www.andhrajyothy.com
పేజీలు: 16 + 20
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ*

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 88

శనివారం | 13-7-2019

శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి రా. 12.29 తదుపరి త్రయోదశి; నక్షత్రం: అనూరాధ సా. 4.28 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: రా. 10.17 -11.57; దుర్ముహూర్తం: ఉ. 5.52-7.36; అమృతఘడియలు: శే ఉ. 7.29; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 5.52; సూర్యాస్తమయం: 6.50

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

సభలో సమరం

'జీరో' వడ్డీపై రెండో రోజూ హోరాహోరీ

- రాజీనామా సవాళ్లతో సభలో వేడి
- 'డౌన్ డౌన్' నినాదాలు, వాగ్వాదం
- సభా... చేపల మార్కెటా: స్పీకర్
- టీడీపీ చిల్లిగవ్వ ఇవ్వలేదన్నారు
- మూడేళ్లలో 415 కోట్లు చెల్లించాం
- పాత బకాయిలూ మాఫీ చేశాం
- రాజీనామానా.. క్షమాపణా: బాబు
- 5 శాతం ఇస్తే సరిపోతుందా!
- మీరు 23.. మేం 150 మందిమి
- మేం లేస్తే మీరు సీట్లో ఉండలేరు
- సభకు గూండాలను తెచ్చారు
- విపక్షంపై విరుచుకుపడ్డ సీఎం జగన్

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సభ సమరాంగణాన్ని తలపించింది. అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం, అరుపులతో దద్దరిల్లింది. 'ఇది అసెంబ్లీయా... చేపల మార్కెటా' అని స్వయంగా సభాధ్యక్షుడే ఆవేదన వ్యక్తం చేయాల్సి వచ్చింది. 'చంద్రబాబు హయాంలో జీరోవడ్డీ రుణాలు ఇవ్వలేదని రుజువు చేస్తా! ఆయన రాజీనామా చేస్తారా' అని గురువారం సీఎం జగన్ సవాల్ విసిరిన సంగతి తెలిసిందే. తాము ఆ పథకం అమలు చేశామంటూ విపక్ష నేత చంద్రబాబు శుక్రవారం ఆధారాలు చూపించారు. 'మీరు క్షమాపణ చెబుతారా... లేక రాజీనామా చేస్తారా' అంటూ ప్రతి సవాల్ విసిరారు. దీనిపై

మిగతా 14వ పేజీలో...

సున్నా వడ్డీకి వంద కోట్లేనా?

- రైతులకేం జవాబు చెబుతారు?.. అమ్మ ఒడిని ఆంక్షల బడి చేశారు
- బీమాను రూ.లక్షకు తగ్గించారు.. బీసీలపై అక్కసుతో నిధుల కోత
- హామీలు ఆకాశంలో.. కేటాయింపులు పాతాళంలో.. బాబు విమర్శ
- బడ్జెట్ భేషుగ్గా ఉంది.. విపక్షానిది తప్పుదారి పట్టించే యత్నం: వైసీపీ
- పిట్టల రాయుడి కోతల బడ్జెట్: కాంగ్రెస్.. ఆదాయం ఎలా: బీజేపీ

14

అంచనాలు భారీ..	ఆశల సవారీ..	
2,27,974 కోట్లతో జగన్ తొలి బడ్జెట్	గ్రాంట్ల అంచనా 61,071 కోట్లు	బ్రాహ్మణ కార్పొరేషన్‌కు 100 కోట్లు
35,260 కోట్లు ద్రవ్య లోటు	మార్కెట్ రుణాలు 41,121 కోట్లు	'పులివెందుల'కు 100 కోట్లు
	పన్ను ఆదాయం 75,437 కోట్లు	రాజధాని అమరావతికి 615 కోట్లు

మోదీ కరుణిస్తారని... కాసులు కురిపిస్తారని ఒక ఆశ! పన్ను ఆదాయం 17 వేల కోట్ల మేర పెరుగుతుందని భారీ అంచనా! బహిరంగ మార్కెట్ నుంచి రూ.41 వేల కోట్ల రుణాలు సేకరించాలనే లక్ష్యం!

వెరసి రూ. 2.28 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌కు ఈ పద్దులే ప్రధాన ఆలంబన! కేంద్రం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా ఏకంగా రూ.61 వేల కోట్లు వస్తాయని ఆశించడం ఒక అతి-ఆశ!

బుగ్గన బడ్జెట్ ప్రసంగాన్ని ఆలకిస్తూ సీఎం చిరునవ్వులు

నవరత్న ఖచితం

అప్పులే ఆలంబన.. గ్రాంట్లే ఆధారం

అంకెల విన్యాసంతో తొలి పద్దు కసరత్తు

- 'జగనన్న అమ్మ ఒడి'
- 'జగనన్న విద్యాదీవెన'
- కొత్త పేర్లతో రెండు పథకాలు
- వ్యవ'సాయం' 28,866 కోట్లు
- వైఎస్సార్ భరోసాకు పెద్దపీట
- సున్నా వడ్డీకి రూ.100 కోట్లు
- నేతన్నలకు 24 వేలు సాయం
- నాయీ బ్రాహ్మణులు, రజకులు, దర్జీలకు ఏటా పది వేలు
- సాగునీటికి 13,139 కోట్లు
- నిరుటి కంటే 22% తగ్గింపు
- కాపు సంక్షేమానికి 2 వేల కోట్లు
- ద్వాక్రాలకు వచ్చే ఏడాది నుంచి రూ.27 వేల కోట్లు రీయింబర్స్

నవరత్నాలే తారకమంత్రమన్న బుగ్గన బడ్జెట్

నిషేధం అంటూనే మద్యంపై భారీ ఆశలు

2,297 కోట్ల అదనపు అంచనా

వ్యాట్‌తో కలిపితే 20 వేల కోట్లు!

'అమ్మ ఒడి' ఒకరికే!

43 లక్షల మంది తల్లులకు లబ్ధి

మోదీ కరుణిస్తాడని..
కాసులు కురిపిస్తాడని..

సమగ్ర కథనాలు 11,12,13లో

ప్రకాశంలో రైతు పావులూరి రవి మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య

ఉసురు తీసిన అప్పులు

- ఒకేరోజు నలుగురు రైతుల ఆత్మహత్య
- ఏడు బోర్లు వేస్తే ఒక్కదానిలోనే నీరు
- కర్నూలులో అన్నదాత బలవన్మరణం
- పంట నష్టాలు, కుటుంబ భారం..
- గుంటూరు, ప్రకాశంలో కౌలు రైతులు బలి

2

స్పీకరైతే.. మేం చేతులు కట్టుకుని

కూర్చోవాలా?

- మా అధికారాన్ని సవాల్ చేస్తున్నారా?.. లోతైన విషయాలున్నాయ్
- 'పెద్ద అంశాల'పై నిర్ణయం తీసుకోవాలి.. మంగళవారం విచారిస్తాం
- అప్పటి వరకూ ఏ నిర్ణయం తీసుకోవద్దు.. యథాతథ స్థితి ఉండాలి
- రాజీనామా, అనర్హతపై నిర్ణయాలు వద్దని స్పీకర్‌కు సుప్రీం ఆదేశం
- మురళీధర్‌రావుకు అమిత్‌షా క్లాస్.. జేడీఎస్ మద్దతు తీసుకోం: యడ్డి

16

బలపరీక్షకు నేను సిద్ధం

- కుమార ప్రకటన.. సీఎం కోరినప్పుడు ఏర్పాట్లు: స్పీకర్
- సిద్దూకు చెక్ పెట్టేందుకేనా?.. ఇది ఉమ్మడి నిర్ణయమే!: సిద్దూ

4,36,907 ఇళ్లు రద్దు

- గ్రామీణ గృహాలపై ప్రభుత్వం నిర్ణయం
- వచ్చే ఏడాది నుంచి కొత్తగా
- 'అప్‌గ్రేడేషన్' పథకానికీ చెల్లు
- జీ ప్లస్ ఇళ్లపైనా అదే వైఖరి

3

కొండ కిటకిట

శ్రీవారి సర్వదర్శనానికి 20 గంటలు

3

చేసేది మాత్రమే కర్మ కాదు

కర్మ ఒక నిర్మాణం అనుకుంటే.. ఆలోచన దాని పునాది వంటిది. ఆలోచన ఆచరణగా మారే దశ మహోత్తరమైంది. ఎందుకంటే.. సత్ఫలితాలు, దుష్ఫలితాలు దాని పర్యవసానాలే. అధ్యయనం ద్వారా పొందిన జ్ఞానం, అవగాహనలోంచి ఆలోచన ప్రారంభమవుతుంది. క్రియకు తొలి దశ ఆలోచన. మలిదశ వాక్కు. మూడో దశ కర్మ అవుతుంది.

కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్
ఇంద్రియార్థాన్ విమూఢాత్మా, మిథ్యాచారః స ఉచ్యతే

ఎవరైతే బయటికి కనిపించే కర్మేంద్రియాలను అదుపులో పెట్టి 'హమ్మయ్య నేను కర్మ చేయడం లేదు. కాబట్టి కర్మఫలం అనుభవించాల్సిన పని లేదు' అనుకుంటే అది మూర్ఖత్వమే. ఎందుకంటే కాళ్లు, చేతులవంటి కర్మేంద్రియాలతో ఏమీ చేయకున్నా.. ఇంద్రియార్థాలైన విషయాలపై ఆశతో వాటినే మనసులో తలచుకోవడం కూడా కర్మే. అలాంటివారు మూఢాత్ములు, కపటులు అవుతారు. కర్మ అనగా చేసేది ఒక్కటే కాదు. చూసేది (దృష్టి కోణం), అనుకునేది, అంటున్నది, వింటున్నది అంతా కర్మే. చేసిన తప్పులకే కాదు.. తప్పుడు ఆలోచనలకు, పలుకులకు కూడా ఫలితాన్ని అనుభవించాల్సిందే.

మనుష్యాణాం సహస్రేషు, కశ్చిద్యతతి సిద్ధయే
యతతామపి సిద్ధానాం, కశ్చిన్మాం వేత్తి తత్త్వతః

వేల మందిలో ఏ ఒక్కరో పరిపూర్ణ సిద్ధి కోసం ప్రయత్నిస్తారు. దాన్ని సాధించినవారిలో కూడా ఏ ఒక్కరో పరమాత్మ తత్త్వాన్ని తెలుసుకుంటారని దీని అర్థం. మనమంతా కర్మాధీనులం కాబట్టి కర్మ మనల్ని వెళ్లబుచ్చుతూనే ఉంటుంది. కాబట్టి కర్మలు చేయకుండా ఉండడం వల్ల ఏ ఉపయోగమూ లేదు. కర్మలు చేయాల్సిందే. కానీ, అవి ధర్మసమ్మతమైనవేనా? కాదా? అనే విషయాన్ని మాత్రం తప్పనిసరిగా పరిశీలించాలి. చేసిన కర్మకు ఫలితాన్ని ఆశించకూడదు. అది మంచి అయినా.. చెడు అయినా.. పరమాత్ముడికే అర్పణం చేయాలి. అప్పుడే కర్మఫలం మనను అంటదు.

- ఎస్.ఆర్.భల్లం. 9885442642

పరంజ్యోతి

లోకం తీరు

హలో.. రిసార్ట్‌లో మన ఎమ్మెల్యేలంతా ఉన్నారు కదా?

వానా కాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
తూర్పుగోదావరి	22.0	35.0
హైదరాబాద్	22.4	32.8
అనంతపురం	23.5	35.0
విజయవాడ	26.0	38.9
తిరుపతి	26.7	40.0
పశ్చిమగోదావరి	27.0	35.0
కడప	28.0	39.0
గుంటూరు	29.2	39.8
నెల్లూరు	29.0	39.0
ఒంగోలు	30.1	39.4

అప్పు చంపేస్తోంది

ఒకేరోజు నలుగురు రైతుల ఆత్మహత్య

- ఏడు బోర్లు వేసినా ఒక్కదానిలోనే నీరు
- కర్నూలులో అన్నదాత బలవన్మరణం
- పంట నష్టాలు, కుటుంబ భారం..
- గుంటూరు, ప్రకాశంలో కౌలు రైతులు బలి

వెంకటేశ్వరరెడ్డి (ఫైల్)

శిరివెళ్ల, యడ్లపాడు, గురజాల, జరుగుమల్లి, జూలై 12: పుడమితల్లితో పెనవేసుకున్న బంధం వారిది. ఆది నుంచీ సాగునే నమ్ముకున్నారు. అయితే సకాలంలో వర్షాలు రాక.. పెట్టుబడులూ దక్కక.. దిగుబడి వచ్చినా గిట్టుబాటు ధరలేక.. అప్పులపాలయ్యారు. కుటుంబాన్ని పోషించుకునేందుకు ఓ రైతు కూలీగా మారితే మరో ఇద్దరు కౌలు రైతుగా మారారు.. అయినా కష్టాలు తీరలేదు. విధిలేని పరిస్థితుల్లో ఉసురు తీసుకున్నారు. శుక్రవారం ఒక్కరోజే ముగ్గురు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. కర్నూలు జిల్లా శిరివెళ్ల మండలం మహదేవపురం గ్రామానికి చెందిన రైతు కొట్టే శ్రీనివాసులు(38)కు 1.5 ఎకరాల పొలం ఉంది. గత రెండేళ్లలో అప్పులు చేసి 7 బోర్లు వేస్తే ఒక్క బోరులోనే.. అదీ అరకొరగా నీరు పడింది. ఒక్కో బోరుకు రూ.30వేలు ఖర్చు చేశాడు. రెండేళ్ల క్రితం మునగ పంట వేశాడు. ఇప్పుడు ఉన్న ఒక్క బోరులోనూ నీరు రావడం లేదు. పంటల సాగుకు, బోర్లు వేసేందుకు తెచ్చిన అప్పులు పెనుభారంగా మారాయి. అప్పుల ఊబిలోనుంచి బయటపడే దారి కనిపించక కుటుంబాన్ని పోషించుకునేందుకు రైతు శ్రీనివాసులు 5 నెలల క్రితం నంద్యాలలోని నూనె మిల్లులో కూలీగా మారాడు. ఉదయం నూనె మిల్లులో పనికి వెళ్లడం, సాయంత్రం పొలానికి వెళ్లి పనులు చేసుకునే వాడు. గురువారం రాత్రి ఇంటికి రాలేదు. శుక్రవారం ఉదయం పొలం వైపు వెళ్లిన గ్రామస్థులు శ్రీనివాసులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. శ్రీనివాసులుకు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రైతులే.. కౌలు రైతులుగా మారి...

గుంటూరు జిల్లా యడ్లపాడు మండలం కొత్తసొలసకు చెందిన కౌలు రైతు మల్నేని వెంకటేశ్వర్లు(55)కు రెండెకరాల భూమి ఉన్నా సాగుకు పనికిరాకపోవడంతో సంకురాత్రిపాడులో పదెకరాలు కౌలుకు తీసుకుని నాలుగేళ్లుగా సాగుచేస్తున్నాడు. మూడేళ్లుగా వర్షాభావ పరిస్థితులు, తెగుళ్లతో దిగుబడులు తగ్గి నష్టాలు రాగా, అప్పులపాలయ్యాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం వెంకటేశ్వర్లు గడ్డిమందు తాగి పడిపోగా కుటుంబసభ్యులు వైద్యశాలకు తరలించగా, చికిత్సపొందుతూ మృతిచెందాడు. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం కామేపల్లికి చెందిన పావులూరి రవి (45)కి 2.25 ఎకరాల పొలం ఉంది. పక్క గ్రామమైన ఎన్ఎన్ కండ్రిగలో 3.80 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. పొగాకు సాగుకు రూ. 1.25లక్షలు, శనగకు రూ.లక్షపైన పెట్టుబడి పెట్టాడు. వర్షాభావ పరిస్థితులు వెంటాడటంతో పొగాకు మూడు క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. అది కూడా లోగ్రేడ్ కావడంతో రూ.25 వేలు మాత్రమే దక్కింది. శనగ కాపు లేకపోవడంతో పొలంలోనే పశువులకు వదిలివేశాడు. రెండేళ్లుగా ఇదే పరిస్థితి. అప్పులు వడ్డీతో కలుపుకొని రూ.6 లక్షలకు చేరాయి. రవి ఏడాది క్రితం తన కుమార్తె వివాహానికి మరో రూ.2లక్షలు అప్పు చేశాడు. డబ్బులు ఇచ్చిన వారు ఒత్తిడి పెంచడంతో మనోవేదనతో రవి శుక్రవారం పొలంలో వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇదే జిల్లా కాలుజువ్వలపాడుకు చెందిన కౌలురైతు తాడి వెంకటేశ్వరరెడ్డి(40). గుంటూరు జిల్లాకి పదేళ్ల క్రితం వలస వచ్చాడు. అప్పటి నుంచి ఏటా పదెకరాల పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. పంటలు పండకపోవటంతో రూ.6 లక్షల 50 వేల అప్పులు మిగిలాయి. ఆ బాధను తట్టుకోలేక శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేశ్వరరెడ్డికి భార్య భూలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పావులూరి రవి మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య

అతిక్రమణల సమాచారమేదీ?

- తదుపరి భేటీలోగా ఇవ్వాలి: ఉపసంఘం

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రాధాన్య ప్రాజెక్టులపై సమీక్షించాక.. మిగిలిన ప్రాజెక్టులను చూడాలని నిశ్చయించిన మంత్రివర్గ ఉపసంఘం.. రూ.100 కోట్ల అంచనాకు పైబడిన సాగునీటి ప్రాజెక్టులన్నిటిపైనా సమీక్షించాలని నిర్ణయించింది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటైన ఉపసంఘం శుక్రవారమిక్కడ సమావేశమైంది. మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పి.అనిల్‌కుమార్ యాదవ్, మేకపాటి గౌతమ్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి హాజరయ్యారు. ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావుతో కూడిన అధికారుల బృందం హాజరైంది. అధికారులు ఇచ్చిన సమాచారంపై ఉపసంఘం ఈ సందర్భంగా అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రాజెక్టుల వారీ సమాచారం మాత్రమే ఇచ్చారని.. దానిలో నిబంధనల అతిక్రమణలు, ధరల పెరుగుదలపై సమగ్ర సమాచారం ఎందుకు లేదని ఉపసంఘం సభ్యులు ప్రశ్నించారు. కాంట్రాక్టు సంస్థలకు అధికంగా ఎందుకు పెంచాల్సి వచ్చిందని ఆరా తీశారు. ఆదరాబాదరాగా ప్రాజెక్టుల వారీ సమాచారం ఇవ్వడం వల్ల కమిటీ సభ్యులు సమీక్షించేందుకు వీలు చిక్కడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే మళ్లీ సమావేశం ఉంటుందని.. ఆలోగా సమగ్ర సమాచారంతో కూడిన నోట్‌ను అందించాలని అధికారులను ఉపసంఘం ఆదేశించింది.

సీఎం క్యాంపు కార్యాలయానికి

రూ.3.63 కోట్లు

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నివాసం ఉంటున్న తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో అదనపు సదుపాయాలకోసం ప్రభుత్వం రూ.3.63 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు రహదారులు, భవనాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం క్యాంపు కార్యాలయానికి కొత్తగా భారీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, హైటెన్షన్ లైన్ల ఏర్పాటు కోసం రూ.97 లక్షలు, రక్షణ చర్యల్లో భాగంగా సోలార్ ఫెన్సింగ్, సీసీటీవీల ఏర్పాటుకు రూ.1.25 కోట్లు, ఏసీల కోసం రూ.80 లక్షలు ఖర్చు చేయనున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 20 గంటలు

తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ పెరిగింది. వేకువజామునుంచి రాత్రి 10గంటల వరకు 55,675మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారని, సర్వదర్శనానికి సుమారు 20గంటల సమయం పడుతుందని టీటీడీ అధికారులు ప్రకటించారు. టైంస్లాటెడ్ దర్శన భక్తులతో నారాయణగిరి ఉద్యానవనం కిటికిటలాడుతోంది. ఆలయ పరిసరాలు, కల్యాణకట్టలు, అన్న ప్రసాద భవనం రద్దీగా మారాయి. ఆది, సోమవారాల్లోనూ రద్దీ కొనసాగే అవకాశాలున్నాయి.

చేసిన తప్పులకు క్షమాపణ చెబుదాం

ప్రజలతో మరింత విధేయతతో మెలుగుదాం. గతంలో చేసిన తప్పులకు క్షమాపణలు కోరదాం. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ పనితీరుపై ఆత్మపరిశీలన చేసుకోవాలి. కొందరు నేతలు సరిగ్గా పనిచేయలేదు. అక్రమంగా కమీషన్లు తీసుకోవడంపైనే దృష్టిపెట్టారు.

- పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

ప్రజావేదిక కూల్చివేత పనుల్లో అగ్నిప్రమాదం

ఉండవల్లి కరకట్ట వెంబడి ఉన్న ప్రజావేదిక కూల్చివేత పనుల్లో శుక్ర వారం స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గడ్డర్లపై ఉన్న ఇనుప రేకులను గ్యాస్‌కట్టర్‌తో తొలగిస్తుండగా.. అక్కడే ఉన్న సామగ్రిపై నిప్పు రవ్వలు పడి మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా మంటలు పెద్దవి కావడంతో దట్టంగా పొగ వ్యాపించింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

- తాడేపల్లి టౌన్

శాకాంబరిగా బలుసులమ్మ

తాడేపల్లిగూడెం గ్రామ దేవత బలుసులమ్మను శుక్రవారం శాకాంబరిదేవిగా అలంకరించారు. తొమ్మిది టన్నుల బరువైన 45 రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. తొలి ఏకాదశి కావడంతో అమ్మవారి దర్శనానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

- తాడేపల్లిగూడెం అర్బన్

గుంటూరులో 'పెంగ్విన్' బేబీ!

- అవయవ లోపంతో చిన్నారి జననం

గుంటూరు(మెడికల్), జూలై 12: గర్భంతో ఉన్న సమయంలో తల్లి కెలడోమైన్/థాలిడోమైన్ మందులు తీసుకుంటే శిశువులు కురచ కాళ్లు, చేతులతో జన్మిస్తారు. ఇలా పుట్టిన పిల్లలని పెంగ్విన్ బేబీగా పిలుస్తారు. శుక్రవారం గుంటూరు ప్రభుత్వాస్పత్రికి పెదకూరపాడుకు చెందిన పఠాన్ అయాబ్, షాహీన్ దంపతులకు 3నెలల కిందట జన్మించిన మగ శిశువులో పెంగ్విన్ లక్షణాలు ఉండడంతో చికిత్స కోసం తీసుకొచ్చారు. పీడియాట్రిక్ ప్రొఫెసర్ యశోధర శిశువును పరీక్షించారు. చేతులు రెండు క్షీణించి ఉన్న ఈ చిన్నారిలో కాళ్లు మాత్రం సాధారణంగానే ఉన్నాయి.

నామమాత్ర ముఖ్యమంత్రి!

- హామీల అమలూ అంతేనా?
- అమ్మ ఒడితో ఆటలాడతారా?
- దానికి 'జగనన్న జంపింగ్ జపాంగ్' పేరు బెటర్
- బడ్జెట్‌పై ట్విటర్‌లో లోకేశ్ సెటైర్లు

అమరావతి/విజయవాడ, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులపై పెదవి విరిచిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తనదైన శైలిలో శుక్రవారం ట్విటర్‌లో వరుస కామెంట్లు పెట్టారు. 'జగన్ గారూ! మీ బడ్జెట్ కేటాయింపులే నామమాత్రమా? మీ హామీలు కూడా నామమాత్రమా? చూస్తుంటే మీరు నామమాత్ర ముఖ్యమంత్రిలా అనిపిస్తున్నారు. రైతుల వడ్డీలేని రుణాలకు రూ.3,500 కోట్లు ఎందుకు కేటాయించలేదు. ఇదేనా మీ చిత్తశుద్ధి?. రైతుల వడ్డీలేని రుణాల కోసం రూ.3,500 కోట్లు ఇస్తామని తండ్రి పేరుతో రైతు దినోత్సవం జరుపుతూ అన్నారు. తీరా బడ్జెట్‌లో నామమాత్రంగా రూ.100 కోట్లు కేటాయించారు. పథకాలకు మీ పేర్లు తగిలించుకుని మురిసిపోతున్నారు సరే. అమ్మ ఒడిలో లబ్ధిపొందే తల్లుల సంఖ్యను సగానికి తగ్గించడం ఏమిటి? ఒక తల్లికి ఇచ్చి, ఇంకో తల్లికి ఇవ్వకుండా స్కిప్ చేస్తుంటూ, జంపింగ్ జపాంగ్ ఆటలాడతారా? పథకానికి కూడా 'జగనన్న జంపింగ్ జపాంగ్' అని పేరు పెడితే బాగుండేది. ఆర్థికమంత్రిగారు రామాయణమంతా చదివారు. సంజీవని గురించి చెప్పారు. వైద్య ఖర్చు రూ.1000 దాటితే ప్రభుత్వమే చూసుకుంటుందని ఊదరగొట్టారు. చివరికి ఆరోగ్యశ్రీకి రూ.1,740కోట్లు విదిల్చారు. కొండంత రాగం తీసి పాట పాడకుండా కుసుకేసినట్టుంది. ఐదేళ్లలో 25లక్షల ఇళ్లు కడతామన్నారు. పైగా గృహ రుణాలన్నీ రద్దు చేస్తామన్నారు. బడ్జెట్ చూస్తే గృహ నిర్మాణానికి రూ.8,615 కోట్లు ఇచ్చారు. మీరు నిర్మిస్తామన్నది పిచ్చుక గూళ్లు కాదుకదా' అని లోకేశ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

లష్కరేతో నాకు సంబంధం లేదు

లష్కరే తోయిబా(ఎల్ఈటీ)తో నాకెలాంటి సంబంధం లేదు. ముంబై దాడుల వెనుక నేనున్నానన్నదాంట్లో నిజం లేదు. నాపై, నా అనుచరులు 12 మందిపై పంజాబ్ ప్రభుత్వం పెట్టిన కేసులు కొట్టేయండి.

- లాహోర్ హైకోర్టుతో లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు సయీద్ హాఫీజ్

కృష్ణా తూర్పు డెల్టాకు నీరు విడుదల

గోదావరి నుంచి పట్టిసీమ ద్వారా 6100 క్యూసెక్కుల నీరు ప్రకాశం బ్యారేజ్‌కు వస్తుండటంతో.. కృష్ణా తూర్పు డెల్టాకు శుక్రవారం వెయ్యి క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు. బ్యారేజ్‌కు సమీపాన ఉన్న హెడ్ రెగ్యులేటర్ వద్ద మంత్రులు అనిల్‌కుమార్ యాదవ్, పేర్ని నాని, కొడాలి నాని, వెల్లంపల్లి శ్రీనివాసరావు పూజలు చేసి నీటిని వదిలారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

చిత్తూరు జిల్లా ఏర్పేడు మండలం మరాఠిపురంలో కబ్జాకు గురైన తమ భూములు తమకు ఇప్పించాలని 2 రోజులుగా ఎస్టీలు సీఎం జగన్ ఇంటి వద్ద ఆందోళన చేస్తున్నారు. శుక్రవారం తమ పిల్లలకు సీఎం నివాసం వద్దనే ఇలా స్నానపానాదులు చేయించి నిరసన కొనసాగించారు.

5.5 కిలోల శిశువు జననం!

గుడివాడ (రాజేంద్రనగర్), జూలై 12: సాధారణంగా నవజాత శిశువులు 2 నుంచి 3 కిలోల బరువుతో జన్మిస్తారు. కానీ.. కృష్ణాజిల్లా గుడివాడలోని మాగంటి వైద్యశాలలో గుడ్లవల్లేరుకి ప్రేమ్‌కుమార్, పద్మ దంపతులకు శుక్రవారం 5.5 కిలోల బరువున్న పాప జన్మించింది. తల్లి పద్మకు షుగర్ ఉండడం వల్ల శిశువు బరువు పెరిగిందని వైద్యుడు మాగంటి శ్రీనివాస్ తెలిపారు. పాప ఆరోగ్యంగానే ఉందని, అధిక బరువుతో పుట్టడం వలన ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉండడంతో 24 గంటల పాటు పర్యవేక్షణలో ఉంచామని చెప్పారు.



అల్లం.. హైబీపీకి కళ్లెం!

ముంబై, జూలై 12: మీకు హైబీపీ ఉందా. దీనిని నియంత్రించుకునేందుకు వందల రూపాయలు ఖర్చుపెట్టి మందులు కొంటున్నారా? ఇవి వాడితే సైడ్ ఎఫెక్ట్ వచ్చే ప్రమాదముందని తెలిసినా.. తప్పదని సర్దుకు పోతున్నారా? అయితే, ఇకపై చింతించకండి. నేరుగా వంటగదిలోకి వెళ్లి.. అల్లం ముక్కను తీసుకుని, 4 గ్రాముల ముక్కను తుంచుకుని నమిలి తినండి. రోజూ ఇలా చేయడం ద్వారా హైబీపీతో పాటు రక్తంలోని చక్కెర, శరీరంలోని అధిక కొవ్వు తగ్గిపోవడం ఖాయమని నైజీరియాలోని యూనివర్సిటీ ఆఫ్ ఇలోరిన్ శాస్త్రవేత్తలు తెలిపారు. అల్లం.. హైబీపీని నియంత్రించే అమృతమని పేర్కొన్నారు. అల్లంపై పలు ప్రయోగాలు చేసిన వీరు.. దీనిలోని రసాయనిక గుణాలు, త్వరగా జీర్ణమయ్యే నూనెలు, ఫెనాల్ కాంపౌండ్స్ వంటివి హైబీపీ నుంచి రక్షణ కల్పిస్తాయని వివరించారు.

15న గో'దారి'పై భేటీ!

- హైదరాబాద్ జలసౌధలో ఏపీ, తెలంగాణ ఈఎన్‌సీల చర్చ

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): గోదావరి జలాలను నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల్లోకి ఎత్తిపోయడంపై ఏపీ జలవనరుల శాఖ, తెలంగాణ నీటిపారుదలశాఖ అధికారులు ఈ నెల 15న హైదరాబాద్‌లో సమావేశమై చర్చించనున్నారు. వాస్తవానికి ఆ రోజున రెండు రాష్ట్రాల సీఎంలు జగన్, కేసీఆర్‌లు భేటీ అవుతారని అనుకున్నారు. ఆలోగా ఈ నెల 14న ఇంజనీర్ ఇన్ చీఫ్ స్థాయిలో హైదరాబాద్‌లో సమావేశమై, ఈ పథకానికి సంబంధించి ఒక నిర్ణయానికి వచ్చి సీఎంల ఎదుట ఆ ప్రతిపాదన ఉంచాలని భావించారు. అందులో భాగంగా తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్‌రావుతో మాట్లాడేందుకు ఏపీ అధికారులు ప్రయత్నించారు.

పురపాలక, ఆరోగ్య శాఖల్లో
భారీగా బదిలీలు

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పురపాలక శాఖలో పెద్ద ఎత్తున బదిలీలు జరిగాయి. మొత్తం 101 మంది మున్సిపల్ కమిషనర్ స్థాయి అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. ఇతర విభాగాల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చి, మున్సిపల్ శాఖలో గత కొంతకాలంగా సేవలందిస్తున్న పలువురిని వారి స్వంత విభాగాలకు బదిలీ చేసింది. కర్నూలు మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.రవీంద్ర బాబు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్‌గా పి.నిరంజన్ రెడ్డి నియమితులయ్యారు.

ఏపీసీఆర్డీయే, ఏపీ రెరాలోనూ బదిలీలు..

ఏపీ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (ఏపీ రెరా)లో జాయింట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న వి.సునీత బదిలీ అయ్యారు. ఆమెను గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ సిటీ ప్లానర్‌గా ఎస్.చక్రపాణి స్థానంలో నియమించారు. ఎస్.చక్రపాణిని డిప్యుటేషన్‌పై విజయవాడలోని ఏపీఐఐసీలో జేడీ (టౌన్ ప్లానింగ్)గా నియమించారు. విజయవాడలోని ఏపీసీఆర్డీయే ప్రధాన కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న బి.బాలాజీని డిప్యుటేషన్‌పై ఏపీ రెరా జేడీగా బదిలీ చేశారు.

9 మంది డీఎంహెచ్‌వోలకు స్థానచలనం

ప్రభుత్వం ఆరోగ్యశాఖలోనూ భారీగా బదిలీ చేపట్టింది. జిల్లా వైద్యాధికారుల దగ్గర నుంచి ప్రొఫెసర్ల వరకూ పదుల సంఖ్యలో బదిలీలు చేస్తూ ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే: కేవీపీ

న్యూఢిల్లీ, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక హోదాను తప్పకుండా అమలు చేయాల్సిన రాజ్యాంగపరమైన, నైతికపరమైన, న్యాయపరమైన బాధ్యత కేంద్రంపై ఉందని రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచందరరావు అన్నారు. శుక్రవారం రాజ్యసభలో ఈ అంశంపై ఆయన ప్రత్యేక ప్రస్తావన తీసుకువచ్చారు. "14వ ఆర్థిక సంఘం తన నివేదిక సమర్పించడానికి ముందే... 2014 మార్చి 2న కేంద్ర కేబినెట్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని నిర్ణయించింది. అందువల్ల ఆర్థిక సంఘం నివేదికకూ, ప్రత్యేక హోదాకూ ముడి పెట్టరాదు" అని కేవీపీ అన్నారు. 2015, ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చిన 14వ ఆర్థిక సంఘం నివేదికను వెనుక తేదీతో ఎలా అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు.

వివేకా కేసులో గంగిరెడ్డికి నార్కో టెస్ట్

పులివెందుల, జూలై 12: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎర్రగంగిరెడ్డికి నార్కో అనాలసిస్ పరీక్షలు నిర్వహించేందుకు పులివెందుల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అనుమతి ఇచ్చింది. వివేకా హత్యకు సంబంధించిన సాక్ష్యాలు చెరిపేశారనే కేసులో అరెస్టయిన ఎర్రగంగిరెడ్డి 90 రోజులు రిమాండ్‌లో ఉండి గత నెల 27న బెయిల్‌పై విడుదలయ్యారు. ఆయనకు నార్కో అనాలసిస్, పాలిగ్రామ్, బీప్ పరీక్షలకు అనుమతులు ఇవ్వాలంటూ పోలీసులు శుక్రవారం కోర్టును ఆశ్రయించారు.

బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్సీ అన్నం

బాపట్ల టౌన్, జూలై 12: గుంటూరు జిల్లా బాపట్లకు చెందిన మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీశ్ ప్రభాకర్ శుక్రవారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఢిల్లీలో బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్రవ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ దేవధర్, రాజ్యసభ సభ్యులు సుజనా చౌదరి సమక్షంలో పార్టీ సభ్యత్వం తీసుకున్నారు.

4,36,907 ఇళ్లు రద్దు

- గ్రామీణ గృహాలపై ప్రభుత్వం నిర్ణయం
- వచ్చే ఏడాది నుంచి కొత్తగా
- 'అప్‌గ్రేడేషన్' పథకానికీ చెల్లు
- జీ ప్లస్ ఇళ్లపైనా అదే వైఖరి

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ గృహనిర్మాణ పథకం కింద గత ప్రభుత్వం మంజూరు చేసిన 4,36,907 ఇళ్లను వైసీపీ సర్కారు రద్దు చేసింది. జిల్లాలకు ఇంకా కేటాయించని, లబ్ధిదారులకు మంజూరు చేసినా ప్రారంభంకాని, ప్రారంభమైనా నిధులు వెచ్చించని, బిలో బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్నవి ఇందులో ఉన్నాయి. ఈ ఏడాదికి పురోగతిలో ఉన్న ఇళ్లను పూర్తిచేసి, వచ్చే ఏడాది నుంచి కొత్త పథకాన్ని ప్రారంభించాలనుకుంటున్న ప్రభుత్వం ఈ మేరకు మంజూరైన ఇళ్లన్నిటినీ రద్దు చేసింది. దీంతో ప్రభుత్వ సాయంతో ఇళ్లు కట్టుకోవాలనుకుంటున్న వారంతా వచ్చే ఏడాది వరకు ఆగాల్సిందే. గత ప్రభుత్వం రకరకాల పథకాల కింద ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించింది. అందులో ఎన్టీఆర్ గ్రామీణ గృహనిర్మాణం కీలకంగా ఉంది. ఈ పథకంలోనే అత్యధిక మంది ఇళ్లు పొందుతున్నారు. ఈ పథకం పేరునే ఇప్పుడు వైఎస్ఆర్ గృహనిర్మాణంగా మార్చారు. ఈ పథకం కింద ఐదేళ్లలో గత ప్రభుత్వం 10,00,086 ఇళ్లు మంజూరు చేసింది. ఏటా 2లక్షల ఇళ్లు కేటాయిస్తూ.. చివరి ఏడాది ఒకేసారి 4లక్షలు మంజూరు చేసింది. మొత్తం 4,60,358 ఇళ్లు పూర్తి కాగా, 1,02,821 ఇళ్ల పనులు పురోగతిలో ఉన్నాయి. మిగిలిన 4,36,907 ఇళ్లను ప్రభుత్వం రద్దు చేసింది. అంటే ఆ ఇళ్లు ఇప్పటికే ఎవరికైనా మంజూరు చేసినా వాటికి బిల్లులు రావు. వచ్చే ఏడాది నుంచి కొత్తగా చేపట్టబోయే పథకంలో వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

కేంద్రానివైతే ఓకే!

పాత ఇళ్ల మరమ్మతుల కోసం గత ప్రభుత్వం 'అప్‌గ్రేడేషన్' అనే పథకాన్ని ప్రారంభించింది. అంటే గతంలో కట్టుకున్న ఇంటికి ఏవైనా మరమ్మతులు చేసుకోవాలంటే ఇంటికి రూ.10వేలు రాయితీ ఇస్తారు. ఈ పథకంలో 3,932 ఇళ్లకు రాయితీ ఇచ్చారు. ఇకపై ఈ పథకం అవసరం లేదనుకున్న ప్రభుత్వం దాన్ని కూడా రద్దు చేసింది. తితలీ తుఫాను సమయంలో దెబ్బతిన్న 18,152 మంది ఇళ్లను పునఃపరిశీలించాలని నిర్ణయించింది. తుఫాన్ సమయంలోనే అధికారులు వీటిని గుర్తించారు. 2014లో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హౌసింగ్ పథకం ఆలస్యం కావడంతో ఎమ్మెల్యేల హామీలతో కొందరు సొంతంగా ఇళ్లు కట్టుకున్నారు. వాటిల్లో 1,20,897 ఇళ్లకు రాయితీ ఇవ్వాలని గత ప్రభుత్వం నిర్ణయించగా.. కొత్త ప్రభుత్వం రద్దు చేసింది. పలు ప్రాంతాల్లో జీ ప్లస్ తరహాలో నిర్మించతలపెట్టిన ప్రాజెక్టులకు కూడా ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెట్టింది. కుప్పంలో 2వేల ఇళ్లు, కురుమద్దాలిలో 96, చోడవరంలో 3,936 ఇళ్లు నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా అవన్నీ రద్దయ్యాయి. పీఎంఏవై-గ్రామీణ్, పీఎంఏవై-అర్బన్ (బీఎల్‌సీ) పథకాలు కేంద్రానివి కాబట్టి వాటిని యథావిధిగా కొనసాగించాలని వైసీపీ సర్కార్ నిర్ణయించింది. మొత్తం ఈ ఏడాది నిర్మాణంలో ఉన్నవి తప్ప కొత్తగా ఇళ్లు ఇచ్చే అవకాశం లేదని తేల్చేసింది.

మోజో టీవీ మాజీ సీఈవో
రేవతి అరెస్టు

- శబరిమలకు మహిళా జర్నలిస్టును పంపిన టీవీ
- దానిపై చర్చ నిర్వహించిన యాంకర్ రఘు, రేవతి
- తమతో ఏకీభవించని అతిథిని గెటవుట్ అంటూ బయటకు
- ఎస్సీ ఎస్టీ చట్టం కింద ఫిర్యాదు చేసిన వరప్రసాద్

బంజారాహిల్స్/హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మోజో టీవీ మాజీ సీఈవో రేవతిని బంజారాహిల్స్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం గతంలో ఆమెపై నమోదు చేసిన కేసులో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం విచారణ అనంతరం ఆమెను అరెస్టు చేస్తున్నట్టు ప్రకటించారు. 'సేవ్ శబరిమల' పేరుతో ఈ ఏడాది జనవరిలో మోజో టీవీ ఓ మహిళా జర్నలిస్టును అయ్యప్ప ఆలయానికి పంపించింది. అనంతరం చోటుచేసుకున్న పరిణామాలపై చర్చించేందుకు జనవరి 23న మోజో చానల్ చర్చా కార్యక్రమం నిర్వహించింది. దీనికి యాంకర్ రఘు, అప్పటి సీఈవో రేవతి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఈ చర్చలో మాట్లాడేందుకు జాతీయ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగులరపు వరప్రసాద్ అలియాస్ హమారా ప్రసాద్‌ను పిలిచారు. చర్చలో భాగంగా వరప్రసాద్ వాదనలతో ఏకీభవించని రేవతి, రఘులు లైవ్‌లోనే ఆయనను 'గెటవుట్' అంటూ చర్చా వేదిక నుంచి బయటకు పంపించేశారు. దాంతో, తాను దళితుడిని కాబట్టే యాంకర్ రఘు, సీఈవో రేవతి అవమానకరంగా వ్యవహరించారంటూ అదే నెల 24న వరప్రసాద్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. చర్చా వేదికకు సంబంధించిన వీడియో ఫుటేజీని జతపరిచారు. ఈ నేపథ్యంలో, ఏ1గా రఘు, ఏ2గా రేవతిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతోపాటు ఐపీసీ సెక్షన్ 504 కింద కేసు నమోదు చేశారు. అదే నెల 25న దళిత సంఘాలు, అయ్యప్ప భక్తులు చానల్ వద్ద ధర్నా నిర్వహించారు కూడా. ఈ కేసులో విచారణ మొదలు పెట్టిన పోలీసులు విచారణకు హాజరుకావాలంటూ రేవతి, రఘులకు పలుమార్లు నోటీసులు జారీ చేశారు. కానీ, రఘు కనిపించకుండాపోయాడు. రేవతి స్పందించలేదు.

మణికొండలో అదుపులోకి తీసుకున్న పోలీసులు

విచారణ పూర్తి చేసిన బంజారాహిల్స్ పోలీసులు శుక్రవారం ఉదయం మణికొండలోని రేవతి నివాసానికి వెళ్లారు. విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకుంటున్నట్టు చెప్పారు. అయితే, నోటీసులు ఇవ్వకుండా నేరుగా ఇంటికి ఎలా వస్తారంటూ రేవతి పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కాసేపు హైడ్రామా జరిగింది. అనంతరం ఆమెను పోలీసులు స్టేషన్‌కు తరలించి ఏసీపీ ఎదుట హాజరుపర్చారు. సాయంత్రం వరకు విచారించి అరెస్టు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా రేవతి మాట్లాడుతూ.. ఎప్పటికైనా నిజమే గెలుస్తుందని చెప్పారు.సీనియర్ మహిళా జర్నలిస్టు రేవతిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారంటూ ఐజేయూ, టీయూడబ్ల్యూజే ఖండించాయి.

రవి ప్రకాశ్‌కు షరతులతో కూడిన బెయిల్

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాశ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. టీవీ9 నూతన యాజమాన్యం చేసిన ఫిర్యాదుల ఆధారంగా నమోదైన మూడు కేసుల్లో రవిప్రకాశ్‌కు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కోర్టు ఉత్తర్వులు అందిన 10 రోజుల్లోగా సంబంధిత మేజిస్ట్రేట్ కోర్టులో రవిప్రకాశ్ లొంగిపోవాలని షరతు విధించింది. రూ.5 లక్షలతో రెండు పూచీకత్తులు, వ్యక్తిగత బాండ్ ఇవ్వాలని స్పష్టం చేసింది. పాస్‌పోర్టు స్వాధీనం చేయాలని, మేజిస్ట్రేట్ కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి పోరాదని నిర్దేశించింది. రోజు విడిచి రోజు సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఉదయం 10 - సాయంత్రం 6 గంటల మధ్య సంతకాలు చేయాలని ఆదేశించింది. దర్యాప్తు అధికారులకు సహకరించాలని, సాక్ష్యాలను తారుమారు చేయడం, సాక్షులను ప్రలోభపెట్టడం వంటి చర్యలకు పాల్పడరాదని ఆంక్షలు విధించింది.

కొండ కిటకిట!

- శ్రీవారి సర్వదర్శనానికి 20 గంటలు
- వసతి గదులకు పెరిగిన డిమాండ్
- టీటీడీ సిబ్బందితో భక్తుల వాగ్వాదం

తిరుమల, జూలై 12: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ పెరిగింది. వేసవి సెలవుల్లో శ్రీవారిని దర్శించుకోలేక పోయినవారితో పాటు, రెండో శనివారం, ఆదివారం కావడంతో ఉదయం నుంచే భక్తుల తాకిడి పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో 31కంపార్టుమెంట్లు నిండిపోయి క్యూలైన్ వెలుపలకు వచ్చింది. వేకువజామునుంచి రాత్రి 10గంటల వరకు 55,675మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారని, సర్వదర్శనానికి సుమారు 20గంటల సమయం పడుతుందని టీటీడీ అధికారులు ప్రకటించారు. టైంస్లాటెడ్ దర్శన భక్తులతో నారాయణగిరి ఉద్యానవనం కిటికిటలాడుతోంది. మరోవైపు గదులకు డిమాండ్ పెరిగింది. ఆలయ పరిసరాలు, కళ్యాణకట్టలు, అన్నప్రసాద భవనం రద్దీగా మారాయి. ఆది, సోమవారాల్లోనూ రద్దీ కొనసాగే అవకాశాలున్నాయి. కాగా, ఆళ్వార్‌ట్యాంక్ వద్ద శుక్రవారం సాయంత్రం తమిళనాడుకు చెందిన భక్తబృందం టీటీడీ సిబ్బందితో వాగ్వాదానికి దిగింది.

కిటకిటలాడుతున్న సర్వదర్శనం క్యూలైన్.. వెలుపలకు వచ్చేస్తున్న భక్తబృందం

17న అంగప్రదక్షిణ టోకెన్లు రద్దు

చంద్రగ్రహణం కారణంగా ఈ నెల 17న అంగప్రదక్షిణ సేవ ఉండదని టీటీడీ శుక్రవారం తెలిపింది. ఈ నేపథ్యంలో 16 మధ్యాహ్నం 2 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్ల జారీని రద్దుచేశారు.

కారుతో సహా మునిగిపోతున్నా..!

- స్నేహితుడికి చివరి ఫోన్‌కాల్
- అర్ధరాత్రి కాలువలోకి దూసుకుపోయిన కారు
- పశ్చిమలో యువకుడి మృతి

నిడదవోలు, జూలై 12: పని ఉందని స్నేహితుడి కారు తీసుకుని బయలుదేరిన ఓ యువకుడు.. కొద్దిసేపటికే ప్రమాదానికి గురయ్యాడు. పశ్చిమగోదావరి జిల్లాలోని కొవ్వూరుకు చెందిన సిర్రా శివరామకృష్ణ (27) అదే గ్రామానికి చెందిన తన మిత్రుడు పెరుమాళ్ల సుబ్రహ్మణ్యం కారును పని ఉందంటూ గురువారం రాత్రి తీసుకున్నాడు. అక్కడి బయలుదేరి వెళ్తుండగా దగ్గరలోనే మద్దూరు-విజ్జేశ్వరం వద్ద పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలోకి శివరామకృష్ణ ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి పడిపోయింది. ఆ వెంటనే.. తాను కారుతో సహా మునిగిపోతున్నానని శివరామకృష్ణ ఫోన్‌లో చెప్పాడని సుబ్రహ్మణ్యం తెలిపారు. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో కాలువ మునిగిపోవడాన్ని చూసిన స్థానికులు సమిశ్రగూడెం పోలీసులకు సమాచారం అందించగా, కాలువలో 7,500 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తూ ఉండడం, పూర్తిగా చీకటిమయం కావడంతో సహాయక చర్యలు చేపట్టలేకపోయారు. శుక్రవారం ఉదయమే కాల్వలో గాలింపు చర్యలు చేపట్టారు. నీటి పారుదల శాఖాధికారులు పశ్చిమ డెల్టా కాలువలకు నీటిని నియంత్రించారు. నీరు తగ్గుముఖం పట్టడంతో 10.30 నుంచి 11 గంటల మధ్య కాలువలో కారు బయటపడింది. దాన్ని భారీ క్రేన్‌తో వెలికితీశారు. శివరామకృష్ణ మృతదేహం కూడా కారులోనే లభ్యమైంది.

మీది ముమ్మాటికీ ధిక్కారమే!

- జైలు జీవితం ఎలా ఉంటుందో అనుభవంలోకి రావాలి
- అధికారుల తీరుపై హైకోర్టు ఆగ్రహం

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): 'మా ఆదేశాలు నచ్చకపోతే అప్పీలుకెళ్లాలి. అంతేగానీ వాటిని అమలు చేయకుండా వదిలేస్తే ఎలా? ఇది ముమ్మాటికీ కోర్టు ధిక్కరణే' అని అధికారులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 'జైలు జీవితం ఎలా ఉంటుందో అనుభవంలోకి రావాలి' అని కటువైన వ్యాఖ్యలు చేసింది. కోర్టు ధిక్కారం కేసులో రాష్ట్ర హోంశాఖ మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏఆర్ అనూరాధ, నెల్లూరు సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రవికిరణ్ శుక్రవారం హైకోర్టుకు స్వయంగా హాజరయ్యారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఎం.సత్యనారాయణ మూర్తిలతో కూడి న ధర్మాసనం శుక్రవారం విచారించింది. నెల్లూరు సెంట్రల్‌జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్న గని శ్రీనివాసులును 2018 జనవరి 23న సర్కారు జారీ చేసిన జీవో 8 మేరకు విడుదల చేయాలంటూ ఆయన సోదరుడు పవన్‌కుమార్ గతంలో జైళ్ల శాఖను అభ్యర్థించారు. అందుకు వారు నిరాకరించడంతో ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. జీవోను పరిశీలించి శ్రీనివాసుల్ని విడుదల చేయవచ్చని, క్షమాభిక్షకు ఆయన అర్హుడని స్పష్టం చేస్తూ గత ఏప్రిల్ 9న ఉత్తర్వులు ఇచ్చింది. అయితే జూన్ వరకు శ్రీనివాసుల్ని విడుదల చేయకపోవడంతో పవన్‌కుమార్ మరోమారు హైకోర్టు తలుపుతట్టారు. దీనిపై జూన్ 14న ధర్మాసనం విచారణ చేపట్టింది. అధికారుల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణిస్తూ.. అప్పటి హోంశాఖ కార్యదర్శి, జైళ్లశాఖ డీజీ, నెల్లూరు సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌లు నేరుగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగిన విచారణ సందర్భంగా ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. 'మేం ఆదేశాలు జారీ చేసినా ఖాతరు చేయకుండా, ఎన్నికల కోడ్ అమలులో ఉందని ఖైదీని విడుదల చేయబోమన్నారు. ఆ రోజు ఆ నిర్ణయం తీసుకున్నారు కాబట్టి, ఇప్పుడూ దానికే కట్టుబడి ఉండండి. మరో నిర్ణయం తీసుకోవడానికి వీల్లేదు. మా ఆదేశాలు నచ్చకపోతే అప్పీలుకు వెళ్లాలి తప్ప, వాటిని అమలు చేయకుండా వదిలేస్తే ఎలా? ఇది ముమ్మాటికీ కోర్టు ధిక్కరణే. కోర్టు ఆదేశాల అమలులో బాగా జాప్యం చేశారు. మీ చర్యలను సమర్థించుకునేందుకు ఏమాత్రం అవకాశం లేని వ్యవహారమిది. మీరేం చెప్పదలచుకున్నారో కౌంటర్ దాఖలు చేయండి. జైలు జీవితం ఎలా ఉంటుందో అనుభవంలోకి రావాలి' అని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది.

వ్యాగన్లతో చెన్నైకి వాటర్!

చెన్నైవాసుల దాహార్తి తీర్చేందుకు 50 వ్యాగన్లలో నింపిన 25 లక్షల లీటర్ల నీటితో ఈ రైలు బయలుదేరింది. వేలూరు జిల్లాలోని జోలార్‌పేట నుండి ఈ నీటిని తరలిస్తున్నారు. చేతులు కడగడానికీ, చివరకు తిన్న ప్లేట్లు శుభ్రం చేయడానికి నీరు దొరక్క, చెన్నైలోని పలు హోటళ్లు మొదలు లాడ్జీలు, హాస్టళ్ల వరకు మూతబడుతున్న విషయం తెలిసిందే. అంతలా చెన్నైని ఈ ఏడాది ఎద్దడి ముట్టడించింది. ఈ నేపథ్యంలో జోలార్‌పేట నుంచి నీటితో బయలుదేరిన ప్రత్యేక రైలు శుక్రవారం చెన్నైలోని విల్లివాక్కం స్టేషన్‌కు చేరుకుంది. అక్కడ ప్రత్యేక పైపు లైన్ల ద్వారా ఆ నీటిని అన్‌లోడ్ చేసి, కీల్పాక్‌లోని తాగునీటి సేకరణ కేంద్రానికి తరలించారు. అక్కడ ఆ జలాల నాణ్యతను పునఃపరిశీలిస్తారు. అవసరమైతే మరోమారు శుద్ధీకరించిన మీదట తొలిదశగా ట్రిప్లికేన్, అన్నానగర్, విల్లివాక్కం, అయనావరం, ఎగ్మూరు, హార్బర్ ప్రాంతాల దాహం తీరుస్తారు. ఈ ప్రాజెక్టు నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ.65 కోట్ల నిధులను కేటాయించింది. 55 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రైల్వే వ్యాగన్లను రాజస్థాన్‌లో శుభ్రపరచి 100 వ్యాగన్లను జోలార్‌పేటకు తీసుకువచ్చారు. వాటిలో తొలి విడతగా 50 వ్యాగన్లలో 25 లక్షల లీటర్లను తరలించారు. ఇదే రీతిలో రోజుకు నాలుగు ట్రిప్పులు చొప్పున కోటి లీటర్ల జలాలను తరలించనున్నారు.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

మంత్రి కన్నబాబుకు చిరంజీవి పరామర్శ

సర్పవరం జంక్షన్ (కాకినాడ), జూలై 12: సోదర వియోగంతో బాధపడుతున్న రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ మంత్రి కురసాల కన్నబాబును ప్రముఖ సినీనటుడు, కేంద్ర మాజీ మంత్రి కె.చిరంజీవి పరామర్శించారు. మంత్రి సోదరుడు సురేష్‌బాబు గుండెపోటుతో మృతి చెందడంతో కన్నబాబును పరామర్శించేందుకు శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం విమానాశ్రయంకు వచ్చిన చిరంజీవి అక్కడ నుంచి కారులో నేరుగా కాకినాడ వైద్యనగర్‌లోని మంత్రి స్వగృహానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కన్నబాబు, ఆయన తండ్రి సత్యనారాయణ, కుటుంబ సభ్యులను చిరంజీవి ఓదార్చారు.

తిరుమల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ధర్మారెడ్డి

తిరుమల, జూలై 12(ఆంధ్రజ్యోతి) టీటీడీ తిరుమల ప్రత్యేకాధికారిగా వెంకట ధర్మారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం ఆయన సతీసమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో ఇన్‌చార్జ్ జేఈవో బసంత్‌కుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. తర్వాత ప్రత్యేకాధికారి హోదాలో ధర్మారెడ్డి దంపతులు మరోసారి స్వామిని దర్శించుకున్నారు. ధర్మారెడ్డికి టీటీడీ ఈవో స్వామి వారి శేషవస్త్రంకప్పి తీర్థప్రసాదాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



కక్ష పూరిత దాడులు

ఫార్చ్యూన్ మేగజైన్ 2018 సంవత్సరంలో ప్రపంచంలో అత్యంత ప్రభావశీలురైన యాభైమంది నాయకుల జాబితా ఇటీవల విడుదల చేసింది. అందులో భారతదేశం నుంచి రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీతో పాటు ప్రముఖ న్యాయవాది ఇందిరాజైసింగ్ కూడా ఉన్నారు. జాబితాలో అంబానీది 24వస్థానం, ఇందిరది 20. 'భారతదేశ నిరుపేదల గొంతు ఇందిర. యావత్ జీవితాన్ని అన్యాయంపై పోరాటానికి అంకితం చేసిన మహోన్నత వ్యక్తి' అని వ్యాఖ్యానించింది మేగజైన్. 1984లో భోపాల్ విషవాయువు బాధితుల పక్షాన జరిపిన పోరాటం నుంచి, గృహహింస వ్యతిరేక చట్టం రూపకల్పన వరకూ ఆమె నిర్వహించిన వివిధ భూమికలను శ్లాఘించింది. ప్రపంచం గర్వించదగ్గ ఓ అద్భుత వ్యక్తిగా ఫార్చ్యూన్‌కు కనిపించిన ఇందిరా జైసింగ్ మన పాలకులకు విదేశీ విరాళాల చట్టాన్ని ఉల్లంఘించిన దోషిగా, నిధులను దోచుకున్న దొంగలాగా కనిపిస్తున్నది.

గురువారం ఢిల్లీ, ముంబై నగరాల్లో ఇందిరాజైసింగ్, ఆమె భర్త ఆనంద్ గ్రోవర్ నివాసంపైనా, కార్యాలయాలపైనా జరిగిన సీబీఐ దాడులు వారిపై కొంతకాలంగా సాగుతున్న వేధింపుల్లో మరో ఘట్టం. విదేశీ నిధుల కేసులో దంపతులిద్దరూ ప్రభుత్వానికి సంపూర్ణంగా సహకరిస్తుంటే, హఠాత్తుగా ఈ సీబీఐ దాడులు ఎందుకు? అని ఇరవైమంది విపక్ష ఎంపీలు ప్రధానికి ఓ లేఖరాశారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక చర్యలపై పోరాడుతున్నందుకే ఆమెపై ఈ దాడులు జరిగాయంటూ నూటయాభైమంది మేధావులు, న్యాయవాదులు, అధ్యాపకులు, పాత్రికేయులు కలిసికట్టుగా ఓ ప్రకటనలో విమర్శించారు. ఈ దంపతుల ఆధ్వర్యంలో నడుస్తున్న 'లాయర్స్ కలెక్టివ్' అనే ఎన్జీవో సంస్థ 2005–2014 మధ్యకాలంలో అంటే తొమ్మిదేళ్ళలో సేకరించిన 32కోట్ల విదేశీ నిధుల్లో కొంత మొత్తం 'విదేశీ నిధుల క్రమబద్ధీకరణ చట్టం–ఎఫ్‌సిఆర్ఏ' నిబంధనలను ఉల్లంఘిస్తూ దుర్వినియోగమైందన్నది ఆరోపణ. 2009–14 మధ్యకాలంలో ఇందిర ఈ దేశ అదనపు సొలిసిటర్ జనరల్ హోదాలో ఉండగా, సంస్థ నుంచి 90లక్షల రూపాయలను వేతనంగా అందుకోవడమే కాక, ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులూ తీసుకోకుండా సంస్థ నిధులను విదేశీ ప్రయాణాలకు, ఆతిథ్యానికీ వినియోగించారన్నది ఆరోపణ. హెచ్ఐవి/ఎయిడ్స్ బిల్లుపై పార్లమెంటు సభ్యులను ప్రభావితం చేసేందుకు, డబ్బులిచ్చి కృత్రిమ దర్నాలు చేయించేందుకు కూడా ఈ విదేశీ నిధులు ఉపయోగపడ్డాయన్నది ఆరోపణ. దంపతులు ఈ నిధులను 'రాజకీయ లక్ష్యాల' కోసం వాడారని హోంమంత్రిత్వశాఖ తన ఫిర్యాదులో పేర్కొంది. 2016 జనవరిలో లాయర్స్ కలెక్టివ్ ఆడిట్ పుస్తకాల పరిశీలన జరిగింది. హోంమంత్రిత్వ శాఖ మార్చిలో నోటీసు జారీ చేస్తే సంస్థ వెంటనే సవివరంగా సమాధానం చెప్పింది. అది సంతృప్తికరంగా లేదన్న వాదనతో మరోమారు జులైలో నోటీసులు ఇస్తే వాటికీ సంస్థ సమాధానం ఇచ్చింది. అయినా, ప్రభుత్వం ఆ సంస్థకున్న ఎఫ్ఆర్‌సిఎ అనుమతిని ముందు కొంతకాలం సస్పెండ్ చేసి చివరకు రద్దుచేసి పారేసింది. గత మూడున్నరేళ్ళుగా మారుమాట్లాడని హోంశాఖ మొన్న ఎన్నికల ఫలితాలకు మూడురోజుల ముందు సీబీఐకి ఫిర్యాదు చేసింది.

ఈ ఏడాది మొదట్లో 'లాయర్స్ వాయిస్' అనే ఓ ఎన్జీవో హఠాత్తుగా తెరమీద ప్రత్యక్షమై 'లాయర్స్ కలెక్టివ్'పై సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేస్తూ ప్రభుత్వాన్ని కేసు నమోదు చేయవలసిందిగా ఆదేశించాలనీ, కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని కోరింది. సుప్రీంకోర్టు ప్రభుత్వానికి నోటీసులు జారీచేయడం, ఆ తరువాత ఇందిరపై ఫిర్యాదు సంగతి ఎంతవరకూ వచ్చిందంటూ వివిధ ప్రభుత్వ విభాగాలు ఒక్కసారిగా జూలు విదల్చడం చూసిందే. 'ఇందిర తన మనసులో ఉన్నదే అంటుంది, అన్నది చేస్తుంది. ఎదుటి మనిషి ఎవరన్నదానితో ఆమెకు నిమిత్తం లేదు' అని ఆమె సన్నిహితురాలు నిష్ఠూరంగా చేసిన వ్యాఖ్యలో నిజం ఉన్నది. భారత ప్రధాన న్యాయమూర్తి లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న సందర్భంలో సుప్రీంకోర్టు అనుసరించిన యావత్ ప్రక్రియను ప్రతీ దశలో తప్పుబడుతూ, ప్రశ్నిస్తూ బాధితురాలి పక్షాన నిలిచిందామె. జస్టిస్ లోయా వివాదాస్పద హత్య, రాఫెల్ ఒప్పందం ఇత్యాది తీర్పులను ఘాటుగా విమర్శించిందామె. గుజరాత్ ఊచకోతల్లో బాధిత ముస్లిం కుటుంబాల పక్షాన నిలబడినప్పటినుంచీ పాలకుల దృష్టిలో ఆమె శత్రువుగా మారిపోయి ఉండవచ్చునేమో కానీ, ఈ ప్రజాపక్ష పాతి ఐదు దశాబ్దాలుగా అన్ని వ్యవస్థలకూ కంట్లో నలుసే.

ఏడు శాతంతో ఏమి సాధిస్తారు?

■ పి. చిదంబరం

'పళని' పలుకు

> పరిమిత 7 శాతం వృద్ధిరేటుతో మోదీ ప్రభుత్వం సంతృప్తి చెందినట్టు కన్పిస్తుంది. సంపద సృష్టికి, సంక్షేమాన్ని పెంపొందించడానికి ఏడు శాతం వృద్ధిరేటు ఏ మాత్రం సరిపోదు. యువతకు అవసరమైన లక్షలాది ఉద్యోగాలను ఏడు శాతం వృద్ధిరేటు సృష్టించలేదు. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో భారత్ ఒకటి అనే యోగ్యతాపత్రాన్ని ఏడు శాతం వృద్ధి రేటు సాధించగలదేమో గానీ నిరుపేదలు, నిరుద్యోగులు, నిర్లక్ష్యానికి, దోపిడీకి గురవుతున్న సామాజిక వర్గాలకు దాని వల్ల ప్రయోజనమేమీవుండదు.

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించిన 2019–20 కేంద్ర బడ్జెట్ ఎవరికి ఏమి ఇచ్చిందో చాలా త్వరగానే ప్రతి ఒక్కరికీ అర్థమైపోయింది. ఇప్పుడు ఆ ఆర్థిక పత్రంలో విశదం కానటువంటి సంక్లిష్ట విషయాలేమీ లేవు. కనుకనే కాబోలు ఆ బడ్జెట్ ప్రతిపాదనలేవీ ప్రజల మాటామంతీలో చోటు చేసుకోవడం లేదు. మహా సంపన్నులకు ఆ బడ్జెట్ ఏ మాత్రం ఆమోద యోగ్యంగా లేదు. అయితే భయంతో మౌనం వహించారు. తమపై పన్నుల భారం అధికంగా మోపనందుకు సంపన్నులు గొప్ప ఉపశమనం పొందారు. మధ్య తరగతి ప్రజలకు మోదీ ప్రభుత్వంపై భ్రమలు తొలగిపోయాయి. ఈ బడ్జెట్ వారిపై కొత్త భారాలను మోపింది. పేదలు తమ కర్మ ఇంతేనంటూ ఒక నిండు నిట్టూర్పు విడిచారు. నాలుగు వేల మధ్య స్థాయి కార్పొరేట్ సంస్థలు తమకు ఇచ్చిన వరాలను లెక్క పెట్టుకుంటున్నాయి.

బడ్జెట్ గురించి చురుగ్గా చర్చిస్తున్న వారెవరయ్యా అంటే ఆర్థిక వేత్తలు, సంపాదకీయ రచయితలు మాత్రమే! అయితే ఈ ఇరువర్గాల వారిని కేంద్ర ప్రభుత్వం తూష్ణీం భావంతో నిర్లక్ష్యం చేస్తోంది (ముందస్తు అనుమతి తీసుకోకుండా ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యాలయంలోకి అడుగు పెట్టవద్దని పాత్రికేయులపై ఆర్థిక మంత్రి ఆంక్షలు విధించారు!)

2019–20 ఆర్థిక సంవత్సరంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 7 లేదా 8 శాతం వృద్ధి రేటును సాధిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇది, కేవలం 1 శాతం తేడా మాత్రమే కాదు. అది, కొనసాగుతున్న సాధారణ లేదా అపరిమిత వృద్ధి, సంభావ్య వేగవంతమైన వృద్ధి మధ్య ఉన్న వ్యత్యాసం. ప్రధాన ఆర్థిక సలహాదారు (సిఇఎ) ఆధ్వర్యంలోని ఆర్థిక విభాగం, ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి నేతృత్వంలో ఉండే బడ్జెట్ విభాగంతో సంప్రదింపులు జరపలేదనే విషయాన్ని కూడా అది సూచిస్తోంది. ప్రభుత్వం 7 శాతం పరిమిత వృద్ధిరేటుతో సంతృప్తి చెందుతున్నదా లేక అధిక, వేగవంతమైన వృద్ధిరేటు(8 + శాతం)ను లక్ష్యంగా నిర్దేశించుకున్నదో బడ్జెట్ ప్రసంగంలో సూచనేమీ లేదని పలువురు పరిశీలకులు పేర్కొన్నారు. ప్రభుత్వం 7 శాతం పరిమిత వృద్ధిరేటుతో సంతృప్తి చెందుతున్నదనే నేను అనుమానిస్తున్నాను.

అధిక, వేగవంతమైన వృద్ధిరేటు సాధనకు నాలుగు చోదక శక్తులను పూర్తిస్థాయిలో పనిచేయించాల్సి వుంటుంది. సరుకుల ఎగుమతులు.. ఏటా 315 బిలియన్ డాలర్లకు పైగా విలువైన సరుకులను ఎగుమతి చేయాలని 2013–14 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంగా నిర్దేశించడం జరిగింది. అయితే ఈ లక్ష్యాన్ని 2018–19 ఆర్థిక సంవత్సరంలో మాత్రమే అధిగమించడం సాధ్యమయింది. గత ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు పరిమిత 9 శాతం మాత్రమే. రెవెన్యూ ఖాతా(నికర వడ్డీ చెల్లింపులు, గ్రాంట్లు)లో ప్రభుత్వ వ్యయం 2018–19 ఆర్థిక సంవత్సరం జీడీపీలో 7.18 శాతం మాత్రమే. ప్రైవేట్ వినియోగం అనేది ద్రవ్యోల్బణం, ఉద్యోగిత, ఆర్థిక భద్రత మొదలైన వాటితో సహా అనేక అనూహ్య అంశాలపై ఆధారపడి వుంటుంది. 'ఆదాయాన్ని నేను ఆదా చేసుకోవాలా లేక ఖర్చు పెట్టుకోవాలా?'అనే సందిగ్ధత ఏ గృహస్థును ఎన్నడూ వీడదు. ఉదాహరణకు ప్రైవేట్ వినియోగంలో తగ్గుదల ఆటోమొబైల్స్, ద్విచక్ర వాహనాల విక్రయాలను బాగా దెబ్బ తీసింది.

ఇక పెట్టుబడి (ఇన్వెస్ట్‌మెంట్) విషయాన్ని చూద్దాం. లక్షిత వృద్ధి రేటు సాధనకు ఆర్థిక సర్వే పెట్టుబడులలో నిండు విశ్వాసముంచింది. పెట్టుబడులను అధికంగా ఆకర్షించాలని నిర్దేశించింది. ప్రైవేట్ వినియోగంపై కూడా కొంతమేరకు అధిక వృద్ధిరేటుకు తోడ్పడుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. స్థూల నిర్ణీత మూల ధన కల్పన (గ్రాస్ ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఫార్మేషన్.. జిఎఫ్‌సిఎఫ్) అనేది ఒక ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడికి సాధారణ కొలమానం. నరేంద్రమోదీ మొదటి ప్రభుత్వ హయాంలో జీడీపీలో జిఎఫ్‌సిఎఫ్ శాతం సంవత్సరాల వారీగా ఇలా ఉన్నది: (తొలుత, 2007–08 ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో జిఎఫ్‌సిఎఫ్ 32.9 శాతంగా ఉన్నదన్న విషయాన్ని మనం గమనించి తీరాలి) 2014–15 30.1 శాతం; 2015–16 28.7 శాతం; 2016–17లో 28.2 శాతం; 2017–18 లో 28.6 శాతం; 2018–19లో 29.3 శాతం. జిఎఫ్‌సిఎఫ్ 2007–08లో 32.9 నుంచి దాదాపు ఐదు శాతం మేరకు తగ్గిపోయింది. మూడు సంవత్సరాల పాటు 28 శాతానికి కొంచెం అధికంగా ఉన్నది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో మాత్రమే స్వల్పంగా పెరిగి 29.3 శాతానికి చేరింది.



ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడులు గణనీయంగా పెరిగితేనే జిఎఫ్‌సిఎఫ్ పెరుగుతుంది. పన్ను రాబడులను పెంచుకోవడంలో ప్రభుత్వ సామర్థ్యంపై ప్రభుత్వ పెట్టుబడుల పెరుగుదల ఆధారపడివుంటుంది. అయితే ఆ సామర్థ్యానికి గ్రహణం పట్టింది. సవరించిన నికర పన్ను రాబడి అంచనాలతో 2018–19లో రూ.1,67,455 కోట్ల ఆదాయాన్ని కోల్పోయింది. 2019–20 ఆర్థిక సంవత్సరానికి నికర పన్ను రాబడి పెరుగుదల రేట్లు అంచనాలు, ఎంత మర్యాద పూర్వకంగా చెప్పినా దిగ్భ్రాంతికరమైన అత్యాశతో కూడుకుని ఉన్నాయి. ఆదాయపు పన్నురాబడి 23.25 శాతం పెరుగుతుందని, వస్తు సేవల పన్ను(జీఎస్టీ) రాబడి 44.98 శాతం పెరగగలదనే అంచనాలను ఎవరైనా విశ్వసిస్తారా?

కార్పొరేట్ సంస్థల పొదుపులు, కుటుంబాల పొదుపులపై ప్రైవేట్ పెట్టుబడులు ఆధారపడి ఉంటాయి. మదుపు చేయడమనేది విశ్వాసానికి సంబంధించిన వ్యవహారం. లాభాలను ఆర్జించగలమనే విశ్వాసం కొరవడితే కార్పొరేట్ కంపెనీలు పెట్టుబడులు పెట్టవు; ఆర్జించిన లాభాలను మళ్ళీ మదుపు చేయవు. కుటుంబాల పొదుపులు పెరగని పక్షంలో ప్రైవేట్ పెట్టుబడులు కూడా పెరగవు.

కార్పొరేట్ లాభాలు అనేక కారకాలపై ఆధారపడివుంటాయి. అవి కార్పొరేట్ల నియంత్రణలో ఉండవు. కుటుంబ పొదుపులకు సంబంధించి మరింతగా ఆర్జించి, పొదుపు చేసి మదుపుచేసేలా కుటుంబాలను ప్రోత్సహించే అంశాలేవీ నాకు బడ్జెట్‌లో కన్పించనే లేదు. ఏమైనా ఉంటే అవి కుటుంబాలపై మరింత భారాన్ని మోపాయని చెప్పక తప్పదు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుదల, దీర్ఘకాలిక పెట్టుబడి లాభాలను కొనసాగించడం, షేర్ల బై బ్యాక్ పై పన్ను విధింపు, న్యూస్ ప్రింట్, పుస్తకాలు, స్ప్లిట్ ఎయిర్ కండిషనర్లు, ఆటోమొబైల్ విడి భాగాలు, వెండి, బంగారం ధరల పెంపుదల ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని పెంచుతాయి. జిఎఫ్‌సిఎఫ్ స్తంభించిపోయి, ఉత్పాదకతలో మెరుగుదల లేనిపక్షంలో జీడీపీ వృద్ధి రేటులో చెప్పుకోదగిన పెరుగుదల ఉండదు.

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తమ బడ్జెట్ ప్రసంగంలో ' సంస్థాగత సంస్కరణలు'అనే పదబంధాన్ని రెండు చోట్ల ఉపయోగించారు. అయితే సంస్థాగత సంస్కరణగా భావించదగ్గ ఏ చర్య గురించి ఆమె ప్రసంగంలో ఎటువంటి ప్రస్తావనే లేదు. ఇది, డాక్టర్ మన్మోహన్ సింగ్ వలే నరేంద్ర మోదీ నిర్భీక సంస్కర్త కాదనే నా అభిప్రాయాన్ని ధ్రువీకరించింది. మోదీ మితవాది, సంరక్షణ వాది; స్వేచ్ఛా వాణిజ్యంలో విశ్వాసమున్న పాలకుడు కాదు; పన్నులు విధించి, వచ్చిన రాబడిని వ్యయపరిచే విధానానికి సమర్థకుడు. ఒక్క పన్ను విధింపు విధానంలో మినహా అనేక విషయాలలో మోదీ వైఖరి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరినే పోలివుంటుంది.

పరిమిత 7 శాతం వృద్ధిరేటుతో మోదీ ప్రభుత్వం సంతృప్తిచెందినట్టు కన్పిస్తుంది. సంపద సృష్టికి, సంక్షేమాన్ని పెంపొందించడానికి ఏడు శాతం వృద్ధి రేటు ఏ మాత్రం సరిపోదు. యువతకు అవసరమైన లక్షలాది ఉద్యోగాలను ఏడు శాతం వృద్ధిరేటు సృష్టించలేదు. అభివృద్ధిలో అట్టడుగున ఉన్న 20 శాతం జనాభా తలసరి ఆదాయాన్ని ఏడు శాతం వృద్ధిరేటు పెంచలేదు. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో భారత్ ఒకటి అనే యోగ్యతాపత్రాన్ని ఏడు శాతం వృద్ధి రేటు సాధించగలదేమో గానీ నిరుపేదలు, నిరుద్యోగులు, నిర్లక్ష్యానికి, దోపిడీకి గురవుతున్న సామాజిక వర్గాలకు దాని వల్ల ప్రయోజనమేమీవుండదు. ఉన్నా అది అతి స్వల్పమైనది మాత్రమే.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

గ్రామ సచివాలయంతో నవ గ్రామీణం

మన రాష్ట్రంలో 13,065 గ్రామ పంచాయతీలలో సుమారు 3 కోట్ల పైగా ప్రజలు గ్రామీణ జీవనం కొనసాగిస్తున్నారు. వీరి జీవన స్థితి మెరుగవాలంటే గ్రామ పంచాయతీల పనితీరు మేలైన స్థాయికి తీసుకు వెళ్ళవలసిన అవసరం వుంది.

2001లో కూడా రెవెన్యూ విధులు, పంచాయతీ విధులు కలిపి గ్రామీణ పరిపాలన అభివృద్ధి దిశలో కొనసాగించుటకు గ్రామ సచివాలయ వ్యవస్థ నేర్పాటు చేశారు. మంచి ఫలితాలతో గ్రామీణ ప్రజలు హర్షిస్తున్న సమయంలో 2007లో తిరిగి రెవెన్యూ కార్యదర్శి వ్యవస్థ ఏర్పాటు చేసి రెవెన్యూ విధులను పంచాయతీల నుండి వేరు చేయడం జరిగింది. తద్వారా గ్రామీణ ప్రజలు చాలా ఆనందించారు. అంతేకాక ఈ వ్యవస్థ వల్ల పంచాయతీ రాజ్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారు. రెవెన్యూ శాఖలో గౌరవ వేతనం పొందుతున్న గ్రామ పరిపాలనాధికారులు పంచాయతీ అధికార్లుగా గ్రామ సచివాలయ వ్యవస్థలో చేరి స్కేల్‌తో జీత భత్యాలు పొందడం జరిగింది. కాని పంచాయతీలలో పని చేస్తున్న పార్ట్ టైం / ఫుల్ టైం ఉద్యోగులలో అర్హత వున్న వారు పంచాయతీ కార్యదర్శిగా గ్రహించబడక నేటికి దుర్భరమైన జీవితం అనుభవిస్తున్నారు. మరి వేరే శాఖ వారు పంచాయతీ రాజ్ శాఖలోకి వచ్చి లబ్ది పొందడానికే గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పడిందా! అన్నట్లు వుంది.

ఈ సందర్భంలో గ్రామ సచివాలయ వ్యవస్థ వైపు అడుగులు వేస్తున్న నేటి ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుంది. నేడు ప్రవేశపెట్టిన వాలంటీర్ల వ్యవస్థ గ్రామీణ ప్రజలకు సేవలు అందించే ఆశయంతో ఏర్పాటు చేయడం ముదావహం. ఈ వాలంటీర్ల వ్యవస్థ ఏర్పాటులో ప్రభుత్వం కొన్ని అంశాలు పరిగణనలోనికి తీసుకోవాలి. ముఖ్యంగా నియమితులైన వాలంటీర్లకు ఖచ్చితంగా బయోమెట్రిక్ విధానం ద్వారా ఉదయం, సాయంత్రం వేళలో హాజరు నమోదు తప్పనిసరి చేయాలి. ఆర్థిక పరమైన లావాదేవీలు అప్పగించరాదు. వివిధ ధ్రువపత్రాలు పంచాయతీల నుండి గ్రామీణులకు అందజేయడంలో వాలంటీర్లు అందిస్తున్న సమాచారం గ్రామీణులకు మొబైల్ ద్వారా సందేశం పంపాలి. తద్వారా గ్రామస్థులు వాలంటీర్ల పనితీరుపై తమ అభిప్రాయాలను చెప్పే అవకాశం కలదు. వాలంటీర్లకు గుర్తింపు కార్డు ఇవ్వాలి. సేవలు సక్రమంగా అందిస్తున్నారా? లేదా? అని పంచాయతీ వార్డ్ మెంబర్లు నిశితంగా పరీక్షించాలి. ప్రతి 15 రోజులకొకసారి పంచాయతీ ప్రత్యేక అధికారి పంచాయతీ కార్యదర్శితో సమీక్షించాలి. అన్ని రకాల ప్రభుత్వ విధానాలను గ్రామీణ ప్రజలకు చేరివేతలో గ్రామ వాలంటీర్ల పాత్ర ప్రాముఖ్యత వహించాలి. గ్రామీణ వాలంటీర్లకు తమ ఉనికిని, సమాచారం అందజేయు నిమిత్తం వారికి కనీసం రూ. 300/– మొబైల్ రీఛార్జి సొమ్ము చెల్లింపు జరపాలి. ముఖ్యంగా వాలంటీర్ల "104 & 108" ద్వారా వాహనాలు, పాఠశాల పరిశుభ్రత, గ్రామీణ రోడ్ల నిర్వహణ తీరు తెన్నుల గురించి ఎప్పటికప్పుడు పంచాయతీకి తెలపాలి. తద్వారా గ్రామీణ వాలంటీర్ల వ్యవస్థ తీరు ప్రశంసనీయమవుతుంది. ఇక నేడు ప్రవేశపెట్టబడే గ్రామ సచివాలయ వ్యవస్థ ఎట్లా ఉండాలో చర్చిద్దాం!

> ప్రతి పంచాయతీకి ఒక పంచాయతీ కార్యదర్శి ఉండాలి. సదరు కార్యదర్శి వివిధ ధ్రువపత్రాలను కచ్చితంగా సంబంధిత గ్రామ ప్రజలకు అందజేయాలి. ప్రజా పంపిణీ, విద్యుత్, గ్రామీణ ఉపాధి పథకం, వ్యవసాయం, విద్య, అంగన్‌వాడీ, గ్రామ రెవెన్యూ, గ్రామీణ నీటి సరఫరా విభాగాలకు సంబంధించిన అధికార్ల హాజరు నమోదును గ్రామ పంచాయతీలు నిర్దేశించాలి.

ప్రతి పంచాయతీకి ఒక పంచాయతీ కార్యదర్శి ఉండాలి. సదరు కార్యదర్శులు వివిధ ధృవపత్రాలు ముఖ్యంగా జనన మరణ ధ్రువపత్రాలు, ఆస్తి పాస్తుల పత్రాలు, ఆస్తి విలువ ధ్రువపత్రాలు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ నివాస స్థానిక కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రాలు ఖచ్చితంగా సంబంధిత గ్రామ ప్రజలకు అందజేయాలి. అంతేకాక గ్రామీణ ప్రజలకు నిత్యం అవసరమైన సేవలు ముఖ్యంగా ప్రజా పంపిణీ విద్యుత్, గ్రామీణ ఉపాధి పథకం, వ్యవసాయం, ఇంజనీరింగ్ విభాగం, విద్య, అంగన్‌వాడీ, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామీణ నీటి సరఫరా విభాగాలకు సంబంధించిన అధికార్ల హాజరు నమోదును గ్రామ పంచాయతీలలో నిర్దేశించాలి. వీలుంటే వీరి జీత భత్యాలు పంచాయతీ కార్యదర్శిచే చెల్లింపు జరపాలి.

గ్రామీణ యువతకు ఆర్థిక సహకారం అందించడానికి వాలంటీర్లు తమ పూర్తి సహకారం అందించాలి. పంచాయతీ కార్యదర్శుల పరిపాలనా విభాగాన్ని సమూలంగా మార్పు చేయాలి. కనీసం 2000 జనాభాకి కూడా ప్రత్యేక సచివాలయాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం ముదావహం. ఈ సందర్భంలో పంచాయతీ కార్యదర్శులను రెండు కేటగిరీలుగా మార్పు చేయాలి. 2000 మించి ఉన్న జనాభాకు పంచాయతీ కార్యదర్శి – 1, జనాభా 2000కు తక్కువున్న వాటికి పంచాయతీ కార్యదర్శి – 2 గా మార్పు చేయాలి. అంతేకాక పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ –1కు గెజిటెడ్ హోదా కల్పించాలి. వీరికి జీతభత్యాలు డ్రా చేసే అధికారం కల్పించాలి. అలాగే కేటగిరి పంచాయతీ – 2 విస్తరణాధికారి (పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి)ని డ్రాయింగ్ అధికారిగా మార్పు చేయాలి. అలాగే పంచాయతీ సిబ్బంది(కార్యదర్శి లేక) విధానాన్ని మార్చాలి. ఎందుచేతనంటే 1977లో ప్రభుత్వ సిబ్బందిని స్థిరీకరించారు. నేటికి 42 సంవత్సరాలు అయినందున పంచాయతీల సిబ్బంది ఏ విధంగా ఏ ఏ కేటగిరీ పోస్టులు వుండాలో పునఃస్థిరీకరించాలి. కావున ప్రభుత్వం పంచాయితీలలో రెండు గ్రేడ్‌లు ఏర్పాటు చేసి సిబ్బంది పోస్టును స్థిరీకరించాలి. లేకుంటే పంచాయితీ కార్యదర్శి కూడా తమ విధులను ఆశాజనకంగా నిర్వహించే అవకాశం తక్కువ.

మన ముఖ్యమంత్రి గ్రామీణ భారతం తీరు తెన్నులు మార్చి గ్రామీణ ప్రజలకు పలు సేవలు వారి ఇంటి వద్దనే అందించేందుకు చర్యలు తీసుకోవడం సంతోషకరం. ఈ సందర్భంలో ముఖ్యమంత్రి విధానపరమైన నిర్ణయాలను అభినందిస్తూ పంచాయితీ రాజ్ సంస్థలకు సరియైన ఆర్థిక పరిపుష్టి అందించాలని కోరుతున్నాను.

■ టి.యం.బి. బుచ్చిరాజు
ఛైర్మన్, ఆం.ప్ర. పంచాయతీ రాజ్ సర్వీసెస్ అసోసియేషన్

జనవాక్యం

రైతులకు న్యాయం జరగ లేదు!

రైతులందరికీ వడ్డీ లేని రుణాలు ఇస్తామని ఆశ పెట్టి, రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం వంద కోట్లే కేటాయించటం దురదృష్టకరం. రైతుల కష్టాలు పాలకులకు తెలియనివి కావు. వర్షాభావం నుంచి మొదలు కొంటే గిట్టుబాటు ధర వరకూ అన్నిట్లా అన్నదాతకు అన్యాయం జరుగుతూనే ఉంది. ఈ కారణాంశాల వల్లనే రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రతినిత్యమూ ఇలాంటి వార్తలు చూస్తూ, చదువుతూనే ఉన్నాం. అందరికీ అన్నం పెట్టే రైతన్న పరిస్థితి, సమాజంలో అన్ని వర్గాల కన్నా దయనీయంగా ఉంది. ఈ నేపథ్యంలో పాలకుల తీరు మరింత నిరాశాజనకంగా ఉండటం రైతాంగం ఆత్మస్థైర్యాని కృంగదీస్తుంది. అందుకని రాష్ట్ర ప్రభుత్వం రైతు గురించి పునరాలోచించాలి, రైతులపట్ల ఉదారంగా వ్యవహరించాలి. మాటలకు చేతలకు పొంతన లేకపోతే పాలకులు విశ్వసనీయత కోల్పోవటం ఖాయం.

– జి. రామకృష్ణ
పశ్చిమ గోదావరి జిల్లా

దివ్యాంగులను ఆదుకోవాలి

గత ప్రభుత్వం వృద్ధాప్య, వితంతు పింఛన్లు రెండు వందల రూపాయల నుండి ఐదురెట్లు పెంచింది, దివ్యాంగులకు ఐదువందల నుంచి మూడు రెట్లు పెంచింది, వారితో సరిచూస్తే దివ్యాంగులు నెలకు వెయ్యి కోల్పోయారు. ఈ జనవరి నుంచి రెట్టింపు చేయడం వలన ఐదువేలు తీసుకోవలసిన వారు కేవలం మూడు వేలు పొందుతున్నారు, ఈనెల నుండి వృద్ధులకు రెండు వందల యాభై పెంచినా దివ్యాంగులకు పైసా కూడా పెంచలేదు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా తాము సవతి బిడ్డలమన్న భావనే దివ్యాంగులకు కలుగుతోంది. కుటుంబ సభ్యులకు, సంఘానికి దూరంగా విసిరి వేయబడిన దివ్యాంగులపై వివక్ష సరికాదు. అన్నివర్గాలకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చెబుతున్నారు. కనీస పింఛను మూడు వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దామాషా ప్రకారం వికలాంగులకు పదిహేను వేల రూపాయలు చెల్లించవలసి ఉంటుంది, అప్పటి వరకు కనీసం పదివేలు చెల్లించి వారికి మనోస్థైర్యం కల్పించి వారిని ఉదారంగా ఆదుకోవాలి.

– యర్రమోతు ధర్మరాజు
ధవళేశ్వరం

ఈశాన్య భారత కష్టాలు కడతేరేదెన్నడు?

■ రామచంద్ర గుహ



గతానుగతం

అత్యంత సుందరమైన ప్రాంతాలే ఎడతెగని ఘర్షణలు, హింసాకాండతో అతలాకుతలమవుతున్న ప్రదేశాలుగా ఉండడం వర్తమాన భారతదేశపు ఒక విస్మయకరమైన.. బహుశా, విషాదకరమైన వాస్తవం. కశ్మీర్ లోయ, మధ్య భారతదేశపు అడవులు (మరీ ముఖ్యంగా బస్తర్) ఈశాన్య భారత రాష్ట్రాలే ఇందుకు నిదర్శనాలు.

నేను తొలుత 1990 దశకంలో ఈశాన్య భారత రాష్ట్రాలను సందర్శించాను. నృశాస్త్రవేత్త వెరియర్ ఎల్విన్ జీవితచరిత్ర రచనా కృషిలో భాగంగా నేను ఆ ప్రాంతాలకు వెళ్ళాను. ఇంగ్లాండ్‌లో పుట్టి, పెరిగి, విద్యావంతుడైన ఎల్విన్ యువకుడుగా భారత్‌కు వచ్చారు. ఈ దేశాన్ని ఆయన మరెన్నడూ వీడి వెళ్ళలేదు. 1930, 40 దశకాలలో మధ్య భారత ఆదివాసీలతో కలిసి ఆయన పని చేశారు; వారి గురించి విస్తృతంగా రాశారు. 1954లో భారతీయ పౌరుడుగా ఆదివాసుల వ్యవహారాలపై ప్రభుత్వ సలహాదారుగా ఆయన షిల్లాంగ్‌కు వెళ్ళారు. 1964లో ఎల్విన్ మరణించారు. ఆయన భార్యాబిడ్డలు షిల్లాంగ్ లోనే నివశిస్తున్నారు. నేను వారిని అక్కడే కలుసుకున్నాను.

ఎల్విన్‌తో మేధో బాంధవ్యం నాలో ఈశాన్య రాష్ట్రాల పట్ల శ్రద్ధాసక్తులకు ప్రేరణ అయింది. అవి ఇప్పటికీ నాలో నిండుగా ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాలు, విశాల భారత దేశం మధ్య సంక్లిష్ట సంబంధాలను అర్థం చేసుకోవడానికి నేను నా శాయశక్తులా ప్రయత్నించాను. స్వాతంత్ర్యానంతరం ఈశాన్య భారత రాష్ట్రాలు రెండు రకాల ఘర్షణలకు నెలవులయ్యాయి. ఒకటి తిరుగుబాటు దారులు, భారత రాజ్యం మధ్య చోటుచేసుకున్నవి. నాగా, మిజో తిరుగుబాట్లు, అసోంలో ఉల్ఫా కార్యకలాపాలు ఇందుకు ఉదాహరణలు. రెండు ఈ రాష్ట్రాలలో నివశిస్తున్న వివిధ సామాజిక వర్గాలు, జాతుల మధ్య, చోటు చేసుకున్న ఘర్షణలు. మేధావులు, రచయితలు ఇంతవరకు రెండోరకం ఘర్షణల కంటే మొదటి రకం ఘర్షణలపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతూ వచ్చారు. దేశ భద్రత, రాజ్య సుస్థిరతపై ఈ ఘర్షణలు ప్రత్యక్ష ప్రభావం చూపడమే ఇందుకు కారణం కావచ్చు. ప్రజల నిత్య జీవితాన్ని అమితంగా ప్రభావితం చేస్తున్న రెండోరకం ఘర్షణలపై ఎవరూ పెద్దగా దృష్టి పెట్టలేదు.

ఇప్పుడిప్పుడే ఈ పరిస్థితి మారుతున్నది. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన రచయితలు, మేధావులు రాసిన వ్యాస సంకలనం 'ఇన్‌సైడర్ ఔట్ సైడర్: బిలాంగింగ్ అండ్ అన్ బిలాంగింగ్ ఇన్ నార్త్ ఈస్ట్ ఇండియా' ఆ మార్పును సూచిస్తుంది. ప్రీతి గిల్, సమ్రాట్‌లు ఈ వ్యాసాలను సంపుటీకరించారు. ఈ పుస్తకానికి రాసిన ముందుమాటలో ఈశాన్య భారత సమాజంలోని ఒక ముఖ్య వైరుధ్యాన్ని సంకలన కర్తలు నొక్కి చెప్పారు. 'భారతదేశంలోనూ, ఈశాన్య రాష్ట్రాలకు పొరుగునే ఉన్న దేశాలలోను అధిక సంఖ్యాకులుగా ఉన్న సామాజిక వర్గాల వారు ఈ రాష్ట్రాలలో తరచూ వేధింపులకు గురవుతున్న అల్పసంఖ్యాక వర్గాలుగా నివశిస్తున్నారు. ఇదే సమయంలో వలసవచ్చిన వారి ప్రాబల్యం అన్ని విధాల పెరిగిపోవడంపై స్థానికులలో తీవ్ర, సహేతుకమైన భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి'.

షిల్లాంగ్(మేఘాలయ రాజధాని)పై ఈ పుస్తకంలో ప్రత్యేకంగా కొన్ని వ్యాసాలున్నాయి. ఎల్విన్ 1950 ల్లో మధ్య భారతం నుంచి షిల్లాంగ్‌కు వెళ్ళినప్పుడు ఆ పట్టణం ఆయన్ని అమితంగా ఆకట్టుకున్నది. దేవదారు అరణ్యాలు, సమశీతోష్ణ స్థితులు ఆయనకు ఆల్ప్స్ పర్వత సీమల అనుభూతినిచ్చాయి. అదే వాతావరణం ఇప్పటికీ ఉన్నప్పటికీ, షిల్లాంగ్ గుర్తు పట్టలేనంతగా మారిపోయింది. విస్తరించడంతోపాటు విరూపమయింది. స్థానికులు, బయటినుంచి వచ్చిన వారి మధ్య విభేదాలు, వివాదాలు మరింతగా విషమించాయి.

> నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్, పౌరసత్వ సవరణ బిల్లుతో పాటు సహజ వనరుల దోపిడీ ఈశాన్య భారత రాష్ట్రాలను కల్లోల పరుస్తున్నది. మేఘాలయలో గనుల తవ్వకాలు, అరుణాచల్ ప్రదేశ్ జల విద్యుదుత్పత్తి ప్రాజెక్టులతో ఈశాన్యేతర రాష్ట్రాలు లబ్ధి పొందుతుండగా ఈశాన్య రాష్ట్రాల పర్యావరణం ధ్వంసమవుతున్నది. కేంద్ర ప్రభుత్వ రాజకీయ అవకతవకలకు విశాల భారతదేశ విపణి శక్తుల దోపిడీ తోడవడంతో ఈశాన్య భారత రాష్ట్రాల కష్టాలు కొనసాగనున్నాయి.

1970 దశకంలో, భావి నవలా రచయిత్రి అంజుమ్ హసన్ తల్లిదండ్రులు ఉత్తర భారతదేశం నుంచి షిల్లాంగ్‌కు వలస వచ్చారు. వృత్తిరీత్యా ఇరువురూ అధ్యాపకులు. తన బాల్యంలో వలసవచ్చిన వారికి వ్యతిరేకంగా షిల్లాంగ్‌లో చోటు చేసుకున్న అల్లర్ల గురించి అంజుమ్ విశదంగా రాశారు. ఆ అల్లర్లు ఆమె కుటుంబం నివశిస్తున్న ప్రదేశానికి కూడా వ్యాపించాయి. 'పదుల సంఖ్యలో ఆందోళనకారులు కత్తులు, బాకులు తదితర ఆయుధాలను ఝుళిపిస్తూ మేము నివాసముంటున్న ఇంటి తోటలోకి జొరబడ్డారు. మేము మా ఇంటిల్లి పాదీ ఒక స్నానాల గదిలో దాక్కున్నాము. బయటనుంచి అరుపులు, గర్జనలు విన్పిస్తుండగా మేము బిక్కటిల్లిపోయాము. ఇంతలో (మేము స్వయంగా చూడలేదుగానీ) మా ఇంటిపక్కనే నివశిస్తుండే శ్రీమతి పి (ఖాసీ మహిళ) ఆ గుంపు వద్దకువచ్చి ఆ మూకతో వాదోపవాదాలు చేసి చివరకు వారిని సంయమన పరిచింది. 'వారు బయటివారు కాదు, నా వారు, వారిని వదిలేయండి' అని ఆమె గట్టిగా ఆదేశించింది. ఆమె మాటలు నిజం కాదని ఆందోళనకారులకు తెలుసు. అయినా ఆ అబద్ధంలోని మానవతా భావాన్ని అర్థం చేసుకొని ఆ మూక అక్కడి నుంచి వెళ్ళిపోయింది'. శ్రీమతి పి. ఒక సివిల్ సర్వీస్ అధికారి వితంతువు కావడం వల్ల కూడా ఆమె మాటలు ఆ గుంపుపై ప్రభావాన్ని చూపాయని చెప్పవచ్చు'.

షిల్లాంగ్‌పై మరొక ప్రశస్త వ్యాసాన్ని చరిత్రకారుడు వినాయక్ దత్తా రాశారు. ఇదొక విశ్లేషణాత్మక వ్యాసం. వ్యక్తిగత అనుభవాల నేపథ్యంతో రాసినది కాదు. షిల్లాంగ్‌కు బెంగాలీల, గూర్ఖాల, మార్వాడీల, సిక్కుల వలసలు ఎలా జరిగాయో ఆయన వివరించారు. దశాబ్దాలుగా ఈ విభిన్న సామాజిక వర్గాల వారి వర్ధిల్లిన అన్యోన్యభావం స్థానంలో విరోధం, అపనమ్మకాలు ఎలా చోటు చేసుకున్నాయో ఆయన విశదీకరించారు. దత్తా ఇలా రాశారు: 'సామాజిక సంబంధాలు పరస్పర అనుమానాలు, విద్వేషంతో కలుషితమైపోయాయి. పుకార్లు, రెచ్చగొట్టే ప్రసంగాలు సామాన్యుల మనస్సులను విషపూరితం చేశాయి. హింసాకాండ, ఇళ్ళ నుంచి గెంటివేత తీవ్ర ఆందోళనను సృష్టించాయి. దీంతో ప్రతి వారూ తమ సొంత సామాజిక వర్గం వారు అధికంగా నివశిస్తున్న ప్రాంతంలో స్థిరపడడం జరిగింది. ఒకప్పుడు సర్వ సమ భావం వెల్లివిరిసిన పట్టణంగా ఉన్న షిల్లాంగ్ వెలివాడల సమాహారంగా పరిణమించింది'.

ప్రస్తావిత రెండు అంశాలలోనూ షిల్లాంగ్‌కు, దేశంలోని మరో ప్రాంతంలో ఉన్న ఒక మహానగరంతో పోలికలు ఉన్నాయి. ముంబైలో మతోన్మాద మూకల నుంచి ముస్లింలను కొంత మంది హిందువులు తమ ప్రాణాలకు తెగించి ఎలా రక్షించిందీ మనకు తెలుసు. విశ్వజనీన నగరంగా వర్ధిల్లిన ముంబై అంతకంతకూ భాష, మతం ప్రాతిపదికన వెలివాడలుగా ఎలా పరిణమించిందో కూడా మనకు తెలుసు. మానవ జీవితాలు ఈశాన్య భారతంలోనైనా, విశాల భారతావనిలో మరెక్కడైనా ఒక్కటే. ఉదార స్వభావం, సంకుచిత మనస్తత్వం; దయా స్వభావం, దురభిమానం తమ ప్రభావాన్ని చూపడానికి పరస్పరం పెనగులాడుకోవడం కద్దు.

ఉత్తర భారతీయురాలుగా అంజుమ్, బెంగాలీగా వినాయక్ దత్తాలిరువురూ షిల్లాంగ్‌కు 'పరాయివారే'. వారి వ్యాసాలు నిశిత అంతర్దృష్టితో రాసినవి. అయితే షిల్లాంగ్‌కు ఈశాన్య ప్రాంతానికి చెందిన, దేశీయ సాంస్కృతిక మూలాలు గల ఖాసీ సామాజికుడు ఒకరు రాసిన వ్యాసం కూడా ఉన్నట్టయితే ఈ పుస్తకం మరింత సమగ్రంగా ఉండేదని నేను భావిస్తున్నాను. మేఘాలయ రాజధానిగా, ఈశాన్య భారత ప్రధాన నగరాలలో ఒకటిగా షిల్లాంగ్ ఆవిర్భావం ఆదివాసీ సమాజ అంతర్గత గతిశీలతను ఎలా మార్చిందో నేను తెలుసుకోగోరుతున్నాను. ఎన్నికల రాజకీయాలు, మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో ఎల్లెడలా పురుషులదే ఆధిపత్యం కదా. మరి ఖాసీ తెగ ప్రజల జీవితాలలో స్పష్టంగా గోచరమయ్యే మహిళల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఆ పురుషాధిపత్య రాజకీయాలు, ఆర్థిక కార్యకలాపాల వల్ల క్షీణించాయా?

అసోంకు చెందిన బెంగాలీ ముస్లిం షలీమ్ ఎమ్. హుస్సేన్ రాసిన వ్యాసం నన్ను ప్రత్యేకంగా ఆకట్టుకున్నది. 'గ్రోయింగ్ అప్ మియా' అనే ఈ వ్యాసంలో, (ఉత్తర భారతీయ) ముస్లిం విలువలు, సంప్రదాయాల ప్రభావం అమితంగా ఉండే ఢిల్లీలోని ఒక విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా వ్యాసకర్త అనుభవాలను వివరించింది. 'ఉర్దూ భాష నాకు ఎందుకు తెలియదో నా మిత్రులకు వివరించవలసివచ్చింది. మా ఇంట్లో బిర్యానీని ఎప్పుడూ తినలేదని అంగీకరించడం ద్వారా నేను దైవదూషణకు పాల్పడినవాడినయ్యాను!' అని షలీమ్ రాశారు.

ఈశాన్య భారత రాష్ట్రాలలో శాంతి, సామరస్యాలు పూర్తి స్థాయిలో లేనప్పటికీ దశాబ్దాల హింసాత్మక ఘర్షణలు కొంతమేరకు తగ్గు ముఖం పట్టాయని సంకలనకర్తలలో ఒకరైన సమ్రాట్ రాశారు. ఆయన ఇంకా ఇలా రాశారు: 'విభజనపూరిత రాజకీయాలను ఆర్థిక కార్యకలాపాలు తగ్గుముఖం పట్టించాయి. అసోంలో నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్, ప్రతిపాదిత పౌరసత్వ సవరణ బిల్లుతో ప్రజ్వరిల్లిన అస్తిత్వ రాజకీయాలు ఈ పరిస్థితి కొనసాగడాన్ని అనుమతిస్తాయా అనేది చర్చించవలసిన విషయమే. ఈశాన్య భారత రాష్ట్రాలలో ఎక్కడైనా సరే ఏ మాత్రం మత సంకుచితత్వం పెచ్చరిల్లినా పాత చెడ్డరోజులు మళ్ళీ దాపురించడం ఖాయం'.

నిజానికి నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్, పౌరసత్వ సవరణ బిల్లుతో పాటు సహజవనరుల దోపిడీ ఈశాన్య భారత రాష్ట్రాలను కల్లోల పరుస్తున్నది. మేఘాలయలో గనుల తవ్వకాలు, అరుణాచల్ ప్రదేశ్ జల విద్యుదుత్పత్తి ప్రాజెక్టులతో ఈశాన్యేతర రాష్ట్రాలు లబ్ధి పొందుతుండగా ఈశాన్య రాష్ట్రాల పర్యావరణం ధ్వంసమవుతున్నది. కేంద్ర ప్రభుత్వ రాజకీయ అవకతవకలకు విశాల భారతదేశ విపణి శక్తుల దోపిడీ తోడవడంతో ఈశాన్య భారత రాష్ట్రాల కష్టాలు కొనసాగనున్నాయి.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

సుజుకీ నుంచి సరికొత్త జిక్సర్

న్యూఢిల్లీ: సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా.. దేశీ మార్కెట్లోకి సరికొత్త జిక్సర్‌ను విడుదల చేసింది. ఈ బైక్ ధర రూ.1,00,212 (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్). 155 సీసీ, ఫోర్ స్ట్రోక్, సింగిల్ సిలిండర్ ఇంజన్, యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఏబీఎస్)తో ఈ బైక్‌ను తీసుకువచ్చినట్లు సుజుకీ తెలిపింది. డైనమిక్ రైడర్లను దృష్టిలో పెట్టుకుని అత్యుత్తమ పవర్‌తో ఈ బైక్‌ను తీసుకువచ్చినట్లు సుజుకీ మోటార్ ఇండియా హెడ్ కొచిరో హిరో తెలిపారు.

మేలో పడకేసిన పారిశ్రామిక ఉత్పత్తి

న్యూఢిల్లీ : ఆర్థిక వ్యవస్థలో మందగమనం కొనసాగుతోంది. ఈ సంవత్సరం మేలో పారిశ్రామిక ఉత్పత్తి మరింత పడకేసింది. పారిశ్రామిక ఉత్పత్తిని సూచించే పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) మేలో 3.1 శాతానికి పడిపోయింది. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది 0.7 శాతం తక్కువ. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో నమోదైన 4.3 శాతంతో పోల్చినా మే నెల ఐఐపీ 1.2 శాతం తక్కువగా ఉంది. మైనింగ్ (గనులు), తయారీ

రంగం పడకేయడం ఇందుకు ప్రధాన కారణం. గత ఏడాది మేలో మైనింగ్ రంగంలో 5.8 శాతంగా ఉన్న వృద్ధి రేటు, ఈ సంవత్సరం మేలో 3.2 శాతానికి పడిపోయింది. ఇదే కాలంలో తయారీ రంగం వృద్ధి రేటూ 3.6 శాతం నుంచి 2.5 శాతానికి తగ్గింది. దీంతో మే నెల ఐఐపీ వృద్ధి రేటు 3.1 శాతానికి దిగొచ్చింది.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayIndia
ద.మ. రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును

ఇ-టెండరు కోరుతూ ప్రకటన (https://ireps.gov.in ద్వారా)

భారత రాష్ట్రపతి తరఫున, CAO (నిర్మాణం), ద.మ. రైల్వే, సికింద్రాబాద్ వారు దిగువ పనుల కొరకు ఇ-టెండర్లు కోరుతున్నారు.

1. నిట్ నం. 77-CAO-C-SC-2019 తేది : 10.07.2019
పని పేరు: నడికుడి-శ్రీకాళహస్తి న్యూ బిజి లైన్ - ఇరవై నాలుగు నెలల(24) కాలానికి మూడు వాహనాలు- Dy. CPM/Con/WCSP/SC యూనిట్‌లో ఇతర పనులు మరియు నడికుడి-శ్రీకాళహస్తి స్టేషన్ల మధ్యన నూతన బిజి లైన్ పనులతో సంబంధం గల రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, గ్రామ అధికారులు, గ్రామీణ అధికారుల ఉమ్మడి సమావేశాలు మరియు తనిఖీలు, నిర్మాణ పనులు, భూసేకరణ & సర్వే, సర్వేలు, సాయిల్ ఎక్స్‌ప్లొరేషన్ తనిఖీ, ఎక్విప్‌మెంట్స్, మెటీరియల్ రవాణా కొరకు Dy. CPM/Con/WCSP/SC యూనిట్ యొక్క సిబ్బంది మరియు SSEs/SEs/JEs కొరకు టాటా 497 SP/ కార్గోకింగ్ మహీంద్రా నాన్ A/c 640DP లేదా తత్సమానం వంటి మూడు నంబర్ల వాహనాలు అద్దెకు తీసుకొనుట. **అంచనావ్యయం:** రూ.17,04,000.00 **బయానా:** రూ.34,100.00, **పూర్తి చేయు కాలం:** 24 నెలలు, **తెరచు తేది :** 06.08.2019 న 15.00 గం.కు

2 నిట్ నం. 78-CAO-C-SC-2019 తేది: 10.07.2019
పని పేరు : లింగంపేట జగిత్యాల - నిజామాబాద్ సెక్షన్ మధ్యలో నూతన బిజి లైన్ నిర్మాణం: లింగంపేట జగిత్యాల-నిజామాబాద్ స్టేషన్ల (కోరుట్ల, మెట్‌పల్లి, మోర్తాడ్ మరియు ఆర్మూర్ యార్డులు కలుపుకుని) మధ్య కిమీ 83,605 నుండి 177.300 వరకు క్రాసింగ్స్ మరియు నూతనంగా వేసిన ట్రాక్ మెయిన్ లైన్స్ మరియు పాయింట్ల నిర్వహణ. **అంచనావ్యయం:** రూ. 1,93,44,000.00, **బయానా:** రూ. 2,46,700.00, **పూర్తి చేయాల్సిన కాలం:** 12 నెలలు, **తెరచు తేది:** 06.08.2019 న 15.00 గం.కు.

3 నిట్ నం. 79-CAO-C-SC-2019 తేది: 10.07.2019
పని పేరు : నాందేడ్ డివిజన్- ఖాండ్వా-అకోలా సెక్షన్- ఖాండ్వా మరియు అముల్‌ఖుర్ద్ స్టేషన్ల మధ్య ఎంజి నుండి బిజి వరకు ట్రాక్ మార్పు చేయుట. స్టేషన్ భవనాలు, రిలే, బ్యాటరీ, జనరేటర్ కలుపుకుని & ఎక్విప్‌మెంట్ రూమ్స్, హైలెవల్, ప్లాట్‌ఫారాలు, సబ్ వే లు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, కవర్ ఓవర్ ప్లాట్‌ఫారాలు మరియు యార్డ్ డ్రెయిన్లు, సర్క్యులేటింగ్ ఏరియాలు, అప్రోచ్ రోడ్లు వగైరా పనులు మోర్టార్, జిర్వాన్, టకల్, గుర్హి మరియు అమ్లాఖుర్ద్ స్టేషన్ల వద్ద ఖాండ్వా మరియు బుర్హాన్‌పూర్ జిల్లాలు, మధ్య ప్రదేశ్ రాష్ట్రంలోనివి. **అంచనావ్యయం:** రూ. 34,76,51,739.19, **బయానా:** రూ. 18,88,300.00, **పూర్తి చేయాల్సిన కాలం:** 12 నెలలు, **తెరచు తేది:** 06.08.2019 న 15.00 గం.కు.

4 నిట్ నం. 80-CAO-C-SC-2019 తేది: 11.07.2019
పని పేరు : సివిల్, ఎలక్ట్రికల్ (జనరల్ & టిఆర్‌డి) మరియు (ట్రాఫిక్ సర్వేలు అంచనాలు మరియు ప్రణాళికలతో నివేదిక దాఖలు మరియు పెద్దపల్లి-కరీంనగర్ బిజి లైన్ (9 కిమీ) మరియు ఖాజీపేట -బల్హార్షా మెయిన్ లైన్ కలుపుతూ పెద్దపల్లి రైల్వే స్టేషన్ల సమీపాన బైపాస్ లైన్ కొరకు ప్రిలిమినరీ ఇంజినీరింగ్-సహిత- ట్రాఫిక్ సర్వే నిర్వహించుట.
అంచనావ్యయం: రూ.1,44,000.00, **బయానా:** రూ.2,900.00. **పూర్తి చేయాల్సిన కాలం:** 03 నెలలు, **తెరచు తేది:** 06.08.2019 న 15.00 గం.కు

i) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాలకు వెబ్‌సైట్ https://ireps.gov.inకు లాగాన్ అవ్వగలరు.
ii) బయానా మరియు టెండరు డాక్యుమెంట్ ధర ఐఆర్ఇపిఎస్‌లో ఆన్‌లైన్‌లో అందుబాటులోని నెట్ బ్యాంకింగ్/ పేమెంట్ గేట్‌వే సౌకర్యాల ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.
iii) టెండరుదారులు వారి ఆఫర్లను టెండరు ముగింపునకు ముందు పదిహేను రోజుల కాలం అయినట్టి టెండరు దాఖలు/బిడ్డింగ్ కాలంలో దాఖలు చేయవలెను, ఇది టెండరు డాక్యుమెంట్లలో పేర్కొనబడినది.
iv) టెండరుదారులు ఏదేని సవరణ కొరకు (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది) కొరకు టెండరు దాఖలు/బిడ్డింగ్ కాలం ప్రారంభ తేది వరకు గమనించవలసి ఉంటుంది.
చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్/కన్‌స్ట్రక్షన్స్ సికింద్రాబాద్
PUB/0800

ఇ-టెండరు ప్రకటన నం.323/ DRM/W/GNTఆఫ్ 11.07.2019
దిగువ తెలిపిన పనుల కొరకు దిగువ సంతకందారు 14.08.2019న 15.30 గం.వరకు ఇ-టెండర్లు కోరుతున్నారు.

1. టెండరు ఐడి: 2219 Sr. DEN/DEN: N **పని వివరణ :** గుంటూరు డివిజన్‌లో CTYL, DKD, JNPD, NLDA, NRT, PDGL, REP & VNUP గూడ్స్ షెడ్స్ వద్ద గూడ్స్ టెర్మినల్స్ వద్ద కూలీలు ఉపయోగించుట కొరకు త్రాగునీరు, మరుగుదొడ్ల, విశ్రాంతి గదులు కవర్‌చేయు షెడ్ వంటి ప్రాథమిక సౌకర్యాలు. **సుమారు విలువ:** రూ.6668402, **బయానా:** రూ.133400/–, **టెండరు ఫారం ధర :** రూ.5,000/–

2. టెండరు ఐడి: 2220 **Sr. DEN/DEN: N పని వివరణ :** GNT డివిజన్–1 TEL-RAL సెక్షన్ : RAL స్టేషన్ వద్ద RCC బాక్సులతో వంతెన నం.93 పొడిగింపు, 2. రేపల్లె : రేపల్లె స్టేషన్ వద్ద 2వ ప్లాట్‌ఫారం నిర్మాణం కొరకు టిఎం సైడింగ్ రీలొకేషన్ & డిఇఎంయు లూప్ లైన్ ఏర్పాటు. **సుమారు విలువ:** రూ. 12758916/–, **బయానా:** రూ.213800/–, **టెండరు ఫారం ధర :** రూ.5,000/–

3. టెండరు ఐడి: 2221 **Sr. DEN/DEN: N పని వివరణ :** SSE/P.Way/NGNT సెక్షన్, ADEN/North/GNT సబ్ డివిజన్‌లో గుంటూరు–తెనాలి స్టేషన్ల మధ్యన కిమీ 1/3 నుండి 24/6 వరకు కట్టకు సెస్ మరియు సైడ్ స్లోప్స్‌కు మరమ్మతులు. **సుమారు విలువ:** రూ. 3368686/–, **బయానా:** రూ.67400/–, **టెండరు ఫారం ధర :** రూ.3,000/–

4. టెండరు ఐడి: 2222, **Sr. DEN/DEN:W పని వివరణ :** DEN/West/GNT అధికారిక పరిధిలో వివిధ స్టేషన్ల వద్ద ప్రయాణికులకు నీటి సరఫరా సదుపాయాల ఏర్పాట్లు. **సుమారు విలువ:** రూ. 6806454/–, **బయానా:** రూ.136100/–, **టెండరు ఫారం ధర :** రూ.5,000/–

5. టెండరు ఐడి: 2223, **Sr. DEN/DEN: N పని వివరణ :** Sr DEN/North/GNT అధికారిక పరిధిలో వివిధ స్టేషన్ల వద్ద ప్రయాణికులకు నీటి సరఫరా సదుపాయాల ఏర్పాట్లు. **సుమారు విలువ:** రూ. 12176735/–, **బయానా:** రూ.210900/–, **టెండరు ఫారం ధర :** రూ.5,000/–

6. టెండరు ఐడి: 2224, **Sr. DEN/DEN: N పని వివరణ :** 1) గుంటూరు డివిజన్‌లో భట్టిప్రోలు స్టేషన్ వద్ద ప్లాట్‌ఫామ్ నం.1 రెయిజింగ్ ఏర్పాటు. 2) HL ప్లాట్‌ఫారం నం.2 పని తో సంబంధం గల రేపల్లె వద్ద రిలే రూమ్ ఏర్పాటు చేయుట. 3) GNT డివిజన్‌లో వేమూరు స్టేషన్ వద్ద ప్లాట్‌ఫారం నం.2 రెయిజింగ్ ఏర్పాటు. **సుమారు విలువ:** రూ. 23444655/–, **బయానా:** రూ. 267200/–, **టెండరు ఫారం ధర :** రూ.10000/–.

1. ఇ-బిడ్ల ఆన్‌లైన్ దాఖలుకు ఆఖరి తేది 14.08.2019 న 15.30 గం.వరకు. సవివరమైన సమాచారం కొరకు వెబ్‌సైట్ www.ireps.gov.inకు లాగాన్ చేయగలరు.
2. ఏదేని తదుపరి సమాచారం/సవరణ ఇ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా తెలియజేయబడుతుంది.
డివిజనల్ రైల్వే మేనేజర్ (పనులు) గుంటూరు
PUB/0801

టెండరు ప్రకటన నం.
1) ELS- BZA-eTN-05 -2019-20 తేది:11.07.2019
2) ELS-BZA-eTN-06-2019-20 తేది:11.07.2019

భారత రాష్ట్రపతి తరఫున దిగువ సంతకందారుచే 02.08.2019న 15.00 గం.వరకు దిగువ పనుల కొరకు ఇ-టెండర్లు కోరబడుచున్నవి.

1) టెండరు నం. పని 1: ELS-BZA-eTN-05-2019-20 తేది:11.07.2019 **పని 2:** ELS-BZA-eTN-06-2019-20 తేది:11.07.2019

2.పని పేరు: పని1: ELS/BZA-రెండు(02) సం॥ల కాలానికి ఎలక్ట్రిక్ లోకోషెడ్/ విజయవాడ వద్ద మల్టీ యుటిలిటీ వాహనం (MUVs) నాన్-ఏసి అద్దెకు తీసుకొనుట. **పని 2:**"ELS/BZA-రెండు (02) సం॥ల కాలానికి ఎలక్ట్రిక్ లోకోషెడ్, విజయవాడ వద్ద EOT క్రేన్లు లోడ్ టెస్టింగ్ మరియు వివిధ కెపాసిటీలు VVVF డ్రైవ్‌లతో EOT క్రేన్లు కొరకు వార్షిక నిర్వహణ కాంట్రాక్ట్.

3. పూర్తి చేయుకాలం: పని1: 24 నెలలు, **పని 2:** 24 నెలలు.

4.టెండరు విలువ: పని1:రూ.7,48,800.00 **పని 2:**రూ.45,37,036.35

5. బయానా: పని 1: రూ.15,000.00 **పని2:** రూ.90,800.00

6 టెండరు డాక్యుమెంట్ ధర:పని1: రూ.2,000 **పని 2:**రూ.3,000

7. టెండరు ముగింపు తేది, సమయం: **పని 1:** 02.08.2019న 15.00గం.ల వరకు. **పని 2:** 02.08.2019న15.00గం.ల వరకు

కాగోరు టెండరుదార్లు ఏదేని టెండరుకు ఏవేని మార్పులు సవరణ గమనించుటకు టెండరు ముగింపు తేది ముందు వెబ్‌సైట్ www.ireps.gov.in ను దర్శించగలరు.
డివిజనల్ రైల్వే మేనేజర్ (TRS), ELS, విజయవాడ
PUB/0804

బహిరంగ ఇ-టెండరు ప్రకటన నం. B/E.29/TrD/Tender/21&22 (2019-20) తేది: 12.07.2019
దిగువ పనుల కొరకు దిగువ సంతకందారుచే ఇ-టెండర్లు కోరబడుతున్నవి.

1. టెండరు నం: B/E.29/TrD/Tender/21 (19-20)
పనుల వివరణ: విజయవాడ డివిజన్–అన్నవరం, పిఠాపురం, నర్సీపట్నం రోడ్, రావికంపాడు, గుల్లిపాడు, నర్సింగపల్లి, సామర్లకోట మరియు తుని స్టేషన్ల(8 నంబర్లు) వద్ద అదనపు గ్యాంగ్ వేతో FOBల పొడిగింపు, నూతన FOBల ఏర్పాటుతో సంబంధంగల OHEకి మార్పులు/చేర్పులు. **పూర్తి చేయుకాలం:** 270 రోజులు, **సుమారు విలువ:** రూ.10248293/–, **బయానా:** రూ.201300/–, **టెండరు ఫారం ధర:** రూ.5,000/–

2. టెండరు నం: B/E.29/TrD/Tender/22 (19-20)
పనుల వివరణ: విజయవాడ డివిజన్ – దక్షిణ మధ్య రైల్వేలో ఎలక్ట్రిక్ లోకో షెడ్/విజయవాడలో హోమింగ్ సామర్థ్యం పెంపుదల మరియు నల్లమాద డ్రెయిన్‌లో బిఆర్ నం.617కు డైవర్షన్ లైన్ మళ్లింపు ఏర్పాటు దృష్ట్యా ప్రస్తుతం ఉన్న OHEకు మార్పులతో కలుపుకుని ఎల్‌టి ట్రాన్స్‌ఫార్మర్ స్టేషన్లు, 65 చ.మి.మీల కేటనరీ మరియు 107/150 చ.మి.మీ.ల HDG కాపర్ కాంటాక్ట్ వైర్‌తో 25KV, 50Hz సింగిల్ ఫేజ్ ఎసి ట్రాక్షన్ ఓవర్‌హెడ్ ఎక్విప్‌మెంట్ డిజైన్, సరఫరా, స్థాపన, పరీక్షించుట మరియు పని చేయించుట. **పూర్తి చేయుకాలం:** 270 రోజులు, **సుమారు విలువ:** రూ.59,53,853/–, **బయానా:** రూ.1,19,100/–, **టెండరు ఫారం ధర:** రూ.5,000/–

ముగింపు తేది: 02.08.2019న 15.00 గం.కు
సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/TrD/విజయవాడ
PUB/0802

టెండరు ప్రకటన
భారత రాష్ట్రపతి తరఫున, సిగ్నల్ & టెలికాం (ప్రాజెక్ట్స్), దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ వారు బహిరంగ టెండరు/సింగిల్ ప్యాకెట్ ఇ-టెండరింగ్ విధానంలో దిగువ పనుల కొరకు ఇ-టెండర్లు కోరుతున్నారు.

టెండరు నం. టెండరు నం. B-SG-P-T-3-15EI-19-20 తేది: 11.07.19
పని పేరు: దక్షిణ మధ్య రైల్వేలో గుంతకల్ డివిజన్‌లో గుత్తి–పుల్లంపేట సెక్షన్ మధ్యన 15 స్టేషన్లు RJP, NRE, BKPT, KPU, YGD, YA, MOO, RLL, PLU, JKO, KDP ,VRN, TU, KMQA, RLO వద్ద ఆర్‌డిఎస్‌వో మార్గదర్శకాల ప్రకారం ఆకృతీకరణ ద్వారా వార్మ్ స్టాండ్ బై నుండి హాట్ స్టాండ్ వరకు ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ సిస్టమ్ మార్పు చేయుట (ఫేజ్–III).
టెండరు విలువ: రూ.64426214.25
బయానా: రూ.472100.00,
ఒక్కొక్క టెండరు బుక్‌లెట్ ధర: రూ.10000/–
పూర్తి చేయాల్సిన కాలం: పన్నెండు (12) నెలలు, **ముగింపు తేది మరియు సమయం:** 06.08.2019 న 15.00 గం.కు

1. బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాలకు వెబ్‌సైట్ https://ireps.gov.inకు లాగాన్ అవ్వగలరు.
2. బయానా మరియు టెండరు డాక్యుమెంట్ ధర ఐఆర్ఇపిఎస్‌లో ఆన్‌లైన్‌లో అందుబాటులోని నెట్ బ్యాంకింగ్/ పేమెంట్ గేట్‌వే సౌకర్యాల ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.
3. టెండరుదారులు వారి ఆఫర్లను టెండరు ముగింపునకు ముందు పదిహేను రోజుల కాలం అయినట్టి టెండరు దాఖలు/బిడ్డింగ్ కాలంలో దాఖలు చేయవలెను, ఇది టెండరు డాక్యుమెంట్లలో పేర్కొనబడినది.
4. టెండరుదారులు ఏదేని సవరణ కొరకు (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది) కొరకు టెండరు దాఖలు/బిడ్డింగ్ కాలం ప్రారంభ తేది వరకు గమనించవలసి ఉంటుంది.
డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికమ్యూనికేషన్ ఇంజినీర్(ప్రాజెక్ట్స్) విజయవాడ.
A1128/19
తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ : http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.inవద్ద దర్శించండి.
PUB/0803

ఇన్ఫీ.. అంచనాలు మించి!

తొలి త్రైమాసికంలో రూ.3,802 కోట్ల లాభం

ఆదాయ వృద్ధి అంచనా 8.5–10శాతానికి పెంపు

న్యూఢిల్లీ: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాల అంచనాలు మించాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) తొలి త్రైమాసికానికి (ఏప్రిల్-జూన్) ఇన్ఫీ కన్సాలిడేటెడ్ లాభం వార్షిక ప్రాతిపదికన 5.2 శాతం వృద్ధి చెంది రూ.3,802 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో (2018-19) ఇదే త్రైమాసికానికి లాభం రూ.3,612 కోట్లుగా ఉంది. త్రైమాసిక ప్రాతిపదికన చూస్తే మాత్రం క్షీణతను కనబర్చింది. ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో ప్రకటించిన రూ.4,078 కోట్ల లాభంతో పోలిస్తే 6.8 శాతం తగ్గింది. ఈ జూన్‌తో ముగిసిన మూడు నెలల్లో ఇన్ఫోసిస్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 13.9 శాతం పెరిగి రూ.21,803 కోట్లకు చేరుకుంది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో రాబడి రూ.19,128 కోట్లుగా నమోదైంది. ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంతో పోల్చినా ఆదాయం 1.2 శాతం పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి(2019-20) స్థిర కరెన్సీ ఆధారిత ఆదాయ వృద్ధి అంచనాను కంపెనీ 8.5-10 శాతానికి పెంచింది. ఏప్రిల్‌లో ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా 7.5-9.5 శాతంగా పేర్కొంది. నిర్వహణ మార్జిన్ అంచనాను మాత్రం 21-23 శాతంగానే కొనసాగించింది.

డాలర్లలో లాభం 54.6 కోట్లు

అమెరికన్ కరెన్సీలో ఇన్ఫోసిస్ లాభం జూన్ త్రైమాసికానికి 54.6 కోట్ల డాలర్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలానికి 53.4 కోట్ల డాలర్ల లాభం గడించింది. ఆదాయం విషయానికొస్తే.. 283 కోట్ల డాలర్ల నుంచి 313 కోట్ల డాలర్లకు పెరిగింది. సమీక్షా కాలానికి ఇన్ఫోసిస్ డిజిటల్ సేవల విభాగ ఆదాయం 111.9 కోట్ల డాలర్లుగా నమోదైంది. అంటే, మొత్తం ఆదాయంలో ఈ విభాగానిదే 35.7 శాతం వాటా. జూన్ త్రైమాసికంలో డిజిటల్ సేవల ఆదాయం వార్షిక ప్రాతిపదికన 41.9 శాతం, త్రైమాసిక ప్రాతిపదికన 8.6 శాతం

ఆర్థిక ఫలితాలు ప్రకటిస్తున్న ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్, సీఎఫ్ఓ నిలాంజన్ రాయ్

వృద్ధిని నమోదు చేసుకుందని కంపెనీ వెల్లడించింది.

వాటాదారులకు బొనాంజా!

ఏటా నగదు నిల్వల్లో 70 శాతం వరకు వాటాదారులకు పంచాలన్నది కంపెనీ ప్రస్తుత పాలసీ. తాజా బోర్డు సమావేశంలో ఈ విధానాన్ని పునఃసమీక్షించడం జరిగింది. వాటాదారులకు మరింత ఆదాయాన్ని పంచాలని బోర్డు నిర్ణయించినట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదలుకొని ఐదేళ్లలో కంపెనీ నగదు నిల్వల్లో 85 శాతాన్ని వాటాదారులకు పంచనున్నట్లు కంపెనీ ప్రకటించింది. డివిడెండ్లు, షేర్ల తిరిగి కొనుగోలు (బైబ్యాక్), ప్రత్యేక డివిడెండ్ల రూపంలో ఈ సొమ్మును వాటాదారులకు బదిలీ చేయనుంది. గతంలో ప్రకటించిన రూ.8,260 కోట్ల షేర్ల బైబ్యాక్ ప్రక్రియ త్వరలోనే ముగియనుందని, ఇప్పటివరకు రూ.5,934 కోట్ల విలువైన షేర్లను తిరిగి కొనుగోలు చేయడం జరిగిందని సంస్థ తెలిపింది.

ఈ ఏడాదిలో 18వేల నియామకాలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 18,000 మంది ఫ్రెషర్లను ఉద్యోగాల్లో చేర్చుకోవాలని కంపెనీ భావిస్తోందని ఇన్ఫోసిస్ సీఓఓ ప్రవీణ్ రావు వెల్లడించారు. జూన్ త్రైమాసికంలో 8,000 మందికి జాయినింగ్ లెటర్లు జారీ చేయడం జరిగిందని, అందులో 2,500 మంది ఫ్రెషర్లని ఆయన తెలిపారు. అమెరికాలోనూ నియామకాలు కొనసాగుతాయన్నారు.

12.4% స్థిర కరెన్సీ ఆధారిత వార్షిక వృద్ధి	**20.5%** నిర్వహణ మార్జిన్లలో పెరుగుదల
270కోట్ల డాలర్లు త్రైమాసికంలో కుదుర్చుకున్న భారీ కాంట్రాక్టుల విలువ	**1,336** జూన్ చివరినాటికి యాక్టివ్ క్లయింట్ల సంఖ్య
2,29,029 జూన్ చివరినాటికి ఉద్యోగుల సంఖ్య	**23.4%** తొలి త్రైమాసికంలో ఉద్యోగుల వలసల రేటు

పాడి రైతులకు చెక్కులు అందజేస్తున్న నారా భువనేశ్వరి

పాడి రైతుల సంక్షేమమే 'హెరిటేజ్' లక్ష్యం

» ప్రత్యేకంగా రూ.30 కోట్ల నిధి : నారా భువనేశ్వరి

లక్కవరపుకోట (విజయనగరం జిల్లా) : పాడి రైతుల సంక్షేమం కోసం రూ.30 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసినట్టు హెరిటేజ్ రైతు సంక్షేమ నిధి శాశ్వత ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. విజయనగరం జిల్లా లక్కవరపుకోటలో శుక్రవారం హెరిటేజ్ సంస్థ ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె ఈ విషయం చెప్పారు. పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా హెరిటేజ్ సంస్థ ముందుకు సాగుతుందన్నారు. సంక్షేమ నిధితో పాటు పాడి రైతులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించామన్నారు. అనంతరం ఉత్తరాంధ్ర పరిధిలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన పాడి రైతుల పిల్లలకు రూ.2 వేల చొప్పున నగదు అందించారు. ఉత్తమ పాడి రైతులకు బహుమతులు అందజేశారు.

పొగాకు బోర్డు చైర్మన్‌గా యడ్లపాటి రఘునాథబాబు

గుంటూరు (ఆంధ్రజ్యోతి): భారత పొగాకు బోర్డు చైర్మన్‌గా యడ్లపాటి రఘునాథ బాబును కేంద్ర ప్రభుత్వం నియమించింది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ మేరకు జారీ చేసిన ఉత్తర్వులు శుక్రవారం గుంటూరులోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయానికి అందాయి. ప్రస్తుతం గుంటూరులోని పొగాకు బోర్డు ఇన్‌చార్జి చైర్మన్‌గా సీనియర్ ఐఏఎస్ సునీత, కార్యదర్శిగా ఐఏఎస్ అద్దంకి శ్రీధర్ బాబు కొనసాగుతున్నారు.

కార్మిక చట్టాలను సంస్కరించాలి..

» అధిక వృద్ధి రేటుకు పెట్టుబడులు కీలకం
» ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కార్మిక చట్టాల్లో సంస్కరణలు చేపట్టడం ద్వారా రాష్ట్రాలు మెరుగైన వృద్ధిని సాధించడానికి అవకాశం ఉంటుందని ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్ తెలిపారు. రాజస్థాన్ రాష్ట్రం కార్మిక చట్టంలో నాలుగైదు సంస్కరణలు చేయడం మూలంగా పెద్ద కంపెనీల సంఖ్యను పెంచుకోగలిగిందని, ఫలితంగా ఉపాధి కల్పనతోపాటు ఉత్పాదకత పెరగడానికి ఆస్కారం ఏర్పడిందన్నారు. శుక్రవారం నాడు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో భారత ఆర్థిక వ్యవస్థ ఐదేళ్లకాలంలో 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందా? అన్న అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణమూర్తి సుబ్రమణియన్ పాల్గొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ ఈ స్థాయికి చేరుకోవడానికి చేపట్టాల్సిన ప్రణాళికలు, వ్యూహాలను ఆర్థిక సర్వేలో

ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్‌తో ఐఎస్‌బీ డీన్ రాజేంద్ర శ్రీవాస్తవ, ప్రొఫెసర్ భగవాన్ చౌదరి

సూచించినట్టు ఆయన చెప్పారు. భారత ఆర్థిక వ్యవస్థ మొదటి లక్ష కోట్ల డాలర్ల స్థాయికి చేరుకోవడానికి 55 ఏళ్లు పట్టిందని, కానీ 1.7 నుంచి 2.7 లక్షల కోట్ల డాలర్లకు ఎదగడానికి 2014 నుంచి 2019 మధ్యకాలం సరిపోయిందని సుబ్రమణియన్ తెలిపారు. మారిన పరిస్థితుల్లో దేశ ఆర్థిక వ్యవస్థ నిర్దేశిత కాలంలో 5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుకుంటుందన్న విశ్వాసం ఉందన్నారు. ఆటోమొబైల్ వంటి రంగాల్లో ప్రస్తుతం మందగమనం నెలకొన్నా.. ఇతర రంగాల పనితీరు మెరుగ్గా కనిపిస్తోందని చెప్పారు. ఉక్కు, తయారీ రంగాల్లో వృద్ధి రేటు బాగుందన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు, వ్యవసాయ రంగాన్ని వృద్ధి పరిచేందుకు తగిన విధంగా ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని చెప్పారు. దేశీయ పొదుపు మొత్తాలు చాలా తక్కువ స్థాయిలో ఉన్నాయని, ఇవి పెరిగితే పెట్టుబడుల వృద్ధికి ఆస్కారం ఉంటుందన్నారు. బంగారం, రియల్ ఎస్టేట్ వంటి రంగాల్లో ప్రజల పెట్టుబడులు తగ్గుతున్నాయని చెప్పారు.

టెక్నాలజీ కారణంగా ఉద్యోగాలు పోతాయన్నది అవాస్తవమని, టెక్నాలజీ ప్రవేశంతో ఎక్కువ ఉద్యోగాలు లభించడానికే అవకాశం ఉంటుందని సుబ్రమణియన్ పేర్కొన్నారు. పెట్టుబడుల పెరుగుదల ఉత్పాదకతతోపాటు వృద్ధి రేటు పుంజుకోవడానికి ప్రధానంగా దోహదపడుతుందని సుబ్రమణియన్ అన్నారు. చైనా తన జీడీపీలో సగం పెట్టుబడుల కోసం వినియోగిస్తోందని, దీంతో ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు.

ట్రూజెట్‌కు మరో 5 విమానాలు

» మరిన్ని గమ్యస్థానాలకు సేవలు
» వచ్చే రెండేళ్లలో రూ.600 కోట్ల ఆదాయ లక్ష్యం
» పబ్లిక్ ఇష్యూకు వచ్చే యోచన
» నాలుగేళ్లు పూర్తి చేసుకున్న కంపెనీ

ట్రూజెట్ ప్రణాళికలను వెల్లడిస్తున్న టర్బో మేఘా ఎయిర్‌వే డైరెక్టర్ కె.వి.ప్రదీప్, తదితరులు

హైదరాబాద్, ఆంధ్రజ్యోతి బిజినెస్: ప్రాంతీయ విమానయాన సేవల మార్కెట్‌లో తన స్థానాన్ని మరింత పెంచుకుని.. పటిష్ఠం చేసుకోవాలని హైదరాబాద్‌కు చెందిన టర్బో మేఘా ఎయిర్‌వే భావిస్తోంది. 'ట్రూజెట్' బ్రాండ్‌తో సేవలందిస్తున్న కంపెనీ మొదటిసారి విమాన ప్రయాణం చేసే వారిపై దృష్టి పెట్టనుంది. ఆయా సేవలకు వేర్వేరుగా చార్జీలు వసూలు చేయడం.. బోర్డింగ్ పాసులపై ప్రకటనలు, ఐటీ సొల్యూషన్లను వినియోగించడం ద్వారా నిర్వహణ వ్యయాలను తగ్గించుకోవడం, ఇతర మార్గాల ద్వారా లాభదాయకతను పెంచుకోనున్నట్లు టర్బో మేఘా ఎయిర్‌వే డైరెక్టర్ కెవి ప్రదీప్ తెలిపారు. ట్రూజెట్ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం 5 ఏటీఆర్ విమానాలతో 20 గమ్యస్థానాలకు సేవలందిస్తున్న కంపెనీ 2019 చివరి నాటికి మరో 5 ఏటీఆర్ విమానాలు, వచ్చే ఏడాదిలో 5-8 ఏటీఆర్ విమానాలను సమకూర్చుకోనుంది. సమీప భవిష్యత్తులో 6 కొత్త గమ్యస్థానాలకు సేవలను విస్తరించనుంది. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో పట్టు సాధించి.. కంపెనీ ఒక స్థాయికి చేరిన తర్వాత పబ్లిక్ ఇష్యూకు వచ్చే ఆలోచన ఉందని, ఇందుకు రెండు, మూడేళ్లు పడుతుందని ప్రదీప్ తెలిపారు. దీనిపై ఇప్పటికిప్పుడే ఏమీ మాట్లాడలేమన్నారు. కొన్ని మార్గాల్లో నిర్వహణ పరమైన లాభాలను కంపెనీ ఆర్జిస్తోందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కంపెనీ నికర లాభాన్ని ఆర్జించడానికి అవకాశాలు ఉన్నాయని కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ కెజి విశ్వనాథ్ తెలిపారు. 2021-22నాటికి ఆదాయం రూ.600 కోట్లకు చేరగలదని అంచనా వేస్తున్నట్లు వివరించారు. 2017-18కి రూ.165 కోట్ల ఆదాయంపై రూ.84 కోట్ల నష్టాన్ని చవిచూసినట్లు వివరించారు. 2018-19కి ఆదాయంలో 50 శాతం అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఒకరికి ఒకరు ప్రయాణికులను అందించుకోవడానికి దేశ, విదేశాలకు చెందిన విమానయాన సంస్థలతో ట్రూజెట్ చర్చలు జరుపుతోంది.

టీవీఎస్ నుంచి ఇథనాల్‌తో నడిచే బైక్

» అపాచీ ఆర్‌టీఆర్ 200ఎఫ్ఐ ఈ100 విడుదల
» ధర రూ.1.2 లక్షలు

న్యూఢిల్లీ: టీవీఎస్ మోటార్ కంపెనీ మార్కెట్లోకి ఇథనాల్ ఇంధనంతో నడిచే టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ 200 ఎఫ్ఐ ఈ100ను విడుదల చేసింది. ఈ బైక్ ధర రూ.1.2 లక్షలు. శుక్రవారంనాడిక్కడ జరిగిన కార్యక్రమంలో టీవీఎస్ అపాచీ ఆర్‌టీర్ 200 బైక్‌ను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్, టీవీఎస్ మోటార్ చైర్మన్ శ్రీనివాసన్ విడుదల చేశారు. ఈ కొత్త మోడల్ తొలుత చెరకు పండించే రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటకల్లో అందుబాటులో ఉంటుందని టీవీఎస్ చైర్మన్ శ్రీనివాసన్ వెల్లడించారు. దేశంలో ఎక్కడా కూడా ఇథనాల్ ఇంధనాన్ని విక్రయించే పంపులు లేవని, దేశవ్యాప్తంగా ప్రారంభించాలని కేంద్ర పెట్రోలియం శాఖను కోరనున్నామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. కాగా టీవీఎస్ మోటార్ ఫ్లాగ్‌షిప్ బ్రాండ్‌గా ఉన్న టీవీఎస్ అపాచీ విక్రయాలు ప్రపంచవ్యాప్తంగా 35 లక్షల యూనిట్లకు చేరుకున్నాయని సంస్థ చైర్మన్ శ్రీనివాసన్ తెలిపారు. ప్రస్తుతం ద్విచక్ర వాహన పరిశ్రమ పర్యావరణ అనుకూల ఉత్పత్తులను ఉత్పత్తి చేయాలని భావిస్తోందని, మరోవైపు భవిష్యత్‌లో ఎలక్ట్రిక్, హైబ్రిడ్, ప్రత్యామ్నాయ ఇంధనాన్ని వినియోగించే వాహనాల వినియోగం పెరగనున్న నేపథ్యంలో ఇథనాల్ ఆధారిత ఉత్పత్తులను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావటం కీలకమైన విషయమని ఆయన అన్నారు. ఇథనాల్ ఇంధనానికి మారటం చాలా సులువని, ఇది పర్యావరణంపై ఎంత మాత్రం ప్రభావం చూపించదని ఆయన తెలిపారు. అంతేకాకుండా వినియోగదారునిపై కూడా వ్యయ భారం ఉండదని శ్రీనివాసన్ పేర్కొన్నారు. దేశీయంగా పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి ఇథనాల్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. నాన్ టాక్సిక్, బయోడీగ్రేడబుల్ ఇంధనంకావటంతో సులభంగా రవాణా, నిల్వ చేసుకునే వెసులుబాటు ఉంది.

ఎస్‌బీఐ ఆర్‌టీజీఎస్, నెఫ్ట్, ఐఎంపీఎస్ సేవలు ఉచితం

న్యూఢిల్లీ: ఇంటర్నెట్, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ లావాదేవీలపై విధిస్తున్న చార్జీలను ఎత్తివేస్తున్నట్లు దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) ప్రకటించింది. నగదు రహిత ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దటంలో భాగంగా ఈ నెల 1 నుంచి ఈ తరహా లావాదేవీలపై చార్జీలను విధించరాదని ఆర్‌బీఐ ఆదేశించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆగస్టు 1 నుంచి మొబైల్ ఫోన్ల ద్వారా ఐఎంపీఎస్ (ఇమ్మీడియెట్ పేమెంట్ సర్వీస్) విధానంలో నగదు బదిలీ చేస్తే ఎలాంటి చార్జీలను విధించరాదని నిర్ణయించినట్లు ఎస్‌బీఐ తెలిపింది. అలాగే ఆర్‌టీజీఎస్ (రియల్ టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్) విధానం, నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్) ద్వారా రూ.2 లక్షల వరకు నగదు బదిలీపై చార్జీలను మినహాయించినట్లు తెలిపింది. డిజిటల్ రూపంలో నగదు లావాదేవీలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. కాగా ఈ నెల 1 నుంచే యోనో, ఇంటర్నెట్ బ్యాంకింగ్ (ఐఎన్‌బీ), మొబైల్ బ్యాంకింగ్ (ఎంబీ) వినియోగదారుల కోసం ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ చార్జీలను ఎస్‌బీఐ ఎత్తివేసింది. ఆగస్టు 1 నుంచి ఐఎన్‌బీ, ఎంబీ, యోనో ఖాతాదారుల కోసం ఐఎంపీఎస్ చార్జీలను ఎత్తివేస్తున్నట్లు తెలిపింది. జూలై 1వ తేదీకి ముందు నెఫ్ట్ లావాదేవీలపై రూ.1, రూ.5 చార్జీలను విధించగా, ఆర్‌టీజీఎస్ విధానంలో రూ.5-రూ.50 వరకు చార్జీలను వసూలు చేసింది.

6 కోట్ల ఇంటర్నెట్ ఖాతాదారులు

2019 మార్చి చివరినాటికి ఎస్‌బీఐలో దాదాపు 6 కోట్లకు పైగా ఖాతాదారులు ఇంటర్నెట్ బ్యాంకింగ్‌ను వినియోగిస్తున్నారు. ఇందులో 1.41 కోట్ల మంది మొబైల్ బ్యాంకింగ్ సర్వీసులను వినియోగిస్తున్నారు. మొబైల్ బ్యాంకింగ్ లావాదేవీల్లో ఎస్‌బీఐ 18 శాతం మార్కెట్ వాటా కలిగి ఉంది. కాగా యోనో యూజర్లు కోటికి పైగా ఉన్నారు. నెఫ్ట్, ఐఎంపీఎస్, ఆర్‌టీజీఎస్ లావాదేవీలపై చార్జీలు ఎత్తివేయటంతో మరి కొంతమంది ఖాతాదారులు డిజిటల్ లావాదేవీల వైపు మళ్లే అవకాశం ఉందని ఎస్‌బీఐ తెలిపింది.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి (కిలో)	రూపాయి (ఒక డాలర్‌కు)	ముడి చమురు
38,736.23	11,552.50	34,555	37,830	68.69	66.84
86.88	30.40	ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత) 161	170	25 పైసలు	

గ్రీన్‌కోలో జీఐసీ, ఏడీఐఏ
32.9 కోట్ల డాలర్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు చెందిన గ్రీన్‌కో ఎనర్జీ హోల్డింగ్స్‌లో సావరిన్ వెల్త్ ఫండ్స్ జీఐసీ హోల్డింగ్స్, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ)లు 32.9 కోట్ల డాలర్ల పెట్టుబడి పెట్టనున్నాయి. పవర్ స్టోరేజ్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఈ సావరిన్ వెల్త్ ఫండ్స్ గత జూన్‌లో గ్రీన్‌కో ఎనర్జీలో 49.5 కోట్ల డాలర్ల పెట్టుబడి పెట్టాయి. కొత్తగా అందే నిధులను ఈ కంపెనీ ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టుల కోసం వినియోగించాలనుకుంటోంది. అంతేకాకుండా కంపెనీల కొనుగోళ్ల కోసం వినియోగించనుంది. కాగా ఈ రెండు సావరిన్ ఫండ్స్ ఇప్పటి వరకు గ్రీన్‌కోలో (తాజా పెట్టుబడులు సహా) 220 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టాయి. గ్రీన్‌కో వ్యవస్థాపకులుగా మహేష్ కొల్లి, అనిల్ కుమార్ చలమలశెట్టిలు ఉన్నారు. కంపెనీలో జీఐసీకి 61 శాతం, ఏడీఐఏకు 15 శాతం వాటా ఉండగా.. మిగతా వాటా మహేష్, అనిల్ కుమార్‌కు ఉంది. ఈ కంపెనీ సౌర, పవన, జల విద్యుత్ ప్రాజెక్టులు చేపడుతోంది. కంపెనీ రెన్యూవబుల్ ఎనర్జీ ఆపరేషనల్ సామర్థ్యం 4.2 గిగావాట్లుగా ఉంది. మరో 7 గిగావాట్ల ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి.

లారస్ ల్యాబ్స్ విశాఖ యూనిట్‌కు ఎఫ్‌డీఏ ఓకే

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నంలోని యూనిట్ 4లో అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యూఎస్ ఎఫ్‌డీఏ) తనిఖీలు నిర్వహించి ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని లారస్ ల్యాబ్స్ వెల్లడించింది. ఎఫ్‌డీఏ ఈ నెల 8 నుంచి 12 వ తేదీ వరకు ఈ తనిఖీలను ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా విజయవంతంగా నిర్వహించిందని తెలిపింది. ఎలాంటి అభ్యంతరాలు లేకపోవటంతో ఫారమ్ 483ను జారీ చేయలేదని పేర్కొంది.

డాక్టర్ రెడ్డీస్ ప్లాంట్‌పై అభ్యంతరాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : హైదరాబాద్, బొల్లారంలోని యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రిడియెంట్స్ (ఏపీఐ) తయారీ ప్లాంట్-2లో యూఎస్ ఎఫ్‌డీఏ తనిఖీలు నిర్వహించి ఐదు అభ్యంతరాలను వ్యక్తం చేసిందని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ తెలిపింది. ఈ మేరకు ఫారమ్ 483ను జారీ చేసిందని తెలిపింది. నిర్దేశిత గడువులోగా వీటికి సమగ్రమైన సమాధానమివ్వనున్నట్లు డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. అయితే ఎఫ్‌డీఏ ఎలాంటి అభ్యంతరాలను వ్యక్తం చేసిందనేది మాత్రం కంపెనీ వెల్లడించలేదు.

జెట్ దివాలాపై ఎన్‌సీఎల్‌ఏటీకి డచ్ దివాలా అడ్మినిస్ట్రేటర్

న్యూఢిల్లీ : జెట్ ఎయిర్‌వేస్ దివాలా విషయంలో డచ్ దివాలా అడ్మినిస్ట్రేటర్.. నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ)ను ఆశ్రయించారు. భారత్‌లో జెట్ ఎయిర్ దివాలా ప్రక్రియ కొనసాగుతోందని, ఇందులో సాయమందించాలని ముగ్గురు సభ్యులతో కూడిన ఎన్‌సీఎల్‌ఏటీ బెంచ్‌కు సారథ్యం వహిస్తున్న జస్టిస్ ఎస్‌జే ముఖోపాధ్యాయ.. డచ్ బ్యాంకర్ప్సీ అడ్మినిస్ట్రేటర్‌ను కోరారు. దీంతో డచ్ అడ్మినిస్ట్రేటర్ ఇందుకు ఒప్పుకున్నారు. అయితే జెట్ ఎయిర్‌వేస్‌కు సంబంధించి జప్తు చేసిన ఆస్తులను విక్రయించరాదని కోరారు. దీంతో ఈ విషయంపై జెట్ ఎయిర్ రుణదాతలు రెండు వారాల్లో సమాధానమివ్వాలని ఎన్‌సీఎల్‌ఏటీ ఆదేశించింది. తదుపరి ఈ కేసులో విచారణను ఆగస్టు 21న చేపట్టనున్నట్లు తెలిపింది.

మరిన్ని ఎఫ్‌ఎంసీజీ విభాగాల్లోకి ఐటీసీ

కొనుగోళ్లపై దృష్టి.. ఐటీసీ చైర్మన్ సంజీవ్ పురి

కోల్‌కతా: విభిన్న వ్యాపారాల్లోకి విస్తరించిన ఐటీసీ.. ఎఫ్‌ఎంసీజీ రంగంలోని కొత్త కేటగిరీలు, సబ్ సెగ్మెంట్లలోకి కూడా ప్రవేశించాలనుకుంటోంది. ఇందుకోసం కంపెనీల కొనుగోళ్ల ద్వారా వ్యూహాత్మక అవకాశాలను అందిపుచ్చుకోవాలని భావిస్తున్నట్టు ఐటీసీ చైర్మన్ సంజీవ్ పురి తెలిపారు. శుక్రవారంనాడిక్కడ ఆయన కంపెనీ సర్వసభ్య సమావేశంలో వాటాదారులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం ఐటీసీ సెగ్మెంట్ రాబడిలో నూతన ఎఫ్‌ఎంసీజీ వ్యాపారాల ద్వారా 25 శాతం సమకూరుతోందని తెలిపారు. ఎఫ్‌ఎంసీజీ వ్యాపారంలో మరింత వృద్ధిని సాధించడానికి కొత్త కేటగిరీలు, సబ్ సెగ్మెంట్లలోకి ప్రవేశించాలనుకుంటున్నట్టు ఆయన చెప్పారు. వృద్ధి కోసం మరిన్ని పెట్టుబడులు పెట్టడంతోపాటు కంపెనీల కొనుగోళ్లకు ఉన్న అవకాశాలను కూడా పరిశీలిస్తామన్నారు. కొత్త సెగ్మెంట్లలోకి ప్రవేశించడం ద్వారా గత రెండు మూడేళ్ల కాలంలో ఐటీసీ తన ఎఫ్‌ఎంసీజీ పోర్ట్‌ఫోలియోను మరింతగా విస్తరించుకుంది. గత ఏడాదిలో కంపెనీ 50కి పైగా ఉత్పత్తులను విడుదల చేసింది. దీని ద్వారా ఇప్పటికే ఉన్న కేటగిరీని బలోపేతం చేయడంతోపాటు కొత్త సెగ్మెంట్లలోకి ప్రవేశించింది.

8% వృద్ధి రేటుతోనే 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ

ప్రభుత్వం పెట్టుబడులకు సరైన వాతావరణం కల్పించాలి: రంగరాజన్



హైదరాబాద్ : వచ్చే ఐదేళ్లలో జీడీపీ వృద్ధి రేటు ఏటా ఎనిమిది శాతం ఉంటేనే 2024-25 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ ఐదు లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుకుంటుందని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ సి రంగరాజన్ స్పష్టం చేశారు. ఈ స్థాయిలో వృద్ధి రేటు సాధించాలంటే అందుకు స్పష్టమైన రోడ్ మ్యాప్ అవసరమన్నారు. శుక్రవారం జరిగిన ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ స్నాతకోత్సవంలో ఆయన ఈ విషయం స్పష్టం చేశారు. ఆర్థిక వృద్ధిని పెంచడంలో పెట్టుబడులు ప్రధాన చోదక శక్తిగా పనిచేస్తాయన్నారు. అయితే పెట్టుబడులకు అవసరమైన సానుకూల వాతావరణం కల్పించాల్సిన బాధ్యత విధాన నిర్ణేతలపైనే ఉందన్నారు. అధిక జీవన ప్రమాణాల సాధనకు దేశం వీలైనంత వేగంగా ముందుకు కదలాలన్నారు. ప్రస్తుతం 2.7 లక్షల కోట్ల డాలర్లు ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను 2025 మార్చి నాటికి ఐదు లక్షల కోట్ల డాలర్ల స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో పని చేస్తున్నట్టు ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఇందుకు అనుగుణంగానే కేంద్ర బడ్జెట్‌ను రూపొందించినట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ నేపథ్యంలో రంగరాజన్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. సంక్షేమ కార్యక్రమాల భారంతో ప్రభుత్వం పెద్దగా పెట్టుబడులు పెట్టే పరిస్థితిలో లేనందున, ప్రైవేట్ పెట్టుబడులే మార్గమన్నారు.

ఇండస్‌ఇండ్ లాభంలో 38% వృద్ధి

న్యూఢిల్లీ: జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి ఇండస్‌ఇండ్ బ్యాంక్ లాభం 38.3 శాతం వృద్ధి చెంది రూ.1,432.50 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలానికి లాభం రూ.1,035.72 కోట్లుగా నమోదైంది. సమీక్షా కాలానికి బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.6,369.75 కోట్ల నుంచి రూ.8,624.62 కోట్లకు పెరిగింది. ఆస్తుల నాణ్యత విషయానికొస్తే.. గత ఏడాది జూన్ చివరినాటికి 1.15 శాతంగా ఉన్న బ్యాంక్ మొండి బకాయిలు లేదా స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) ఈ జూన్ చివరికల్లా 2.15 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పీఏలు 0.51 శాతం నుంచి 1.23 శాతానికి ఎగబాకాయి. మొండి బకాయిలు పెరగడంతో వాటి కోసం కేటాయింపులు కూడా పెరిగాయి. ఎన్‌పీఏల గండిని పూడ్చుకునేందుకు గత త్రైమాసికంలో బ్యాంక్ రూ.430.62 కోట్ల కేటాయింపులు జరిపింది. గత ఏడాదిలో ఇదే సమయానికి కేటాయింపులు రూ.350 కోట్లుగా ఉన్నాయి. భారత్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ లిమిటెడ్ (బీఎఫ్ఐఎల్)ను విలీనం చేసుకోవడం పూర్తయిందని ఇండస్‌ఇండ్ బ్యాంక్ తెలిపింది. బీఎఫ్ఐఎల్ ఆర్థిక పనితీరు గణాంకాలతో కలిపే జూన్ త్రైమాసిక ఫలితాలను విడుదల చేసినట్లు బ్యాంక్ స్పష్టం చేసింది. శుక్రవారం బీఎస్ఈలో ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేరు 1.98 శాతం నష్టపోయి రూ.1,510.35 వద్ద ముగిసింది.

అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనల్లో పాల్గొనేందుకు ఎంఎస్ఎంఈలకు అవకాశం

ఐసీ పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం

హైదరాబాద్: విదేశీ ఎగుమతి అవకాశాల కోసం చూస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) సదవకాశం. అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనల్లో పాల్గొనదలిచే ఎంఎస్ఎంఈలకు అంతర్జాతీయ సహకారం (ఐసీ) పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం కల్పిస్తోంది. అర్హత కలిగిన ఎంఎస్ఎంఈలకు అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనల్లో స్థలం అద్దె కోసం జరిపే చెల్లింపులకు 100 శాతం సాయం (గరిష్ఠంగా రూ.1.25 లక్షలు లేదా వాస్తవంగా చెల్లించిన అద్దెలో ఏది తక్కువైతే అది) లభించనుంది. అలాగే, ప్రదర్శనలో పాల్గొనబోయే సంస్థ తరపున ప్రతినిధులకు ఒక్కొక్కరికీ ఎకానమీ క్లాస్ విమాన టికెట్ కొనుగోలుకు 100 శాతం (గరిష్ఠంగా రూ.లక్ష లేదా వాస్తవంగా చెల్లించిన రుసుములో ఏది తక్కువైతే అది) ఆర్థిక సాయం లభించనుంది. ఈ పథకంలో భాగంగా ప్రత్యేకంగా ఏదేని ఉత్పత్తి లేదా మల్టీ ప్రొడక్ట్ ఇంకా సేవా రంగ ఎంఎస్ఎంఈలకూ ఆర్థిక మద్దతు లభించనుందని ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ తెలిపింది. అంతర్జాతీయ ట్రేడ్ ఎగ్జిబిషన్లు, వాటి వివరాలు తెలుసుకునేందుకు తమ అడిషనల్ ఇండస్ట్రియల్ అడ్వైజర్‌ను సంప్రదించవచ్చని ఇనిస్టిట్యూట్ వెల్లడించింది. లేదా 040-23078131/32/33 నంబర్లకు ఫోన్ చేసి కూడా వివరాలు పొందవచ్చు.

రోజంతా లాభాలు.. చివరికి నష్టాలు



ముంబై : రోజంతా లాభాలతో ట్రేడైన స్టాక్ మార్కెట్ శుక్రవారం చివరికి నష్టాలతో ముగిసింది. ట్రేడింగ్ చివర్లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సెన్సెక్స్ 86.88 పాయింట్ల నష్టంతో 38,736.23 దగ్గర, 30.40 పాయింట్ల నష్టంతో నిఫ్టీ 11,552.50 వద్ద క్లోజయ్యాయి. కేంద్ర బడ్జెట్ దెబ్బతో ఈ వారం సెన్సెక్స్ 777.16 పాయింట్లు, నిఫ్టీ 258.65 పాయింట్లు నష్టపోయాయి. ఆరంభంలో లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్ ఆ తర్వాత ఒక దశలో 39,000 బెంచ్‌మార్క్‌ని అధిగమించింది. అయితే ట్రేడింగ్ చివరికి వచ్చేసరికి లాభాలు ఆవిరయ్యాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్లలో 13 కంపెనీల షేర్లు మాత్రమే లాభాలతో ముగిశాయి.

అమెరికా-చైనా వాణిజ్య యుద్ధానికి తోడు, ట్రంప్ హెచ్చరికతో భారత-అమెరికా మధ్య కూడా వాణిజ్య యుద్ధం చెలరేగే ప్రమాదం ఉందని మార్కెట్ వర్గాలు భయపడుతున్నాయి. అలాగే శుక్రవారం మార్కెట్ ముగిసిన తర్వాత వెలువడే జూన్ నెల ద్రవ్యోల్బణం, పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) గణాంకాలు ఎలా ఉంటాయోనన్న భయాలు మార్కెట్‌ను వెంటాడాయి. దీంతో ట్రేడర్లు, మదుపరులు ఆచితూచి వ్యవహరించారు. బీఎస్ఈ సెక్టోరియల్ సూచీల్లో క్యాపిటల్ గూడ్స్, టెలికాం, ఆయిల్ అండ్ గ్యాస్, ఇండస్ట్రియల్స్, ఎనర్జీ, బ్యాంకెక్స్, ఫైనాన్స్ సూచీలు నష్టాలతో ముగిశాయి. మెటల్స్, బేసిక్ మెటీరియల్స్, రియల్టీ, హెల్త్‌కేర్ సూచీలు మాత్రమే కొద్దిపాటి లాభాలతో క్లోజయ్యాయి. సెన్సెక్స్ షేర్లలో బజాజ్ ఫైనాన్స్, ఓఎన్‌జీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, ఎల్ అండ్ టీ, యాక్సిస్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, కోటక్ మహీంద్రా బ్యాంక్ కంపెనీల షేర్లు 2.08 శాతం వరకు నష్టపోయాయి. వేదాంత, సన్‌ఫార్మా, టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్, హీరో మోటో కార్ప్, యెస్ బ్యాంక్ షేర్లు మాత్రం కొద్దిపాటి లాభాలతో ముగిశాయి.

క్వెస్ కార్ప్ కంపెనీ షేరు శుక్రవారం హాట్‌హాట్‌గా ట్రేడైంది. బీఎస్ఈలో ఒక దశలో ఈ కంపెనీ షేరు 18 శాతం వరకు దూసుకుపోయింది. చివరికి 9.27 శాతం లాభంతో రూ.480.95 దగ్గర క్లోజైంది. ప్రిఫరెన్షియల్ కేటాయింపు పద్ధతిలో అమెజాన్ ఇండియాకు 7.54 లక్షల షేర్లు కేటాయించేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలపడం ఇందుకు దోహదం చేసింది.

జీవిత కాల గరిష్ఠ స్థాయిలో ఎస్‌బీఐ లైఫ్ షేరు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కంపెనీ వృద్ధి రేటు బాగుంటుందన్న అంచనాతో ఎస్‌బీఐ లైఫ్ షేరు శుక్రవారం జీవిత కాల గరిష్ఠ స్థాయికి చేరింది. బీఎస్ఈలో ఒక దశలో ఈ కంపెనీ షేరు రూ.789 స్థాయికి చేరింది. చివరికి 3.49 శాతం లాభంతో రూ.780.60 దగ్గర స్థిరపడింది. ఈ సంవత్సరం మొత్తం మీద ఎస్‌బీఐ లైఫ్ షేరు ధర 34 శాతం పెరిగింది.

నచ్చినట్టుగా ఫర్నీచర్

- కస్టమైజేషన్‌కే ప్రాధాన్యం
- గోద్రెజ్ ఇంటీరియో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుబోధ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గృహాల్లో వినియోగించే ఫర్నీచర్‌ను తమకు నచ్చినట్టుగా తయారు చేయించుకునే (కస్టమైజేషన్) వారి సంఖ్య క్రమంగా పెరుగుతోందని, ఇలాంటి కస్టమర్ల మూలంగా జరిగే అమ్మకాల విలువే అధికంగా ఉంటోందని గోద్రెజ్ ఇంటీరియో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (బీ2సీ) సుబోధ్ మెహతా తెలిపారు. తమ వద్ద ఫర్నీచర్‌ను కొనుగోలు చేసే వారిలో 40 శాతం మంది కస్టమైజేషన్‌కే ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. గత కొన్నేళ్ల కాలంలో ఇంటి నిర్మాణ పరిమాణం తగ్గిపోతోందని, ఇందుకు అనుగుణంగానే ఫర్నీచర్‌ను కస్టమర్లు కోరుకుంటున్నారన్నారు. జీవన శైలీ మారడం కూడా కస్టమైజేషన్‌కు దారితీస్తోందని శుక్రవారంనాడిక్కడ మెహతా విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా గృహ ఫర్నీచర్ మార్కెట్ పరిమాణం రూ.75,000 కోట్ల స్థాయిలో ఉందని, ఇందులో 20 శాతం వాటా వ్యవస్థీకృత రంగానిది కాగా మిగతా 80 శాతం అవ్యవస్థీకృత రంగానిదేనని ఆయన తెలిపారు. వ్యవస్థీకృత రంగంలో 20-25 కంపెనీలున్నాయని, ఈ విభాగంలో తమ కంపెనీ మార్కెట్ వాటా 15 శాతంగా ఉందని ఆయన చెప్పారు.

నాగాస్త్రానిదే గెలుపు

- రాఫెల్ క్షిపణి ఒప్పందం రద్దు
- స్పైక్‌తో లక్ష్యఛేదన అసాధ్యమని నిర్ధారణ
- స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన నాగ్ క్షిపణి
- కొత్త తరం క్షిపణుల రూపకల్పనకు స్ఫూర్తి
- త్వరలో సైన్యంలోకి ప్రవేశపెట్టే అవకాశం

దేశ సరిహద్దుల రక్షణలో శత్రు ట్యాంకులను ధ్వంసం చేసేందుకు.. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన నాగ్ క్షిపణి వైపే భారత సైన్యం మొగ్గు చూపింది. రాఫెల్ కంపెనీ రూపొందించిన స్పైక్ క్షిపణిని కాదని.. రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) రూపొందించిన నాగ్‌ను ఉపయోగించాలని నిర్ణయించింది. వాస్తవానికి మన రక్షణ దళాలు ఇప్పటి దాకా ఎక్కువగా విదేశీ పరిజ్ఞానాన్నే నమ్ముకున్నాయి. కానీ, వాటిలో అప్పుడప్పుడు ఇబ్బందులు వస్తే ప్రత్యామ్నాయంలేక.. మౌనంగా ఉండిపోయిన సందర్భాలున్నాయి. నాగ్ క్షిపణినే ఉపయోగించాలని తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఆ పరిస్థితి మారుతుందని రక్షణరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సరిహద్దుల్లో శత్రు ట్యాంకులను ధ్వంసం చేయడంలో కీలకమైన ఈ క్షిపణులను కొనుగోలు చేయాలని సైన్యం చాలాకాలంగా ప్రయత్నిస్తోంది. ఈ మేరకు ఇజ్రాయెల్‌కు చెందిన రాఫెల్ సంస్థ రూపొందించిన స్పైక్ ట్యాంకు వ్యతిరేక నిర్దేశిత క్షిపణుల (ఏటీజీఎం)ను 50 కోట్ల డాలర్ల (రూ.3500 కోట్ల)తో కొనుగోలు చేయాలని నిర్ణయించింది. 21 క్షిపణి లాంచర్లు, 8356 క్షిపణులు, 15 సిమ్యులేటర్ల కొనుగోలుకు రాఫెల్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఈ ఒప్పందంపై అప్పట్లోనే విమర్శలు వచ్చాయి. మన అమ్ముల పొదిలో నాగ్ ఉండగా.. స్పైక్‌ను ఎందుకు కొనుగోలు చేయాల్సివచ్చిందని కొందరు రక్షణరంగ నిపుణులు ప్రశ్నించారు. వీటిపై ప్రభుత్వం స్పందించకుండా మౌనంగా ఉండిపోయింది. అయితే క్షిపణిని మన దేశంలో వివిధ రకా ల పరిస్థితుల్లో పరీక్షించి చూసిన తర్వాతే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం రాఫెల్‌కు ముందే చెప్పింది. ఈ మేరకు సైన్యం వివిధ వాతావరణ పరిస్థితుల్లో ఈ క్షిపణిని పరీక్షించింది. రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో జరిపిన పరీక్షల్లో స్పైక్ దారుణంగా విఫలమైంది. "దీనిలో అనేక సమస్యలున్నాయి. ఉదాహరణకు.. ఇది లక్ష్యాలను గుర్తించడంలో విఫలమవుతోంది. దీనివల్ల శత్రు లక్ష్యాలను ఛేదించటం దాదాపు అసా ధ్యం.. అందువల్లే ఈ ఒప్పందాన్ని ప్రభుత్వం రద్దు చేసింది" అని రక్షణ రంగానికి చెందిన ఉన్నతాధికారి ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు. స్పైక్‌కు బదులుగా నాగ్‌ను ఉపయోగించాలని సైన్యం నిర్ణయించిందని, దీని వల్ల అనేక రకాల ప్రయోజనాలున్నాయని అన్నారు. "వీటిలో మొదటిది స్వాలంబన. ఇది పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసింది కాబట్టి భవిష్యత్తులో వచ్చే సమస్యలను సులభంగా పరిష్కరించుకోవచ్చు. అంతే కాకుండా కొత్త తరం క్షిపణులను అభివృద్ధి చేయటానికి వీలవుతుంది. రెండోది విదేశీ మారక ద్రవ్యం ఆదా. మూడోది శాస్త్రవేత్తల్లో నూతనోత్సాహం." అని ఆ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు. దీనిని అతి త్వరలోనే సైన్యంలోకి ప్రవేశపెట్టనున్నారు.

- స్పెషల్ డెస్క్

శత్రువును వెంటాడే నాగాస్త్రం

మన పురాణాల్లోని నాగాస్త్రాన్ని ఒక్కసారి ప్రయోగిస్తే చాలు.. శత్రువును వెంటాడి వేటాడి మరీ సంహరిస్తుంది. మన శాస్త్రవేత్తలు రూపొందించిన నాగ్ కూడా దాదాపు ఇలాంటిదే! 2009లో ఈ క్షిపణిని అభివృద్ధి చేయడం ప్రారంభించారు. ఇప్పటి దాకా ఈ తరహా క్షిపణులను తయారు చేయడానికి దాదాపు రూ.322 కోట్లు ఖర్చు పెట్టారు. దాదాపు 4కిలోమీటర్ల దూరంలో ఉన్న ట్యాంకులను గురి చూసి ప్రయోగిస్తే.. ఈ క్షిపణి వాటిని వెంటాడుతుంది. వేగంగా ప్రయాణించే ట్యాంకులను కూడా వెంటాడుతుంది. అంతే కాకుండా దీని కోసం ప్రత్యేకంగా ఇమేజ్ సీకింగ్ ఆప్టికల్ గైడెన్స్ వ్యవస్థను రూపొందించారు. దీని వల్ల ఈ క్షిపణికి అదనపు సామర్థ్యం చేకూరింది. దీనిని సైనిక విమానాల నుంచి గానీ, భూమిపై ఉండే లాంచర్ల నుంచి గానీ ప్రయోగించవచ్చు.

సోషల్ మీడియాపై జాగ్రత్త

- ప్రభుత్వోద్యోగులకు కేంద్రం మార్గదర్శకాలు
- సైనికోద్యోగులకు వేరుగా ఆదేశాలు

న్యూఢిల్లీ, జూలై 12: భారత ప్రభుత్వ విభాగాలకు చెందిన వెబ్‌సైట్ల హ్యాకింగ్‌కు రోజుకు సగటున 30 దాడులు జరుగుతున్న నేపథ్యంలో.. అప్రమత్తతపై కేంద్ర ప్రభుత్వోద్యోగులకు పలు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఈ మేరకు కేంద్ర హోంశాఖ 24 పేజీలతో కూడిన మార్గదర్శకాలను విడుదల చేసింది. ఆ వివరాలిలా ఉన్నాయి..

- ఆఫీసు కంప్యూటర్లలో సోషల్ మీడియాను వాడొద్దు
- అధికారుల అనుమతితోనే పెన్‌డ్రైవ్‌లను వినియోగించాలి
- పబ్లిక్ వైఫైలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడొద్దు. ఒకవేళ ఇంటి నుంచి అధికారిక ఈ-మెయిల్ పంపాల్సి వస్తే.. ఉద్యోగులు వినియోగించే వైఫై రౌటర్‌కు తప్పనిసరిగా మ్యాక్ (మీడియా యాక్సెస్ కంట్రోల్) అడ్రస్ ఉండాలి
- అధికారిక ఫైళ్లను క్లౌడ్ (గూగుల్ డ్రైవ్, డ్రాప్ బాక్స్, ఐక్లౌడ్ వంటివి)లో పెట్టకూడదు
- 13 లక్షల మంది సైనికులు వాట్సాప్ వాడుతున్నట్లు గుర్తించిన రక్షణ శాఖ.. వారికోసం ప్రత్యేకంగా రెండు పేజీల మార్గదర్శకాలను విడుదల చేసింది.

బీజేపీని బలోపేతం చేస్తా: నాదెండ్ల

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో బీజేపీని బలోపేతం చేస్తానని ఉమ్మడి ఏపీ మాజీ సీఎం, బీజేపీ నేత నాదెండ్ల భాస్కర్‌రావు చెప్పారు. తన వయస్సు గురించి కొంతమంది ఏదేదో మాట్లాడుతున్నారని, అయితే వాటిని తాను పట్టించుకోబోనని స్పష్టం చేశారు. పని చేయడానికి వయస్సుతో సంబంధం లేదని తేల్చిచెప్పారు. బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో ప్రాంతీయ పార్టీల ప్రాభవం తగ్గిపోయిందని, బంధుప్రీతి వల్లే వాటికి ఈ పరిస్థితి ఏర్పడిందని అభిప్రాయపడ్డారు. అంతకుముందు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌ను భాస్కర్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు.

పీవీ విజయాలను గుర్తించని కాంగ్రెస్: జీవీఎల్

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రధానమంత్రులందరి పాలనలో కంటే పీవీ నరసింహారావు హయాంలోనే దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగైన వృద్ధిని సాధించిందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. తెలుగు బిడ్డ కావడం వల్లే ఆయనను కాంగ్రెస్ పార్టీ సరైన విధంగా గుర్తించలేదన్నారు. శుక్రవారం బడ్జెట్‌పై రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ప్రతి అయిదారేళ్లకూ ఆర్థిక వ్యవస్థ రెట్టింపు అవుతుందనే వడ్డీ వ్యాపారి ఆర్థిక సిద్ధాంతంతో.. బీజేపీ విధానాలను పోల్చడంపై జీవీఎల్ మండిపడ్డారు.

గిడ్డంగుల సంస్థ ఎండీగా రిటైర్డ్ ఐఏఎస్

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేవీ సత్యనారాయణ నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సంక్షిప్తంగా..

శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్: విదేశీ మార్కెట్ల నుంచి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ దాదాపు రూ.1,700 కోట్లు సమీకరించనుంది.

నాబార్డ్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ నుంచి దాదాపు రూ.55,000 కోట్లు సమీకరించనున్నట్లు నాబార్డ్ తెలిపింది.

అదానీ పవర్: ఈక్విటీ షేర్లు, కన్వర్టబుల్ డిబెంచర్లు, బాండ్లు, ఇతర సెక్యూరిటీల ద్వారా రూ.7,000 కోట్ల వరకూ సమీకరించడానికి అదానీ పవర్‌కు వాటాదారులు ఆమోదం తెలిపారు.

బులియన్



బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	35,000	---	35,570	34,350	34,530
క్రితం ముగింపు	34,340	---	35,790	34,420	34,870
22 క్యారెట్లు	33,290	---	32,720	31,800	32,960
క్రితం ముగింపు	32,730	---	32,920	31,850	33,300
వెండి (కిలో)	38,200	---	38,900	39,000	41,000
క్రితం ముగింపు	38,400	---	39,200	39,200	41,300

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.75 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	415	చిత్తూరు	448
వరంగల్	418	చెన్నై	455
విజయవాడ	408	నమక్కల్	445
గోదావరి	408	బెంగళూరు	435
విశాఖపట్నం	444	ముంబై	470

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	85
కరీంనగర్	80	గుంటూరు	85
వరంగల్	80	ఒంగోలు	87
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	82
కర్నూలు	80	నెల్లూరు	82
విశాఖపట్నం	90	అనంతపురం	78
గోదావరి	83		

డ్రైవర్‌కుకునుకు పట్టిందా.. బండికి బ్రేక్!

వాహనాల్లో ప్రత్యేక పరికరం.. యూపీఎస్ ఆర్టీసీ వినూత్న ప్రయోగం

లఖ్‌నవూ, జూలై 12: వాహనం నడుపుతున్న సమయంలో డ్రైవర్ కంటిపై కునుకు పడితే.. ఇకపై ఎలాంటి ప్రమాదమూ జరగదు! వాహనం అత్యవసరంగా నిలిచిపోతుంది అంతే!! ఉత్తరప్రదేశ్(యూపీ)లోని యమునా ఎక్స్‌ప్రెస్ మార్గంపై ఇటీవల జరిగిన ఘోర ప్రమాదంలో 29 మంది మృతి చెందిన నేపథ్యంలో యూపీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (యూపీఎస్ ఆర్టీసీ) ఈ సరికొత్త పరికరానికి రూ.40వేల ఖర్చుతో రూపకల్పన చేసింది. రాత్రివేళల్లో వాహనాలను నడిపే డ్రైవర్లు నిద్రలోకి జారిపోకుండా ఇది హెచ్చరిస్తుంది. ప్రస్తుతమిది ప్రయోగ దశలో ఉంది. ఇందులో ఇజ్రాయెలీ సాంకేతికతతో కూడిన సెన్సర్లు వాడారు. వాహనంలోని డ్యాష్ బోర్డులో ఏర్పాటు చేసే ఈ పరికరం.. డ్రైవర్ కునుకు తీస్తున్నాడని తెలిసిన వెంటనే పనిచేయడం ప్రారంభిస్తుంది. రెడ్ లైట్లు వెలుగుతూ.. 'బీప్' సౌండ్‌తో హెచ్చరిస్తుంది. డ్రైవర్ స్పందించకపోతే.. ఆటోమేటిక్‌గా వేగాన్ని తగ్గించి, కొన్ని క్షణాల్లోనే అత్యవసర బ్రేకులు వేసి.. వాహనాన్ని నిలిపివేస్తుంది. ఓవర్ టేక్ సమయంలోనూ డ్రైవర్‌ను హెచ్చరిస్తుంది.

ఈడీ కేసులో విచారణకు హాజరైన కోనేరు

నిందితులకు చార్జిషీటు ప్రతులు అందజేత

హైదరాబాద్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్ కుంభకోణం కేసులో ట్రైమ్యాక్స్ సంస్థల అధినేత కోనేరు రాజేంద్ర ప్రసాద్ శుక్రవారం సీబీఐ కోర్టు ముందు హాజరయ్యారు. ఇతర నిందితులు శ్రీకాంత్ జోషి, జి.వెంకట విజయరాఘవ, తుమ్మల రంగారావు, ఎన్.సునీల్ రెడ్డి, కోనేరు ప్రదీప్‌తోపాటు సౌత్ ఎండ్ ప్రాజెక్ట్స్ అండ్ ఫౌండేషన్స్ డైరెక్టర్ మనోహన్‌రెడ్డి, ఆసరా థీమ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ ఐ.శ్యామ్‌ప్రసాద్‌రెడ్డితోపాటు ఎమ్మార్ హిల్స్ టౌన్‌షిప్, ఎమ్మార్ ఎంజీఎఫ్ ల్యాండ్, స్టైలిష్‌హోం సంస్థల తరపు ప్రతినిధులు కూడా హాజరయ్యారు. వీరి హాజరును నమోదు చేసుకున్న జడ్జి....తదుపరి విచారణను ఆగస్టు 21కి వాయిదా వేశారు. కోర్టు సిబ్బంది చార్జిషీటు ప్రతులను నిందితులకు అందజేశారు. మరో నిందితుడైన కోనేరు మధు ప్రస్తుతం దుబాయ్‌లో ఉన్న నేపథ్యంలో సమన్లను ఆయన తండ్రి రాజేంద్ర ప్రసాద్‌ను తీసుకోవాలని కోరగా తిరస్కరించారని ఈడీ తరఫు న్యాయవాది నివేదించారు.

మినహాయింపు కోరిన జగన్, విజయసాయి

అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనాల్సి ఉన్నందున విచారణకు హాజరుకాలేకపోతున్నారని ఏపీ సీఎం జగన్ తరపు న్యాయవాది అశోక్‌రెడ్డి సీబీఐ ప్రత్యేక కోర్టుకు నివేదించారు. పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనాల్సి ఉన్నందున విచారణకు హాజరుకాలేనని ఎంపీ విజయసాయిరెడ్డి తెలిపారు. టీటీడీ చైర్మన్‌గా విధుల్లో పాల్గొనాల్సి ఉన్నందున కోర్టుకు రాలేనని మరో నిందితుడు వైవీ సుబ్బారెడ్డి కూడా నివేదించారు. హాజరీ నుంచి మినహాయింపు కోరుతూ వీరి తరపున దాఖలైన వ్యాజ్యాన్ని జడ్జి అనుమతించారు. సీనియర్ ఐఏఎస్‌లు మన్మోహన్‌సింగ్, శ్రీలక్ష్మిలతోపాటు ఈ కేసులో ఇతర నిందితులు హాజరయ్యారు.

పచ్చి బఠాణీని 'ఎక్స్‌ట్రా' దినుసుగానే కాదు... 'మెయిన్ కోర్సు' వంటల్లో కూడా వాడొచ్చు. ఉత్తరాదిలో ఈ మటర్‌ను ఆలూతో పాటు ఇతర కూరల్లో విరివిగా ఉపయోగిస్తారు. రొటీన్‌కు భిన్నంగా ఈ గ్రీన్‌పీస్‌తో వెరైటీగా ఎన్నో రుచులను తయారుచేయొచ్చు. వీటితో చేసే కబాబ్‌లు, కర్రీలే కాదు... కజ్జికాయలు, పలావ్ కూడా రుచికరంగా ఉంటాయి. ఆలస్యమెందుకు... పచ్చిబఠాణీతో ఈ కొత్త వంటకాలను ట్రై చేయండి. గ్రీన్'ఫీస్ట్'కు సిద్ధంకండి.

గ్రీన్ ఫీస్ట్

గ్రీన్‌పీస్ కబాబ్

కావలసినవి: పాలకూర - 500గ్రాములు, పచ్చి బఠాణీ - 500గ్రాములు, పచ్చిమిర్చి - రెండు, అల్లం - ఒక చిన్నముక్క, ఉప్పు - రుచికి తగినంత, మిరియాల పొడి - పావు టీస్పూన్, బ్రెడ్ ముక్కలు - రెండు, సెనగపిండి - కొద్దిగా, నూనె - సరిపడా, ఉల్లిపాయ - ఒకటి.

తయారీ:
- ముందుగా పాలకూరను శుభ్రంగా కడిగి, కట్ చేసి పెట్టుకోవాలి.
- పచ్చి బఠాణీలను ఉడికించి పక్కన పెట్టుకోవాలి.
- మిక్సీలో బఠాణీలు, పాలకూర, అల్లం, పచ్చిమిర్చి, బ్రెడ్‌ముక్కలు వేసి గ్రైండ్ చేసి ప్యూరీ తయారు చేసుకోవాలి.
- అందులో మిరియాల పొడి, తగినంత ఉప్పు వేసుకుని పక్కన పెట్టుకోవాలి.
- ఒక పాన్‌లో నూనె వేసి కాస్త వేడి అయ్యాక మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసుకుంటూ సెనగపిండిలో అద్దుతూ నూనెలో వేసి వేగించాలి.
- ఉల్లిపాయలతో గార్నిష్ చేసుకొని వేడి వేడిగా సర్వ్ చేసుకోవాలి.

నిమోన

కావలసినవి: పచ్చి బఠాణీ - ఒక కేజీ, బంగాళదుంపలు - రెండు, ఉల్లిపాయలు - నాలుగు, ఇంగువ - చిటికెడు, అల్లం - ఒక ముక్క, వెల్లుల్లి రెబ్బలు - నాలుగు, బిర్యానీ ఆకులు - రెండు, ధనియాల పొడి - ఒక టేబుల్ స్పూన్, కారం - ఒక టీస్పూన్; పసుపు - అర టీస్పూన్, జీలకర్ర - ఒక టీస్పూన్, లవంగాలు - ఐదు, యాలకులు - ఐదు, దాల్చిన చెక్క - చిన్నముక్క, కొత్తిమీర - ఒకకట్ట, ఉప్పు - తగినంత, టొమాటో ప్యూరీ - మూడు టేబుల్ స్పూన్లు, నూనె - సరిపడా, నెయ్యి - ఒక టేబుల్ స్పూన్.

తయారీ:
- పచ్చిబఠాణీలో సగం మెత్తగా గ్రైండ్ చేయాలి. మిగతా సగం కొద్దిగా కచ్చాపచ్చా ఉండేలా గ్రైండ్ చేయాలి.
- అల్లం, వెల్లుల్లి, లవంగాలు, దాల్చినచెక్క, జీలకర్ర, యాలకులను పేస్టు మాదిరిగా చేసుకొని పక్కన పెట్టాలి.
- ఉల్లిపాయలను పేస్టు మాదిరిగా చేసుకోవాలి.
- బంగాళదుంపను చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఒక పాన్‌లో నూనె వేసి ఉల్లిపాయలు, బంగాళదుంప ముక్కలు వేసి వేగించాలి.
- అందులో బిర్యానీ ఆకు, ఉల్లిపాయ పేస్టు, కొత్తిమీర, పసుపు, కారం, తగినంత ఉప్పు వేసి మరికాసేపు వేగించి పక్కన పెట్టుకోవాలి.
- మరొక పాన్‌లో నెయ్యి వేసి కాస్త వేడి అయ్యాక ఇంగువ వేయాలి. తరువాత మెత్తగా గ్రైండ్ చేసుకున్న బఠాణీ మిశ్రమం వేయాలి.
- ఇప్పుడు పక్కన పెట్టుకున్న బంగాళదుంప మిశ్రమం, టొమాటో ప్యూరీ వేసి మరికాసేపు వేగించాలి. కచ్చా, పచ్చాగా గ్రైండ్ చేసుకున్న బఠాణీలు వేయాలి. కొద్దిగా నీళ్లు పోసి, గరంమసాలా వేయాలి.
- చిన్న మంటపై ఉడికించుకోవాలి. కొత్తిమీరతో గార్నిష్ చేసుకుని, అన్నంతో గానీ, చపాతీతో గానీ తింటే రుచిగా ఉంటుంది.

గాజర్ మటర్

కావలసినవి: పచ్చి బఠాణీ - రెండు కప్పులు, క్యారెట్ - ఒకటి, నెయ్యి - రెండు టేబుల్ స్పూన్లు, ఇంగువ - చిటికెడు, మెంతులు - ఒక టీస్పూన్, సోంపు - ఒక టేబుల్ స్పూన్, కారం - ఒక టీస్పూన్, గరంమసాలా - ఒక టీస్పూన్, ఉప్పు - తగినంత, నిమ్మరసం - ఒక టేబుల్ స్పూన్, కొత్తిమీర - ఒకకట్ట.

తయారీ:
- మెంతులు, సోంపు గింజలను వేగించి పొడి చేసుకోవాలి.
- ఒక పాన్‌లో నెయ్యి వేసి కాస్త వేడి అయ్యాక ఇంగువ వేయాలి.
- క్యారెట్, పచ్చి బఠాణీ వేసి వేగించాలి.
- కారం, గరంమసాలా, ఉప్పు వేసి కలియబెట్టాలి.
- చిన్నమంటపై ఉడికించాలి. నిమ్మరసం పిండుకుని దింపుకోవాలి.
- కొత్తిమీరతో గార్నిష్ చేసుకుని సర్వ్ చేసుకోవాలి.

పచ్చి బఠాణీ పలావ్



కావలసినవి: బాస్మతి బియ్యం - రెండుకప్పులు, నెయ్యి - రెండు టేబుల్‌స్పూన్లు, జీలకర్ర - ఒక టేబుల్ స్పూన్, అల్లం - చిన్నముక్క, పచ్చి బఠాణీ - రెండు కప్పులు, ధనియాల పొడి - రెండు టీస్పూన్లు, గరంమసాలా - ఒకటీస్పూన్, ఉప్పు - తగినంత, పసుపు - ఒక టీస్పూన్, నీళ్లు - సరిపడా.

తయారీ:
- బాస్మతి బియ్యం శుభ్రంగా కడిగి గంటపాటు నానబెట్టుకోవాలి.
- ఒక పాన్‌లో నెయ్యి వేసి కాస్త వేడి అయ్యాక జీలకర్ర, మెత్తగా దంచిన అల్లం వేయాలి.
- అల్లం బాగా వేగాక బియ్యం, పచ్చి బఠాణీ, గరంమసాలా, ధనియాల పొడి, పసుపు, ఉప్పు వేసి కలియబెట్టాలి.
- కాసేపు వేగాక నాలుగు కప్పుల నీళ్లు పోసి, బియ్యం వేసి చిన్నమంటపై ఉడికించాలి.
- అన్నం ఉడికిన తరువాత వేడి వేడిగా సర్వ్ చేసుకోవాలి.

మటర్ పనీర్

కావలసినవి: పనీర్ - రెండు కప్పులు, పచ్చిబఠాణీ - రెండు కప్పులు, పచ్చిమిర్చి - నాలుగు, ఉల్లిపాయలు - రెండు, వెల్లుల్లి రెబ్బలు - రెండు, అల్లం - చిన్నముక్క, టొమాటోలు - రెండు, నూనె - పావు కప్పు, జీలకర్ర - రెండు టీస్పూన్లు, బిర్యానీ ఆకులు - రెండు, పసుపు - అర టీస్పూన్, ఉప్పు - రుచికి తగినంత, మిరియాల పొడి- చిటికెడు, ధనియాల పొడి - ఒక టేబుల్ స్పూన్, కొత్తిమీర - ఒకకట్ట.

తయారీ:
- ఉల్లిపాయలు, అల్లం, వెల్లుల్లి రెబ్బలను పేస్టులా చేసుకోవాలి.
- ఒక పాన్‌లో నూనె వేసి కాస్త వేడి అయ్యాక జీలకర్ర, బిర్యాని ఆకు వేసి వేగించాలి.
- తరువాత ఉల్లిపాయ పేస్టును వేయాలి. గోధుమ రంగు వచ్చే వరకు వేగించుకోవాలి.
- టొమాటో ముక్కలు, పసుపు, గరంమసాలా, మిరియాల పొడి, ధనియాల పొడి, ఉప్పు వేసి మరి కాసేపు వేగించాలి.
- పచ్చి బఠాణి, పనీర్, పచ్చి మిర్చి వేసి, కలిపి మరికాసేపు ఫ్రై కానివ్వాలి.
- రెండు కప్పుల నీళ్లు పోసి ఉడికించాలి. పది నిమిషాల పాటు చిన్న మంటపై ఉడకనివ్వాలి.
- కొత్తిమీర వేసుకొని దింపుకోవాలి.

పచ్చి బఠాణీ కజ్జికాయలు

కావలసినవి: మైదా పిండి - ఒకటిన్నర కప్పు, ఉప్పు - తగినంత, నూనె - సరిపడా, ఆవాలు - ఒకటీస్పూన్, పచ్చిమిర్చి - నాలుగు, కొత్తిమీర - ఒకకట్ట, పచ్చి బఠాణీ - ఒకటిన్నర కప్పు, ఉప్పు - రుచికి తగినంత, నూనె - సరిపడా.

తయారీ:
- ఒక పాత్రలో మైదా పిండి తీసుకొని, ఉప్పు వేసి మెత్తటి మిశ్రమంలా కలపాలి.
- ఒక పాన్‌లో నూనె వేసి కాస్త వేడి అయ్యాక ఆవాలు, పచ్చిమిర్చి, పచ్చిబఠాణీ, కొత్తిమీర, ఉప్పు వేసి కలుపుకోవాలి. పచ్చి బఠాణీ దోరగా అయ్యే వరకు వేగించాలి.
- ఇప్పుడు పిండి మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక్కో ఉండను వెడల్పుగా ఒత్తి, మధ్యలో బఠాణీ మిశ్రమం పెట్టి చివరలు దగ్గరకు చేర్చి ఒత్తుకోవాలి.
- గోధుమరంగు వచ్చే వరకు వీటిని వేగించుకుంటే నోరూరించే పచ్చి బఠాణీ కజ్జికాయలు రెడీ.

గుడ్‌ఫుడ్

పోషకాల గని రాజ్‌మా!

చిరుధాన్యాలలో 'కిడ్నీ బీన్స్' ప్రత్యేకమైనవి. ఎరుపు, బ్రౌన్ రంగులో ఉండే వీటిని పోషకాల గని అని చెప్పొచ్చు. పీచుపదార్థం, ప్రొటీన్లతో నిండిన ఈ సూపర్ సీడ్స్‌లో ఆరోగ్యానికి మేలు చేసే గుణాలెన్నో. వీటి వల్ల ఒనగూరే ఇతర ఆరోగ్య లాభాలేమంటే...

- ఈ గింజల్లో పొటాషియం, మెగ్నీషియం రక్తప్రసరణ సవ్యంగా జరిగేలా చూసి, రక్తపోటును నివారిస్తాయి. వీటిలోని సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు, ఫైబర్ రక్తంలోని కొలెస్ట్రాల్ నిల్వలను తగ్గిస్తాయి.
- కిడ్నీ బీన్స్‌లో గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువ. ఇవి చక్కెర స్థాయిల్ని అదుపులో ఉంచుతాయి. కాబట్టి డయాబెటిక్ సమస్య ఉన్నవారు వీటిని తింటే ఫలితం ఉంటుంది.
- వీటిలోని విటమిన్ బి1 జ్ఞాపకశక్తిని మెరుగు పరుస్తుంది. అల్జీమర్స్ ముప్పు నుంచి కాపాడుతుంది.
- ఈ గింజల్లోని మాంగనీస్ జీవక్రియల్ని వేగవంతం చేసి, ఆహారం నుంచి తొందరగా శక్తి విడుదలయ్యేలా చూస్తుంది.
- వీటిలో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్‌ను నిర్మూలించి, రోగనిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. అంతేకాదు చర్మం మీద ముడతల్ని నివారించి, యవ్వనంగా కనిపించేలా చేస్తాయి. వెంట్రుకలు, గోళ్లకు పోషణనిస్తాయి .
- కిడ్నీ బీన్స్‌లో ప్రొటీన్స్ అధికంగా ఉంటాయి. శాకాహారులకు అవసరమైన ప్రొటీన్లు ఈ గింజల్లో లభిస్తాయి. చిన్నపిల్లల శారీరక, మనో వికాసానికి ఈ ప్రొటీన్లు ఎంతో ఉపకరిస్తాయి.
- పీచు పదార్థం అధికంగా, కొవ్వులు తక్కువగా ఉండే ఈ గింజల్ని తింటే తొందరగా ఆకలి వేయదు. బరువు తగ్గాలనుకునేవారికి ఇవి మంచి ఫుడ్ ఛాయిస్.
- ఈ గింజల్ని సరైన మోతాదులో తింటే జీర్ణవ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది. పెద్దపేగు కేన్సర్ ముప్పు తప్పుతుంది.
- వీటిలోని మెగ్నీషియం కొలెస్ట్రాల్ నిల్వల్ని తగ్గించి, రక్తనాళాలు మూసుకుపోకుండా చూసి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి.
- కిడ్నీబీన్స్ తింటే మైగ్రేన్ నుంచి ఉపశమనం లభిస్తుంది. గర్భిణులకు కావాల్సిన ఐరన్, ఫోలిక్ ఆమ్లం ఈ గింజల్లో లభిస్తాయి.

కిచెన్ కార్నర్

మిల్క్ బాయిలర్

స్టవ్ మీద పాలు పెడితే చూస్తూనే ఉండాలి. ఒక్క క్షణం పక్కకు వెళితే పాలు పొంగిపోవడం చూస్తూనే ఉంటాం. మరి పాలను గిన్నెలోనే ఎందుకు వేడి చేయాలి? పాలకూ ఓ కుక్కర్ కొనుక్కుంటే పోలా? హాయిగా... విజిల్ రాగానే దింపుకోవచ్చు. ఆలోచన బాగుంది కదూ! ఇంకెందుకు ఆలస్యం. మిల్క్ బాయిలర్‌కు ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టేయండి. స్టెయిన్‌లెస్ స్టీల్‌తో నిర్మించిన దళసరి బాడీ కుక్కర్ నాణ్యతను తెలుపుతుంది. పాలు మరగడం ప్రారంభంకాగానే విజిల్ వస్తుంది. కాబట్టి పాలు ఎక్కువ సేపు మరిగిపోతాయనే దిగులు అక్కర్లేదు. 1 లీటరు, 1.5 లీటరు, 2 లీటర్ల సామర్థ్యం ఉన్న మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. ఒక లీటరు బాయిలర్ ధర సుమారు రూ. 390 నుంచి ఉంది. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంది.





విశేషం

నవ్య | ఆంధ్రజ్యోతి అనేక

నీటి మడుగులో శయనించే ఆ స్వామి... నలభయ్యేళ్ళకోసారి పైకి వస్తాడు. భక్త జన కోటికి కనువిందు చేస్తాడు. అత్తి కర్రతో మలచిన ఆర్త రక్షకుడు ఈ కంచి వరదుడు!

జల అనంత శయనుడు!

మత్స్యావతారం ఎత్తి, జలాలలో దాగిన సోమకుణ్ణి వధించి, వేదాలను కాపాడిన శ్రీమహావిష్ణువు... సప్త మోక్షపురాలలో ఒకటైన తమిళనాడులోని కాంచీపురంలో అత్తి వరద రాజ స్వామిగా నీటి కొలనులో విశ్రమిస్తాడు. నాలుగు దశాబ్దాలకు ఒకసారి పైకి వస్తాడు. వివిధ అలంకారాల్లో అర్చనలు అందుకుంటాడు. మళ్ళీ జలగర్భంలోకి చేరుకుంటాడు. ఏ ఆలయంలోనూ కనిపించని ఈ విశేషానికి కంచిలోని శ్రీ వరదరాజ పెరుమాళ్ ఆలయం ఇప్పుడు మరోసారి వేదిక అయింది.

బ్రహ్మ కొలిచిన పాదం..

అత్తి శ్రీవరదరాజ స్వామి (అత్తి వరదర్) జల నివాసం వెనుక అనేక కథనాలు ఉన్నాయి. స్థలపురాణం ప్రకారం, బ్రహ్మ

దేవుడు దేవలోక శిల్పి విశ్వకర్మను పిలిచి, తాను నిర్మహించబోయే మహాయాగానికి అనువైన నగరాన్ని నిర్మించాలని కోరాడు. బ్రహ్మ కోరిక మేరకు విశ్వకర్మ చెక్కిన మహా అద్భుతమే నేటి కాంచీపురం వరదరాజ పెరుమాళ్ ఆలయం. బ్రహ్మతో విబేధాల కారణంగా తాను ఆ యాగంలో పాల్గొనడం లేదని సరస్వతి చెప్పడంతో గాయత్రి, సావిత్రిలతో బ్రహ్మ యాగాన్ని పూర్తి చేశాడు. ఈ విషయం తెలుసుకున్న సరస్వతి ఆవేశం చెంది 'వేగవతి' నదిగా పొంగి పొరిలి, యాగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నించింది. ఆ సమయంలో యాగాన్ని కాపాడేలా మహావిష్ణు ఆ నదికి అడ్డుగా పడుకొని ప్రళయాన్ని అడ్డుకున్నాడు. బ్రహ్మ చేపట్టిన అశ్వమేధ యాగం దిగ్విజయంగా పూర్తయింది. యాగ గుండంలోని అగ్ని నుంచి లక్ష్మీదేవి సమేతంగా మహావిష్ణువు వరదరాజ పెరుమాళ్‌గా ఆవిర్భవించాడు. ఆయనే అత్తివరదర్‌గా పూజలందుకుంటున్నాడు. యజ్ఞగుండం నుంచి బయటకు వచ్చిన అత్తి వరదర్ అగ్నిలో దహించిపోవడంతో ఆ విగ్రహాన్ని మూలవర్ సన్నిధిలో ప్రతిష్ఠించరాదని నిర్ణయించారట! అగ్ని నుంచి బయటకు వచ్చిన సమయంలో అధిక వేడిమితో తల్లడిల్లిపోయిన స్వామివారిని చల్లబరిచేందుకే 40 ఏళ్ల నీటిలోనే ఉంచుతున్నట్టు స్థలపురాణం సూచిస్తోంది.

కాగా, 1688వ సంవత్సరం ఔరంగజేబు కాలంలో అత్తి వరదర్ విగ్రహాన్ని కాపాడుకొనేందుకు కాంచీపురం నుంచి తిరుచ్చి సమీపంలోని ఉడయార్‌పాళయానికి తరలించి దాచిపెట్టారనీ, ఆ తరువాత మళ్లీ ఆ విగ్రహాన్ని కాంచీపురం తరలించారనీ తెలుస్తోంది. దీన్ని బట్టి చాలా ఏళ్ళు వరదరాజ పెరుమాళ్ ఆలయంలోని మూలవర్ సన్నిధిలో అత్తి వరదర్ లేరన్న విషయం స్పష్టమవుతోంది.

ఆదిశేషుడి అనుమతితో...

మరో కథనం ప్రకారం... అత్తి వరదరాజ స్వామిని కృతయుగంలో విశ్వకర్మ అత్తి చెట్టుతో చేశాడు. దాన్ని బ్రహ్మ స్వయంగా ప్రతిష్ఠించాడు. కాంచీపురంలో బ్రహ్మ యాగం చేస్తున్నప్పుడు స్వామివారి దారు విగ్రహానికి మంటలు తాకాయి. ఆ అపరాధానికి పరిహారం ఏమిటని స్వామిని బ్రహ్మ అడిగితే, ఆదిశేషుడి మూర్తుల మధ్య కొలనులో తనను ఉంచాల్సిందిగా స్వామి ఆదేశించారు. అప్పటి నుంచి ఆలయం కొలనులో నీళ్లలోనే స్వామి ఉన్నారు. ఆ మూర్తిని దర్శించే అవకాశం వివిధ యుగాల్లో కేవలం బ్రహ్మ, గజేంద్రుడు, బృహస్పతి, ఆదిశేషులకు మాత్రమే దక్కింది. మిగిలిన భక్తులకు కూడా తనను సేవించే అవకాశం ఇవ్వాలని స్వామి అడగడంతో, బ్రహ్మ, గజేంద్రుడు, బృహస్పతి కొన్ని క్షణాల సేపు మాత్రమే స్వామి దర్శన భాగ్యానికి అనుమతించారు. ఆదిశేషుడి వంతు వచ్చినప్పుడు, దేవతాకాలమానం ప్రకారం మండలం (40) రోజులకు ఒకసారి (మానవులకు 40 సంవత్సరాలు)... మానవ కాలమానంలో 48 రోజుల పాటు భక్తులు దర్శించుకోవడానికి అనుమతిని ఇచ్చాడు. తరువాత మళ్ళీ 40 ఏళ్ళు స్వామి నీటి మడుగులోనే ఉంటారు. దాన్ని ఆదిశేషుడి పేరిట 'అనంత సరోవరం' అని పిలుస్తారు.

దాడుల నుంచి రక్షణ కోసం...

కంచిపై ముస్లిం పాలకులు దాడులు చేసినప్పుడు, మూలవిరాట్టును కాపాడడం కోసం అర్చకులు దాన్ని రహస్యంగా దాచారన్నది మరో కథ. దాని ప్రకారం, సుమారు నలభయ్యేళ్ళ పాటు గర్భగుడిలో దేవతామూర్తులు, పూజా పునస్కారాలు లేవు. ఈలోగా మూలవిరాట్‌ను దాచిన అర్చకులు మరణించారు. వారి వారసులు దాని కోసం వెతికినా దొరకలేదు. చివరకు రాతితో చేసిన మరో విగ్రహాన్ని వేరే చోటు నుంచి తీసుకువచ్చి, గర్భగుడిలో ప్రతిష్ఠించారు. ఈ మూర్తిని 'దేవరాజ స్వామి' లేదా 'శ్రీ వరదరాజ పెరుమాళ్' అంటారు. ఆ తరువాత, కాంచీపురంలోని 1709లో స్వామి వారి పుష్కరిణి ఎండిపోయినప్పుడు, అత్తి వరదర్ మూలవిరాట్ బయటపడింది. అర్చకులు, ఆలయ అధికారులు సమావేశమై, ఆలయ ఇతిహాసానికి అనుగుణంగా నలభయ్యేళ్ళకు ఒకసారి 48 రోజులపాటు అత్తి వరదర్‌కు పూజలు నిర్వహించాలనీ, భక్తులకు దర్శనం కల్పించాలనీ నిర్ణయించారు. అప్పటి నుంచి ఆ ఆనవాయితీ కొనసాగుతోంది. శ్రీ వరదరాజ పెరుమాళ్ ఆలయం 108 వైష్ణవ దివ్య క్షేత్రాలలో ఒకటి. ఈ ఆలయం ఉన్న కొండను అత్తిగిరి అంటారు.

మళ్ళీ మరోసారి...

క్రితంసారి 1978లో అత్తి వరదర్ చివరిసారిగా దర్శనం ఇచ్చారు. తరువాత వెండి పెట్టెలో స్వామిని భద్రపరచి, తిరిగి అనంత పుష్కరిణిలో భద్రపరిచారు. నలభయ్యేళ్ళ తరువాత మళ్ళీ ఈ ఏడాది జూలై ఒకటో తేదీన అనంత సరోవరం నుంచి స్వామి పైకి వచ్చి, ఆలయంలోని వసంత మండపంలో విడిది చేశారు. 48 రోజులపాటు భక్తులకు ఆయన దర్శనాన్ని అందిస్తారు. ఆ తరువాత స్వామి తదుపరి దర్శనం లభించేది2059లోనే!

- గనిరెడ్డి అరుణ్‌కుమార్, చెన్నై, ఆంధ్రజ్యోతి

ఎప్పటి వరకూ?: ఆగస్టు 17 వరకూ

ఎక్కడ?: తమిళనాడు రాష్ట్రంలోని కాంచీపురంలో ఉన్న శ్రీ వరదరాజ పెరుమాళ్ ఆలయంలో

ఎలా వెళ్లాలి?: చెన్నై నుంచి 80 కి.మీ., తిరుపతి నుంచి 180 కి.మీ. దూరంలో కంచి ఉంది. ఆ నగరాల నుంచి బస్సుల్లో కంచి చేరుకోవచ్చు. నాగర్‌కోయిల్, మదురై వెళ్ళే కొన్ని రైళ్ళు కంచి రైల్వే స్టేషన్‌లో ఆగుతాయి. సమీప విమానాశ్రయం చెన్నైలో ఉంది.

ఇవీ చూడండి: కంచి కామాక్షి ఆలయం, ఏకాంబరేశ్వర స్వామి ఆలయం (శివ కంచి), కామకోటి పీఠం.

అత్తి వరదర్ దర్శన సమయాలు: ఉదయం 4.30 నుంచి రాత్రి 10 గంటల వరకూ

టిక్కెట్ బుకింగ్: https://tnhrce.gov.in వెబ్‌సైట్ ద్వారా అత్తి వరదర్ సహస్రార్చన టిక్కెట్లను 4 రోజుల ముందు బుక్ చేసుకోవచ్చు. ఉదయం పది గంటలకు బుకింగ్ ప్రారంభం అవుతుంది. ఉదయం 6.30కి జరిగే అర్చనకు 250, సాయంత్రం 5 గంటలకు నిర్వహించే అర్చనకు మరో 250 చొప్పున రోజుకు 500 టిక్కెట్లు విక్రయిస్తారు. శని, ఆదివారాలకు టిక్కెట్లు ఇవ్వరు. మిగిలిన రోజుల కోసం బుక్ చేసుకోవచ్చు. టిక్కెట్టు ఖరీదు రూ. 500.

కొన్ని రోజులు నిలబడి...

- కంచిలోని వరదరాజ పెరుమాళ్ ఆలయాన్ని 'విష్ణు కంచి' అంటారు. ప్రసిద్ధమైన బంగారు, వెండి బల్లులు ఉన్నది ఇక్కడే. ఈ బల్లులను తాకితే, బల్లి పడిన దోషాలు పోతాయంటారు.
- అత్తి వరదర్ విగ్రహం ఎత్తు సుమారు 10 అడుగులు.
- ఈ 48 రోజుల్లో 30 రోజులు శయన భంగిమలో, 18 రోజులు నిలబడి స్వామి దర్శనం ఇస్తారు.
- ప్రతిరోజూ విశేష అలంకారం లేదా సేవ ఉంటాయి.
- 48 రోజులు పూర్తి అయిన తరువాత అనంత సరోవరం (అనంత పుష్కరణి)లోని నాలుగు కాళ్ళ మండపంలో, వెండి పెట్టెలో స్వామిని భద్రపరుస్తారు.

స్త్రీ సుడోకు - 80

					9		3	
	8							
	5	4		1	7			
	2	9	6		4			3
		5	7		3	1		
6			9		1	5	2	
			2	9		7	5	
							8	
	6		1					

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 79 సమాధానం

4	2	6	5	8	9	7	1	3
9	5	3	1	2	7	8	4	6
8	1	7	3	4	6	5	9	2
1	8	4	9	7	2	6	3	5
7	3	2	6	5	1	9	8	4
6	9	5	8	3	4	1	2	7
3	6	8	2	1	5	4	7	9
2	4	9	7	6	8	3	5	1
5	7	1	4	9	3	2	6	8

ఇన్‌స్టాలో తొలి పోస్ట్... అమ్మకు అంకితం

- రామ్‌చరణ్

"కొన్ని విషయాలు ఎప్పటికీ మారవు" అని రామ్‌చరణ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. ఏం మారవు? అమ్మ ప్రేమ! అవును... పిల్లలపై తల్లి ప్రేమ ఎప్పటికీ మారదని ఆయన ఉద్దేశం!! ఇటీవల రామ్‌చరణ్ ఇన్‌స్టాగ్రామ్‌లో అడుగుపెట్టారు. చిన్నతనంలోనూ, పెరిగి పెద్దయిన తర్వాత తల్లితో కలిసి దిగిన ఫొటోలను పోస్ట్ చేశారు. ఇన్‌స్టాలో రామ్‌చరణ్ తొలి పోస్ట్ అదే. "సంథింగ్స్ నెవర్ ఛేంజ్. నా తొలి పోస్ట్ నీకే అంకితం. లవ్యూ అమ్మ. నేను ఎప్పటికీ అమ్మ కూచినే" అని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రానికి ఈ ఫొటోను సుమారు రెండున్నర లక్షలమంది లైక్ చేశారు. ఫొటో బావుందని చాలామంది కామెంట్ చేశారు.

పదినిమిషాల కోసం

నాలుగు నెలలు కష్టపడ్డా

- రష్మిక

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా జంటగా నటించిన చిత్రం 'డియర్ కామ్రేడ్'. 'ఫైట్ ఫర్ వాట్ యు లవ్' అన్నది ఉపశీర్షిక. భరత్ కమ్మ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్, బిగ్ బెన్ సినిమాస్ సంస్థలు నిర్మిస్తున్నాయి. నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్, మోహన్ చెరుకూరి, యశ్ రంగినేని నిర్మాతలు. గురువారం ఈ సినిమా ట్రైలర్‌ను హైదరాబాద్‌లో విజయ్ దేవరకొండ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "ట్రైలర్ ఎలా ఉంటుందో అన్న టెన్షన్‌తో ఈ రోజు ఉదయాన్నే నిద్రలేచా. సినిమా రిలీజ్ దగ్గరపడుతుంటే నిద్రపట్టడం లేదు. కానీ ట్రైలర్‌కు రెస్పాన్స్ బావుండడంతో టెన్షన్ తగ్గింది. నేనీ స్థాయిలో ఉండటానికి తెలుగు ప్రేక్షకులు చూపించే అభిమానమే కారణం. నాకు సపోర్ట్ చేస్తున్న అందరినీ కామ్రేడ్ అనే పిలుస్తా" అని అన్నారు. రష్మిక మాట్లాడుతూ "బ్యూటిఫుల్ స్టోరీ ఇది. పది నిమిషాల సీన్ కోసం మూడు, నాలుగు నెలలు క్రికెట్ నేర్చుకున్నా" అని చెప్పారు. "ట్రైలర్‌కు స్పందన బావుంది. శుక్రవారం నుంచీ మ్యూజికల్ ఫెస్ట్ నిర్వహిస్తున్నాం. 22న వైజాగ్‌లో ప్రీ రిలీజ్ వేడుక చేస్తాం. 26న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అని నిర్మాతల్లో ఒకరైన నవీన్ యర్నేని తెలిపారు.

విజయ్ దేవరకొండ, రష్మిక

అలసి పోతే ఎలా?

"మన కలలు ఎంత విశాలంగా ఉంటాయో, మనం సాధించాలనుకునే అంశాలు కూడా అంతే గొప్పగా ఉంటాయి. అందుకే కలలు కనాలి. వాటి సాకారానికి కృషి చేయాలి" అని అన్నారు రకుల్‌ప్రీత్ సింగ్. ఆమె ప్రస్తుతం అక్కినేని నాగార్జున సరసన 'మన్మథుడు2'లో నటిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎప్పుడూ కలర్‌ఫుల్ పిక్చర్స్ పోస్ట్ చేసే రకుల్ మాట్లాడుతూ "ఎవరైనా సరే... అలా బిగుసుకుపోయి, స్టిఫ్‌గా ఉండకూడదు. మానసికంగానూ, భౌతికంగానూ ఫ్లెక్సిబుల్‌గా ఉండాలి. అలాగే ఓ ధ్యేయంతో పనిచేస్తున్నంత సేపూ ఉత్సాహంగా ఉండాలి. మనం అలసిపోయామని చేస్తున్న పనిని సగంలో ఆపకూడదు. చేయాల్సిన పని పూర్తయినప్పుడు మాత్రమే వాటికి ఫుల్‌స్టాప్ పెట్టాలి. పనిని సక్రమంగా చేసినప్పుడు ఒక రకమైన ఆత్మసంతృప్తి కలుగుతుంది. ఆ వెలుగు మన కళ్లల్లో కనిపిస్తుంది" అని అన్నారు రకుల్ ప్రీత్ సింగ్.

రకుల్ ప్రీత్ సింగ్

రామ్‌ని నాకు తెలిసినంత వాడుకున్నా

నభా నటేష్, రామ్, నిధి అగర్వాల్

- పూరి జగన్నాథ్

"నేను రామ్‌తో తొలిసారి పనిచేశాను. తనలో అమితమైన ఎనర్జీ ఉంది. వాడుకున్నోళ్లకు వాడుకున్నంతన్నమాట. నాకు చేతనైనంతగా నేను వాడాను. సినిమా చూసిన ప్రతి ఒక్కరికీ 'ఇస్మార్ట్ శంకర్' మైండ్‌లో నిలిచిపోతాడు. తను మాట్లాడిన తెలంగాణ యాస సినిమాకు హైలైట్ అవుతుంది. పక్కా మాస్ ఎంటర్‌టైనింగ్ చిత్రమిది" అని పూరి జగన్నాథ్ అన్నారు. ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. పూరి జగన్నాథ్, ఛార్మి సంయుక్తంగా నిర్మించారు. రామ్ కథానాయకుడు. నభ నటేష్, నిధి అగర్వాల్ నాయికలు. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిత్ర యూనిట్ పాల్గొన్నారు. రామ్ మాట్లాడుతూ "నా జీవితంలో బెస్ట్ టైమ్ 'ఇస్మార్ట్ శంకర్' కోసం పనిచేసిన సమయమే. నృత్యాలు, సంగీతం, రీరికార్డింగ్... ఇలా సినిమాలో అన్నీ బాగా కుదిరాయి. ప్రతి విషయాన్నీ ప్రేక్షకులు తప్పకుండా ఆస్వాదిస్తారు. ఈ నెల 18న మా చిత్రం విడుదలవుతుంది" అని అన్నారు. ఛార్మి మాట్లాడుతూ "సినిమా తొలి కాపీ చూశాం. మరింత నమ్మకం పెరిగింది. ప్రేక్షకులకు ఫుల్‌మీల్స్ లాంటి సినిమా అవుతుంది" అన్నారు.

నా జీవితంలో మర్చిపోలేని చిత్రం 'ఆమె'

అమలాపాల్, భరద్వాజ

"ఆమె'లో అమలాపాల్ నటన చూసి షాకయ్యా. ఈ జనరేషన్‌లో అమల చాలా గొప్ప పెర్ఫార్మర్. 'ఆమె' తరహా చిత్రాలు చేయాలంటే గొప్ప ప్యాషన్ ఉండాలి. అది లేని వారు భయంతో వెనకాడతారు" అని తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. అమలాపాల్ నాయికగా నటించిన థ్రిల్లర్ 'ఆమె' చిత్రానికి ఆయన సమర్పకుడు. రత్నకుమార్ దర్శకుడు. ఈ చిత్రం పోస్టర్ లాంచ్ కార్యక్రమం హైదరాబాద్‌లో గురువారం సాయంత్రం జరిగింది. హీరో శ్రీకాంత్ పోస్టర్ విడుదల చేశారు. 'ఆమె' ట్రైలర్ బావుందని, సినిమా పెద్ద విజయం సాధించాలని శ్రీకాంత్, దర్శకురాలు నందినిరెడ్డి అభిలషించారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ "నేను 1979లో పరిశ్రమలోకి వచ్చాను. ఈ నలభై ఏళ్లల్లో ఎన్నో సినిమాలు చేశాను. చూశాను. కానీ 'ఆమె'ను చూసి షాక్ అయ్యాను. ఎంతో ప్యాషన్ ఉంటేగానీ ఇలాంటి ప్రాజెక్టులు చేయరు. తెలుగులో చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. నా జీవితంలో మర్చిపోలేని చిత్రమవుతుంది" అని చెప్పారు. అమలాపాల్ మాట్లాడుతూ "రొటీన్ స్క్రిప్టులతో విసిగిపోయి, ఈ రంగాన్ని వదిలిపెడదామనుకున్న సమయంలో 'ఆమె' స్క్రిప్ట్ వచ్చింది. ఇందులో నగ్నత్వం ఉంది. కానీ సినిమా విడుదలయ్యాక దాన్ని ఎవరూ ఫోకస్ చేయరు. నిజాయతీగా మేం చేసిన సినిమాను మెచ్చుకుంటారు. ఆ క్రెడిట్ మా దర్శకుడికి, కెమెరామేన్ విజయ్‌కి దక్కుతుంది" అని అన్నారు. ఈ నెల 19న విడుదల చేస్తున్నామనీ, ఆకట్టుకునే సినిమా ఇదనీ నిర్మాతలు రాంబాబు కల్లూరి, విజయ్ మోరవెనేని తెలిపారు.



సలహా

వరి నాట్ల వేళ పారాహుషార్

వరి, చెరకు, వేరుశనగ సాగుచేసే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతాంగానికి ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు చేస్తున్న సూచనలు.

జూన్ నెలలో వరి నారుమడులు పోసిన రైతుల పొలాల్లో జూలైలో నాట్లు పడే అవకాశం ఉన్నందున వరి నాట్ల సమయంలో ఈ క్రింది మెళకువలు పాటించాలి.

- ప్రధాన పొలాన్ని 3-4 సార్లు దమ్ము చేసి బాగా చదును చేసుకోవాలి.
- ఆయా మండలాలకు సిఫారసు చేసిన భాస్వరం ఎరువును ఆఖరి దమ్ములో వేసుకోవాలి.
- దీర్ఘకాలిక, మధ్యకాలిక రకాలను 25-30 రోజుల వయసున్న నారును ఊడ్చుకోవాలి.
- స్వల్పకాలిక రకాలు సాగు చేస్తున్నప్పుడు 20-25 రోజుల వయస్సున్న నారు ఊడ్చుకోవాలి.
- రెండు నుండి మూడు మూనల నారును పైపైన ఊడ్చాలి.
- కాలిబాటలు 2-3 మీటర్లు విధిగా ఉండేటట్లు చూసుకోవాలి.
- సిఫారసు చేసిన నత్రజనిని మూడు సమభాగాలుగా మొదటిసారి నాటడానికి ముందు, రెండవసారి పిలకల దశలో, ఆఖరుగా అంకురం ఏర్పడే దశలో వేసుకోవాలి.
- ప్రధాన పొలంలో కలుపు నివారణకు నాట్లు వేసిన 3-5 రోజులలోపు పల్చగా నీరు పెట్టి ఎకరానికి 1.5 లీటర్ల బూటాక్లోర్ లేదా 500 మి.లీ. ప్రిటిలాక్లోర్ లేదా ఆక్సాడయార్జిల్ 33-50 గ్రా. లేదా బెన్‌సల్ఫ్యూరాన్ మిథైల్ ప్రిటిలాక్లోర్ గుళికలు 4 కిలోలు చొప్పున సమానంగా పడేలాగా ఎకరానికి 20 కిలోల ఇసుకతో కలిపి చల్లుకోవాలి.

వర్షాధారంగా చెరకు వేస్తున్నారా?

- వర్షాధారంగా చెరకు సాగు చేసే ప్రాంతాల్లో తొలకరి వర్షాలకు చిజిల్/సబ్ సాయిల్ తోలడం వలన పంట పొలంలో వర్షపు నీరు లోతు పొరల్లోకి ఇంకుతుంది. దీనివల్ల ఎక్కువ తేమ నిలువ ఉండి పంట నీటి ఎద్దడికి గురి కాకుండా ఉంటుంది.
- ఉత్తర కోస్తా జిల్లాలలో వర్షాధారపు చెరకు సాగు చేసే నేలల్ని లోతు దుక్కి చేసి, ఎకరానికి 10 టన్నులు బాగా మాగిన పశువుల ఎరువును వాడుకోవాలి. 60 సెం.మీ. ఎడంతో చెరకు చాళ్ళు ఏర్పాటు చేసుకోవాలి.
- చెరకు విత్తనాన్ని 10 శాతం సున్నపు నీటిలో ఒక గంట సమయం ముంచి నాటుకోవాలి. దీని కారణంగా మొలక శాతం, పంట నీటి ఎద్దడిని తట్టుకొనే శక్తి పెరుగుతుంది.
- చెరకు నాట్లకు ముందుగా ఎకరానికి 125 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేటు, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లను చెరకు చాళ్లలో వేసుకోవాలి.
- చెరకు ముచ్చెలు నాటిన మూడు రోజుల లోపుగా నేలపై ఎకరానికి 2 కిలోల 'అట్రాజిన్' లేదా 60 గ్రా. మెట్రిబ్యుజిన్ కలుపు రసాయనాన్ని పిచికారీ చేసుకోవాలి.
- నాటిన మూడు రోజుల లోపుగా కలుపు మందు పిచికారీ చేసిన పిదప ఎకరానికి 1.25 టన్నుల చెరకు చెత్తను కప్పుట ద్వారా నేలలోని తేమ సంరక్షింపబడి, కలుపు, పీక ఉధృతి తగ్గుతుంది.
- వర్షాధారంగా జూన్‌లో నాటిన చెరకు తోటలకు మొదటి దఫా నత్రజని ఎరువును (ఎకరానికి 30 కిలోల యూరియా) భూమిలో తగినంత పదును ఉన్నప్పుడు వేసుకోవాలి.
- దీర్ఘకాలిక బెట్ట పరిస్థితులు నెలకొన్నప్పుడు లీటరు నీటికి 25 గ్రా. యూరియా, 25 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లను కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలి.

విత్తన శుద్ధితో వేరుశనగ భద్రం

పంట మొదటి దశలో వచ్చే రసం పీల్చు పురుగుల (దీపపు పురుగులు, తామర పురుగులు) నివారణకు కిలో విత్తనాలకు 2 మి.లీ., ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్, 4 మి.లీ. నీరు చొప్పున కలిపి విత్తన శుద్ధి చేయాలి. అలాగే కిలో విత్తనానికి 1 గ్రా. టెబ్యుకొనజోల్ 2% డి.ఎస్ లేదా 3 గ్రా. మ్యాంకోజెబ్ చొప్పున కలిపి విత్తన శుద్ధి చేయాలి. మొదట క్రిమిసంహారక మందుతో శుద్ధి చేసి నీడలో ఆరబెట్టాలి. తరువాత శిలీంద్రనాశిని మందుతో శుద్ధి చేయాలి. ట్రైకోడెర్మా విరిడి 8 గ్రా. కిలో విత్తనానికి చొప్పున కాండం కుళ్ళు/వేరు కుళ్ళు తరచుగా వచ్చే ప్రాంతాలలో విత్తనశుద్ధి చేయాలి.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేసుకోవాలి. సాధారణ ఫలితాలను దృష్టిలో ఉంచుకొని ఎకరానికి 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేటు, 35 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. నత్రజని ఎరువు (యూరియా) ఎకరాకు 18 కిలోల విత్తనం వేసేటప్పుడు ఎకరాకు 20 కిలోల జింకు సల్ఫేటు మూడు పంటలకొకసారి వేసుకోవాలి. మొదటి దశలో కలుపు నివారణకు బ్యూటాక్లోర్ 1 లీ., లేదా పెండిమిథాలిన్ 1 లీ./200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 48 గంటలలోపు పిచికారీ చేయాలి.

విజయగాథ

ఆధునిక పద్ధతుల్లో తీగ జాతితో పాటు వివిధ రకాల కూరగాయల పండిస్తూ అధిక లాభాలు ఆర్జిస్తున్నారు అనంతపురం జిల్లా రైతు సోమశేఖర్. ఉద్యోగం వదిలేసి స్వగ్రామంలో వ్యవసాయం చేస్తూ సాటి రైతులకు ఆదర్శంగా నిలిచిన ఆ రైతు ప్రస్థానం ఇది.

టమాటా సాగుతో కోటి ఆదాయం

తీగజాతి కూరగాయల సాగులో మేటిగా నిలిచిన అనంత రైతు

అనంతపురం జిల్లా తనకల్లు మండలంలోని వేపలపల్లి గ్రామానికి చెందిన యువ రైతు సోమశేఖర్ బ్రతుకు తెరువు కోసం హైదరాబాద్ చేరారు. ఓ హోటల్‌లో ఫుడ్ ఈవెంట్ మేనేజర్‌గా పనిచేశారు. ఆయనకు తాను చేస్తున్న పని ఏమాత్రం సంతృప్తిని వ్వలేదు. పుట్టిన గడ్డ మీద గౌరవంగా జీవిద్దాం అనుకుని వేపలపల్లికి తిరిగి వచ్చేశారు. తల్లిదండ్రులు సంపాదించిన భూమిలో బోర్లు వేసి, వ్యవసాయం ప్రారంభించారు. నలుగురు నడిచే దారిలో కాకుండా భిన్నంగా సాగు చేస్తే తప్ప లాభాలు రావని గ్రహించారు. తనదైన శైలిలో టమోటా, బీర, కాకర, దోస, గుమ్మడి, వంగ వంటి పంటలను సాగుచేయడం ప్రారంభించారు. తనకున్న భూమితో పాటు పక్కన ఉన్న భూములు కూడా లీజుకు తీసుకుని సాగు చేపట్టారు. మూడేళ్లలో రూ. 30 లక్షలు పెట్టుబడి పెట్టారు. ఖర్చులు పోను 20 లక్షల లాభం ఆర్జించి అందరికీ ఆదర్శంగా నిలిచారు ఆ యువరైతు. అధిక లాభాలు ఆర్జించడానికి తాను అనుసరించిన సాగు విధానాలే కారణం అన్నారు సోమశేఖర్.

కోటి ఆదాయం టార్గెట్

టమోటా పంటలకు కట్టెలు కట్టి నాణ్యమైన దిగుబడి సాధించారు. ఈ విధానం వల్ల అధిక దిగుబడి రావడంతో పాటు పంట నాణ్యత కూడా పెరిగింది. దాంతో మార్కెట్‌లో ఈ రైతు పండించిన కూరగాయలకు మంచి గిరాకీ ఏర్పడింది. తద్వారా లాభాలు కూడా గణనీయంగా పెరిగాయి. ప్రస్తుతం 15 ఎకరాల్లో టమోటా సాగు చేపట్టారు. సాగు కోసం ఇప్పటికే రూ. 12 లక్షలు ఖర్చుచేశారు. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం బాక్స్ ధర రూ. 1000 వరకు వుంది. ప్రతి రోజు 200 బాక్స్‌లు దిగుబడి వస్తోంది. రెండు, మూడు కోతల తర్వాత రోజుకు 2 వేల బాక్సుల దిగుబడి వస్తుందన్నారు ఆ యువరైతు. ధర నిలకడగా ఉంటే రూ. 1 కోటి దాకా పంట రావచ్చునన్న ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. టమోటాతో పాటు అన్ని రకాల తీగ జాతి కూరగాయలను విలక్షణ పద్ధతిలో సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు ఈ రైతు. తాను పండించే పంటలకు సాధారణ క్రిమిసంహారక మందులతో పాటు జీవామృతం, ఘనజీవామృతం, వేస్ట్‌డీకంపోజర్ లాంటి సేంద్రియ ఎరువులు కూడా ఉపయోగిస్తున్నారు. క్రమేణా రసాయన పురుగు మందులు వాడటం ఆపేసి, సేంద్రియ ఎరువులతోనే పంటలు పండించాలన్నదే తన లక్ష్యమన్నారు. ఫుడ్‌ఈవెంట్ మేనేజర్‌గా హోటల్‌లో ఒకరి వద్ద వేతనానికి పనిచేసిన సోమశేఖర్ నేడు వందల మందికి ఉపాధి కల్పిస్తూ రైతులకు ఆదర్శంగా నిలవడం విశేషం.

- ఆంధ్రజ్యోతి, తనకల్లు, అనంతపురం

సాగుకు యువత నడుంకట్టాలి

వ్యవసాయం చేసేవారి సంఖ్య క్రమంగా తగ్గుతోంది. ముఖ్యంగా యువత స్వగ్రామాలకు తిరిగి వచ్చి సాగు రంగంలో అడుగుపెట్టాలి. మంచి సాగు పద్ధతులు అనుసరిస్తే ఉద్యోగానికంటే అధిక రాబడి పొందే వీలుంటుంది. యువత సాగు రంగంలోకి వస్తేనే రసాయన రహిత వ్యవసాయం పెరుగుతుంది. అప్పుడే రైతుకు గౌరవం కూడా పెరుగుతుంది.

- సోమశేఖర్, రైతు వేపలపల్లి

కొత్త వంగడం

బ్లాక్ రైస్‌కు భలే గిరాకీ

రెండు కొత్త వంగడాలు ఆవిష్కరించిన బాపట్ల శాస్త్రవేత్తలు

రైతులకు బిపిటి 5204 రకం వరి విత్తనాలను అందించిన బాపట్ల వ్యవసాయ శాస్త్రవేత్తలు మరో అద్భుతమైన వంగడాన్ని రూపొందించారు. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న బ్లాక్‌రైస్‌ను బాపట్ల రకాలలో కూడా అందించేందుకు సిద్ధం చేశారు. ఈ ఏడాది రైతులకు మినీకిట్‌ల ద్వారా ఈ వంగడాన్ని అందిస్తున్నారు. బిపిటి 2841 పేరుతో రూపొందించిన బ్లాక్‌రైస్‌లో యాంటీ ఆక్సిడెంట్‌లు అధికంగా ఉంటాయి. వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. జింకు, ఐరన్ ఎక్కువగా ఉంటాయి. సాధారణ రకాలు కంటే ఇది ఎన్నో పోషకాలతో నిండినదని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో నల్లబియ్యం కిలో 270 నుంచి 300 రూపాయలకు విక్రయిస్తున్నారని శాస్త్రవేత్తలు తెలియజేశారు. ఈ వంగడాన్ని రైతులకు అందించాలనే సంకల్పంతో పరిశోధించి నూతన వంగడాన్ని సిద్ధం చేసినట్లు బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సివి.రామారావు తెలిపారు. దీని పంటకాలం 130 రోజులని ఆయన చెప్పారు. పైరు మీద పడిపోదని, ఆశించిన దిగుబడులు వస్తాయన్నారు. ప్రస్తుతం రైతులకు మినీకిట్‌లు అందజేసి ఆ తరువాత వంగడాన్ని పూర్తి స్థాయిలో విడుదల చేస్తామన్నారు. అదేవిధంగా మరో నూతన వంగడం బిపిటి 2846 రకాన్ని కూడా రైతులకు ఈ ఏడాది మినీకిట్ ద్వారా అందిస్తున్నామన్నారు. దోమపోటు, అగ్గితెగులు తట్టుకునే ఈ రకం పంటకాలం 145 రోజులు ఉంటుంది.

ఫౌండేషన్ సీడ్ సిద్ధం

ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని బాపట్ల వ్యవసాయ కళాశాల వ్యవసాయక్షేత్రంలో ఈ నెల 8వ తేదీ నుంచి రైతులకు ఫౌండేషన్ సీడ్ విక్రయిస్తున్నామని అసోసియేట్ డీన్ డాక్టర్ డి.లోకనాధరెడ్డి తెలిపారు. బిపిటి 5204, బిపిటి 2270, ఎన్ఎల్ఆర్ 145 రకాల ఫౌండేషన్ వరి విత్తనాలు రైతులకు అమ్మటానికి అందుబాటులో ఉంచామన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు ఒరిజనల్స్‌తో పాటుగా జిరాక్స్ కాపీలను తీసుకొచ్చి చూపించాలని ఆయన కోరారు. ఒక్కొక్క రైతుకు గరిష్ఠంగా 30 కిలోల బస్తాలు రెండు ఇస్తారు. విత్తనాలు కోసం ముందుగా దరఖాస్తు చేసుకున్న, దూరప్రాంతాల నుంచి లేఖలు పంపించిన వారికి ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, బాపట్ల

పునర్వసు కార్తె
జూలై 19 వరకు

వైవిధ్యం

సేంద్రియ పొగాకు సాగుకు ప్రోత్సాహం

ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ముందడుగు

సేంద్రియ విధానంలో పొగాకు సాగు చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు చేకూరుతున్నది. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో రైతులు ఇప్పటికే సేంద్రియ పద్ధతిలో పొగాకు సాగు చేసి లబ్ది పొందారు. ఇతర జిల్లాల్లో కూడా ఈ పద్ధతిలో పొగాకు సాగు చేసే విధంగా పొగాకు బోర్డు రైతుల్ని ప్రోత్సహిస్తున్నది.

ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పొగాకు రైతులు గత నాలుగేళ్ళుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొన్నారు. దీంతో పొగాకు దిగుబడులు తగ్గాయి. నాణ్యత కూడా గణనీయంగా తగ్గింది. పలు ప్రాంతాల్లో ఈ ఏడాదిలో గ్రేడ్ పొగాకు ఎక్కువగా పండడానికి ఇది ప్రధాన కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ పరిస్థితులను గమనించిన పొగాకు బోర్డు ఛైర్మన్ కె. సునీత తక్కువ ఖర్చుతో నాణ్యమైన పొగాకు పండించే అవకాశం వున్న సేంద్రియ విధానంపై రైతుల్లో చైతన్యం నింపుతున్నారు. పొగాకు బోర్డు ప్రోత్సాహంతో పలు జిల్లాల్లో రైతులు సేంద్రియ పద్ధతిలో పొగాకు సాగు చేపట్టి సత్ఫలితాలు సాధిస్తున్నారు.

భూసారం పదిలం

పొగాకు రైతులు భూసారాన్ని కాపాడుకోవడం ప్రధానం. అందుకోసం సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని బోర్డు సారథి సునీత సూచిస్తున్నారు. వ్యవసాయ భూముల్లో రైతులు పచ్చిరొట్ట పైర్లు వేయాలని చెప్పడంతో పాటు అందుకు అవసరమైన చర్యలను కూడా పొగాకు బోర్డు చేపట్టింది. పొగాకు సాగుకు ముందు పచ్చిరొట్ట సాగు వల్ల నేల గుల్లబారి, తేమ నిలబెట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది. తద్వారా పంట వర్షాభావ పరిస్థితులను తట్టుకుంటుంది. ఈ ఏడాది ప్రకాశం, నెల్లూరు, పశ్చిమగోదావరి, ఇతర ప్రాంతాల్లో 3.2 లక్షల కిలోల పచ్చిరొట్ట విత్తనాలను పొగాకు రైతులకు పొగాకు బోర్డు అందుబాటులో ఉంచింది. రైతుల కోరిక మేరకు అదనంగా ఈ విత్తనాలను సరఫరా చేసేందుకు సిద్ధమని ఛైర్మన్ సునీత తెలిపారు. సేంద్రియ పద్ధతిలో పొగాకు సాగు చేసే రైతులు ఈ చర్యలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

- వర్షం లేదని పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు పొలంలో చల్లటం ఆపివేయకూడదు. వాటిని సేంద్రియ పద్ధతిలో ద్రవ జీవామృతంలో పది నిముషాలు నానబెట్టి తీసి డ్రైసోయింగ్ పద్ధతిలో చల్లుకోవచ్చు.
- పొలంలో చల్లిన విత్తనాలను గడ్డి, వేరుశనగ పొట్టు లేదా పొలాల్లో సులభంగా లభించే ఇతర వస్తువుల ద్వారా ఆచ్ఛాదన చేయాలి. దీనివల్ల విత్తనాలు వర్షం పడే వరకు భూమిలో బతికి ఉంటాయన్నారు. కొద్దిపాటి వర్షం పడగానే అవి మొలకెత్తుతాయి.
- ప్రకాశం జిల్లాలో విరలాపురానికి చెందిన నవులూరు సురేంద్ర అనే రైతు డ్రై సోయింగ్ పద్ధతిలో విత్తనాలు చల్లగా అవి మొలకెత్తి పచ్చిరొట్ట పంట ఏపుగా పెరుగుతోంది.
- రైతులు మిశ్రమ పంట విధానాలను అనుసరించాలి. పొగాకు పంట లాభసాటిగా లేని గ్రామాల్లో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలి.

- ఆంధ్రజ్యోతి, గుంటూరు

మీ పెరట్లోనే నిగనిగలాడే వంకాయలు

కూరగాయలు ప్రధానంగా పండించే రైతులు వంగ పంటపై విపరీతంగా పురుగు మందులు చల్లుతున్నారు. మిద్దెతోటలు, పెరటితోటలు సాగు చేసేవారు కొంచెం శ్రద్ధ పెడితే వంగ పంటను పండించడం సులభం అంటున్నారు ప్రముఖ మిద్దెతోట నిపుణులు **తుమ్మేటి రఘోత్తమరెడ్డి.**



మిద్దెతోటలు, పెరటితోటల్లో వంగ మొక్కలను పెంచడం సులభం. ఈ మొక్కల సుగుణం ఏమిటంటే ఏ కాలంలో అయినా కాపు కాస్తాయి. మూడు కాలాల్లో కూడా పండించవచ్చు. హైబ్రిడ్ విత్తనాలు అయితే ఆరు నెలల నుండి సంవత్సరం వరకు కాపు కాస్తాయి. దేశీ విత్తనాలు అయితే చీడ పీడలు తక్కువ, జీవితకాలం ఎక్కువ ఉంటుంది. ఒక్కోసారి రెండు సంవత్సరాల పాటు కాపు కాస్తాయి. వంగకు నీరు తక్కువ అవసరం ఉంటుంది. వంగ ఎక్కువ కాపు కాసినప్పుడు నిలవ పచ్చడి పెట్టుకోవచ్చు లేదా ముక్కలు కోసి ఎండబెట్టుకుని వరుగులు చేసుకుని తరువాత వాడుకోవచ్చు. వంగ మొక్కలను ప్రధానంగా రెండు రకాల చీడపీడలు ఇబ్బంది పెడతాయి. పేను సమస్య తీవ్రంగా ఉంటుంది. అలాగే కాయ తొలుచు పురుగు కూడా బాగా నష్టం కలిగిస్తుంది. అప్పుడప్పుడు తెల్లనల్లి సమస్య కూడా వస్తుంది. బయట రైతులు వంగ పంట మీద విపరీతంగా పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ఒక ఎకరం వంగ పంట మీద దాదాపు పది లీటర్ల పురుగు మందులు చల్లుతున్నారు. ఈ పంట మీద చల్లినన్ని పురుగు మందులు ఏ ఇతర పంటల మీదా చల్లడం లేదు. అందువల్ల వంగ మొక్కల్ని మిద్దెతోటల్లో తప్పనిసరిగా మూడు కాలాల్లోనూ పండించుకోవాలి.

వంగ పంటలో ప్రధాన చీడపీడయిన పేను నివారణ గురించి తెలుసుకుందాం. వంగ మొక్కల ఆకుల అడుగుభాగాలలో పేను చేరుతుంది. కంటికి కనిపిస్తుంది. లేత ఆకుపచ్చ పసుపుఛాయలో ఉంటుంది. పేను చేరిన మొక్కల మీద ఎర్రచీమలు సంచరిస్తుంటాయి. పేను సోకిన ఆకులను తెంపి తోట నుండి దూరంగా పారెయ్యాలి. పేనును మొదటి దశలోనే గుర్తిస్తే చేత్తో సున్నితంగా నలిపి కూడా నివారించవచ్చు. బాగా పేను సోకిన ఆకులను తెంపి పారేశాక వేపనూనె పిచికారీ చేయాలి. అయిదు లేదా పది మిల్లీ లీటర్ల వేపనూనెను ఒక లీటరు నీటిలో బాగా కలిపి మొక్కలు బాగా తడిసేలాగా పిచికారీ చేయాలి. మళ్లీ వారం వ్యవధిలో మరోసారి పిచికారీ చేయాలి. వేపనూనెకు బదులు వంటింటి పదార్థాలైన అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి వంటి వాటి రసాలను కూడా పిచికారీ చేయవచ్చు. కొద్దిగా శ్రద్ధ పెడితే సంవత్సరం పొడవునా వంగ పంట పండించుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి
రియల్ ఎస్టేట్
REAL ESTATE
10 విజయవాడ • శనివారం 13 జూలై 2019

రాష్ట్ర స్థిరాస్తి రంగం నీరసించింది. సరఫరా పెరిగినంతగా డిమాండ్ లేదు. దీంతో ఇన్వెంటరీలు పెరిగి పోయాయి. ట్రంప్ దెబ్బతో ప్రవాసాంధ్రుల కొనుగోళ్లూ ఆగిపోయాయి. ధరలు చుక్కలంటడంతో మధ్య తరగతి ప్రజలు కొనుగోళ్లకు సాహసించడం లేదు. నీరసించిన రాష్ట్ర రియల్టీ రంగంపై ప్రత్యేక స్టోరీ. .

కొనుగోళ్లు తగ్గాయి..

ఇన్వెంటరీలు పెరిగాయి

కష్టాల్లో రియల్టీ రంగం

రాష్ట్రంలో స్థిరాస్తి రంగం మేడిపండు చందంగా ఉంది. కొనుగోళ్లు బాగా తగ్గిపోయాయి. డిమాండ్ లేకున్నా భారీ ప్రాజెక్టులు పట్టాలపైకి వస్తున్నాయి. ఇన్వెంటరీ (అమ్ముడుపోని ఫ్లాట్లు, ఇళ్లు) పెరిగిపోతోంది. ధరలు మాత్రం దిగి రావడం లేదు. కొనుగోలుదారులకు సవాలక్ష సమస్యలు. పరిస్థితి ఇంతకు ముందులా లేదు. ప్రతి పైసాకు లెక్క చెప్పాల్సి వస్తోంది. గతంలోలా బినామీ పేర్లతో కొనడానికి, బ్లాక్‌మనీతో తీసుకోవడానికి వీలుకావడం లేదు. కనీసం సగమన్నా వైట్‌లో చెల్లించాల్సి వస్తోంది. మరోవైపు పెట్టుబడులూ తగ్గుతున్నాయి. ఇంతకు ముందు విదేశాల్లో ఉన్న ప్రవాసాంధ్రులు ఇక్కడ స్థిరాస్తులపై పెట్టుబడులు పెట్టమని డబ్బులు పంపేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది.

ట్రంప్ దెబ్బ

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా 'మేకిన్ అమెరికా' నినాదం అందుకున్నారు. దీంతో చాలా మంది ప్రవాసాంధ్రులు అక్కడే పెట్టుబడులు పెడుతున్నారు. అమెరికాలోనే సొంతిల్లు సమకూర్చుకుంటున్నారు. అమెరికాలోనే ట్రిపుల్ బెడ్‌రూమ్‌తో కూడిన డూప్లెక్స్ హౌస్ (వుడెన్ ఫ్లోర్‌తో) రూ.1.25 కోట్లకు లభిస్తోంది. ఇందుకోసం అప్పు చేయాల్సి వస్తే అక్కడి బ్యాంకులు 4 శాతం వడ్డీకే రుణం సమకూర్చుస్తున్నాయి. దాంతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు అక్కడే పెట్టుబడి పెడుతున్నారు. ఈ నేపథ్యంలో వారి కొనుగోళ్లు ఇక్కడ బాగా తగ్గిపోయాయి.

ఎంతో తేడా

విశాఖపట్నంలో పదిహేనేళ్ల క్రితం ఈస్ట్‌పాయింట్ కాలనీలో 2,000 చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) ఫ్లాటు రూ.20 లక్షలకు లభించేది. దానిని రిజిష్టర్ చేయడానికి రూ.1.5 లక్షల స్టాంప్ డ్యూటీ కడితే సరిపోయేది. ఇప్పుడు అదే ప్రాంతంలో ఆ ఫ్లాటు (సెకండ్ హ్యాండ్) ను ఇపుడు అమ్మితే చదరపు అడుగు రూ.4 వేలు చొప్పున రూ.80 లక్షలు వస్తోంది. దీనికి స్టాంప్ డ్యూటీగా రూ.6 లక్షలు చెల్లించాలి. అదే కొత్త ఫ్లాటు అయితే ఎస్ఎఫ్‌టీ రూ.7,000 నుంచి రూ.8,000 వరకు ఉంది. ధరలు ఎంతగా పెరిగాయో చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ప్రస్తుతం 2,000 ఎస్ఎఫ్‌టీ విస్తీర్ణం ఉన్న ఫ్లాటు కొనాలంటే, రూ.1.5 కోట్లు ఖర్చవుతోంది. అప్పట్లో వైట్‌లో 20 శాతం ఇచ్చి, మిగిలిన 80 శాతం బ్లాక్‌మనీ ఇచ్చినా నడిచిపోయేది. ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. వైట్‌లో 80 శాతం ఇచ్చి, మిగిలిన 20 శాతం బ్లాక్‌లో ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇన్వెంటరీ బోలెడు

అయినా గత పదేళ్లలో నిర్మాణ రంగం భారీగా విస్తరించింది. అనేక మంది కొత్త ప్రాజెక్టులు కట్టారు, కడుతున్నారు. డిమాండ్ లేకున్నా నిర్మాణాలు చేపడుతున్నారు. తక్కువ స్థలంలో ఎక్కువ నిర్మాణాల కోసం హై రైజ్డ్ భవనాలు వెలుస్తున్నాయి. గతంలో ఐదు అంతస్థుల కంటే ఎక్కువ కట్టడానికి అనుమతులు ఇచ్చేవారు కాదు. ఇప్పుడు 30 అంతస్థుల భవనాలు వచ్చేశాయి. దీంతో సప్లయ్ పెరిగింది. ఆ మేరకు కొనుగోళ్లు లేవు. దాంతో ఇన్వెంటరీ పెరిగిపోయింది.

పరిష్కార మార్గాలు

- స్థిరాస్తి రంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలి
- పన్నుల భారం తగ్గించాలి, కొన్నాళ్ల భూముల విలువ పెంచకుండా సంయమనం పాటించాలి
- స్టీల్, సిమెంట్ ధరలు అడ్డగోలుగా పెంచకుండా నియంత్రణ విధించాలి
- ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు
- మాస్టర్‌ప్లాన్‌తో రహదారులు నిర్మించి, వాటిని అవుటర్ రింగ్ రోడ్లతో అనుసంధానం చేయాలి. దీని వల్ల శివారు ప్రాంతాలకు కనెక్టివిటీ పెరుగుతుంది
- రవాణా సదుపాయం కల్పిస్తే శివారు ప్రాంత భూములకు డిమాండ్ పెరుగుతుంది. తక్కువ ధరకు ఇళ్లస్థలాలు లభిస్తాయి

ఇటువంటి చర్యలు ఇంకా అనేకం చేపట్టాలని మార్కెట్ వర్గాలు కోరుతున్నాయి.

-విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి)

సామాన్యులు కొనే పరిస్థితి లేదు

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సామాన్యుల ఆదాయం పెరగలేదు. ప్రభుత్వ ఉద్యోగులు, కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల ఆదాయం మాత్రమే పెరిగింది. వారే ఎంత ధరైనా కొనగలుగుతున్నారు. అదైనా ఒక్కసారే. మిగిలిన వారంతా పెద్ద మొత్తాలు పెట్టి ఫ్లాట్లు కొనలేకపోతున్నారు. బ్యాంకులు వారికి అవసరమైనంత రుణం కూడా ఇవ్వడం లేదు. దీంతో ఇప్పుడు అంతా 'అఫర్డబుల్ హౌసింగ్' అంటూ కొత్త పాట ప్రారంభించారు.

కారణాలు అనేకం

- గత పదేళ్లలో భూముల ధర భారీగా పెరిగిపోయింది
- పదేళ్ల క్రితం విశాఖ పరిసర ప్రాంతాల్లో రోడ్డును ఆనుకుని ఉన్న వ్యవసాయ భూమి ఎకరా రూ.50 లక్షలకు లభించేది. ఇపుడు అదే పొలం రూ.5 కోట్లు పలుకుతోంది
- పదేళ్ల క్రితం గజం రూ.2 వేలకు విక్రయించిన ఇంటి స్థలం ఇప్పుడు రూ.40,000కు చేరింది
- నిర్మాణ వ్యయం చుక్కలనంటుతోంది. సిమెంట్, స్టీల్, ఇటుక, ఇసుక ధరలు అనేక రెట్లు పెరిగిపోయాయి
- ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో ఎంత ధర పెట్టినా ఇసుక దొరకడం లేదు
- నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికుల కూలి రేట్లూ పెరిగి పోయాయి. మేస్త్రీకి కొన్ని నగరాల్లో రోజుకు వెయ్యి రూపాయలు చెల్లించాల్సి వస్తోంది
- పెద్ద నోట్ల రద్దు దెబ్బ నుంచి ఇప్పటికీ కొందరు రియల్టర్లు కోలుకోలేదు
- సర్వీసు టాక్స్ స్థానంలో వచ్చిన జీఎస్‌టీని పరిశ్రమ అదనపు భారంగానే భావిస్తోంది
- రిజిస్ట్రేషన్ల శాఖ స్టాంప్ డ్యూటీని పెంచింది. ప్రతి ఏడాది మార్కెట్ విలువలు సవరిస్తూ బూమ్‌తో సమానంగా రేట్లు పెంచుకుంటూ పోతోంది. కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ విలువ కంటే తక్కువ ధరకే భూమి లభిస్తోంది.

నిర్వహణతోనే భవనాలకు

విలువ

ఆదమరిస్తే అసలుకే ముప్పు

ఇల్లు లేదా ఫ్లాట్ కొనగానే సరిపోదు. వాటి నిర్వహణా సక్రమంగా ఉండాలి. నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం చూపినా, నాణ్యత దెబ్బతిని వాటి విలువా పడిపోతుంది. ఒక్కోసారి భవనం అస్తిత్వానికే ముప్పు ఏర్పడవచ్చు. అపార్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ కాలనీలకూ ఇది వర్తిస్తుంది. సరైన నిర్వహణ లేకపోతే అపార్ట్‌మెంట్ల మన్నికా దెబ్బతింటుంది. సరిగ్గా కట్టిన ఏ అపార్ట్‌మెంట్ భవనాలైనా, మంచి నిర్వహణ ఉంటే 40 సంవత్సరాల పాటు ఎలాంటి ఢోకా లేకుండా ఉంటాయి. నిర్వహణ సరిగా లేకపోతే 20 ఏళ్లకే పెచ్చులూడి అపార్ట్‌మెంట్ విలువ పడిపోతుంది. గేటెడ్ కమ్యూనిటీ కాలనీల నిర్వహణ కూడా సక్రమంగా ఉండాలి. లేకపోతే కాలనీలోని విల్లాలకు విలువ ఉండదు. ఈ కాలనీల్లో పిల్లలు, పెద్దలకు, ప్రత్యేకంగా పార్కులు, ఆటస్థలాలు, స్విమ్మింగ్ పూల్, జిమ్ వంటి ఆధునిక సదుపాయాలు కల్పించగానే సరిపోదు. వాటిని పక్కగా నిర్వహించే సామర్థ్యముండాలి. అప్పుడే వాటి విలువ రెట్టింపు అవుతుంది.

నిర్వహణ ఇలా

- అపార్ట్‌మెంట్‌వాసులు / గేటెడ్ కమ్యూనిటీవాసులు ఐక్యంగా ఉండాలి. ఇందు కోసం కమిటీలను ఏర్పాటు చేసుకోవాలి
- ప్రతి నెలా అపార్ట్‌మెంట్ / గేటెడ్ కమ్యూనిటీ కాలనీ నిర్వహణ ఖర్చులను రాస్తూ పారదర్శకంగా ఉండాలి
- అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ల యజమానులందరూ స్నేహపూర్వకంగా మెలగాలి
- కామన్ ఖర్చులను అపార్ట్‌మెంట్ లేదా గేటెడ్ కమ్యూనిటీ కాలనీలోని ప్రతి ఇంటి, ఫ్లాట్ యజమాని భరించాలి
- పటిష్టమైన సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవాలి
- అపార్ట్‌మెంట్లకు మన్నికైన పెయింటింగ్ వేయించాలి
- అపార్ట్‌మెంట్లకు చిన్న చిన్న మరమ్మతులు వస్తే నిర్లక్ష్యం చేయకూడదు. లేకపోతే మున్ముందు అపార్ట్‌మెంట్ మరింత దెబ్బతింటుంది
- అపార్ట్‌మెంట్లలో పగుళ్లకు దారితీసే మొక్కలను వెంటనే తొలగించి ప్లాస్టింగ్ చేయించాలి
- విద్యుత్, డ్రైనేజీ, మంచినీటి సరఫరా, లిఫ్ట్ వంటి మౌలిక వసతుల నిర్వహణకు ప్రత్యేక సిబ్బంది ఉండాలి
- అపార్ట్‌మెంట్‌తో పాటు పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి
- ఏమైనా రిపేర్లు వస్తే నాణ్యమైన వస్తువులనే ఉపయోగించాలి
- నిర్వహణ తీరును బట్టే అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లోని ఫ్లాట్ల విలువ ఆధారపడి ఉంటుంది
- అపార్ట్‌మెంట్లు గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లో తప్పనిసరిగా అగ్ని ప్రమాదాల నివారణ పరికరాలుండాలి.

-హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

పెరుగుతున్న ప్రీ ఇంజనీరింగ్

బిల్డింగ్ నిర్మాణాలు

- సమయంతో పాటు డబ్బు ఆదా
- 80 శాతంపైగా తరలింపునకు అవకాశం

గుంటూరు, కృష్ణా జిల్లాలో గత 15 సంవత్సరాల నుంచి ప్రీ ఇంజనీరింగ్ బిల్డింగ్ నిర్మాణాలు అందుబాటులో ఉన్నాయి. అయితే గత రెండేళ్ల నుంచే ఈ తరహా నిర్మాణాలు ఊపందుకున్నాయి. సాధారణ భవన నిర్మాణంతో పోలిస్తే ఈ తరహా భవనాల నిర్మాణ ఖర్చు తక్కువ. నెల రోజుల్లోనే నిర్మాణం పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తేవచ్చు. ఒక వేళ భవనాన్ని పడగొట్టి మరోచోటికి మార్చుకోదలిస్తే, 80 శాతానికిపైగా నిర్మాణ సామాగ్రిని తిరిగి వినియోగించుకోవచ్చు. నిర్మాణ సంస్థలు ప్రీ ఇంజనీరింగ్ భవనాలకు 20 సంవత్సరాలకుపైగా హామీ ఇస్తున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో ఈ తరహా భవనాల నిర్మాణాలు ఊపందుకున్నాయి.

అద్దె స్థలాల్లో ఎక్కువ

స్థలం అద్దెకు తీసుకొని కొన్నేళ్ల పాటు వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే చోట కంపెనీలు ఇటువంటి నిర్మాణాలు చేస్తున్నాయి. అవకాశం ఉన్నంత కాలం వ్యాపారం చేసుకుని, మరోచోటికి మారాల్సి వచ్చినప్పుడు మరోచోటికి పోతాయి. అప్పుడు కూడా ఈ భవనాల నిర్మాణంలో వాడిన సామాగ్రిలో 80 శాతానికిపైగా మరలా పనికొస్తాయి. నిజానికి 1960 నుంచి ఈ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంది. అయితే అల్యూమినియం, క్రోమియం మెటల్స్ వాడటం విరివిగా అందుబాటులోకి వచ్చిన తర్వాతే వీటిపై ఆసక్తి పెరిగింది. నగరాల్లో గిడ్డంగులు, ఇండోర్ కోర్టులను ఎక్కువగా ప్రీ ఇంజనీరింగ్ టెక్నాలజీతోనే నిర్మిస్తున్నారు. పెద్ద గిడ్డంగులకే పరిమితం కాకుండా 200 నుంచి 400 గజాలలోపు స్థలంలో కూడా కంపెనీలు ఈ తరహా భవనాలు నిర్మిస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వం తొలగించిన ప్రజావేదిక కూడా ఈ తరహాలో నిర్మించిందే. నాగార్జున యూనివర్సిటీ సమీపంలో ఇటీవల ప్రకృతి వ్యవసాయంపై జరిగిన సదస్సుకు అవసరమైన నిర్మాణాల్ని ప్రభుత్వం ఈ తరహాలోనే పూర్తి చేసింది.

-గుంటూరు(ఆంధ్రజ్యోతి)

చదరపు అడుగుకు రూ.20

ప్రస్తుతం అనేక కంపెనీలు ప్రీ ఇంజనీరింగ్ భవనాలు నిర్మిస్తున్నాయి. స్థలం చూపిస్తే వంద అడుగుల ఎత్తు వరకు అవసరమైన నిర్మాణం ఈ పరిజ్ఞానంతో నిర్మించవచ్చు. ఇందుకోసం చదరపు అడుగుకు అయ్యే ఖర్చు రూ.20 మాత్రమే. కంప్యూటర్‌పై కచ్చితమైన కొలతలతో దీనికి సంబంధించిన పనిముట్లను తయారు చేస్తారు. పోస్టులకు వాడే ఉక్కు కడ్డీలు, అల్యూమినియం, క్రోమియం మిక్సింగ్ మెటల్‌తో తేలికగా ఉండే సపోర్టింగ్ రాడ్స్, అల్యూమినియం షీట్లు కలిపి ఒకేసారి కొలతలు ఇస్తారు. దీని ప్రకారం కంపెనీలోనే నిర్మించభోయే భవనం తాలూకు అన్ని విడిభాగాలు 15-20 రోజుల్లో తయారవుతాయి. మరో 15 రోజుల్లో అనుకున్న స్థలంలో నిర్మిస్తున్నారు.

'రెరా' ఆమోదం ఉంటేనే స్థిరాస్తులు కొనాలి

ఆంధ్ర ప్రదేశ్‌లో 'రెరా' చట్టం అమలులోకి వచ్చి రెండేళ్లయింది. అయినా ఇప్పటికే అనేక స్థిరాస్తి వెంచర్లు ఈ చట్టం కింద నమోదు కాలేదు. చాలా మంది వ్యాపారులు రెరా రిజిస్ట్రేషన్ నెంబర్ లేకుండానే అమ్మకాలు సాగిస్తున్నారు. ఇలాంటి వెంచర్లలో స్థిరాస్తులు కొంటే వచ్చే నష్టాలేంటో తెలుసుకుందాం.

స్థానిక సంస్థల అనుమతులూ అవసరమే.. లేకపోతే పెట్టుబడులు బూడిదలో పోసిన పన్నీరే

అపార్ట్‌మెంట్, ఇంటి స్థలం, దుకాణం.. ఇలా ఎలాంటి స్థిరాస్తిని కొనుగోలు చేయాలన్నా అవి ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (ఏపీ రెరా) దగ్గర నమోదయ్యాయో లేదో తెలుసుకోవాలి. నమోదైతేనే ఆ ఆస్తుల్ని కొనుగోలు చేయాలి. స్థిరాస్తులకు సంబంధిత స్థానిక సంస్థలు లేదా పట్టణాభివృద్ధి సంస్థలు ఇచ్చిన అనుమతులు మాత్రమే చాలవు. అవి 'రెరా' వద్ద నమోదవడం తప్పనిసరన్న అంశాన్ని గుర్తుంచుకోవాలి. రెరాలో నమోదు కాకపోతే ఆ ఆస్తుల కొనుగోలుకు గుడ్‌బై చెప్పడం మంచిది. లేకపోతే వాటి కొనుగోలు కోసం చేసిన ఖర్చంతా బూడిదలో పోసిన పన్నీరవుతుంది.

AP RERA
Andhra Pradesh Real Estate Regulatory Authority

'రెరా' ప్రయోజనాలు

స్థిరాస్తి రంగంలో చోటు చేసుకునే మోసాలు, అవకతవకలకు చెక్ పెట్టేందుకు రెండేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం రెరా చట్టం తీసుకొచ్చింది. ఆ తర్వాత ఏపీ, తెలంగాణతో పాటు దాదాపు అన్ని రాష్ట్రాలు ఆ చట్టం ప్రాతిపదికపై తమ సొంత రెరా చట్టాలు అమల్లోకి తెచ్చాయి. ఈ చట్టంతో బిల్డర్ల ఆగడాలకు చెక్ పెట్టే అవకాశం ఏర్పడింది.

ఈ చట్టం ముఖ్య ప్రయోజనాలు

- ప్రతి స్థిరాస్తి వ్యవహారం పూర్తి పారదర్శకంగా జరుగుతుంది
- కొనుగోలుదారులు చెల్లించే నగదును, రియల్టర్లు తమకు నచ్చినట్టు వాడుకోవడం లేదా వేరే ప్రాజెక్టులకు మళ్లించేందుకు అవకాశం లేదు
- బిల్డర్లు ఆయా ప్రాజెక్టులను నిర్దిష్ట కాలవ్యవధి లోగా నిర్ణీత ప్రమాణాలతో పూర్తి చేయాలి
- ఫ్లాట్లు లేదా ప్లాట్లు కొనుగోలుదారులకు సక్రమంగా అందుతాయి
- ప్రతి రియల్టీ ప్రాజెక్టును ముందుగానే అన్ని వివరాలతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి
- రెరా రిజిస్ట్రేషన్ నెంబర్ లేకుండా ఇళ్ల స్థలాలు, ఫ్లాట్లు, భవనాలు ఇత్యాది ఎటువంటి స్థిరాస్తుల అమ్మకాలు చేయకూడదు. ప్రచారాన్నీ అనుమతించరు
- ఈ నిబంధనలు ఉల్లంఘించే స్థిరాస్తి సంస్థలు లేదా వ్యక్తులపై భారీ జరిమానా విధిస్తారు
- నిబంధనలకు లోబడి, సజావుగా తమ కార్యకలాపాలను నిర్వర్తించే రియల్టర్లకు 'రెరా' చట్టం రక్షణ కల్పిస్తుంది
- రెరా వద్ద నమోదైన ప్రాజెక్టుల్లో ప్రమోటర్లు, బిల్డర్లు, కొనుగోలుదారుల మధ్య ఏమైనా అంశాల్లో విభేదాలు తలెత్తితే, వాటిని సామరస్యంగా పరిష్కరించేందుకూ రెరా కృషి చేస్తుంది.

ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని రెరా దగ్గర నమోదైన వెంచర్లు, ప్రాజెక్టుల్లో మాత్రమే స్థిరాస్తులను కొనుగోలు చేయాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు సూచిస్తున్నాయి.

నామమాత్రంగానే ఆచరణ

రెరా చట్టం పకడ్బందీగానే ఉన్నా ఇప్పటికీ స్థిరాస్తుల కొనుగోలుదార్లలో చాలా మందికి ఈ చట్టంపై సరైన అవగాహన లేదు. దీనికి తోడు రాష్ట్రంలోని రియల్టర్లలో ఎక్కువ మంది ఇప్పటికీ తమ వెంచర్లను రెరా కింద నమోదు చేయలేదు. దీంతో రియల్టర్లకు పెద్దగా నష్టం లేదు. అయితే ఆ వెంచర్లలో స్థిరాస్తులు కొనుగోలు చేసిన వారికి మాత్రం కడగండ్లు తప్పవు. తాము కొనుగోలు చేసిన అపార్ట్‌మెంట్లను వాటి బిల్డర్లు, ప్రమోటర్లు సకాలంలో, అనుకున్న విధంగా పూర్తి చేయకపోయినా లేక ఇళ్ల స్థలాలు కొన్న వెంచర్లలో నిర్ణీత ప్రమాణాల ప్రకారం మౌలిక వసతులు కల్పించకున్నా, కామన్ సైట్లను వదలకున్నా నష్టపోయేది కొనుగోలుదారులే.

రాజధాని సమీపంలోనూ

రాజధానిగా అమరావతిని ప్రకటించిన తర్వాత దాని చుట్టుపక్కల కృష్ణా, గుంటూరు జిల్లాల్లో లెక్కకు మిక్కిలిగా రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలిశాయి. 'క్యాపిటల్ క్రేజ్'ను సొమ్ము చేసుకునే తాపత్రయంలో పలువురు రియల్టర్లు ఇళ్ల స్థలాల వెంచర్లు, అపార్ట్‌మెంట్ల నిర్మాణాన్ని చేపట్టారు. గత రెండేళ్లలో ఇలాంటి వెంచర్ల సంఖ్య మరింత పెరిగింది. వీటిల్లో చాలావాటికి ఏపీసీఆర్డీయే అనుమతులున్నప్పటికీ, 'రెరా' రిజిస్ట్రేషన్ నెంబర్లు లేవు. అయినప్పటికీ ఈ విషయం పెద్దగా పట్టించుకోకుండా, చాలామంది అలాంటి వెంచర్లలో కొనుగోళ్లు జరిపారు.

మిగతా ప్రాంతాల్లో

ఇదే పరిస్థితి రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణాల్లోనూ, వాటికి పరిసరాల్లోనూ ఉంది. అంతా సజావుగా సాగితే ఫర్లేదు అనుకోని పరిణామాలు లేదా రియల్టర్ల లాభాపేక్ష, స్వార్థంతో ఏమైనా ప్రాజెక్టులు అర్ధంతరంగా, అసంపూర్ణంగా ఆగిపోతే వాటిల్లో కొనుగోళ్లు జరిపిన వారు నష్టపోవడం తథ్యం.

-అమరావతి (ఆంధ్రజ్యోతి)

బడ్జెట్‌పై జరిగిన కేబినెట్ భేటీలో మేనిఫెస్టోను చూపుతున్న సీఎం జగన్

రుణమే శరణమా...

'అప్పు అభివృద్ధికి సూచిక... ఇదో సరదా వ్యాఖ్య! సంక్షేమాన్ని సాగిస్తూనే.. అభివృద్ధి సాధించాలంటే అప్పులు చేయక తప్పదు మరి! ఎప్పట్లాగానే కొత్త సర్కారు కూడా 'రుణానుబంధం'పై బాగా ఆధారపడింది. ఇతరత్రా రుణాలు పక్కనపెడితే... బహిరంగ మార్కెట్ నుంచే రూ.41,121 కోట్ల అప్పులు తెచ్చుకోవాలని నిర్ణయించారు. 2018-19లో చంద్రబాబు ప్రభుత్వం ఈ పద్దు కింద రూ.34,757 కోట్లు చూపించింది. దీనిని ఓటాన్ అకౌంట్‌కు 39,478 కోట్లకు పెంచింది. జగన్ సర్కారు ఇంతకుమించి అప్పులకు వెళతామని చెప్పింది.

కొత్త కదా...

ఇది కొత్త ప్రభుత్వం! ఫిబ్రవరిలోనే ఓటాన్ అకౌంట్ ప్రవేశపెట్టిన నేపథ్యంలో... స్థూలమైన అంకెల్లో భారీ తేడాలేవీ బుగ్గన పద్దులో కనిపించలేదు. కేటాయింపుల్లో కొన్ని రంగాలకు ప్రాధాన్యం పెరగడం, తగ్గడం కనిపించింది. ఓటాన్ అకౌంట్‌తో పోల్చితే పూర్తిస్థాయి బడ్జెట్ రూ.1797 కోట్లు ఎక్కువగా ఉంది. ఈ రెండు బడ్జెట్లలోనూ రెవెన్యూ వ్యయం దాదాపు సమానం. పన్ను ఆదాయం, కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో రావాల్సిన నిధులు కూడా అటూ ఇటూగా ఒక్కటే. మార్కెట్ రుణాలు ఓటాన్ అకౌంట్‌కంటే పూర్తిస్థాయి బడ్జెట్‌లో రూ.1643 కోట్ల మేర పెంచారు. ఈ ఆర్థిక సంవత్సరం ఓపెనింగ్ బ్యాలెన్స్, క్లోజింగ్ బ్యాలెన్స్ రెండు చోట్లా ఒక్కటే అంకె చూపించడం మరో విశేషం.

మోదీ కరుణిస్తాడని..!

2.28 లక్షల కోట్లతో జగన్ తొలి పద్దు

కేంద్ర సాయం, రుణాలు, పన్నులే ఆలంబన

- మోదీ రూ.61వేల కోట్లు ఇస్తారని అంచనా
- తేడా వస్తే... లెక్కలు ముక్కలే
- బాబు సర్కారులాగే అంకెల విన్యాసాలు
- ఇదీ జగన్ సర్కారు తొలి బడ్జెట్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఘనమైన బడ్జెట్...
ఘనమైన కేటాయింపులు...
సకల వర్గాలకు సంక్షేమ రాగాలు..
నిధులతో జిగేల్‌మనే నవ రత్నాలు...
ఆహా అనిపించేలా 2,27,974 కోట్ల రూకల బడ్జెట్ ఇది!
కొత్త ప్రభుత్వం తనదైన శైలిలో, తమ ప్రాధాన్యాల మేరకు కూర్చిన పద్దు ఇది!

అంతా బాగుంది! కానీ... కొత్త సర్కారు కూడా పాత పద్ధతిలోనే నడిచింది. కరువు కాలంలో ఖజానా అనే ఖాళీ బిందెను పట్టుకుని.. కేంద్రమనే మేఘం కరుణిస్తుందని, నిధుల చినుకులు కురిపిస్తుందనే (అతి) ఆశతో లెక్కలు వేసింది. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు స్వల్పమే అనే వాస్తవాన్ని విస్మరించి విన్యాసాలు చేసింది. రావని తెలిసీ పద్దుల్లో ఆ లెక్కలు పోగేసుకుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే.... మొన్నటి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో చంద్రబాబు ప్రభుత్వం చేసిందే, ఇప్పుడు పూర్తిస్థాయి బడ్జెట్‌లో జగన్ సర్కారు కూడా చేసింది. సుమారు 2.28 లక్షల కోట్ల బడ్జెట్ బండికి ఒక ఇరుసు.. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు! రెండో ఇరుసు.. బహిరంగ మార్కెట్ నుంచి, ఇతర మార్గాల నుంచి సేకరించే రుణం! దీంతోపాటు.. పన్ను ఆదాయంపైనా సర్కారు పెద్ద ఆశలే పెట్టుకుందని పద్దులు చూస్తే అర్థమవుతుంది.

పన్నులు పెరిగేనా!?

రాష్ట్ర ప్రజల నుంచి వివిధ పన్నుల రూపంలో 75,437 కోట్ల రూపాయలు వస్తాయని బడ్జెట్‌లో అంచనా వేశారు. 2018-19 సవరించిన అంచనాతో పోల్చితే ఇది ఏకంగా 17 వేల కోట్లు అదనం! పన్ను ఆదాయం ఎలా పెరుగుతుంది? ఉన్న పన్నులు పెంచుతారా, లేక కొత్త పన్నులు వేస్తారా? ఇదేదీ లేకపోతే.. ఎగవేతలన్నవే లేకుండా పక్కాగా వసూళ్లు చేస్తారా? అదీ కాకపోతే.. పన్ను ఆదాయానికి సంబంధించిన లావాదేవీలు పెరుగుతాయని భావిస్తున్నారా? ఈ ప్రశ్నలకు సమాధానం కోసం వేచి చూడాల్సిందే! పాత పద్దును చూస్తే మాత్రం.. పన్ను ఆదాయం ఈ స్థాయిలో ఉండటం కష్టమనే చెప్పవచ్చు. గత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాల్లో పన్నుల రూపంలో ప్రజల నుంచి రూ.65,535 కోట్ల ఆదాయం వస్తుందని చంద్రబాబు సర్కారు అంచనా వేసింది. సవరించిన అంచనాల్లో పన్ను ఆదాయం రూ.58,125 కోట్లకు పరిమితమైంది. ఇప్పుడు.. దీనిని దాదాపు 17వేల కోట్లు పెంచి.. ఏకంగా రూ.75,437 కోట్లు వస్తుందని అంచనా వేశారు.

మోదీ దయ చూపాలి...

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ లెక్కలు ముక్కలు కాకుండా ఉండాలంటే.. నవ్యాంధ్రపై ప్రధాని మోదీ ధారాళంగా నిధులు కురిపించాలి. ఎందుకంటే.. కేంద్రం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ (తిరిగి చెల్లించాల్సిన అవసరం లేని నిధులు) రూపంలో ఏకంగా 61,071 కోట్లు వస్తాయని చూపించారు. ఈ విషయంలో చంద్రబాబు సర్కారుదీ అదే తీరు! ఫిబ్రవరిలో పెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కేంద్ర గ్రాంటుగా రూ.60,721 కోట్లు చూపించారు. 2018-19 అంచనాలు, వాస్తవ పరిస్థితిని చూస్తే.. ఇది బాగా వాస్తవ దూరం! అప్పట్లో 50,695 కోట్లు కేంద్ర గ్రాంటుగా వస్తాయని అంచనా వేశారు. చివరికి.. వచ్చింది 19,456 కోట్లు మాత్రమే సవరించిన అంచనాల్లో తెలిపారు. అంటే.. 30వేల కోట్లు లోటు! ఈ లెక్కన తాజా బడ్జెట్ లెక్కల్లో ఈ ఒక్క పద్దు కిందే రూ.40వేలకోట్లు తేడా కొడుతుంది!కేంద్రంతో సత్సంబంధాలు నెరపుతున్న నేపథ్యంలో.. మోదీని మంచి చేసుకుని భారీగా గ్రాంట్లు సాధించుకోవచ్చునని ధీమాయే ఈ అంకె రంకెకు కారణం కావొచ్చు. అయితే... మోదీ సర్కారు ఏపీకి ఇస్తున్న ప్రాధాన్యమేమిటో ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లోనే తేలిపోయింది.

19.82 శాతం పెరిగింది

అత్యధికంగా 'రెవెన్యూ' 128 శాతం

ఐటీ బడ్జెట్‌లో సగం కోత

గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఈసారి బడ్జెట్ పరిమాణం 19.82 శాతం పెరిగింది. 2018-19లో రూ.1.91 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టగా 2019-20 పూర్తిస్థాయి బడ్జెట్‌ను రూ.2.27 లక్షల కోట్లతో రూపొందించారు. ఈసారి అత్యధికంగా రెవెన్యూ శాఖ బడ్జెట్ 128 శాతం మేర, వ్యవసాయ రంగానికి 81 శాతం, ఇంధన రంగానికి 63 శాతం మేర బడ్జెట్ పెరిగింది. ఐటీ బడ్జెట్ 54 శాతం మేర తగ్గించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ బడ్జెట్ 10 శాతం, నైపుణ్యాభివృద్ధి శాఖ బడ్జెట్ 29 శాతం, సాంఘిక సంక్షేమ శాఖ బడ్జెట్ 7.6 శాతం, జలవనరుల శాఖ బడ్జెట్ 22 శాతం తగ్గించారు.

● ఎంతెంత తేడా!

సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు చేసిన కేటాయింపుల మేరకు నిధులు రావాలంటే... రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన స్థాయిలో మోదీ సర్కారు గ్రాంట్లు ఇవ్వాలి. పన్నుల ఆదాయం బాగా పెరగాలి. ఆశించిన మేరకు బహిరంగ మార్కెట్ నుంచి అప్పులు సేకరించాలి. ఏ విధంగా చూసినా... కేంద్ర గ్రాంట్ల రూపంలోనే రూ.40 వేల కోట్లకు పైగానే 'తేడా' కనిపించే అవకాశముంది. పన్నుల ఆదాయం రూ.17 వేల కోట్లు పెరగడంపై అధికారుల్లోనే అనుమానాలున్నాయి. బహిరంగ మార్కెట్‌లో రుణ సమీకరణ... సర్కారు సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది!

● తెలిసీ పెంచారా

బడ్జెట్‌పై కసరత్తులో భాగంగా కొన్ని రోజుల కిందట ఆర్థిక శాఖ అధికారులు రాష్ట్ర ఆదాయ వనరులపై అంచనాతో ముఖ్యమంత్రికి ఒక నివేదిక ఇచ్చారు. దీని ప్రకారం రూ.1.85 లక్షల కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనా. తీరా బడ్జెట్ ప్రవేశ పెట్టేసరికి ఇది 42,671 కోట్లు పెరిగి... 2.24 లక్షల కోట్లకు చేరుకుంది. ఆదాయంపై అధికారుల తొలి అంచనా చెప్పింది, తాజా బడ్జెట్‌లో చూపింది ఇది...

ఆదాయ వనరులు	వాస్తవిక ఆదాయం రూ.కోట్లలో	బడ్జెట్‌లో వేసిన ఆదాయం రూ.కోట్లలో
రాష్ట్రంలో పన్ను ఆదాయం	69846	75437
పన్నేతర ఆదాయం	5216	7354
కేంద్ర పన్నుల్లో రాష్ట్రం వాటా	34833	34833
కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు	28117	61071
మార్కెట్ రుణాలు	45079	41121
లోన్లు	456	2500
పబ్లిక్ అకౌంట్ నెట్	1756	1800
మొత్తం	185303	224116

'అమ్మ ఒడి' ఒకరికే

- కుటుంబంలో పిల్లలెందరున్నా తల్లికే..
- బడ్జెట్‌లో 6455.80 కోట్లు కేటాయింపు
- ఒకటి నుంచి పది, ఇంటర్ కలుపుకొని 43 లక్షలమందికి రూ.15వేలు చొప్పున
- తెల్ల రేషన్ కార్డు ఉండటం తప్పనిసరి

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నవరత్నాల్లో ఒకటైన 'అమ్మఒడి' పథకం కోసం బడ్జెట్‌లో రూ.6455.80 కోట్లు కేటాయించారు. ఇందులో ఒకటి నుంచి పదోతరగతి వరకు పిల్లలకు రూ.5,595 కోట్లు, ఇంటర్ విద్యార్థులు రూ.860 కోట్లు అందజేస్తారు. ఒక కుటుంబంలో చదివే పిల్లలు ఎందరున్నా, తల్లికి మాత్రమే ఈ పథకం లబ్ధిని అందిస్తామని శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. 'ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న పిల్లల తల్లులకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో రూ.15వేల ఆర్థిక సాయం అందిస్తాం' అని వెల్లడించింది. 'అమ్మ ఒడి' పథకాన్ని ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న పిల్లలకు వర్తింపజేయాలని సర్కారు తొలుత భావించింది. అయితే ఆ తర్వాత ఇంటర్మీడియెట్ వరకు ఈ పథకాన్ని విస్తరించాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు దాదాపు 70 లక్షల మంది, రెండేళ్ల ఇంటర్మీడియెట్ కోర్సును సుమారు 10లక్షలమంది చదువుతున్నారు. అయితే వీరిలో దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలు, అంటే తెల్లరేషన్ కార్డు కలిగి ఉండటం, ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటున్నప్పటికీ తల్లికే లబ్ధి చేకూర్చేలా ఈ పథకం నిబంధనలను రూపొందించారు. ఈ రెండు అంశాలను ప్రాతిపదికగా తీసుకుంటే 'అమ్మ ఒడి' పథకం కింద దాదాపు 43లక్షల మంది అర్హులు ఉన్నట్లు విద్యాశాఖ గుర్తించింది. ఇందులో 1 నుంచి పదో తరగతుల పిల్లలు 37.30లక్షల మంది కాగా, మిగిలిన 5.73లక్షల మంది ఇంటర్మీడియెట్ విద్యార్థులు. వీరందరికీ ప్రస్తుత విద్యా సంవత్సరంలో వచ్చే జనవరి 26న 'అమ్మ ఒడి' పథకం కింద రూ.15వేల చొప్పున అందించనున్నారు. ఐ.టి.ఐ, పాలిటెక్నిక్ కోర్సులు చదువుకునేవారికి కూడా 'అమ్మ ఒడి' పథకాన్ని వర్తింపజేయాలన్న డిమాండ్లు వచ్చాయి. కానీ ఆ విషయం బడ్జెట్‌లో ప్రస్తావించలేదు.

గృహనిర్మాణానికి 5 వేల కోట్లు

- పేదల ఇంటిస్థలం కోసం భూసేకరణ

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఉగాది నాటికి పేదలకు ఇంటిస్థలం కేటాయించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని కార్యరూపంలోకి తీసుకొచ్చేందుకు ముందడుగు పడింది. ఇంటిస్థలం కోసం భారీగా భూసేకరణకు రూ.5 వేల కోట్లను బడ్జెట్‌లో ప్రతిపాదించారు. వైఎస్సార్ గృహనిర్మాణ పథకం కింద ఈ మొత్తాన్ని రెవెన్యూ శాఖ పద్దులో చేర్చారు. భూసేకరణ చేయాల్సింది రెవెన్యూశాఖనే కాబట్టి ఇందులో ప్రతిపాదించారు. జిల్లా కలెక్టర్ల సదస్సులో ఇళ్లస్థలాల భూసేకరణపై రెవెన్యూశాఖ సీఎం జగన్‌కు ప్రతిపాదనలు సమర్పించింది. ప్రభుత్వం వద్ద 4,500 ఎకరాలే ఉన్నాయని, ప్రైవేటుగా 12వేల ఎకరాలపైనే సేకరించాల్సి ఉందని నివేదించారు. భూసేకరణ కోసం రూ.6,500 కోట్లపైనే ఖర్చవుతుందని అంచనా వేశారు. పేద ప్రజలకు సొంతింటి కల తీర్చడానికి ఎంత ఖర్చయినా పెడుతామని సీఎం ఆ భేటీలో స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగానే ప్రైవేటుగా భూసేకరణ కోసం రూ.5,000 కోట్లు కేటాయించారు. కాగా.. ప్రొటోకాల్ ఖర్చుల కోసం రూ.17.25 కోట్లను కేటాయించారు. దీంతో ఆ భారం ఇక రెవెన్యూ అధికారులు, తహశీల్దార్లపై పడదు. తహశీల్దార్లకు వాహనాలు సమకూర్చేందుకు బడ్జెట్‌లో రూ.19 61 కోట్లు కేటాయించారు.

మహిళా శిశు సంక్షేమానికి 2,556 కోట్లు

బడ్జెట్‌లో మహిళా శిశు సంక్షేమ రంగానికి రూ.2,556.45 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం శిశువులకు అందజేస్తున్న పోషకాహారాన్ని ఇప్పటివరకూ బాలామృతం పేరుతో అందిస్తుండగా.. తాజాగా దాని పేరు వైఎస్సార్ అమృత హస్తంగా మార్చారు. బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.106.91 కోట్లు కేటాయించారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు అందజేస్తున్న గౌరవ వేతనాన్ని రూ.వెయ్యి పెంచిన ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు 1430.28 కోట్లను ప్రతిపాదించారు. ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి రూ.107 కోట్లు కేటాయించారు.

విద్యకు పెరిగిన బడ్జెట్

రూ. 32,618.46 కోట్లు కేటాయింపు

గతేడాదికన్నా 34.87% పెంపు

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): 2019-20 వార్షిక బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రాధాన్యత లభించింది. సాధారణ విద్యకు రూ.32,618.46 కోట్లు కేటాయించింది. 2018-19తో పోలిస్తే దాదాపు 34.87% మేర కేటాయింపులు పెరిగాయి. గత ప్రభుత్వం 2018-19 వార్షిక బడ్జెట్‌లో రూ.24,185.75 కోట్లు కేటాయించగా, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం 2019-20 బడ్జెట్‌లో రూ.32,618.46 కోట్లను కేటాయించింది. అంటే తాజా బడ్జెట్‌లో రూ.8,433.71 కోట్ల మేర కేటాయింపులు పెంచారు. 2019-20 వార్షిక బడ్జెట్‌లో .. ఉన్నత విద్యకు రూ.3,021.63 కోట్లు, సాంకేతిక విద్యకు రూ.580.28 కోట్లు కేటాయించారు. ఈసారి పలు కొత్త పథకాలను అమలు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆ మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచింది.

కేటాయింపుల్లో కీలక అంశాలు

- 'అమ్మ ఒడి' పథకానికి రూ.6455.80 కోట్లు. 43 లక్షల మంది తల్లులకు లబ్ధి.
- పాఠశాలల మౌలిక సదుపాయాలకి రూ.1500 కోట్లు.
- మధ్యాహ్న భోజన పథకానికి రూ.1077 కోట్లు.
- పాఠశాలల నిర్వహణ గ్రాంట్ రూ.160 కోట్లు.
- 'జగనన్న విద్యా దీవెన' కింద విద్యార్థులకు 100% ఫీజు రీయింబర్స్‌మెంట్.
- ఆహారం, ప్రయాణం, హాస్టల్, పుస్తకాలకు ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.20 వేలు. దీనికి రూ.4962.3 కోట్లు కేటాయింపు. 15.5 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం.
- మధ్యాహ్న భోజనం తయారీకి కేంద్రీకృత వంట గదుల ఏర్పాటుకు రూ.100 కోట్లు.



ఆరోగ్యానికి అందలం

ప్రజారోగ్యానికి 11,399 కోట్లు

- గతేడాది కంటే 34% పెంపు
- ఆస్పత్రి వసతికి 1500 కోట్లు
- ఆశాల కోసం రూ.455 కోట్లు

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య వ్యవస్థకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం.. తాజా బడ్జెట్‌లో ఆరోగ్యశాఖకు రికార్డు స్థాయిలో 11,399 కోట్లను కేటాయించింది. గతేడాదితో పోల్చితే రూ.2,936 కోట్లు (34%) పెంచింది. గత ప్రభుత్వం 2018-19 బడ్జెట్‌లో ఆరోగ్యశాఖకు రూ.8,463 కోట్లు కేటాయించింది. తర్వాత రూ.7,227 కోట్లుగా సవరించింది. వైసీపీ ప్రభుత్వం 2019-20లో 108 అంబులెన్సులు, 104 వాహనాల పెంపు, కొత్త మెడికల్ కాలేజీలకు భారీగా కేటాయించింది. ఈ శాఖలో ఉన్న మూడు కీలక విభాగాలకు కనీసంగా మూడు వేల కోట్ల చొప్పున కేటాయించింది. ప్రభుత్వాస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.1500 కోట్లు ప్రతిపాదించింది. కొత్తగా ఏర్పాటు చేయనున్న వైఎస్సార్ ట్రైబల్ మెడికల్ కాలేజీ నిర్మాణానికి రూ.66 కోట్లు, గుంటూరు జిల్లా గురజాలలో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు రూ.66 కోట్లు కేటాయింపులు జరిపింది. విజయనగరంలో మెడికల్ కాలేజీకి రూ.66 కోట్లు ఇవ్వగా.. ఏలూరు వైద్య కళాశాలకు రూపాయి కూడా కేటాయించలేదు.

కర్నూలు స్టేట్ కేన్సర్ సెంటర్‌కు రూ.43.60 కోట్లు, మెడికల్ కాలేజీల్లో పీజీ సీట్లు పెంచేందుకు రూ.40 కోట్లు కేటాయించారు. ఆశా వర్కర్లకు ప్రతి నెలా పది వేలు అందిస్తామని సీఎం జగన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి అనుగుణంగానే బడ్జెట్‌లో ఆశాల జీతాలకు రూ.455.84 కోట్లు కేటాయించారు. ఎన్టీఆర్ బేబీ కిట్స్ పథకం పేరును వైఎస్సార్ బేబీ కిట్ పథకంగా మార్చి రూ.17 కోట్లు ప్రతిపాదించారు. రాష్ట్రంలో ప్రతి మండలానికి ఒక 108 అంబులెన్సు, 104 వాహనాన్ని ఇవ్వాలని ప్రభుత్వం నిశ్చయించింది. ఇందులో భాగంగా 108 అంబులెన్సుల నిర్వహణకు రూ.143.38 కోట్లు, 104 వాహనాల కోసం రూ.179.76 కోట్లు కేటాయించింది. ఆయుష్ కాలేజీ అభివృద్ధికి 51.08 కోట్లు ప్రతిపాదించింది.

'ఆరోగ్యశ్రీ'కి అంతంతే..!

1740 కోట్లలో 480 కోట్లు బకాయిలకే

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ విషయంలో ప్రభుత్వం చెప్పినదానికీ, బడ్జెట్‌లోని కేటాయింపులకూ పొంతన లేదు. ఈ పథకానికి ఆశించిన స్థాయిలో నిధులను కేటాయించలేదు. రూ.1,740 కోట్లతోనే సరిపెట్టింది. 2018-19లో ఈ పథకానికి గత ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించింది. అ నిధులు కూడా సరిపోకపోవడంతో రూ.300 కోట్లు అదనంగా కేటాయించింది. ప్రస్తుత బడ్జెట్‌లో గతేడాది కంటే అదనంగా కేవలం రూ.440 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యశ్రీకి ఈ నిధులు ఏ మూలకు సరిపోవని వైద్య నిపుణులు పెదవి విరుస్తున్నారు. మరోవైపు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ భారీగా అప్పుల్లో ఉంది. ప్రస్తుతం నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.480 కోట్ల వరకూ బకాయిలున్నాయి. వైద్యం ఖర్చు రూ.1000 దాటితే ప్రభుత్వమే భరిస్తుందని, హైదరాబాద్‌తోపాటు బెంగుళూరు, చెన్నై వంటి నగరాల్లో కూడా ఆరోగ్యశ్రీ కార్డు చూపించి ఉచితంగా వైద్యం చేయించుకునే అవకాశం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటనలు చేసింది. ఈ ప్రకటనలు నిజరూపం దాల్చాలంటే కనీసం రూ.3 వేల కోట్లు అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

బడ్జెట్ 2019-20

బడ్జెట్ ప్రసంగంలో సంస్కృత శ్లోకాలు

ప్రముఖుల సూక్తులు వల్లెవేసిన బుగ్గన

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభలో తొలిసారిగా ఆర్థికమంత్రి హోదాలో బడ్జెట్ ప్రవేశపెట్టిన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రముఖుల సూక్తులతో పాటు సంస్కృత శ్లోకాలు చదువుతూ అందరినీ ఆకర్షించారు. తనకున్న సాహిత్యపటిమ, అనుభవాన్ని ఆయన అందులో చూపించారు. ఆద్యంతం తెలుగులోనే మాట్లాడిన బుగ్గన ప్రారంభంలోనే సీఎం జగన్, స్పీకర్ తమ్మినేని సీతారామ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఇచ్చినందుకు జగన్‌కు రుణపడి ఉంటానన్నారు. మూడో అంశంగా దేశ నిర్మాణంలో మనకో పాత్ర ఉండాలంటూ మహాత్మాగాంధీ సూక్తిని ప్రస్తావించారు. బడ్జెట్ స్ఫూర్తి, తన లక్ష్యాన్ని పేర్కొంటూ 'సత్యానికి తప్ప దేనికీ లొంగను' అంటూ మహాత్ముడి మరో కొటేషన్‌ను చదివారు. వైఎస్ఆర్ రైతుభరోసా గొప్పతనాన్ని చాటుతూ బుగ్గన ఓ సంస్కృత శ్లోకాన్ని చదివారు. వైఎస్ఆర్ వడ్డీలేని రుణాల గురించి ప్రస్తావిస్తూ... రైతుకు పంటప్రాణం, పంటకు వాతావరణం ప్రాణం అంటూ ఆరు వాక్యాల కవితను చదివి తన భావాన్ని వ్యక్తీకరించారు. అమ్మఒడి పథకం ప్రాధాన్యతను వివరిస్తూ సరస్వతి నమస్తుభ్యం శ్లోకాన్ని చదివారు. "పక్షులకు ఆకాశమే బలం, చేపలకు నీళ్లేబలం, మరి పిల్లలకు? అమ్మఒడే బలం" అంటూ పథకం గురించి చెప్పుకొచ్చారు. చదువు గొప్పతనం గురించి చెబుతూ "తల్లిలా రక్షిస్తుందట, తండ్రిలా మంచి చేస్తుందట" అంటూ భావయుక్తంగా చెప్పారు. వైఎస్ఆర్ గృహనిర్మాణ పథకం గురించి మాట్లాడే సమయంలో కొన్ని చక్కటి వాక్యాలు చదివారు. "పక్షికి గూడు ఉంటుంది...మృగాలకు గుహలుంటాయి.. చిన్న చీమకూడ పుట్టను ఏర్పాటు చేసుకుంటుంది. ఓ నీడంటూలేని దురదృష్టమైన పరిస్థితి మనిషిదే" అంటూ ఇంటి అవసరం ఎంతముఖ్యమో వివరించారు. నిరుద్యోగులకు కంటితుడుపు భృతి ఇచ్చేకన్నా పని కల్పించడం అవసరమని పేర్కొంటూనే..."పాలు కావాల్సిన వాడికి పాలే ఇవ్వాలి. ఏనుగును ఇస్తే ఉపయోగం ఏమిటి?" అంటూ ప్రశ్నించారు. మహిళా సంక్షేమం, సాధికారత ప్రాధాన్యత చెప్పడానికి డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ చెప్పిన మాటలను గుర్తుచేశారు.

నవరత్న ఖచితం

మా సర్కారుకు ఇవే ప్రధానం.. 'తొలి పద్దు'లో బుగ్గన ప్రకటన

- ఇక 'జగనన్న అమ్మ ఒడి'
- విద్యార్థులకు 'జగనన్న విద్యాదీవెన'
- నేతన్నలకు రూ.24వేలు ఇస్తాం
- డ్వాక్రాలకు వచ్చే ఏడాది నుంచి..
- ఆలయ బోర్డులు, కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 శాతం కోటా
- రూ.2.28 లక్షల కోట్లతో బడ్జెట్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

జగన్ సర్కార్ 'బడ్జెట్ బండి' వచ్చేసింది. రూ.2.28 లక్షల కోట్ల భారీ అంకెలను మోసుకొచ్చింది. 'నవ రత్న' హామీల అమలే లక్ష్యమంటూ కేటాయింపుల లెక్కలు విప్పింది. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ రెడ్డి శుక్రవారం అసెంబ్లీలో తన తొలి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, తమ సర్కారు ప్రాధాన్యాలను వివరిస్తూ, మహనీయుల మాటలను గుర్తుచేస్తూ బడ్జెట్ ప్రసంగం చేశారు. తమ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న నవరత్న హామీల అమలుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సాధారణంగా బడ్జెట్ ప్రసంగాల్లో శాఖలు, పథకాలకు జరిపిన కేటాయింపుల వివరాలుంటాయని... తన ప్రసంగంలో ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పథకాలు, బడ్జెట్‌ను గణనీయంగా పెంచిన పథకాలపై దృష్టి సారించానని చెప్పారు. భారీగా పెట్టుబడులు సాధించామని అప్పటి ప్రభుత్వం చెప్పినప్పటికీ... తీవ్రమైన వ్యవసాయ సంక్షోభం, యువతకు ఉద్యోగాలు లేకపోవడం, మౌలిక సదుపాయాల కొరత, పేదలకు సరైన సహాయం చేయకపోవడం మొదలైన వైఫల్యాలున్నాయని బుగ్గన విమర్శించారు. రెండంకెల వృద్ధి నిజమో, కల్పితమో నిర్ధారించుకోవాల్సి ఉందన్నారు. తమ ప్రభుత్వానికి అత్యంత దయనీయమైన ఆర్థిక పరిస్థితి వారసత్వంగా వచ్చిందని తెలిపారు. "విభజన సమయంలో 1,30,654 కోట్లుగా ఉన్న రుణం... 2018-19 నాటికి రూ.2,58,928 కోట్లకు చేరింది. ఇదికాక, వివిధ సంస్థల ద్వారా దాదాపు రూ.10 వేల కోట్ల రుణం తీసుకుని ప్రభుత్వ ఖర్చు కోసం మళ్లించారు. సుమారు రూ.18 వేల కోట్ల విలువైన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ రుణాలన్నింటితో పాటు ఫిబ్రవరిలో సమర్పించిన 2019-20 ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కింద వాగ్దానాలను నెరవేర్చడానికి రూ.45 వేల కోట్ల వనరుల అంతరం ఉంది' అని తెలిపారు.

వైఎస్ఆర్ రైతు భరోసా...

రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రాధాన్యమని బుగ్గన ప్రకటించారు. జూలై 8-వైఎస్ జయంతిని రైతు దినోత్సవంగా ప్రకటించిందని గుర్తుచేశారు. "ముఖ్యమంత్రి అధ్యక్షతన వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేశాం. వైఎస్ఆర్ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కోసం రూ.1163 కోట్లు కేటాయించాం. దీనివల్ల 60.02 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలుగుతుంది. 2022 నాటికి వ్యవసాయ ఆదాయాలను రెండింతలు పెంచే లక్ష్యాన్ని సాధించేందుకు చర్యలు తీసుకుంటాం. రైతు భరోసాలో భాగంగా ఉచితంగా బోరుబావులను తవ్వేందుకు రూ.200 కోట్లు కేటాయిస్తున్నాం" అని తెలిపారు. కౌలు రైతులను ఆదుకునేందుకు వీలుగా చట్టాలను సవరిస్తామన్నారు. ఎన్ని కష్టాలొచ్చినా వాటిని ఎదుర్కొని తమ బిడ్డలను బాగా చదివించుకోవాలని, వారి జీవితాలను కొత్తగా నిర్మించాలన్న సంకల్పం ఉన్న అమ్మలకు అండగా ఉంటామన్నారు. పాఠశాలలకు పిల్లలను పంపే ప్రతి తల్లికి వచ్చే ఏడాది జనవరి నుంచి ప్రభుత్వం రూ.15 వేలు అందిస్తుందని, ఈ పథకానికి 'జగనన్న అమ్మ ఒడి' అనే పేరు పెట్టామని... ఇందుకు ముఖ్యమంత్రిని బలవంతంగా ఒప్పించాల్సి వచ్చిందని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలతో సమానంగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామన్నారు. "మధ్యాహ్న భోజన పథక ప్రాధాన్యాన్ని గుర్తించాం. కుక్ కం హెల్పర్ గౌరవవేతనాన్ని రూ.1000 నుంచి రూ.3 వేలకు పెంచాం. ఇందుకు బడ్జెట్‌లో రూ.1077 కోట్లు కేటాయిస్తున్నాం. 'జగనన్న విద్యా దీవెన' పథకం ద్వారా అన్ని కులాలకు చెందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తాం. ఆహారం, ప్రయాణం, హాస్టలు, పుస్తకాలు తదితర ఖర్చుల కోసం ప్రతి సంవత్సరం ఒక్కో విద్యార్థికి రూ.20 వేల చొప్పున చెల్లిస్తాం" అని ప్రకటించారు. ఎస్సీ కాంపోనెంట్ కింద రూ.15 వేల కోట్లు, ఎస్టీ కాంపోనెంట్ కింద రూ.4988 కోట్లు కేటాయించామన్నారు. వారికి ఉచిత విద్యుత్ 100 నుంచి 200 యూనిట్లకు పెంచుతున్నామన్నారు. బీసీ కమిషన్‌ను మరింత సమర్థంగా మార్చుతామని తెలిపారు. నాయీ బ్రాహ్మణులకు, రజకులకు, దర్జీలు తమ యంత్రాలు, ఉపకరణాలు ఆధునీకరించేందుకు ఏటా రూ.10 వేలు ఇస్తామన్నారు. ప్రతి చేనేతకారుని కుటుంబానికి రూ.24 వేలు ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఇమామ్‌ల గౌరవ వేతనాన్ని నెలకు రూ.10 వేలు, మౌజమ్‌లకు రూ.5 వేలకు పెంచాలని ప్రతిపాదించామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల రాజకీయ అభ్యున్నతికి వీలుగా... దేవాలయ ట్రస్టు బోర్డులు, మార్కెట్ యార్డు కమిటీలు, కార్పొరేషన్లలో నామినేటెడ్ పోస్టుల విషయంలో 50 శాతం వారికే కేటాయిస్తూ బిల్లు తీసుకొస్తామన్నారు. కాపు సంక్షేమం కోసం రూ.2 వేల కోట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.100కోట్లు కేటాయించామన్నారు.

సాగునీటికి ఇలా...

సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.13,139 కోట్లు కేటాయిస్తున్నట్లు బుగ్గన తెలిపారు. రాజధాని నిర్మాణం కోసం రూ.500 కోట్లు, కడప స్టీల్ ప్లాంట్ కోసం బడ్జెట్‌లో రూ.250 కోట్లు కేటాయించామన్నారు. శాసన మండలిలో ఉపముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.



108, 104 సేవలకు జీవం

వైఎస్ హయాంలో ప్రారంభించిన 108, 104 సేవలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని, వాటికి తిరిగి ప్రాణం పోస్తామని ఆర్థిక మంత్రి తెలిపారు. వార్షికాదాయం రూ.5 లక్షల కంటే తక్కువగా ఉన్న అన్ని కుటుంబాలకు ఆరోగ్యశ్రీ వర్తిస్తుందన్నారు. రూ.1000కు మించి ఖర్చయ్యే వైద్యంపై... పరిమితి లేకుండా అన్ని కేసులకు చికిత్స అందిస్తారన్నారు. రూ.66 కోట్ల వ్యయంతో పాడేరు ప్రాంతంలో గిరిజన వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.రూ.66 కోట్లతో గురజాల వద్ద, విజయనగరంలో వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రూ.50 కోట్ల వ్యయంతో శ్రీకాకుళం జిల్లా పలాసలో కిడ్నీ పరిశోధనా కేంద్రాన్ని, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామన్నారు.

వైఎస్ఆర్ బీమా..

వైఎస్ఆర్ బీమా కింద 18 నుంచి 60 ఏళ్ల లోపు వారికి సహజ మరణానికి కుటుంబానికి రూ.లక్ష, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు అందిస్తామని బుగ్గన ప్రకటించారు. వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా సంఘాలకు వచ్చే ఏడాది నుంచి 4వాయిదాల్లో రూ.27,168 కోట్ల రుణాన్ని మాఫీ చేస్తామన్నారు. గ్రామ, వార్డు వలంటీర్ల సహకారంతో స్వయం ఉపాధి యూనిట్లను 'వైఎస్ఆర్ చేయూత' పథకం ద్వారా పంపిణీ చేస్తామన్నారు. 'వైఎస్ఆర్ పెళ్లికానుక' కింద బీసీలకు రూ.50 వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.ఒక లక్ష అందించనున్నామన్నారు.

ఐదేళ్లలో 25 లక్షల ఇళ్లు...

రాబోయే ఐదేళ్లలో 25 లక్షల గృహాలను నిర్మిస్తామని బుగ్గన ప్రకటించారు. వచ్చే ఏడాది నుంచే నిర్మాణాలు ప్రారంభమవుతాయన్నారు. ముందుగా ఈ ఏడాదిలో ఇల్లు లేనివారికి 25 లక్షల ఇంటి పట్టాలను పంపిణీ చేసేందుకు రూ.8615 కోట్లు కేటాయిస్తున్నామన్నారు. ప్రభుత్వ సేవలు ప్రజల ఇంటి వద్దకే అందాలన్న ఆలోచనతో గ్రామ/వార్డు వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చామని తెలిపారు. ఇంటి వద్దకే సరుకులు అందించే వ్యవస్థ ప్రవేశపెడుతున్నామన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక బృందాల కోసం వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేస్తామన్నారు.

బుగ్గన వారి తొలి పద్దు

వివరం	2017-18	2018-19 (బ.అం)	2018-19 (స.అం)	2019-20 (బ.అం)
1) రెవెన్యూ వసూళ్లు	1,05,062	1,55,507	1,14,684	1,78,697
ఎ)పన్ను ఆదాయం	49,812	65,535	58,125	75,437
బి) పన్నేతర ఆదాయం	3,813	5,346	4,391	7,354
సి) కేంద్ర పన్నుల్లో వాటా	28,674	33,929	32,710	34,833
డి) గ్రాంట్లు	22,760	50,695	19,456	61,071
2) మూలధన వసూళ్లు	41,258	35,552	48,447	49,277
3) మొత్తం వసూళ్లు	1,46,320	1,91,059	1,63,132	2,27,974
4) రెవెన్యూ వ్యయం	1,21,213	1,50,271	1,26,339	1,80,475
5) మూలధన వ్యయం	13,490	28,678	20,398	32,293
6) రుణాలు, వడ్డీ చెల్లింపు	9,458	10,851	13,553	13,417
7) మొత్తం వ్యయం	1,46,944	1,91,063	1,62,134	2,27,974
8) రెవెన్యూ లోటు	-16,151	5,235	-11,654	-1,778
9) ద్రవ్య లోటు	-32,372	-24,205	-33,619	-35,260

బ.అం.- బడ్జెట్ అంచనా
స.అం.- సవరించిన అంచనా
(రూ. కోట్లలో)

'మౌలికం'గా పెంచారు

గతంకంటే కాస్త మెరుగ్గా కేటాయింపులు

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో మౌలిక సదుపాయాల రంగానికి గతం కంటే కాస్త ఎక్కువ నిధులు కేటాయించారు. ఏపీఐఐసీకి గత బడ్జెట్‌లో రూ.157కోట్లు కేటాయిస్తే...ఈ బడ్జెట్‌లో రూ. 350 కోట్లకు పెంచారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో మౌలిక సదుపాయాలకు, విమానాశ్రయాల అభివృద్ధికి కేటాయింపులు పెంచారు. కడప ఉక్కు కర్మాగారానికి తొలిసారిగా రూ.250కోట్లు కేటాయించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలకు మాత్రం గత ఏడాది రూ.620 కోట్లు కేటాయిస్తే...ఈ ఏడాది రూ.573కోట్లే ప్రతిపాదించారు. పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి పథకం కింద తొలిసారి రూ.250కోట్లు కేటాయించారు. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు రూ.661కోట్లు, భోగాపురం విమానాశ్రయానికి రూ.75కోట్లు, విజయవాడ విమానాశ్రయానికి రూ.ఐదుకోట్లు, రాజమహేంద్రవరం విమానాశ్రయ అభివృద్ధికి రూ.ఆరుకోట్లు, తిరుపతి విమానాశ్రయానికి రూ.10కోట్లు, కడప, కర్నూలు లాంటి ప్రాంతీయ విమానాశ్రయాలకు రూ.50కోట్లు కేటాయించారు. మచిలీపట్నం పోర్టు రూ.2కోట్లు, భావనపాడు పోర్టు కోటి, కాకినాడ పోర్టు 8.44కోట్లు, కృష్ణపట్నం పోర్టు 8.04కోట్లు, గంగవరం పోర్టు 33.67లక్షల నిధులు కేటాయించారు.

ఆహారశుద్ధి పరిశ్రమలకు ప్రోత్సాహం

రాష్ట్రంలో స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవకాశం ఉన్న చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), ఆహారశుద్ధి రంగంలోని పరిశ్రమలకు ప్రోత్సాహకం కల్పించేందుకు నిధుల కేటాయింపు పెంచారు. ఎంఎస్ఎంఈల ప్రోత్సాహకానికి రూ.200కోట్లను కేటాయించారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.200కోట్లు ప్రతిపాదించారు. ఆహారశుద్ధి రంగంలో పరిశ్రమల ప్రోత్సాహానికి గత బడ్జెట్‌లో రూ.16.20కోట్లు ఇవ్వగా...ఈసారి రూ.100కోట్లు కేటాయించారు. ఎస్సీ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలకు గత బడ్జెట్‌లో రూ.20కోట్లు కేటాయించగా...ఈసారి దాన్ని 150కోట్లకు పెంచారు. ఫైబర్‌నెట్‌కు మాత్రం గత ఏడాది రూ.200కోట్లు కేటాయిస్తే...ఈ బడ్జెట్‌తో రూ.100కోట్లే కేటాయించారు. ఫైబర్ గ్రిడ్ మౌలిక సదుపాయాల కల్పనకు గత బడ్జెట్‌లో రూ.347కోట్లనుంచి ఈ బడ్జెట్‌లో రూ.150కోట్లకు కేటాయింపులు తగ్గాయి.



రూపాయి రాక	
రాష్ట్ర పన్నులు - సుంకాలు	42.2
కేంద్ర పన్నుల్లో వాటా	19.5
ఇతర పన్నేతర ఆదాయం	38.2
వడ్డీ ఆదాయం	0.1

రూపాయి పోక	
అభివృద్ధి వ్యయం	76.1
వడ్డీ చెల్లింపులు	9.9
పరిపాలనా వ్యయం	4.8
పన్ను వసూళ్ల వ్యయం	0.7
ఇతరత్రావ్యయం	9.5
లోటు	(-)1.0

పుర, పట్టణ పాలనకు 6587 కోట్లు

అర్బన్ హౌసింగ్‌కు రూ. వెయ్యికోట్లు

- రాజధానికి రూ.615 కోట్లు.. బెజవాడ,మంగళగిరికి చెరో 50 కోట్లు

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు మొత్తం రూ.6587.09 కోట్లను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించారు. అత్యధికంగా వైఎస్సార్ పట్టణ గృహ పథకానికి రూ.వెయ్యి కోట్లను ప్రతిపాదించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్)కు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా మరో రూ.170 కోట్లను, ఏపీ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ టిడ్కో)కు రూ.300 కోట్లను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పట్టణాల్లోని స్వయంశక్తి సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందజేసేందుకు ఉద్దేశించిన వైఎస్సార్ వడ్డీరహిత రుణ పథకం కింద రూ.648 కోట్లను కేటాయించారు. వచ్చే నెల 15వ తేదీ నుంచి ప్రారంభమవనున్న మున్సిపల్ వార్డు వలంటీర్ల వ్యవస్థ కోసం రూ.280 కోట్లు, వార్డు సచివాలయాల కోసం రూ.180 కోట్లు కేటాయించారు. త్వరలో జరగనున్న పట్టణ సంస్థల ఎన్నికల నిర్వహణకు రూ.60 కోట్లు ప్రతిపాదించారు. ప్రజారోగ్య కార్మికులుగా అవుట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న వారికి ఆరోగ్య భృతి కింద రూ.90 కోట్లను ఇవ్వనున్నారు. రాజధానికి ఆనుకుని ఉన్న గుంటూరు జిల్లాలోని మంగళగిరిని మోడల్ టౌన్‌గా అభివృద్ధి పరచేందుకు రూ.50 కోట్లను కేటాయించారు. విజయవాడలో మౌలిక వసతుల మెరుగుకు రూ.50 కోట్లు చూపారు. అమరావతి మెట్రో రైల్‌కు రూ.3.60 కోట్లు, విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టులకు అర్బన్ డెవలప్‌మెంట్ అసిస్టెన్స్ కింద రూ.10 కోట్లు ఇచ్చారు. 'అమృత్' పథకానికి రూ.373.61 కోట్లు, 'స్మార్ట్ సిటీ'లకు రూ.150 కోట్లు, సీఐఐపీ కింద పట్టణ స్థానిక సంస్థల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కల్పనకు రూ.100 కోట్లు, జేఎన్ఎన్‌యుఆర్ఎం కింద రూ.50.65 కోట్లు, నూతనంగా ఏర్పాటైన పట్టణాభివృద్ధి సంస్థ (ఉడా)లకు రూ.50 కోట్లు, సీవరేజ్ వ్యవస్థ ఆధునికీకరణ- సీవరేజ్ ట్రీట్‌మెంట్లకు రూ.50 కోట్లు, మున్సిపల్ పాఠశాలల్లో కనీస వసతుల కల్పనకు రూ.50 కోట్లు, మున్సిపాలిటీలకు రాష్ట్ర ఆర్థిక సంఘం కింద ఇచ్చేందుకు రూ.50 కోట్లు, తాగునీరు- సెప్టేజ్ మేనేజ్‌మెంట్ అభివృద్ధి పథకానికి రూ.25 కోట్లు, గ్రేడ్-3 మున్సిపాలిటీలకు రూ.44.52 కోట్లు, నగర పంచాయతీలకు రూ.40 కోట్లు కేటాయించారు. సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.35.30 కోట్లు, వ్యక్తిగత మరుగుదొడ్ల కోసం రూ.15 కోట్లు, స్వచ్ఛ భారత్‌పై అవగాహన కార్యక్రమాలకు రూ.5 కోట్లు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు రూ.10 కోట్లు, ఎన్.యు.ఎల్.ఎం.కు రూ.68.37 కోట్లు, 'మెప్మా'కు రూ.23.40 కోట్లు, అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్‌కు 13.44 కోట్లు, 'ఏపీరెరా'కు 3 కోట్లు కేటాయించారు.

తలసరి 1,64,025

- 2018-19 రాష్ట్ర వృద్ధిరేటు 15.5%
- జీఎస్‌టీలో రాష్ట్ర వాటా 35 శాతం
- జాతీయం కంటే వృద్ధిలో ముందే
- రాష్ట్ర ఆర్థిక సర్వే నివేదికలో వెల్లడి

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తలసరి ఆదాయం రూ.1,64,025గా ప్రభుత్వం ప్రకటించింది. 2017-18లో ఇది రూ.1,43,935 మాత్రమేనని తెలిపింది. ఈ వివరాలతో ఆర్థిక సర్వే నివేదికను శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టింది. ఆర్థిక సర్వేలో 2018-19మార్చి వరకు ఉన్న విశేషాలను పేర్కొన్నారు. జీఎస్‌డీపీ, జీవీఏ, వృద్ధిరేటు ప్రతి అంశంలోను ఆ కాలంలో జాతీయ సగటు కంటే ఎక్కువే ఉందని నివేదిక పేర్కొంది. జీఎస్‌డీపీ 2018-19లో 6.80లక్షల కోట్లుగా ఉంది. అంతకు ముందు ఏడాదికంటే ఇది 11.2శాతం పెరిగింది. అదే జాతీయ స్థాయిలో ఈ వృద్ధిరేటు కేవలం ఏడు శాతమే. జీవీఏ 2018-19లో అది రూ.6.14లక్షల కోట్లు. ఇది 2017-18కంటే 10.77శాతం అధికం. అదే జాతీయ స్థాయిలో ఈ వృద్ధిరేటు 6.8శాతం మాత్రమే. జీవీఏలో వ్యవసాయ రంగ వాటా 33.64 శాతం, పారిశ్రామిక రంగం వాటా 23.38 శాతం, సేవారంగం వాటా 42.98%. 2018-19లో వ్యవసాయ రంగం 12.40శాతం వృద్ధిరేటు, పారిశ్రామిక రంగం 18.10శాతం, సేవారంగం 16.15 శాతం వృద్ధిరేటు సాధించాయి. మొత్తంగా వృద్ధి రేటు 15.50శాతంగా ఉంది. మరోవైపు 2018-19 సవరించిన అంచనాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్నుల ఆదాయం రూ.58,125కోట్లు, పన్నేతర ఆదాయం రూ.4,391కోట్లు, కేంద్రం నుంచి పన్నుల వాటా రూ.52,963 కోట్లుగా ఉంది. రాష్ట్ర పన్నుల ఆదాయంలో 38% అమ్మకం పన్ను రూపంలో, 35% పన్ను జీఎస్‌టీ రూపంలో రావడం విశేషం. పారిశ్రామిక రంగంలో 2018-19లో అద్భుత ప్రగతిని సాధించినట్లు నివేదిక పేర్కొంది. ఆ ఏడాదిలో రాష్ట్రంలోకి 44 మెగా పరిశ్రమలను తీసుకొచ్చామని, దీనివల్ల 16,925ఎ౦ందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించామని చెప్పింది. ఇదే ప్రగతిని 2019-20లో కూడా కొనసాగిస్తామని పేర్కొంది.

కడప ఉక్కుకు రూ.250 కోట్లు

- పులివెందుల అభివృద్ధికి 100 కోట్లు
- కడప యాన్యుటీ పార్కుకి 120కోట్లు
- ఆటో,ట్యాక్సీ డ్రైవర్లకు రూ.400కోట్లు

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ కేటాయింపుల్లో ముఖ్యమంత్రి సొంతజిల్లా కడపలో ఉక్కు కర్మాగారం నిర్మాణానికి రూ.250 కోట్లు కేటాయించారు. జగన్ నియోజకవర్గం పులివెందుల అభివృద్ధికి రూ.100కోట్లు బడ్జెట్‌లో పెట్టారు. ఈ నిధులను పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా ఖర్చుచేస్తారు. కడప యాన్యుటీ పార్క్ నిర్మాణం కోసం రూ.120కోట్ల రూపాయలు కేటాయించారు. ఇక, అనంతపురం నుంచి అమరావతి రహదారి నిర్మాణానికి రూ.100కోట్లు కేటాయించారు. గుంటూరు జిల్లా గురజాల, విజయనగరంలో ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటు చేయనున్నారు. పాడేరు, అరకులో గిరిజనుల కోసం వైద్య కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం రూ.50కోట్లతో పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటుచేయనున్నారు. జిల్లా కేంద్రాల్లో వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.110కోట్లు, ఆటో, టాక్సీ డ్రైవర్ల సంక్షేమానికి 400కోట్లు, రోడ్ సేఫ్టీకి రూ.50కోట్లు కేటాయించారు. అగ్రిగోల్డ్ బాధితులకు రూ.1,150 కోట్లు కేటాయించింది. హోంశాఖకు ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.7,462 కోట్లు కేటాయించింది. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు రూ.1,572కోట్లు కేటాయించారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఈ సంస్థను ఆదుకోవడానికి వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించిన ప్రభుత్వం, వివిధ స్కీములకు చెల్లించాల్సిన బకాయిలు రూ.500కోట్లు ఇవ్వనుంది. దీంతోపాటు కొత్త బస్సుల కొనుగోలుకు రూ.50కోట్లు, మరో పద్దు కింద రూ.22కోట్లు కేటాయించింది. ఈ కేటాయింపుల పట్ల గుర్తింపు కార్మిక సంఘం నేతలు వైవీ రావు, పలిశెట్టి దామోదర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. చరిత్రలో ఎన్నడూ ఈ స్థాయిలో ఆర్టీసీకి కేటాయింపుల్లేవని వైఎస్సార్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర నాయకులు రాజారెడ్డి, చల్లా చంద్రయ్య పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్, ఆర్థిక మంత్రి బుగ్గన, రవాణాశాఖ మంత్రి పేర్ని నానికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

జగన్ పేరుతో రెండు పథకాలు

ముఖ్యమంత్రి జగన్ పేరుతో రెండు పథకాలను ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. పిల్లలను పాఠశాలకు పంపే తల్లులకు ఏటా 15వేల రూపాయలు ఇస్తానని ఎన్నికల సమయంలో జగన్ వాగ్దానం చేశారు. ఆ పథకానికి 'జగనన్న అమ్మ ఒడి' అని పేరు పెట్టారు. బడ్జెట్లో ఈ పథకానికి రూ.6,455కోట్లు కేటాయించారు. అయితే జగనన్న అమ్మఒడి కొందరికేనా.? అందరికీనా.? అని టీడీపీ ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తున్నారు. కాగా, జగన్ పేరుతో అమల్లోకి వచ్చిన రెండో పథకం పేరు 'జగనన్న విద్యా దీవెన'. పదో తరగతి దాటిన విద్యార్థులకు ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. అన్ని వర్గాలకు చెందిన విద్యార్థులకు ఏటా రూ.20వేల చొప్పున అందిస్తారు. రాష్ట్రంలో 15.50 లక్షల మందికి ఈ పథకం వర్తిస్తుంది. దీనికి అవసరమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రూ.4,962 కోట్లు బడ్జెట్లో కేటాయించింది.

ఆంధ్రజ్యోతి

అవసరం 3500కోట్లు.. ఇచ్చింది 100 కోట్లు

రుణభారంతో రైతు కుంగిపోకుండా ప్రతిదశలో ఆదుకునేందుకు వడ్డీ లేని పంట రుణాలిస్తామని ప్రకటించిన ప్రభుత్వం, దీనికింద బడ్జెట్‌లో నామమాత్రంగా రూ.100కోట్లు కేటాయించింది. ఈ ఏడాది రైతులకు రూ.84వేల కోట్లు వడ్డీ లేకుండానే పంట రుణాలు ఇస్తామని ఈనెల 8న కడప జిల్లా జమ్ములమడుగులో జరిగిన రైతు దినోత్సవంలో సీఎం జగన్ ప్రకటించారు. రూ.84వేల కోట్లకు రూ. 3,550కోట్లు వడ్డీ కింద అవసరం రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటే, వారి కుటుంబాలను ఆదుకునేందుకు రూ.7లక్షలు తక్షణ సాయం అందించేందుకు బడ్జెట్‌లో రూ.100కోట్లు కేటాయించారు.

అనంత-అమరావతి ఎక్స్‌ప్రెస్ వే భూసేకరణకు 100 కోట్లు

» కడప రోడ్ల కోసం 120 కోట్లు

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాయలసీమను నవ్యాంధ్ర రాజధాని అమరావతికి అనుసంధానించే అనంతపురం-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేకు తొలిసారిగా నిధులు కేటాయించారు. 2019-20 బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టు భూసేకరణ కోసం రూ.100 కోట్లు ప్రతిపాదించారు. నిజానికి ఈ ఎక్స్‌ప్రెస్ వే భూసేకరణకు రూ.2,200 కోట్లకు పైబడి ఖర్చవుతుంది. ఇందులో 50% రాష్ట్రం, మిగతాది కేంద్రం భరించాలి. కాగా.. రాష్ట్ర ప్రధాన రహదారుల పద్దు కింద కడప జిల్లాలో నిర్మించే రోడ్ల కోసం రూ.120 కోట్లు కేటాయించారు. మొత్తంగా రవాణా, రహదారులు, భవనాల శాఖకు రూ.6,202.98 కోట్లు ప్రతిపాదించారు. రహదారి భద్రతకు రూ.50కోట్లు ప్రతిపాదించారు.

'పులివెందుల'కు 100 కోట్లు.. అమరావతికి 615 కోట్లు

రాష్ట్ర బడ్జెట్ ఒక ఆసక్తికరమైన చర్చకు దారి తీసింది. కడప జిల్లా 'పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ ఏజెన్సీ'కి రూ.100 కోట్లను కేటాయించగా, అమరావతికి రూ.615 కోట్లు ప్రతిపాదించారు. రాజధానికి ఇచ్చిన బడ్జెట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.500కోట్లు, క్యాపిటల్ రీజియన్ సోషల్ సెక్యూరిటీ ఫండ్ కింద రూ.65కోట్లు, అమరావతి క్యాపిటల్ సిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు రూ.50కోట్లు కేటాయించారు! సీఎం నియోజకవర్గం కావడంవల్లే పులివెందులకు ఏ ప్రాంతానికీ ఇవ్వనన్ని నిధులు కేటాయించారన్న వ్యాఖ్యలు వినిపించాయి. గత ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో రాజధానిని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించి, తనహయాంలో అందుకు రూ.వేల కోట్లను కేటాయించింది. సుమారు రూ.30 వేలకోట్లకుపైగా విలువైన పలు ప్రాజెక్టులు వివిధదశల్లో ఉన్నాయి. తాజా కేటాయింపులను చూసిన తరువాత, ఇప్పట్లో అమరావతి కోలుకునే పరిస్థితి లేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

పర్యాటకం, క్రీడలకు 604 కోట్లు

పర్యాటక, సాంస్కృతిక, క్రీడా, యువజన సంక్షేమ శాఖలకు కలిపి తాజా బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.604కోట్లు కేటాయించింది. గతేడాది ఈ రెండు శాఖలకు అప్పటి ప్రభుత్వం రూ.2,063 కోట్లు ఇవ్వడం గమనార్హం. గత ప్రభుత్వం క్రీడలు, యువజన సంక్షేమ శాఖకు కేటాయించిన రూ.1667 కోట్లలో రూ.1000 కోట్లను నిరుద్యోగ భృతి కింద చెల్లించాలని నిర్ణయించింది. అయితే, ప్రస్తుత ప్రభుత్వం నిరుద్యోగ భృతిని పక్కన పెట్టింది. దీంతో ఈ ఏడాది క్రీడలు, యువజన సంక్షేమ శాఖకు కేవలం రూ.363 కోట్లు మాత్రమే కేటాయించింది.

'పన్నుల' లక్ష్యం 50 వేల కోట్లు

వాణిజ్య పన్నులశాఖ 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.50 వేల కోట్ల ఆదాయం ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గతేడాది రూ.43,053 కోట్లను రాబట్టి, పన్నుల వసూళ్లలో 14% వృద్ధి రేటు సాధించింది. ఈ ఏడాది కూడా లక్ష్యాన్ని అధిగమించేలా పన్నుల వసూళ్లు ఉంటాయని నిపుణులు భావిస్తున్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో ఆదాయం తగ్గుముఖం పడుతోంది. గతేడాది రూ.6,600కోట్లు ఆదాయం ఆర్జించాలని ఆ శాఖ నిర్ణయించింది. కానీ, రూ.4300కోట్లు మాత్రమే సమకూరింది.

వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ 4.5వేల కోట్లు

వ్యవసాయ విద్యుత్ సబ్సిడీకి ప్రభుత్వం కేటాయింపులు పెంచింది. వ్యవసాయానికి 9గంటల ఉచిత విద్యుత్ సరఫరాకు నిర్ణయం తీసుకొన్న నేపథ్యంలో ఈ పద్దు కింద తాజా బడ్జెట్‌లో రూ.4,525కోట్లు కేటాయించారు. ఆక్వా రైతులకు సబ్సిడీపై విద్యుత్ సరఫరాకు రూ.475కోట్లు ప్రతిపాదించారు. గతంలో తీసుకొన్న విద్యుత్ బాండ్లకు చెల్లింపుల కింద రూ.1,542కోట్లు, నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన రుణాలు తీసుకోవడానికి మరో రూ.245 కోట్లు ట్రాన్స్‌కోకు కేటాయించారు. విద్యుత్ సంస్థలకు బడ్జెట్లో రూ.6,881కోట్ల కేటాయించారు.

పౌరసరఫరాలకు వెయ్యికోట్లు అదనం

రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం సరఫరా చేస్తామంటూ ప్రకటనలు చేసిన ప్రభుత్వం బడ్జెట్‌లో మాత్రం ఆ దిశగా కేటాయింపులు చేయలేదు. ఓవైపు సన్నబియ్యం, మరోవైపు ప్యాకింగ్‌కు అదనంగా భారీ నిధులు అవసరమవుతాయని అంచనాలు వేయగా కేటాయింపులు మాత్రం ఆ స్థాయిలో లేవు. 2019-20 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం పౌరసరఫరాల శాఖకు రూ.4,429కోట్లు కేటాయించింది. గతేడాదితో పోలిస్తే ఇది దాదాపు వెయ్యి కోట్లు అంటే 26శాతం ఎక్కువ.

ఎస్సీ కాంపోనెంట్‌కు 15వేల కోట్లు

తాజా బడ్జెట్‌లో ఎస్సీ కాంపోనెంట్‌కు రూ.15,000.85కోట్లు కేటాయించారు. ఈ విభాగానికి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.14,367కోట్లు కేటాయించగా ప్రస్తుతం స్వలంగా పెంచారు. ఈ నిధులను 46శాఖలకు పంపిణీ చేస్తారు. అదేవిధంగా ఎస్టీ కాంపోనెంట్‌కు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.5,385 కోట్లు కేటాయించగా, ఇప్పుడు రూ.4,988.52కోట్లు కేటాయింపు చేశారు. బీసీ కాంపోనెంట్ కింద చంద్రబాబు ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ద్వారా రూ.16,226కోట్లు కేటాయిస్తే ప్రస్తుత ప్రభుత్వం రూ.15,061కోట్లు ప్రతిపాదించింది.

పాస్టర్లకు 5వేల గౌరవవేతనం

చర్చిల్లో పనిచేసే పాస్టర్లకు నెలకు రూ.5వేల గౌరవ వేతనం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే ఇమామ్‌లకు రూ.10వేలు, మౌజన్లకు రూ.5వేలు చొప్పున ఇస్తారు.

కాపు సంక్షేమానికి 2 వేల కోట్లు

కాపు సంక్షేమానికి ఇస్తున్న నిధులను ప్రభుత్వం రెట్టింపు చేసింది. బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించింది. కాపు కార్పొరేషన్ ఆధ్వర్యంలో పలు పథకాలు చేపట్టారు. విదేశీవిద్య పథకంలో ఒక్కో విద్యార్థికి రూ.10లక్షలు రాయితీగా ఇస్తున్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్‌కు 100 కోట్లు

బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్‌కు ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించింది. రూ.150కోట్లు ఇవ్వాలని అధికారులు ప్రతిపాదనలు పంపినా.. అంతవరకే పరిమితం చేసింది. పేద బ్రాహ్మణులకు కార్పొరేషన్ పెన్షన్లు ఇస్తోంది.

ఒక్క రూపాయి పెంచలేదు: ఆనంద్‌సూర్య

బ్రాహ్మణ సంక్షేమానికి గత ప్రభుత్వం కేటాయించిన నిధులకు ఒక్క రూపాయి అదనంగా కేటాయించలేదని ఆ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనంద్ సూర్య విమర్శించారు.

ధూప దీప నైవేద్యానికి 234 కోట్లు

ఆదాయం లేని ఆలయాల కోసం అమలు చేస్తున్న ధూప దీప నైవేద్యం పథకానికి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.234 కోట్లు కేటాయించింది. 2వేల జనాభా ఉన్న పంచాయతీకి రూ.30వేలు, 5వేల వరకు జనాభా ఉన్న పంచాయతీకి రూ.60వేలు, 10వేల వరకు జనాభా ఉన్న పంచాయతీకి రూ.90వేలు, 10వేలు జనాభా దాటిన పంచాయతీకి రూ.1.2 లక్షలు కేటాయించింది.

వ్యవ'సాయం' 28,866 కోట్లు

రైతు శ్రేయస్సుకు రూ.12 వేల కోట్లు

- » వైఎస్సార్ భరోసాకి రూ.8,750కోట్లు
- » ఎన్జీ రంగా వర్సిటీకి రూ. 355కోట్లు
- » సున్నావడ్డీకి బడ్జెట్‌లో రూ.వందకోట్లు
- » కొత్తగా వంద రైతు బజార్లు ఏర్పాటు
- » రైతు సేవకు గ్రామ సచివాలయంలో ఒక్కో వ్యవసాయ, పశు సహాయకులు
- » రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్ ప్రసంగంలో అసెంబ్లీలో బొత్స, మండలిలో మోపిదేవి

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు కలిపి రూ.28,866.23కోట్ల నిధులను కేటాయించారు. శుక్రవారం శాసనసభలో మంత్రి బొత్స సత్యనారాయణ, శాసనమండలిలో మంత్రి మోపిదేవి వెంకటరమణ ప్రవేశపెట్టిన వ్యవసాయ బడ్జెట్‌లో ఈ కేటాయింపులు చేశారు. ఇందులో రైతు సంక్షేమం, వ్యవసాయ విభాగం అభివృద్ధికి రెవెన్యూ పద్దు కింద రూ.12,280.14 కోట్లు, కేపిటల్ వ్యయం కింద రూ.230.28కోట్లు ప్రతిపాదించారు. 'వైఎస్సార్ రైతు భరోసా'కు రూ.8,750కోట్లు, వైఎస్సార్ ఉచిత పంట బీమా పథకానికి రూ.1,163కోట్లు, పంట ఉత్పత్తుల ధరల స్థిరీకరణ నిధికి రూ.3వేల కోట్లు, ప్రకృతి విపత్తుల నిధికి రూ.2వేల కోట్లు, జాతీయ భద్రత మిషన్ పథకం కోసం రూ.141.26కోట్లు కేటాయించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద రూ.341కోట్లు, రైతులకు రాయితీ విత్తనాల సరఫరాకు రూ.200కోట్లు, సూక్ష్మపోషకాల పంపిణీకి రూ.30.05కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు 460.05కోట్లు, వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలకు రూ.89.63కోట్లు, పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహానికి పరంపరాగత కృషి వికాస్ యోజన పథకానికి రూ.91.31కోట్లు వ్యవసాయ బడ్జెట్‌లో కేటాయించారు. రైతులకు గ్రామ సచివాలయ సేవలు అందించేందుకు ఒక గ్రామ వ్యవసాయ సహాయకుడి పోస్టు, పశుసంవర్ధకశాఖ తరపున ఓ సహాయకుడిని నియమించనున్నట్లు ప్రకటించారు. ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ కింద రూ.355కోట్లు, వివిధ వ్యవసాయ కళాశాలలు, పరిశోధనా కేంద్రాల్లో మౌలిక వసతులకు రూ.60కోట్లు కేటాయించారు.

అనుబంధ కేటాయింపులు..

ఉద్యానవన అభివృద్ధి పథకం కింద రూ. 100.94కోట్లు, ఎంఐడీహెచ్ పథకంకింద ఉద్యాన పంటల సమగ్ర అభివృద్ధికి రూ.200కోట్లు, మైక్రో ఇరిగేషన్‌కు రూ.1105.66కోట్లు ఆయిల్‌పామ్ సాగు ప్రోత్సాహానికి రూ.65.15కోట్లు, ఆయిల్ పామ్ రైతులకు ధరల్లో వ్యత్యాసానికి బోనస్‌గా రూ.80కోట్లు కేటాయించారు. 2019-20లో 2.40లక్షల హెక్టార్లలో పీఎంకేఎస్‌వై సూక్ష్మసేద్యం అభివృద్ధిలో భాగంగా 1182 షేడ్ నెట్స్, పాలీహౌస్‌లకు 50%రాయితీతో ఇవ్వాలని ప్రతిపాదించారు. 100%రాయితీతో సామాజిక నీటి కుంటలు, 50%రాయితీతో వ్యక్తిగత నీటి కుంటలు తీయిస్తామని ప్రకటించారు. పశుసంవర్ధకశాఖకు రూ.1,240.93కోట్లుతో బడ్జెట్ అంచనాలు రూపొందించి, రూ.163.05కోట్లు మూలధర వ్యయంగా, రూ.1,077.88కోట్లు రెవెన్యూ వ్యయంగా ప్రతిపాదించారు. నవరత్నాల అమలులో భాగంగా పాల సేకరణ కింద పాల ఉత్పత్తిదారులకు లీటరుకు రూ.4 బోనస్ వచ్చే ఏడాది నుంచి ఇవ్వాలని ప్రతిపాదించారు. పశు నష్టపరిహార పథకం కింద రూ.30వేల వంతున చెల్లించేందుకు రూ.50కోట్లు కేటాయించారు. పశుదాణా పథకాలకు రూ.100కోట్లు పెంచారు. పశు ఆరోగ్య పథకాలకు రూ.75.35కోట్లు, వ్యాధుల నిర్మూలనకు రూ.25కోట్లు, పౌల్ట్రీ రైతుల వడ్డీ రాయితీ పథకానికి రూ.50కోట్లు కేటాయించారు. పశువైద్య విశ్వవిద్యాలయానికి రూ.117కోట్లు కేటాయించారు. చేపలవేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే జీవనభృతిని రూ.4వేల నుంచి రూ.10వేలకు పెంచారు. దీనికి రూ.100కోట్లు కేటాయించారు. ప్రమాదవశాత్తు జాలర్లు మృతి చెందితే రూ.10లక్షలు పరిహారం ఇస్తామని ప్రకటించారు. మొత్తం రెవెన్యూ పద్దు కింద రూ. 409.62కోట్లు, క్యాపిటల్ పద్దు కింద రూ.141.24కోట్లు కేటాయించారు. మార్కెటింగ్ శాఖ ద్వారా 10లక్షల టన్నుల గోడౌన్లు నిర్మించాలని ప్రతిపాదించారు. కొత్తగా 100రైతుబజార్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ శాఖకు రెవెన్యూ పద్దు కింద రూ.3,012.34కోట్లు, క్యాపిటల్ వ్యయం కింద రూ.200.10కోట్లు కేటాయించారు. మొత్తం వ్యవసాయం, రైతు సంక్షేమానికి బడ్జెట్‌లో రెవెన్యూ పద్దు కింద రూ.12,280.14కోట్లు, క్యాపిటల్ పద్దు కింద రూ.230.28కోట్లు కేటాయించారు.

కౌలురైతులకూ 'సహకారం'

సహకార సంఘాల ద్వారా ఈ ఏడాది రూ. 12వేల కోట్లు స్వల్పకాలిక పంట రుణాలు, రూ.1,500కోట్లు దీర్ఘకాలిక రుణాలు ఇవ్వాలని ప్రతిపాదించారు. ఇందులో రూ.1,200కోట్లు కౌలు రైతులకు ఇస్తారు. ఐసీడీపీ ఫేజ్2 అమలుకు ఈ ఏడాది రూ.31,585కోట్లు ఖర్చు చేయనున్నారు. విద్యుత్ శాఖ ద్వారా ఈఏడాది చివరి నాటికి 18.02లక్షల వ్యవసాయ సర్వీసుల్లో 60% ఫీడర్లకు పగలు 9గంటల విద్యుత్ సరఫరా చేస్తుండగా, 40% ఫీడర్ల పరిధిలో తగు ఏర్పాటుకు రూ.1,700కోట్లు ప్రతిపాదించారు. ఉచిత విద్యుత్ కనెక్షన్లకు రూ.4,525కోట్లు ప్రతిపాదించారు. రైతులకు విద్యుత్ యూనిట్ రూ.2నుంచి రూపాయిన్నరకు తగ్గించేందుకు రూ.475కోట్లు కేటాయించారు. నెట్‌క్యాప్ ద్వారా50వేల సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని ప్రతిపాదించారు. దీనికింద 81వేల ఎకరాల్లో పండ్ల తోటలు, 5వేల కిలోమీటర్ల రోడ్ల వెంట మొక్కలు నాటడం, 35వేల చెరువుల పూడికతీత, 25,500పంట కుంటలు తవ్వాలని, ఇందుకోసం రూ.3,626కోట్లు వినియోగించాలని ప్రతిపాదించారు.



మద్యంపై భారీ ఆదాయం!

» 2,297కోట్లు అదనంగా వస్తాయన్న ప్రభుత్వం

» నిషేధం అంటూనే అదనపు రాబడిపై అంచనా

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మద్యం అమ్మకాల ద్వారా 2019-20 లో భారీగా ఆదాయం సమకూరుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. గతేడాది ఎక్సైజ్ ఆదాయం రూ.6,220కోట్లు వస్తే, ఈసారి రూ.8,517కోట్లు రావొచ్చని భావిస్తోంది. ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే రాబడి లెక్కల్లో చూపింది. ఈ మొత్తం గతేడాది కంటే రూ.2,297కోట్లు(36శాతం) అదనం. ఓవైపు మద్యనిషేధం అమలు చేస్తామని చెబుతూనే పెద్దఎత్తున రాబడిని అంచనా వేయడం గమనార్హం. బెల్టుషాపులపై చర్యలు తీసుకోవడంతో పాటు షాపులను ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిపిస్తామని, మద్యం వినియోగం తగ్గిస్తామని అంటున్న ప్రభుత్వం... ఆదాయం మాత్రం పెరుగుతుందని ఎలా అంచనా వేసిందో అర్థంకాని విషయం. ప్రైవేటు షాపులకు ఇచ్చే మార్జిన్ మిగులుతుందనుకున్నా, వారు కట్టే లైసెన్సు ఫీజులు మాత్రం రావు. అయినా ప్రభుత్వానికే లాభమని కొందరు అధికారులు అంటున్నారు. కొత్త షాపుల ఏర్పాటు, అద్దెలు, ఫ్రిజ్‌లు, ఇతర సామగ్రి కొనుగోలు చేయడంతో పాటు అందులో పనిచేసే సిబ్బందికి వేతనాలు ఇవ్వాలి. ఇవన్నీ అదనపు భారమే తప్ప లాభం వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. వచ్చే ఏడాది నుంచి లాభం వస్తుందని భావించినా ప్రస్తుతానికి వస్తువుల కొనుగోలు భారమే అవుతుంది. మరోవైపు సుమారు 20శాతం షాపులు తగ్గించాలని అనుకుంటున్నారు. దీంతో సాధారణంగా మద్యం వినియోగం తగ్గిపోతుంది. అందుకు అనుగుణంగా ఆదాయమూ తగ్గుతుంది. కానీ, మద్యంపై ఆదాయం పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఇది ఎక్సైజ్ ఆదాయం కాగా మద్యం అమ్మకాలపై వ్యాట్ రూపంలో భారీగా వచ్చే ఆదాయాన్ని వాణిజ్య పన్నుల రాబడుల్లో చూపిస్తారు.

వ్యవసాయాభివృద్ధికి ద్విముఖ వ్యూహం

ప్రపంచానికి పట్టెడన్నం పెట్టే రైతన్న శ్రేయస్సు కోసం ఒక దృఢ సంకల్పంతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని బడ్జెట్ సమర్పణ సమయంలో అసెంబ్లీలో బొత్స సత్యనారాయణ, మండలిలో మోపిదేవి వెంకటరమణ అన్నారు. రైతు సంక్షేమం అనే మాట వింటే వైఎస్ గుర్తొస్తారు. ఆయన స్ఫూర్తితో రైతు, వ్యవసాయ విధానాలను ప్రభుత్వం చేపడుతోంది. రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి మాకు రెండు కళ్లు. ద్విముఖ వ్యూహంతో ఈ రంగాలను తీర్చిదిద్దుతాం. దేశ చిత్రపటంలో వ్యవసాయ, అనుబంధ రంగాలు ప్రస్ఫుటంగా ప్రతిబింబించాలనే కృత నిశ్చయంతో ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నాం. అందువల్లే నవరత్నాల్లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు పెద్ద పీట వేశాం. ఈ ఏడాది అక్టోబరు15నుంచే రైతు భరోసా ప్రారంభిస్తాం. కౌలు రైతుల విషయంలో గత ప్రభుత్వం తీసుకున్న చర్యలు సఫలం కాలేదు. అందుకే భూ యాజమాన్య హక్కులకు విఘాతం కలగకుండా కౌలు రైతుల చట్టంలో సమూల మార్పులకు సంకల్పించాం. 11నెలల కాలానికి కౌలు రైతులకు పంట హక్కులు కల్పిస్తూ, పట్టాదారులకు ఇబ్బంది లేకుండా ఒక కౌలు పత్రాన్ని తీసుకువస్తున్నాం' బొత్స, మోపిదేవి చెప్పారు. పంటల బీమా కోసం ప్రీమియం భారాన్ని రైతులకు తగ్గించాలనే ఉద్దేశంతో వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని నోటిఫై చేసిన అన్ని పంటలకు వర్తింపజేస్తున్నట్లు వెల్లడించారు. రైతులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని ప్రకటించారు. రుణాలను సకాలంలో చెల్లించినవారికి జీరో వడ్డీ పథకం వర్తింపజేసి, రూ.లక్ష లోపు పంట రుణాలకు వడ్డీ ప్రభుత్వమే భరిస్తుందని, దానికోసం రూ.100కోట్లు బడ్జెట్‌లో కేటాయించామన్నారు. అగ్రికల్చర్ మిషన్ ఏర్పాటు చేశామని, ఎప్పటికప్పుడు వ్యవసాయ పరిస్థితులను సమీక్షించుకుంటూ, రైతు సమస్యల పరిష్కార వేదికగా పని చేస్తుందని వివరించారు. ధరల స్థిరీకరణ నిధి, ప్రకృతి విపత్తుల నిధిని ఎలా వినియోగించాలో ఈ మిషన్ నిర్ణయిస్తుందని తెలిపారు.

2019-20లో జల వనరుల శాఖకు కేటాయింపులివీ..

సాగునీటి ప్రాజెక్టులు	నిధులు (రూ.కోట్లలో)
తెలుగుగంగ	423.98
కడప జిల్లా ప్రాజెక్టులు	622.11
వంశధార తొలి దశ	379
ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు	488.02
పూలసుబ్బయ్య వెలిగొండ	200
గుండ్లకమ్మ రిజర్వాయరు	558.22
పాలేరు బిట్రగుంట	5
రాళ్లపాడు పునర్నిర్మాణం	670.65
తుంగభద్ర	90.17
హంద్రీ-నీవా	136.44
భైరవాని తిప్ప	1343.13
పోలవరం ప్రాజెక్టు	5254.64
శ్రీశైలం జల విద్యుత్కేంద్రం	287.78
గోదావరి డెల్టా	122.61
కృష్ణా డెల్టా	1336.2
ఎత్తిపోతలు, మధ్య తరహా పథకాలు	5242.31
చిన్న తరహా నీటి పారుదల	576.91

సాగునీటికి 13,139 కోట్లు

నిరుటి కంటే 22.61% తగ్గింపు

» బడ్జెట్‌లో 5.76 శాతం నిధులు

» ఏడాదిలో గాలేరు-నగరి, వెలిగొండ-1 పూర్తి

» 2021కల్లా పోలవరం కూడా..

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జల యజ్ఞం కింద పలు సాగునీటి ప్రాజెక్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం 2019-20 వార్షిక బడ్జెట్‌లో రూ.13,139.13 కోట్లను కేటాయించింది. గత ఏడాది కంటే 22.61 శాతం తక్కువగా నిధులు కేటాయించారు. 2018-19 వార్షిక బడ్జెట్‌లో రూ.16,979.23 కోట్లను కేటాయిస్తే.. ఈ ఏడాది రూ.13,139.13 కోట్లు ప్రతిపాదించారు. మొత్తం వార్షిక బడ్జెట్‌లో 5.76 శాతం మేర నిధులను సాగునీటి రంగానికి కేటాయించారు. రాష్ట్రంలో జలయజ్ఞం కార్యక్రమం ద్వారా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కృష్ణా, గోదావరి ఆయకట్టును స్థిరీకరణను చేయాలని.. రాయలసీమ, ఉత్తర కోస్తా ప్రాంతాలలోనూ సాగునీరందించి పచ్చదనంతో నింపాలని భావించారని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. జలయజ్ఞం కలలు సాకారం కానున్నాయన్నారు. '2021నాటికి పోలవరం పూర్తి చేయాలన్న కృత నిశ్చయంతో ప్రభుత్వం ఉంది. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్-1ను ఏడాదిలో, టన్నెల్-2ను రెండేళ్లలోనూ పూర్తి చేయాలన్న లక్ష్యాలను నిర్దేశించుకున్నాం. ఏడాదిలో గాలేరు-నగరి ప్రాజెక్టును పూర్తి చేస్తాం. అవుకు టన్నెల్‌ను పూర్తి చేసి.. గండికోట రిజర్వాయరులో నీటిని నింపి కడపలోని ఆయకట్టుకు నీరిస్తాం. హంద్రీ-నీవాని పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్నాం. నిర్ధీత లక్ష్యం మేరకు రెండో దశ పనులు పూర్తి చేస్తాం. వంశధార ప్రాజెక్టు, సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి ప్రాజెక్టులు పూర్తిచేసి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో సాగునీటిని అందిస్తాం' అని ప్రభుత్వం స్పష్టం చేసింది.



పన్నులు వేస్తున్నారిలా!

(అంకెలు రూ.కోట్లలో) స.అం.: సవరించిన అంచనా బ.అం.: బడ్జెట్ అంచనా

పన్ను వివరం	2015-16	2016-17	2017-18	2018-19 (స.అం.)	2019-20 (బ.అం.)
భూమి శిస్తు	52	166	107	57	300
రిజిస్ట్రేషన్ల ద్వారా	3,527	3,475	4,270	5,427	6,600
చరాస్తులపై పన్ను	196	192	132	159	320
ఎక్సైజ్ సుంకం	4,385	4,644	5,460	6,220	8,517
అమ్మకం, వాణిజ్య పన్నులు	29,104	32,484	36,155	42,525	55,000
వాహన పన్ను	2,082	2,467	3,038	3,358	4,000
ఇతరత్రా పన్నులు	571	749	650	379	700
మొత్తం పన్నులు	39,917	44,177	49,812	58,125	75,437

బుగ్గన బడ్జెట్.. నేతల కామెంట్

బడ్జెట్ భేషుగ్గా ఉంది

» నవరత్నాలకు నిధులు.. జగన్ చిత్తశుద్ధికి నిదర్శనం: వైసీపీ

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అద్భుతంగా ఉందని పలువురు వైసీపీ సభ్యులు కితాబిచ్చారు. జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు, ఎన్నికల వాగ్దానాల అమలు కోసం మేనిఫెస్టోలో ప్రకటించిన నవరత్నాలకు తొలి బడ్జెట్‌లో నిధులు కేటాయించడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమని ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి అన్నారు. మాట తప్పడు, మడప తిప్పడు అన్న జగన్ తీరుకి ఈ బడ్జెట్ నిదర్శనమని ఎమ్మెల్యే అప్పలరాజు చెప్పారు. ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించేలా ప్రతిపక్షం వ్యహరిస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. చంద్రబాబు తానిచ్చిన 650 హామీల్లో 100 హామీలు కూడా ఆయన నెరవేర్చలేదన్నారు. జగన్ రైతు పక్షపాతి అని, చంద్రబాబు రైతు వ్యతిరేకి అని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. బడ్జెట్ సామాజిక న్యాయానికి నిదర్శనమని, ఈ నిధుల కేటాయింపు వల్ల అసమానతలు తొలగుతాయని ఎమ్మెల్యే వరప్రసాద్ చెప్పారు. భగవంతుడి వరంలా బడ్జెట్ ఉందని.. గత ప్రభుత్వం మైనారిటీలకు కాగితాల్లోనే నిధులు కేటాయించిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ముస్తాఫా విమర్శించారు. పాదయాత్రలో చూసిన ప్రజల కష్టాల పరిష్కారానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే మేరుగ నాగార్జున తెలిపారు. జగన్ చెప్పింది చేస్తారన్న నమ్మకం ఈ బడ్జెట్‌లో ప్రస్ఫుటించిందని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు.

సభ నిర్వహణ జగన్‌కు తెలియదు: టీడీపీ

అసెంబ్లీ సాక్షిగా సీఎం జగన్ పచ్చి అబద్ధాలాడుతున్నారని టీడీపీ ఎమ్మెల్యేలు మండిపడ్డారు. శాసనసభను ఎలా జరపాలో, ఎలా జరగకూడదో ఆయనకు తెలియదని ధ్వజమెత్తారు. వడ్డీలేని పంట రుణాలపై ఆధారాలు చూపిస్తుంటే 'ఆవు కథ' చెప్పారని అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. 'నన్ను పట్టుకుని బాగా పెరిగావు కానీ బుద్ధి పెరగలేదని సీఎం వ్యాఖ్యానించడం దారుణం. అధికార పక్షం అహంకార ధోరణిని వదిలిపెట్టేది లేదు' అని స్పష్టం చేశారు. జగన్ తీరు ఫ్యాక్షనిజం, శాడిజంలా ఉందని గోరంట్ల బుచ్చయ్యచౌదరి ధ్వజమెత్తారు. వడ్డీ లేని రుణాలపై సీఎం తప్పుడు సమాచారంతో అసెంబ్లీని తప్పుదారి పట్టించారని రామానాయుడు దుయ్యబట్టారు. ప్రతిపక్షం ప్రజా సమస్యలపై నిలదీస్తే అధికార పార్టీ సభ్యులు ఎదురుదాడి చేస్తున్నారని మద్దాలి గిరిధర్ అన్నారు.

యనమల X సుభాష్ చంద్రబోస్

» మండలిలో జైలు పర్వం

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): తాగునీటి ఎద్దడిపై శాసనమండలిలో అధికార విపక్షాల మధ్య తీవ్రస్థాయిలో వాగ్యుద్ధం చోటుచేసుకుంది. 'పాపం చేశారు కాబట్టే మీరు జైలుకెళ్లొచ్చారు' అని టీడీపీ విమర్శిస్తే.. 'వేచి ఉండండి. మీరూ జైలుకెళ్లే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి' అని అధికారపక్షం బదులిచ్చింది. శుక్రవారం మండలిలో టీడీపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. దీనిని చైర్మన్ షరీఫ్ తిరస్కరించారు. దీంతో టీడీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. వెల్‌లోకి వెళ్లారు. 'రాష్ట్రంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుంది. తాగునీటి ఎద్దడికి గత టీడీపీ ప్రభుత్వమే కారణం' అని మంత్రి రామచంద్రారెడ్డి విమర్శించారు. 'సమస్య తీవ్రమైనదే. కాదని ఎవరూ అనడం లేదు. ఐదేళ్ల వివరాలు మా దగ్గర ఉన్నాయి. ఈ సమస్యకు గత ప్రభుత్వమే కారణం. వివరాలన్నీ చెప్పిన తర్వాత టీడీపీ సభ్యులు తలకాయ ఎక్కడ పెట్టుకోవాలో తెలియదు' అని డిప్యూటీ సీఎం పిల్లి సుభాష్‌చంద్రబోస్ మండిపడ్డారు.

ప్రభుత్వం వచ్చింది.. వాన రాలేదు: టీడీపీ

రాష్ట్రంలో 5కోట్ల మంది ప్రజలు నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని టీడీపీ సభ్యులు ధ్వజమెత్తారు. 'మంత్రి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడిన విధానం సరిగా లేదు. వైసీపీ ప్రతి దానికీ గత ప్రభుత్వమే కారణం, అవినీతి అనడం సరికాదు. పాపం చేశారు కాబట్టే మీరు జైలుకెళ్లారు. మీ పాపాలు చెప్పాలంటే రోజులు చాలవు. ఎవరు పాపాలు చేశారో చర్చకు సిద్ధం' అని విపక్షనేత యనమల రామకృష్ణుడు మండిపడ్డారు. ఈ దశలో మరోసారి మాట్లాడిన ఉపముఖ్యమంత్రి బోస్.. 'వేచి ఉండండి. మీరూ జైలుకెళ్లే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. పోలవరంలో ఎంత అవినీతి జరిగిందో, మీరు కూర్చున్న ఈ భవనంలో ఎంత అవినీతి చోటుచేసుకుందో తెలుస్తాం' అని బదులిచ్చారు. మంత్రి ఆదిమూలపు సురేశ్, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు కూడా టీడీపీపై విమర్శలు చేశారు. 'మీ ప్రభుత్వం వస్తే వాన వస్తుందని అన్నారు. కానీ వాన రాలేదు' అని టీడీపీ సభ్యుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ ఎద్దేవా చేశారు. చివరకు తాగునీటి సమస్యపై సోమవారం సభలో చర్చిద్దామని డిప్యూటీసీఎం బోస్ చెప్పడంతో టీడీపీ సభ్యులు నిరసన విరమించారు.

అప్పులపై అబద్ధమెందుకు?: యనమల

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలో అప్పులకు సంబంధించి ఎందుకు అబద్ధం చెప్పారని యనమల రామకృష్ణుడు.. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని నిలదీశారు. గురువారం మండలి ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్రంపై 2019 మే 30వ తేదీ నాటికి రూ.2,61,302.81 కోట్ల అప్పులభారం ఉందని బుగ్గన తెలిపారు. మరి ఆర్థిక శాఖ శ్వేతపత్రంలో అప్పులను రూ.3.62 లక్షల కోట్లుగా ఎందుకు చూపారని యనమల ప్రశ్నించారు. సభలో సరైన వివరాలు చెప్పిన మంత్రి.. శ్వేతపత్రంలో తప్పుడు వివరాలు ఎందుకు ఇచ్చారని నిలదీశారు. వివిధ కార్పొరేషన్లు, ప్రభుత్వరంగ సంస్థలకు చెల్లించాల్సిన అప్పులనూ శ్వేతపత్రంలో కలిపామని మంత్రి వివరించారు. ఐదేళ్లలో బాధ్యతారహితంగా అప్పులు చేశారని.. విచ్చలవిడిగా డబ్బు ఖర్చుచేశారని బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ విమర్శించారు. ఆదాయం పెంచే మార్గాలను ప్రభుత్వం ఆలోచించాలని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు సూచించారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి నిధులు తీసుకురావాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీలు శ్రీనివాసులురెడ్డి, రాముసూర్యారావు డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఆదరణ పథకం అవినీతిమయమని, ఆ పథకంలో జరిగిన అవినీతిని వెలికితీసేందుకు విచారణ జరుపుతామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి శంకరనారాయణ మండలిలో తెలిపారు.

టెండర్లలో అవినీతి లేకుండా బిల్లు: బోస్

అవినీతి నిర్మూలనకు తమ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఉపముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ తెలిపారు. రూ.100 కోట్ల విలువ దాటిన అన్ని టెండర్లను పబ్లిక్ డొమైన్‌లో పెట్టిన తర్వాత విశ్లేషించి.. అవినీతి లేకుండా పారదర్శక బిల్లును సభలో ప్రవేశపెడుతున్నామని చెప్పారు. ప్రజావేదిక కూలగొట్టి మిగతావి కూలగొట్టలేదని.. ఇదేనా పారదర్శకత, నిజాయితీ అని టీడీపీ ఎమ్మెల్సీ రామచంద్రరావు నిలదీశారు.

సెప్టెంబరు 5 నుంచి నూతన ఇసుక పాలసీ: పెద్దిరెడ్డి

జూలై రెండో వారంలో ఇసుక ధరలు నిర్ణయిస్తామని, సెప్టెంబరు 5వ తేదీ నుంచి నూతన ఇసుక విధానం అమలు చేస్తామని రాష్ట్ర భూగర్భగనుల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ ఏడాది మార్చి నాటికి 489 అక్రమ రవాణా కేసులు నమోదయ్యాయని.. రూ.1,20,09,000 మేర జరిమానా వసూలు చేసినట్లు తెలిపారు.

పెద్దగా ఉపయోగం లేదు: పీడీఎఫ్ ఎమ్మెల్సీలు

బడ్జెట్ తాత్కాలికంగా గొప్పగా కనిపించినా.. దీర్ఘకాలంలో పెద్దగా ఉపయోగపడదని పీడీఎఫ్ ఎమ్మెల్సీలు అన్నారు. మీడియా పాయింట్‌లో ఎమ్మెల్సీ బాలసుబ్రమణ్యం, లక్ష్మణరావు, శ్రీనివాసులురెడ్డి, కత్తి నరసింహారెడ్డి, వెంకటేశ్వర్లు శుక్రవారం మాట్లాడారు. 'విద్యా రంగానికి గత బడ్జెట్ కంటే కేటాయింపు పెరిగింది. అయితే అందులో ఎక్కువ శాతం అమ్మ ఒడికే వెళ్తోంది. పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు మెరుగుపర్చకుండా నగదు చేతికిస్తే పెద్దగా ప్రయోజనం ఉండదు' అని అన్నారు.

పిట్టలరాయుడి కోతల బడ్జెట్: తులసిరెడ్డి

బడ్జెట్ పిట్టలరాయుడి కోతల్లా ఉందని పీసీసీ ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి విమర్శించారు. నవరత్నాలకు న్యాయం జరగలేదన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు చేసిన కేటాయింపులు చూసిన తర్వాత పోలవరం ఇప్పట్లో పూర్తవుతుందన్న నమ్మకం పూర్తిగా పోయిందని తులసిరెడ్డి అన్నారు.

సభలో 'సమరం'

మేం సున్నా వడ్డీ పథకమే రద్దు చేసినట్లు అధికారపక్షం మాట్లాడింది. ఇప్పుడు ఆధారాలు చూసిన తర్వాత సీఎం రాజీనామా చేస్తారా? ప్రజలకు క్షమాపణ చెబుతారా?

కరువు మండలాలుగా ప్రకటిస్తే రుణాలు ఆటోమేటిక్‌గా రీషెడ్యూలు అవుతాయి. తెలుసుకోకుండా ఏదో పౌరుషంగా మాట్లాడారు.

\- చంద్రబాబు

ఎలాంటి వారిని తయారుచేశారు..? మొత్తం గూండాలను తయారు చేసుకొచ్చారు. కుక్క తోక వంకర అన్నట్లుగా ప్రతిపక్ష సభ్యుల తీరు మారడం లేదు. వారికి బుద్ధి, జ్ఞానం లేదు.

మీరు 23 మంది ఉన్నారు. మేం 150 మంది ఉన్నాం. మా వారంతా వస్తే మీరు మీ స్థానాల్లో కూడా కూర్చోలేరు.

\- సీఎం జగన్

(మొదటి పేజీ తరువాయి)

ఇరుపక్షాల మధ్య వాదోపవాదాలు సాగి... ఇక దశలో సభ అట్టుడికిపోయింది. పాలక వైసీపీ సభ్యులు పోడియం సమీపంలోకి వచ్చి.. 'చంద్రబాబు డౌన్ డౌన్' అని నినాదాలు చేశారు. అందుకు ప్రతిగా 'మాట తప్పిన సీఎం' అంటూ టీడీపీ సభ్యులు నినదించారు. తీవ్ర గందరగోళం చెలరేగడంతో స్పీకర్ తమ్మినేని సీతారాం సభను వాయిదా వేయాల్సి వచ్చింది.

వాయిదా తీర్మానంతో మొదలు..

ఉదయం సభ ప్రారంభమైన వెంటనే.. గురువారం నాటి కరువుపై చర్చలో భాగంగా సీఎం చేసిన సవాల్‌పై చర్చ చేపట్టాలని టీడీపీ ఎమ్మెల్యేలు వాయిదా తీర్మానం ఇచ్చారు. స్పీకర్ అంగీకరించలేదు. ఈ అంశం గురువారమే ముగిసిందని చెప్పారు. జీరో వడ్డీ నిధులు చెల్లించిన విషయం నిరూపిస్తామని టీడీపీ సభ్యులు నినాదాలు చేశారు. సీఎం జోక్యం చేసుకుని.. ప్రజలకు నిజానిజాలు తెలియాలని.. చర్చ కొనసాగింపునకు అనుమతివ్వాలని కోరడంతో స్పీకర్ అనుమతించారు. దాంతో ప్రతిపక్ష నేత చంద్రబాబు, పాలకొల్లు టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మాట్లాడారు.

పావలా, జీరో వడ్డీ రుణాలిచ్చాం: చంద్రబాబు

జీరో, పావలా వడ్డీ రుణాలపై 2018లో అప్పటి వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ మురళీధర్‌రెడ్డి బ్యాంకర్లకు రాసిన లేఖలను చంద్రబాబు సభలో చదివి వినిపించారు. 2014కి ముందున్న ప్రభుత్వం అమలుచేసిన పావలా వడ్డీ, జీరో వడ్డీ రుణాలను తమ ప్రభుత్వం కొనసాగించిందని చెప్పారు. 'రూ.లక్ష వరకు తీసుకుంటే జీరో వడ్డీ, రూ.లక్ష నుంచి రూ.3 లక్షలు తీసుకుంటే పావలా వడ్డీ కింద రైతులు లబ్ధి పొందారు. పావలా వడ్డీ కింద 2013-14లో రూ.8.45 కోట్లు చెల్లించాం. 1,64,819 మంది రైతులు లబ్ధి పొందారు. 2014-15లో రూ.1.2 కోట్లు చెల్లించాం. 7,510 మంది లబ్ధి పొందారు. 2015-16లో రూ.62 లక్షలు చెల్లించాం. 9,270 మంది లబ్ధి పొందారు. జీరో వడ్డీ రుణాల కింద... 2013-14లో రూ.349.29 కోట్లు చెల్లిస్తే 37,37,311 మంది లబ్ధి పొందారు. 2014-15లో రూ.44.31 కోట్లు చెల్లిస్తే 4,42,423 మంది లబ్ధి పొందారు. 2015-16లో రూ.22.28 కోట్లు చెల్లిస్తే 20,947 మందికి మేలు జరిగింది. మూడేళ్లలో జీరో వడ్డీ కిందే రూ.415 కోట్లు చెల్లించాం. సోషియో ఎకనమిక్ సర్వే కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేసింది. కరువు మండలాలుగా ప్రకటిస్తే రుణాలు ఆటోమేటిక్‌గా రీషెడ్యూలవుతాయి. వాటిని ప్రత్యేకంగా చేయనవసరం లేదు. ఇవన్నీ తెలుసుకోకుండా ఏదో పౌరుషంగా మాట్లాడారు. 2011 నుంచి ఉన్న పావలా వడ్డీ, జీరో వడ్డీ బకాయిలు కూడా మేం మాఫీ చేశాం. కానీ అసలు సున్నా వడ్డీ పథకాన్నే మేం రద్దు చేసినట్లు అధికార పక్షం మాట్లాడింది. కాళేశ్వరంపై చర్చలో కూడా గాడిదలు కాస్తున్నారా అని పరుషంగా మాట్లాడారు. ఇప్పుడు ఆధారాలు చూసిన తర్వాత రాజీనామా చేస్తారా? ప్రజలకు క్షమాపణ చెబుతారా' అని నిలదీశారు. వారిలా తాను తొందరపడలేదని, వివరాలు తెచ్చేలోపల కారణమేంటో గానీ సభను వాయిదా వేశారని చంద్రబాబు అన్నారు. స్పీకర్ కలుగజేసుకుని అప్పటికే 4 గంటల వరకు సభ జరిగినందున తానే సభను వాయిదా వేశానని, ఇందులో ఎవరికీ సంబంధం లేదన్నారు. తాను స్వతంత్రంగానే వ్యవహరిస్తున్నానని, సీనియర్ సభ్యుడిగా సభను ఎలా నడపాలో తనకు తెలుసని చెప్పారు. తన విచక్షణతోనే వాయిదా వేశానని తెలిపారు.

5 శాతం చెల్లించి గొప్పలా: సీఎం

చేసింది తక్కువే అయినా చంద్రబాబు జాతీయస్థాయిలో తనను పొగిడినట్లుగా గొప్పలు చెప్పుకొంటున్నారని జగన్ ఆ తర్వాత మాట్లాడుతూ విమర్శించారు. ప్రతిపక్ష సభ్యులు సభలో ఎవరినీ మాట్లాడనివ్వడం లేదని, నాయకుడు ఎలా ఉంటే.. వారు కూడా అలాగే ఉంటారని అన్నారు. '2014-15లో పంట రుణాలు రూ.29,658 కోట్లు. దానిపై రూ.1186 కోట్లు పావలా వడ్డీ, జీరో వడ్డీ కింద కట్టాల్సి ఉండగా టీడీపీ ప్రభుత్వం రూ.44.31 కోట్లు మాత్రమే చెల్లించింది. 2015-16లో రూ.57,085 కోట్ల రుణాలకు రూ.2,283 కోట్లు కట్టాల్సి ఉంటే రూ.31 కోట్లు చెల్లించారు. 2016-17లో రూ.58,840 కోట్లకు రూ.2,703 కోట్లు చెల్లించాల్సి ఉంటే రూ.182 కోట్లు కట్టారు. 2018-19లో రూ.76,726 కోట్లకు రూ.3,069 కోట్లు వడ్డీ చెల్లించాల్సి ఉంటే రూ.122 కోట్లు ఇచ్చారు. మొత్తం ఐదేళ్లలో రూ.11,595 కోట్లకు కేవలం రూ.630 కోట్లు చెల్లించారు. అంటే మొత్తంలో ఇది కేవలం 5శాతమే. ప్రతిపక్ష నేత రెండేళ్ల వివరాలు చెప్పలేదు. అవి కూడా మేం తెప్పించి చెబుతున్నాం. అంతా కలిపినా 5 శాతం దాటలేదు. రూ.లక్ష అప్పుంటే రూ.5 కడితే సరిపోతుందా? దమ్మిడీ ఇవ్వలేదని అన్నది ఈ ఉద్దేశంతోనే. 95 శాతం వడ్డీ ఎగ్గొట్టి మళ్లీ బ్రహ్మాండంగా చేసినట్లు చెప్పుకొంటున్నారు. ఇప్పటికైనా వారు సిగ్గుపడాలి' అని అన్నారు.

ఇది సభా.. చేపల మార్కెట్టా?

విపక్ష, అధికార సభ్యుల నినాదాల పట్ల స్పీకర్ తమ్మినేని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. నినాదాల కారణంగా పలు మార్లు సభ స్తంభించడంతో అసహనం వ్యక్తంచేశారు. ఒక సందర్భంలో 'ఇది శాసనసభా.. లేక చేపల మార్కెట్టా' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సీఎం, ప్రతిపక్ష నేత మాట్లాడేటపుడు అందరూ గౌరవమివ్వాలని సూచించారు. అందరికీ అవకాశాలు వస్తాయని.. ఆయా పార్టీల శాసనసభాపక్షాలు వారికి అవకాశం కల్పిస్తాయని చెప్పారు. క్రాస్ టాక్స్ వద్దని సభ్యులకు హితవు పలికారు.

గూండాలను తెచ్చారు

ఈ సమయంలో సీఎం క్షమాపణ చెప్పాలని నినాదాలు చేస్తున్న ప్రతిపక్ష సభ్యులను ఉద్దేశించి జగన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'మీరు 23 మంది ఉన్నారు. మేం 150 మంది ఉన్నాం. మా వారంతా వస్తే మీరు మీ స్థానాల్లో కూడా కూర్చోలేరు. అసెంబ్లీ అంటే ఏంటో మీకు తెలుసా? బుద్ధి, జ్ఞానం లేదు మీకు. భయపడతామనుకుంటున్నారా? ఎవడూ ఇక్కడ భయపడడు. అచ్చెన్నాయుడూ.. కూర్చో. నీకు పర్సనాలిటీ పెరిగింది గానీ బుర్ర, బుద్ధి పెరగలేదు. చంద్రబాబుకు, టీడీపీకి అసలు సభ సరిగా జరగాలని లేదు. బట్టలన్నీ ఊడిపోతుంటే ఏంచేయాలో అర్థం కాక రకరకాల బాధలు వెలిబుచ్చుతున్నారు. వారి మాదిరిగా మేం కామెంట్లు చేయాలని డిసైడ్ అయితే సభలో కనిపించరు' అని హెచ్చరించారు. ఇది పర్చూరు కాదని, అసెంబ్లీ అని టీడీపీలో ఓ ఎమ్మెల్యేను ఉద్దేశించి సీరియస్‌గా అన్నారు. 'ఎలాంటి వారిని తయారుచేశారు. మొత్తం గూండాలను తయారు చేసుకుని వచ్చారు' అని తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేశారు.

ఇంకా సీఎం అనుకుంటున్నాడా?

చంద్రబాబు ఇంకా తానే సీఎం అన్న భ్రమలోనే ఉన్నారేమోనని జగన్ అన్నారు. 40ఏళ్ల ఇండస్ట్రీ అంటారని, కనీసం బేసిక్ రూల్స్ తెలియవని విమర్శించారు. గతంలో తాము ఎన్ని వాయిదా తీర్మానాలు ఇచ్చినా ఒక్కటీ అనుమతించలేదని, కానీ చర్చ జరగాలని తాము వాయిదా తీర్మానం అనుమతించామని తెలిపారు. సభ చరిత్రలో వాయిదా తీర్మానం ఎన్నడూ అనుమతించలేదన్నారు.

సీఎం మాటలు ప్లే చేయాలి..

5 శాతం వడ్డీలు చెల్లించారని సీఎం చెప్పిన తర్వాత ప్రతిపక్ష సభ్యులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. గురువారం సీఎం చేసిన సవాల్‌ను సభలో ప్లే చేయాలని డిమాండ్ చేశారు. మాట తప్పిన, మడమ తిప్పిన జగన్ క్షమాపణలు చెప్పాలన్నారు. జీరో వడ్డీ పథకం రద్దు చేశారని సీఎం సభను తప్పుదారి పట్టించారని ధ్వజమెత్తారు. తప్పుడు లెక్కలు, కాకి లెక్కలతో ప్రతిపక్షమే సభను తప్పుదారి పట్టిస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. 40 ఏళ్లు అని చెప్పుకోవడం కాదని, సంస్కారం ఉండాలని అన్నారు. బట్టలు పెడతామని చెప్పి.. ఉన్న బట్టలు ఊడదీసి.. గోచీలు ఇచ్చి, గోచీలు ఇచ్చామని టీడీపీ ఎమ్మెల్యేలు పదే పదే చెప్పుకొంటున్నారని వైసీపీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. వారిచ్చిన గోచీలకు అసలు చర్చ అవసరమా అని ప్రశ్నించారు. 'నాకన్నా లావుగా ఉన్న అచ్చెన్నాయుడు సభ్యులను ప్రొవోక్ చేస్తున్నారు' అని వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. సీఎం సమాధానం చెప్పాలని టీడీపీ ఎమ్మెల్యేలు నినదించడంతో.. చెవిరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు తదితర వైసీపీ సభ్యులు పోడియం వద్దకు వచ్చి ప్రతి నినాదాలు చేశారు. 'చంద్రబాబు 420' అని కోటంరెడ్డి అన్నారు. ఈ దశలో స్పీకర్ టీ బ్రేక్ ప్రకటించారు.

ఆ పథకాలు ఉన్నట్లా.. లేనట్లా?

పొదుపు సంఘాల రుణాలకు జీరో వడ్డీ కింద వడ్డీలు చెల్లించలేదని, అసలు ఆ పథకాలు ఉన్నట్లా లేనట్లా అని గత ప్రభుత్వాన్ని సీఎం ప్రశ్నించారు. 'పొదుపు సంఘాలకు వడ్డీల కింద రూ.3036 కోట్లు ఇవ్వాల్సి ఉంటే ఆగస్టు 2016 నుంచి పూర్తిగా ఎగ్గొట్టారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చే నాటికి పంట రుణాలు రూ.87,612 కోట్లుగా ఉంటే కేవలం రూ.15 వేల కోట్లు మాఫీ చేసి మొత్తం చేసినట్లుగా గొప్పలు చెప్పుకొన్నారు. మళ్లీ 2019 ఎన్నికల మేనిఫెస్టోలో హామీలన్నీ మొత్తం అమలుచేశామని పెట్టుకున్నారు. చెప్పినవి చేయకుండా ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగిస్తే ఎమ్మెల్యేల సంఖ్య 23 నుంచి 13కి పడిపోతుంది. చేయాల్సిన దాంట్లో అతి తక్కువ చేసినందుకు ఇప్పటికైనా రాజీనామా చేస్తారా? లేక నిస్సిగ్గుగా కూర్చుంటారా? కుక్క తోక వంకర అన్నట్లుగా ప్రతిపక్ష సభ్యుల తీరు మారడం లేదు. వారికి బుద్ధి, జ్ఞానం లేదు' అని విరుచుకుపడ్డారు. వెంటనే ఇక ఆ అంశం ముగిసిందని స్పీకర్ ప్రకటించడంతో ప్రతిపక్ష సభ్యులు మళ్లీ నినాదాలు చేశారు.

సున్నా వడ్డీకి వంద కోట్లేనా?

» రైతులకేం జవాబు చెబుతారు?
» బీసీలపై అక్కసుతో నిధుల కోత
» అమ్మ ఒడిని ఆంక్షల బడి చేశారు
» బీమాను రూ.లక్షకు తగ్గించారు
» మాటలకు, చేతలకు పొంతన లేదు
» బడ్జెట్‌పై చంద్రబాబు విమర్శ

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం నిధుల కోతతో అభివృద్ధికి గండికొట్టిందని టీడీపీ అధినేత చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం సున్నా వడ్డీ రుణాలకు రూ.630 కోట్లు మాత్రమే చెల్లించారని శుక్రవారమే జగన్ విమర్శించారని.. కానీ తాజా బడ్జెట్‌లో సున్నా వడ్డీలకు రూ.4 వేల కోట్లు చెల్లించాల్సి ఉంటే.. రూ.100 కోట్లు మాత్రమే కేటాయించారని తప్పుబట్టారు. దీనిపై రైతులకు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. ఈ బడ్జెట్‌లో రైతులకు అన్యాయం చేసి.. వచ్చే బడ్జెట్‌లో సరిచేస్తాననడం పలాయనవాదమన్నారు. బడ్జెట్‌పై చంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో స్పందించారు. బీసీలు తెలుగుదేశం పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారనే అక్కసుతో వారి సంక్షేమ నిధుల్లో కోత విధించారని ఆరోపించారు. బడ్జెట్ ప్రగతికి, ప్రజల సంక్షేమానికి దోహదం చేసేలా లేదన్నారు. వైసీపీ నేతల మాటలకు, చేతలకు పొంతన లేదనేందుకు ఈ బడ్జెట్టే ఉదాహరణగా పేర్కొన్నారు. 'ఏడాదిలోనే 80% హామీలు అమలు చేస్తున్నామని డబ్బాలు కొడతారు. పథకాలు మాత్రం వచ్చే ఏడాది నుంచి అమలు చేస్తామంటారు. కొన్ని పథకాలు దశలవారీగా, ఇంకొన్ని అంశాలు నాలుగేళ్లలో కొద్దికొద్దిగా అమలు చేస్తామంటారు. ఇదేనా ఏడాదిలోనే 80 శాతం మేనిఫెస్టో హామీలు అమలుచేయడం' అని నిలదీశారు. శీతల గిడ్డంగులు, గోదాంలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.200 కోట్లు, ఉచిత బోర్లకు రూ.200 కోట్లు, పశు బీమాకు రూ.50 కోట్ల అరకొర కేటాయింపులు చేసి, రైతుల ఆదాయాన్ని నాలుగేళ్లలో ఎలా రెట్టింపు చేస్తారని ప్రశ్నించారు. కరువుపై శాసనసభలో జరిగిన చర్చలో సుదీర్ఘ ప్రసంగం చేసిన ముఖ్యమంత్రి.. బడ్జెట్‌లో తాగునీటికి, పారిశుధ్యానికి గతం కంటే 15శాతం తక్కువగా కేటాయించారన్నారు. ఆయన ఇచ్చిన హామీలు ఆకాశంలో ఉంటే.. కేటాయింపులు పాతాళంలో ఉన్నాయని చెప్పారు.

139 కార్పొరేషన్లకు స్పష్టతేదీ?

'బీసీల సంక్షేమ నిధుల్లో కోత పెట్టారు. టీడీపీకి వారు వెన్నుదన్నుగా ఉన్నారనే అక్కసుతోనే ఈ పనిచేశారు. 139 ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తున్నామని మొక్కుబడిగా పేర్కొన్నారే తప్ప.. వాటికి కేటాయింపులపై స్పష్టత ఇవ్వకుండా దాట వేశారు. ముస్లింల సంక్షేమానికి తెలుగుదేశం ప్రభుత్వం రూ.1102 కోట్లు కేటాయిస్తే..దానికంటే 13.56 శాతం తక్కువ కేటాయించడం మైనారిటీలను మోసగించడమే. డ్వాక్రా మహిళలకు రూ.3.036 కోట్ల వడ్డీ బకాయిలు ఉన్నాయని చెప్పి బడ్జెట్‌లో కేటాయించింది కేవలం రూ.1.788 కోట్లు. డ్వాక్రా మహిళల రుణాల రద్దు, మహిళలకు ఐదేళ్లపాటు రూ.75 వేలు.. ఈ రెంటికీ ఈ ఏడాది ఎగనామం పెట్టారు. వచ్చే ఏడాది నుంచి చేస్తామని ఈ బడ్జెట్‌లో పేర్కొనడం మరో మోసం. అమ్మ ఒడి పథకాన్ని ఆంక్షల బడిగా చేశారు. పక్కా గృహాల లబ్ధిదారుల రుణాలన్నీ మాఫీ చేస్తామని మేం చెప్పాం. వైసీపీ మాత్రం బడ్జెట్‌లో 300 చదరపు అడుగుల ఇళ్లకే ఆర్థికభారం తగ్గించింది. పింఛను రూ.3 వేలకు పెంచుతామని, తెలుగుదేశం రూ.3 వేలిస్తే.. తాము రూ.4వేలు ఇస్తామన్న జగన్ చివరకు రూ.250 మాత్రమే పెంచారు. దీనివల్ల ఒక్కొక్కరు ఏడాదికి రూ.18 వేలు నష్టపోయారు. నిషేధమంటూ ప్రభుత్వమే మద్యం విక్రయాలు ఎలా చేపడుతుంది? ప్రభుత్వమే వ్యాపారం చేస్తూ.. దానికి దశల వారీ ముసుగు వేయడమేంటి? నేరుగా మద్యం కంపెనీల నుంచి ముడుపులు దండుకునేందుకేనా ఈ విక్రయాలు? పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు మూసేసి.. దుకాణాలు పెట్టి మందు తాగండని ప్రోత్సహించడం వైసీపీకే చెల్లింది. సహజ మరణానికి చంద్రన్న బీమా కింద మేం రూ.2 లక్ష లు ఇస్తే.. దాన్ని రూ.లక్షకు తగ్గించారు. రాజధానికి రూ.500 కోట్లు, కడప ఉక్కుకు రూ.250 కోట్లు కేటాయించారు. వాటితో ఏం చేద్దామని? నిరుద్యోగ భృతికి నిధుల్లేవు. రాష్ట్ర రుణ బకాయిలు రూ.2.61 లక్షల కోట్లని ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో పేర్కొన్నారు. అంతకుముందు శ్వేతపత్రంలో ఆయనే రూ.3.62 లక్షల కోట్ల రుణభారమని చెప్పారు.' 'రాష్ట్రానికి గతంలో ఏం పరిశ్రమలు వచ్చాయని ఎగతాళి చేసే వైసీపీ నేతల కు.. వాళ్ల అసెంబ్లీలో ఇచ్చిన సామాజిక, ఆర్థిక సర్వేనే సమాధానం. గత ఏడాదిలోనే రూ.21 వేల కోట్ల పెట్టుబడులతో 1.05 లక్షల ఉద్యోగాల కల్పన జరిగిందని వారిచ్చిన సర్వేలోనే ఉంది.'

సభలో బడ్జెట్ ప్రతులను పరిశీలిస్తున్న చంద్రబాబు

48 వేల కోట్ల అప్పులు తెస్తారా?

మమ్మల్ని తిట్టి మీరు చేస్తున్నదేంటి?

ప్రభుత్వంపై యనమల ఆగ్రహం

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): 'బడ్జెట్ వివరాల ప్రకారం జగన్ ప్రభుత్వం ఈ ఏడాది రూ.48 వేల కోట్ల అప్పులు తేబోతోంది. ఈ లెక్కన ఈ ఐదేళ్లలో తెచ్చే అప్పులు రూ.రెండున్నర లక్షల కోట్లు దాటతాయి. 1956లో రాష్ట్రం ఆవిర్భవించిన నాటి నుంచి ఇప్పటివరకూ అన్ని ప్రభుత్వాలు కలిపి ఎన్ని అప్పులు తెచ్చారో ఈ ఒక్క ప్రభుత్వమే అంత రుణం తీసుకురానుంది' అని మాజీ మంత్రి, శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం విపరీతంగా అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిందని వైసీపీ నేతలంతా విమర్శలు కురిపించారని, ఇన్ని చెప్పి వారు చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. శ్వేతపత్రంలో కార్పొరేషన్ల అప్పులు కూడా రాష్ట్రం అప్పులో చూపి తమను దుమ్మెత్తి పోశారని, కానీ ఆ అప్పులు రాష్ట్రం అప్పులో కలిపే అవకాశం లేకపోవడంతో బడ్జెట్లో నిజం చెప్పక తప్పలేదన్నారు. 'సంక్షేమ పథకాలు కొత్తవేమీ లేవు. వచ్చే ఏడాది అమలు చేసే వాటి గురించి ఈ బడ్జెట్లో చెప్పారు. పాత పథకాలకు పేర్లు మార్చి వైఎస్సార్ పేరు తగిలించడం తప్ప కొత్తగా తెచ్చినవేమీ లేదు. వ్యవసాయ బడ్జెట్లో వ్యవసాయ రంగానికి రూ.28 వేల కోట్లు కేటాయించినట్లు ఘనంగా చెప్పారు. జనరల్ బడ్జెట్లో మాత్రం ఆ రంగానికి రూ.20 వేల కోట్లే కేటాయించారు. తన తండ్రి మాదిరిగా జల యజ్ఞం చేస్తామన్నారు. నిధులు కోత కోశారు. మాజీ సీఎంగా ఒకట్రెండు పథకాలకు వైఎస్ పేరు పెట్టడంలో తప్పులేదు. ప్రతి పథకానికీ అదే పేరు పెట్టడంలో ఔచిత్యం ఏమిటి? రాష్ట్రంలో, దేశంలో ఇక పేర్లు పెట్టతగిన నేతలు, ఆదర్శమూర్తులు లేరా' అని విస్మయం వ్యక్తం చేశారు. రైతులకు సున్నా వడ్డీ రుణాలపై ముఖ్యమంత్రి జగన్ అసెంబ్లీలో సెల్ఫ్ గోల్ కొట్టుకున్నారని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రైతులకు సున్నా వడ్డీ కోసం రూ.మూడు వేల కోట్లు కావాలని అసెంబ్లీలో రాద్ధాంతం చేసిన జగన్.. గంటల వ్యవధిలోనే బడ్జెట్లో ఈ పద్దు కింద కేవలం రూ.వంద కోట్లు కేటాయించారని అన్నారు. భారీ మెజారిటీతో గెలిచినా అబద్ధాలు, అసత్య ప్రచారంతో వైసీపీ ప్రభుత్వం విశ్వసనీయత కోల్పోయిందని విమర్శించారు.

35 వేల ఫీజుతో ఇంజనీరింగా?

» ముమ్మాటికీ సాధ్యం కాదు!
» ఏఎఫ్ఆర్‌సీ ప్రతిపాదనే అమలు చేయాలి
» నాణ్యమైన విద్యకు ఫీజు పెంచాల్సిందే
» కాలేజీ యాజమాన్యాల డిమాండ్

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యను రూ.35 వేల ఫీజుతో అందించడం సాధ్యంకాదని రాష్ట్రంలోని సీనియర్ ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి. ఏఎఫ్ఆర్‌సీ(ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ) ప్రతిపాదించిన ఫీజులను ఆమోదించాల్సిన అవసరముందని పేర్కొంటున్నాయి. ప్రమాణాలతో కూడిన నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను అందించేందుకు ఇప్పుడున్న ఫీజులు సరిపోవని స్పష్టం చేస్తున్నాయి. ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని మూడేళ్లకు ఒకసారి వృత్తి విద్య ఫీజులను క్వాజీ జ్యుడిషియల్ కమిటీ అయిన ఏఎఫ్ఆర్‌సీ.. కాలేజీల పనితీరు, ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, ఫ్యాకల్టీ అర్హతలు, జీతాల చెల్లింపు.. ఆదాయ వ్యయాలను పరిగణనలోకి తీసుకుని సిఫారసు చేస్తున్నందున ప్రభుత్వం వాటిని ఆమోదించాలని యాజమాన్యాలు కోరుతున్నాయి. ఇంజనీరింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ భారం అనుకుంటే ప్రభుత్వం తమకు ఇవ్వకున్నా ఫర్వాలేదని, కాలేజీల ప్రతిష్ఠ, విద్యా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని తమ ఫీజులు న్యాయమని భావిస్తే విద్యార్థులు అడ్మిషన్ తీసుకుంటారని పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో ఉన్నంత తక్కువ ఫీజులు పొరుగు రాష్ట్రాలు, డీమ్డ్ వర్సిటీల్లో కూడా లేవని అంటున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇప్పటికే పేరుకుపోతున్నాయని, ఇప్పుడు రూ.35 వేల ఫీజుతో కాలేజీలను ఎలా నిర్వహించాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. భారీగా పెట్టుబడులతో నిర్వహిస్తున్న తమ సంస్థలను ఆర్థిక ఇబ్బందుల నుంచి ఆదుకోవాలని యాజమాన్యాల ప్రతినిధులు కోరుతున్నారు.

వారంలో స్పష్టత: మంత్రి సురేశ్

ఇంజనీరింగ్ ఫీజులపై వారంలో స్పష్టత వస్తుందని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ తెలిపారు. 100% ఫీజు రీయింబర్స్ చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజుల ఖరారుపై కళాశాలల యాజమాన్య ప్రతినిధులతో శుక్రవారం సచివాలయంలో భేటీ అయ్యారు. అనంతరం, మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. యాజమాన్యాలకు సీఎం జగన్‌పై నమ్మకం ఉందని, ప్రభుత్వ నిర్ణయంపై సానుకూలత వ్యక్తం చేశారని తెలిపారు.

బీసీ బిల్లుపై ఓటింగ్‌కు నో

» రాజ్యసభ నుంచి విజయసాయి వాకౌట్

న్యూఢిల్లీ, జూలై 12(ఆంధ్రజ్యోతి): జనాభా ప్రాతిపదికన బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదిస్తూ వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి ప్రవేశపెట్టిన ప్రైవేటు మెంబర్ బిల్లును కేంద్రం వ్యతిరేకించింది. బిల్లుపై ఓటింగ్ జరపడానికి కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి థావర్‌చంద్ గెహ్లాట్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది రాజ్యాంగ సవరణ బిల్లు కాబట్టి మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమని, అందుకు సభలో కనీసం 123 మంది సభ్యులు ఉండాలని మంత్రులు తెలిపారు. ప్రస్తుతం సభలో 40-50 మంది మించి లేరు కాబట్టి ఓటింగ్ కుదరదని వారు తేల్చి చెప్పారు. కేంద్ర మంత్రుల వైఖరిని విపక్ష సభ్యులు తప్పు పట్టారు. హాజరైన సభ్యుల్లో మూడింట రెండొంతుల మెజారిటీ ఉంటే సరిపోతుందని కాంగ్రెస్ ఎంపీ బీకే హరిప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా మంత్రి రవిశంకర్ ప్రసాద్ మాట్లాడారు. "మా ప్రభుత్వం ఓబీసీల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసింది. ప్రధాని మోదీ ఓబీసీ వర్గానికి చెందినవారు. ఎంతో మంది ఓబీసీలను మేము ముఖ్యమంత్రులను చేశాం. మీరు చేశారా? మీ కుటుంబ సభ్యులనే ముఖ్యమంత్రులుగా చేస్తారు" అని వ్యాఖ్యానించారు. దీనిపై విజయసాయిరెడ్డి స్పందించారు. "నేను బిల్లును ఉపసంహరించుకోను. చర్చ ప్రారంభయ్యే ముందే న్యాయ మంత్రిని కలిసి స్పష్టమైన హామీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశాను. ఆయన స్పందించలేదు" అని అన్నారు. 'ప్రభుత్వ వైఖరికి నిరసనగా వాకౌట్ చేస్తున్నా' అని ప్రకటించి ఆయన సభ నుంచి వెళ్లిపోయారు.

అవును... కేసీఆర్‌ది ఔదార్యమే: కేశినేని

విజయవాడ, జూలై 12(ఆంధ్రజ్యోతి): 'కేసీఆర్‌ది ఔదార్యం' అంటూ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ విజయవాడ ఎంపీ కేశినేని నాని శుక్రవారం ఓ ట్వీట్ చేశారు. "మీరు చెప్పింది అక్షరాలా నిజం జగన్ గారూ. కేసీఆర్ గారికి అంత ఔదార్యం ఉండబట్టే కదా ఎన్నికలలో మీకు అంత సాయం చేసింది..." అంటూ వ్యంగ్యంగా పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
విజయవాడ ● శనివారం 13 జూలై 2019

ఉచితంగా ఫైనల్ ప్రసారాలు

లండన్: 27 ఏళ్ల తర్వాత ఇంగ్లండ్ వరల్డ్‌కప్ ఫైనల్ చేరడంతో అభిమానులకు ఆ దేశ క్రికెట్ బోర్డు బంపర్ ఆఫర్ ఇచ్చింది. ప్రఖ్యాత లార్డ్స్‌లో ఇంగ్లండ్-న్యూజిలాండ్ మధ్య ఆదివారం జరిగే వరల్డ్‌కప్ ఫైనల్‌ను యూకే అంతటా ఉచితంగా ప్రసారం చేయనున్నారు. అయితే, క్రికెట్ పట్ల ఆదరణ తగ్గుతున్న నేపథ్యంలో ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ఈ నిర్ణయం తీసుకుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సబ్‌స్క్రిప్షన్ ధరలు భారీగా ఉండడంతో చాలా మంది ఇంగ్లిష్ ఫ్యాన్స్.. వరల్డ్‌కప్ మ్యాచ్‌లను టీవీల్లో వీక్షించడం లేదని ఇటీవల ఓ సర్వే తెలిపింది.

రేపు రానున్న కోహ్లీసేన

లండన్: వరల్డ్‌కప్ సెమీస్‌లో ఓడి టోర్నీ నుంచి అవుటైన టీమిండియా.. ఆదివారం స్వదేశానికి పయనం కానుంది. 'ఆటగాళ్లందరూ తలో చోటికి వెళ్లారు. 14న అందరూ కలుసుకొని లండన్ నుంచి ముంబై చేరుకుంటార'ని బోర్డు అధికారి ఒకరు తెలిపారు. ప్రపంచకప్ ఫైనల్ జరిగే రోజే భారత జట్టు స్వదేశానికి బయల్దేరనుంది. బ్రేక్ రావడంతో ఆటగాళ్లు తమకు నచ్చిన చోటుకు వెళ్తున్నారని తొలుత వార్తలు వచ్చాయి. కాగా, మెగా టోర్నీ తర్వాత ధోనీ రిటైర్మెంట్ ప్రకటిస్తాడనే ఊహాగానాలు రావడంతో అందరి దృష్టీ అతడిపైనే కేంద్రీకృతమైంది. ధోనీ ముంబై నుంచి నేరుగా రాంచీకి చేరుకోనున్నట్టు సమాచారం.

విరాట్ x రోహిత్!

టీమిండియాలో వేరు కుంపట్లా?

న్యూఢిల్లీ: వరల్డ్‌కప్‌లో హాట్‌ఫేవరెట్‌గా బరిలోకి దిగిన టీమిండియా.. సెమీస్‌లోనే ఓడి ఇంటి ముఖం పట్టడాన్ని సదరు అభిమాని ఇంకా జీర్ణించుకోలేక పోతున్నాడు. లీగ్ దశలో అదరగొడుతూ టాప్‌లో నిలిచిన టీమ్.. ఒక్కసారిగా కుదేలవడంతో జట్టులో గ్రూపు తగాదాలున్నాయనే ఊహాగానాలు బయల్దేరాయి. తాజాగా కెప్టెన్ కోహ్లీ, వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ చెరో క్యాంప్ నడుపుతున్నారనే పుకార్లు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ విషయాన్ని ఓ ఆటగాడు ధ్రువీకరించినట్టుగా వార్తలు రావడం మరింత ఆందోళన కలిగించే అంశం. ఒక వర్గం కోహ్లీవైపైతే మరో వర్గం రోహిత్‌వైపు ఉన్నట్టు అతడు తెలిపాడు.

ఒంటెత్తు పోకడలా?

కోహ్లీ, కోచ్ రవిశాస్త్రి మధ్య కూడా శ్రుతి లేదనే విషయం బయటకు వస్తోంది. ఒకరికి తెలియకుండా ఒకరు నిర్ణయాలు తీసుకుంటారని సమాచారం. అదే జట్టులో అంతర్గత విభేదాలకు కారణమైందని కూడా విశ్లేషిస్తున్నారు. వరల్డ్‌కప్‌కు అంబటి రాయుడును కాదని విజయ్ శంకర్ ఎంపిక చేయడమే దానికి ఉదాహరణగా చెబుతున్నారు. కోహ్లీకి బోర్డు పాలకుల కమిటీ (సీవోఏ) చీఫ్ వినోద్ రాయ్ అండదండలు ఉండడంతో అతడి నిర్ణయాలను ఎవరూ వ్యతిరేకించే సాహసం చేయలేక పోతున్నారట..! కోచ్ కుంబ్లే విషయంలోనూ కోహ్లీ పంతం నెగ్గిందంటే సీవోఏ వల్లనే అని తెలుస్తోంది. ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌ల్లో టీమిండియా ఘోరంగా ఓడినా.. కోహ్లీని ఎవరూ వేలెత్తి చూపలేకపోవడానికి కారణం కూడా అదేనట!

వాళ్లకే పెద్ద పీట?

కోహ్లీ వర్గ ఆటగాళ్లకే ఎంపికలో ప్రాముఖ్యత. కేఎల్ రాహుల్ ఫామ్‌లో లేకపోయినా అతడికి జట్టులో చోటుదక్కుతుందంటే కోహ్లీ వల్లనే అని పేరు చెప్పని ఓ క్రికెటర్ ఆక్రోశం వ్యక్తం చేశాడు. స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ జట్టులో ఉంటున్నాడంటే దానికి రాయల్ చాలెంజర్ బెంగళూరుతో కోహ్లీకి ఉన్న సంబంధాలేనని మరీ మరీ చెప్పాడు. రాయుడు జట్టులోకి రాకూడదని టీమ్ మేనేజ్‌మెంట్ బలంగా కోరుకుందని కూడా తెలిపాడు. ఒకటి రెండు ఇన్నింగ్స్‌లో విఫలమైతే ఆ కారణంగా అతడిని జట్టు నుంచి తప్పించే అవకాశం కోసం వారు ఎదురుచూశారన్నాడు.

జట్టుగా విఫలమయ్యాం.. బాధపడుతున్నా

అవసరమైనప్పుడు జట్టుగా ఆడడంలో పూర్తిగా విఫలమయ్యాం. అరగంట దారుణమైన ఆటతీరు ప్రపంచకప్‌లో ఫైనల్ చేరే అవకాశాన్ని కోల్పోయేలా చేసింది. ఈ ఓటమితో చాలా బాధలో ఉన్నా. మీరు కూడా నాలాగే భారమైన హృదయాలతో ఉన్నారని తెలుసు. ఏదేమైనా ఇంగ్లండ్ గడ్డపై భారత అభిమానుల నుంచి లభించిన స్పందన అమోఘం. టీమిండియా ఆడిన ప్రతి చోట ఇంగ్లండ్‌ను నీలం రంగులో మార్చినందుకు ధన్యవాదాలు.

– ట్విటర్‌లో రోహిత్ శర్మ


రవిశాస్త్రి

ఎందుకిలా?

- ప్రపంచకప్‌లో టీమిండియా ప్రదర్శనపై సమీక్ష
- కోహ్లీ, రవిశాస్త్రితో త్వరలో సీఓఏ భేటీ
- ధోని బ్యాటింగ్ ఆర్డర్‌పై నిలదీసే అవకాశం

"రాయుడి అంశంపైనా చర్చ!

లండన్: ప్రపంచకప్‌లో భారత జట్టు ఆటతీరును క్రికెట్ పాలక కమిటీ (సీఓఏ) సమీక్షించనుంది. కెప్టెన్ కోహ్లీ, కోచ్ రవిశాస్త్రి స్వదేశం తిరిగి వచ్చాక వారితో సమావేశం కానున్న సీఓఏ..మెగా టోర్నీలో టీమిండియా ఎంపిక తీరుతెన్నులను సమీక్షించనుంది. అలాగే సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్‌తో కూడా భేటీ కానున్న సీఓఏ..వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరిగే టీ20 వరల్డ్‌కప్‌నకు రోడ్‌మ్యాప్‌పై చర్చించనున్నట్టు తెలుస్తోంది. 'కెప్టెన్, కోచ్ తిరిగి వచ్చాక వారితో సమీక్ష నిర్వహిస్తాం. అయితే ఏ తేదీన వారితో సమావేశం అయ్యేది కచ్చితంగా చెప్పలేను. వారిద్దరితో భేటీ కానున్నది ఖాయం. టీ20 ప్రపంచకప్‌నకు సంబంధించి సెలెక్షన్ కమిటీతోనూ మాట్లాడతాం' అని సీఓఏ ఛైర్మన్ వినోద్ రాయ్ వెల్లడించారు. ఇక..ప్రపంచకప్‌సెమీఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో ఓడిన నేపథ్యంలో కెప్టెన్, కోచ్‌తోపాటు సెలెక్షన్ కమిటీ ఛైర్మన్‌ను కొన్ని అంశాలపై సీఓఏ నిలదీసే అవకాశాలున్నాయి. ముఖ్యంగా.. అంబటి రాయుడు విషయంలో అనుసరించిన వైఖరిని ప్రశ్నించనున్నట్టు సమాచారం. వరల్డ్‌కప్ స్టాండ్‌బైగా ఎంపిక చేసిన రాయుడిని విజయ్ శంకర్ గాయపడిన తర్వాత జట్టులోకి తీసుకోలేదు. దాంతో మనస్తాపం చెందిన హైదరాబాద్ బ్యాట్స్‌మన్ కెరీర్‌కు గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే. జట్టులో ఏకంగా ముగ్గురు కీపర్లకు స్థానం కల్పించడంపైనా భేటీలో చర్చకు రానుంది. ఇటీవలి కాలంలో వన్డేలలో పెద్దగా సత్తా చాటని దినేశ్ కార్తీక్‌ను మెగా టోర్నీకి ఎంపిక చేయడంపై సీఓఏ వివరణ కోరే అవకాశముంది. ఇక..సెమీఫైనల్లో జట్టు 5/3తో తీవ్ర కష్టాల్లో కూరుకుపోయిన తరుణంలో ధోనీని ఏడో స్థానంలో బరిలోకి దించిన విషయాన్ని సీఓఏ ప్రస్తావించనున్నట్టు సమాచారం. ధోనీ బ్యాటింగ్ స్థానంపై నిర్ణయం తీసుకున్న బ్యాటింగ్ కోచ్ బంగర్‌ను ప్రశ్నించడంతోపాటు దీనిపై కోచ్ రవిశాస్త్రి వివరణను కూడా అడగనుంది. బీసీసీఐ తదుపరి వార్షిక సాధారణ సమావేశం జరిగే వరకూ ప్రస్తుత సెలెక్షన్ కమిటీయే కొనసాగనుంది. దాంతో సెలక్షన్ కమిటీ సమావేశాల్లో ఛైర్మన్ ప్రసాద్ మరింత గట్టిగా వ్యవహరించాలని సీఓఏ అతడికి సూచించనున్నట్టు తెలుస్తోంది.

జొకోవిచ్
రోజర్ ఫెదరర్,

రోజర్ వచ్చాడు

నదాల్‌కు షాకిచ్చి ఫైనల్ చేరిన స్విస్ మాస్టర్ ● జొకోవిచ్‌తో తుదిసమరం రేపు


నదాల్

లండన్: ఇద్దరు దిగ్గజాల మధ్య సాగిన వింబుల్డన్ సెమీఫైనల్ అభిమానులకు అసలు సిసలు మజా పంచింది. రెండోసీడ్ రోజర్ ఫెదరర్, మూడో సీడ్ రఫెల్ నదాల్ మధ్య జరిగిన ఈ సమరం ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగింది. అయితే చివరకు స్విస్ దిగ్గజం ఫెదరర్ విజయం సాధించి గ్రాస్‌కోర్టులపై తనకు తిరుగులేదని నిరూపించాడు. శనివారం జరిగిన మ్యాచ్‌లో స్విస్‌స్టార్ ఫెదరర్ 7-6 (3), 1-6, 6-3, 6-4 స్కోరుతో స్పెయిన్ బుల్ నదాల్‌ను చిత్తుచేశాడు. ఆదివారం జరిగే ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ నొవాక్ జొకోవిచ్‌తో ఫెదరర్ అమీతుమీ తేల్చుకోనున్నారు. తొలి సెమీఫైనల్లో టాప్‌సీడ్ జొకోవిచ్ 6-2, 4-6, 6-3, 6-2 స్కోరుతో స్పెయిన్‌కు చెందిన బౌటిస్టా అగట్‌పై విజయం సాధించాడు.

నువ్వానేనా..: మాజీ చాంపియన్లు ఫెదరర్-నదాల్ మధ్య నాలుగు సెట్ల సెమీఫైనల్ నువ్వానేనా అనేలా సాగింది. ఇద్దరు ప్రతి పాయింట్‌కోసం పోరాడడంతో తొలి సెట్ టైబ్రేకర్‌కు వెళ్లింది. అయితే టైబ్రేకర్‌లో పైచేయి సాధించిన ఫెదరర్ సెట్‌ను గెలుపొందాడు. ఇక ఏకపక్షంగా సాగిన రెండో సెట్‌ను నదాల్ సొంతం చేసుకుని స్కోరును సమం చేశాడు. ఈనేపథ్యంలో మూడోసెట్‌లో హోరాహోరీ తప్పదనుకొంటే..నదాల్ ఈ సెట్‌లో పూర్తిగా తేలిపోయాడు. దాంతో మూడో సెట్‌ను కైవసం చేసుకున్న ఫెడెక్స్ అదే ఊపుతో నాలుగో సెట్‌లో గెలుపొంది మ్యాచ్‌ను చేజిక్కించుకున్నాడు. 2008 వింబుల్డన్ ఫైనల్ తర్వాత ఆల్‌ఇంగ్లండ్ క్లబ్‌లో ఫెదరర్-నదాల్ ముఖాముఖి తలపడడం ఇదే తొలిసారి. అయితే అప్పుడు ఎదురైన ఓటమికి ఈ విజయంతో ఫెదరర్ ప్రతీకారం తీర్చుకున్నాడు.

ఇక జొకోతో మ్యాచ్‌లో 23వ సీడ్ అగట్ అంచనాలకు మించి రాణించాడు. సెర్బియా వీరుడు జొకోను గట్టిగా ప్రతిఘటించడంతోపాటు రెండోసెట్‌ను గెలుచుకొని అతడికి షాకిచ్చాడు. అయితే తేరుకున్న జొకోవిచ్ తర్వాతి రెండు సెట్లను గెలుచొని ఆరోసారి వింబుల్డన్ ఫైనల్లో అడుగుపెట్టాడు.



సెరెనా సాధించేనా?

- నేడు హాలెప్‌తో టైటిల్ పోరు
- గెలిస్తే మార్గరెట్ కోర్ట్ రికార్డు సమం

సా.6.30 నుంచి స్టార్ స్పోర్ట్స్ సెలెక్ట్-1లో

వింబుల్డన్ మహిళల సింగిల్స్ టైటిల్‌కోసం సెరెనా విలియమ్స్, సిమోనా హలెప్ శనివారం తలపడనున్నారు. కెరీర్‌లో లెక్కకు మిక్కిలి గ్రాండ్‌స్లామ్‌లు గెలుచుకున్న సెరెనా.. సింగిల్స్‌లో ఆస్ట్రేలియా దిగ్గజం మార్గరెట్ కోర్ట్ 24 గ్రాండ్‌స్లామ్‌ల రికార్డును అందుకోవాలని రెండేళ్లుగా ప్రయత్నిస్తున్నా సాధ్యం కావడంలేదు. ఇప్పుడు వింబుల్డన్ రూపంలో ఆ రికార్డును సమం చేసేందుకు చాన్స్ లభించింది. అయితే రొమేనియాకు చెందిన మాజీ వరల్డ్ నెంబర్ వన్ హలెప్.. 37 ఏళ్ల సెరెనాకు ఆ అవకాశం దక్కనిస్తుందా అన్నదే ప్రశ్న.

విండీస్ టూర్‌కు కోహ్లీ, బుమ్రా దూరం..!

న్యూఢిల్లీ: వరల్డ్‌కప్ నుంచి అవుటైన టీమిండియా వచ్చే నెలలో జరగనున్న వెస్టిండీస్ పర్యటనకు సిద్ధం కానుంది. అయితే, తీరిక లేకుండా క్రికెట్ ఆడుతున్న కోహ్లీ, పేసర్ బుమ్రాకు సెలెక్టర్లు విశ్రాంతి నిచ్చే అవకాశాలున్నాయి. ఆగస్టు 3 నుంచి ఆరంభమయ్యే విండీస్ టూర్‌లో భారత్ 3 టీ20లు, 3 వన్డేలు, రెండు టెస్టులు ఆడనుంది. బుమ్రా, కోహ్లీలు పరిమిత ఓవర్ల క్రికెట్‌కు దూరమైనా టెస్టు సిరీస్‌కు మాత్రం జట్టులోకి వస్తారని సమాచారం. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్ కూడా బ్రేక్ ఇచ్చే అవకాశం ఉంది. కాగా, వరల్డ్‌కప్ తర్వాత ధోనీ భవితవ్యం డోలాయమానంలో పడింది. రిటైర్మెంట్‌పై ఊహాగాలు వెలువతున్న నేపథ్యంలో సెలెక్టర్లు ఎలా వ్యవహరిస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఈ నెల 17 లేదా 18న జరిగే సమావేశంలో విండీస్ టూర్‌కు జట్టును ఎంపిక చేయనున్నారు. ధోనీ రిటైర్మెంట్ ప్రకటించక పోయినా అతడికి కూడా బ్రేక్ ఇచ్చే అవకాశాలున్నాయని బోర్డు అధికారి ఒకరు చెప్పారు.

ఫైనల్‌కు ఫీల్డ్ అంపైర్లుగా ధర్మసేన, ఎరాస్మస్

లండన్: లార్డ్స్ మైదానంలో ఆదివారం ఇంగ్లండ్-న్యూజిలాండ్ మధ్య జరగనున్న వరల్డ్‌కప్ ఫైనల్‌కు కుమార్ ధర్మసేన, మారియస్ ఎరాస్మస్ ఫీల్డ్ అంపైర్లుగా వ్యవహరించనున్నారు. రాడ్ టక్కర్ థర్డ్ అంపైర్‌గా, అలీమ్ దార్ ఫోర్త్ అంపైర్‌గా, రంజన్ మదుగల్లే రెఫరీగా బాధ్యతలు నిర్వర్తించనున్నట్టు ఐసీసీ తెలిపింది. అయితే ఆస్ట్రేలియాతో సెమీస్‌లో సెంచరీ దిశగా సాగుతున్న ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్ జేసన్ రాయ్ అంపైర్ ధర్మసేన తప్పుడు నిర్ణయంతో అవుటైన సంగతి తెలిసిందే. దీంతో ధర్మసేన అంపైరింగ్‌పై తీవ్ర విమర్శలు చెలరేగాయి. కానీ, ఐసీసీ మాత్రం టైటిల్ ఫైట్‌కు అతడినే అంపైర్‌గా ఎంపిక చేయడం గమనార్హం.

మెరిసిన శ్రేయాస్, ఖలీల్

విండీస్-ఎపై భారత్-ఎ గెలుపు

కూలిడ్జ్ (ఆంటిగ్వా): వెస్టిండీస్-ఎతో అనధికారిక ఐదు వన్డేల సిరీస్‌లో భారత్-ఎ శుభారంభం చేసింది. శ్రేయాస్ అయ్యర్ (77), ఖలీల్ అహ్మద్ (3/16) రాణించడంతో భారత్-ఎ 65 పరుగులతో విండీస్-ఎపై గెలిచి.. 1-0తో సిరీస్‌లో ఆధిక్యం సాధించింది. తొలుత శ్రేయాస్ అర్ధ సెంచరీతో ఆదుకోవడంతో యువ భారత్ 48.5 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌటైంది. విహారి 34, అక్షర్ పటేల్ 17 రన్స్ చేశారు. రోస్టన్ ఛేజ్ 4, అకీమ్ జోర్డాన్ 3 వికెట్లు తీశారు. స్వల్ప ఛేదనలో భారత బౌలర్ల దెబ్బకు విండీస్-ఎ 35.5 ఓవర్లలో 125 రన్స్‌కే కుప్పకూలి.. ఓటమి పాలైంది. జొనాథన్ కార్టర్ (41 నాటౌట్), రోమన్ పావెల్ (41) పోరాడినా ఓటమి తప్పలేదు. ఖలీల్‌తో పాటు చాహర్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ రెండేసి వికెట్లు తీశారు.

జట్టులో రీఎంట్రీకి డిమాండ్ చేయలేదు



జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా వరల్డ్‌కప్ జట్టులోకి మాజీ క్రికెటర్ డివిలీర్స్ రీఎంట్రీ ఇవ్వాలనే ప్రయత్నం చేశాడనే సమాచారం లీక్ కావడం పెద్ద దుమారాన్నే రేపింది. అయితే, ఈ వివాదంపై డివిలీర్స్ మౌనం వీడాడు. ఆఖరి నిమిషంలో వరల్డ్‌కప్ జట్టులోకి రావడానికి తాను ఎటువంటి డిమాండ్ చేయలేదంటూ తనవైపు వాదనను వినిపించాడు. 'నేను ఎటువంటి డిమాండ్ చేయలేదు. ప్రపంచకప్ టీమ్‌లోకి రీఎంట్రీ ఇవ్వాలని ఎలాంటి ఒత్తిడీ చేయలేదు. ఎన్నడూ అలా భావించలేద'ని డివిలీర్స్ చెప్పాడు. అయితే, రిటైర్మెంట్‌ను ప్రకటించిన రోజు తనకు వరల్డ్‌కప్ ఆడే అవకాశం ఉంటుందా? అని వ్యక్తిగతంగా అడిగానని డివిలీర్స్ చెప్పాడు. కెప్టెన్ డుప్లెసితో మాట్లాడినప్పుడు ఎంతో అవసరమైతేనే తాను అందుబాటులో ఉంటానని స్పష్టం చేశానన్నాడు. కానీ, టీమిండియాతో మ్యాచ్‌లో ఓటమి అనంతరం మా మధ్య జరిగిన వ్యక్తిగత సంభాషణ బయటకు రావడం ఎంతో బాధించిందన్నాడు. జట్టు వైఫల్యం నుంచి దృష్టి మరల్చడానికే ఎవరో ఈ సమాచారాన్ని లీక్ చేశారని డివిలీర్స్ చెప్పాడు. కుటుంబంతో గడపాలనే సహేతుకమైన కారణంతోనే రిటైర్మెంట్ ప్రకటించానన్నాడు.

కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్‌లో
రాహుల్‌కు రజతం

బాపట్ల టౌన్ (ఆంధ్రజ్యోతి): కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో రాగాల వెంకట రాహుల్ రజతం పతకం సొంతం చేసుకున్నాడు. సమోవాలో జరుగుతున్న ఈ పోటీల్లో 89 కిలోల విభాగంలో మొత్తం 320 కిలోల బరువు ఎత్తి సత్తా చాటాడు. రాహుల్ హైదరాబాద్‌లోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ పూర్వ విద్యార్థి. 2018 కామన్వెల్త్ క్రీడల్లో 85 కిలోల విభాగంలో రాహుల్ పసిడి పతకం నెగ్గిన విషయం విదితమే. వచ్చే ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించడమే లక్ష్యంగా రాహుల్ సాధన చేస్తున్నాడని అతడి తండ్రి మధు తెలిపారు.

బెకర్ ట్రోఫీలకు రూ. 5.90 కోట్లు

లండన్: అప్పుల ఊబిలో కూరుకుపోయిన జర్మన్ టెన్నిస్ లెజెండ్ బోరిస్ బెకర్‌కు చెందిన ట్రోఫీలు, ఇతర జ్ఞాపికలు ఆన్‌వేలంలో భారీ ధర పలికాయి. 82 ట్రోఫీలు, జ్ఞాపికలు కలిపి మొత్తం రూ. 5.90 కోట్లకు అమ్ముడైనట్టు వేలం నిర్వహించిన సంస్థ తెలిపింది. రెండేళ్ల క్రితం బెకర్ రూ. 3.43 కోట్ల అప్పుల్లో కూరుకుపోయినట్టు కోర్టు ప్రకటించింది. కాగా, 1989 యూఎస్ ఓపెన్‌లో ఇవాన్ లెండిల్‌పై నెగ్గి బెకర్ సాధించిన ట్రోఫీ అత్యధికంగా రూ. 1.29 కోట్లు రాబట్టింది.

అఫ్ఘానిస్థాన్ అన్ని ఫార్మాట్లకు
కెప్టెన్‌గా రషీద్ ఖాన్

కాబూల్: ప్రపంచకప్‌లో ఒక్క విజయాన్ని కూడా నమోదు చేయలేకపోయిన అఫ్ఘానిస్థాన్ క్రికెట్ జట్టులో ప్రక్షాళన మొదలైంది. కెప్టెన్ గుల్బదిన్ నయీబ్‌పై వేటు పడింది. స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్‌ను అన్ని ఫార్మాట్లకు కెప్టెన్‌గా నియమిస్తున్నట్టు అఫ్ఘాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) శుక్రవారం ప్రకటించింది. ప్రపంచకప్‌నకు ముందు అర్ధాంతరంగా కెప్టెన్సీ నుంచి ఉద్వాసనకు గురైన అస్ఘర్ అఫ్ఘాన్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించింది. 'అన్ని ఫార్మాట్లకు సారథిగా రషీద్ ఖాన్‌కు బాధ్యతలు అప్పగించాం. ఇతనికి డిప్యూటీగా అస్ఘర్ అఫ్ఘాన్ వ్యవహరిస్తాడు' అని ఏసీబీ ట్విటర్‌లో పోస్ట్ చేసింది. మెగా టోర్నీకి ముందు అఫ్ఘాన్ టెస్టు జట్టు కెప్టెన్‌గా రహ్మత్ షా, వన్డేలకు గుల్బదిన్, టీ20లకు రషీద్ ఖాన్ కెప్టెన్లుగా ఉన్న సంగతి తెలిసిందే. ఇక, చీఫ్ సెలెక్టర్ దవ్లాత్ ఖాన్ అహ్మదాజిని కూడా పదవి నుంచి తొలగించింది ఏసీబీ.

గోవాలో నలుగురు మంత్రులు ఔట్!

- ముగ్గురు జీఎఫ్‌పీ, ఒకరు స్వతంత్ర ఎమ్మెల్యే.. రాజీనామా కోరానన్న సీఎం

పనాజి, జూలై 12: గోవాలో కాంగ్రెస్ శాసనసభాపక్షం బీజేఎల్పీలో విలీనం కావడంతో.. ఆ ఎమ్మెల్యేల్లో నలుగురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు బీజేపీ సిద్ధమైంది. ఈ మేరకు ప్రస్తుత మంత్రివర్గంలోని నలుగురు మంత్రులను తొలగించాలని నిర్ణయించింది. ఇందుకోసం సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న గోవా ఫార్వర్డ్ పార్టీ(జీఎఫ్‌పీ)కి చెందిన ముగ్గురు మంత్రులను, స్వతంత్ర ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి చేపట్టిన రోహన్ ఖాంటేను తమ పదవులకు రాజీనామా చేయాల్సిందిగా కోరినట్లు ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ తెలిపారు. వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తామన్నారు. బీజేపీ జాతీయ నాయకత్వం ఆదేశం మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. రాజీనామా కోరిన జీఎఫ్‌పీ మంత్రుల పేర్లను మాత్రం ఆయన వెల్లడించలేదు. అయితే ఈ నిర్ణయంపై ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. తమ పార్టీకి చెందిన మంత్రులెవరికీ దీనిపై సమాచారం లేదని జీఎఫ్‌పీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం విజయ్ సర్దేశాయ్ అన్నారు. 40 స్థానాల గోవా అసెంబ్లీకి 2017లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 17 స్థానాలను గెలుచుకొని అతిపెద్ద పార్టీగా అవతరించగా.. బీజేపీ 13 స్థానాలనే దక్కించుకోగలిగింది. అయినా.. జీఎఫ్‌పీతోపాటు, స్వతంత్రుల మద్దతుతో బీజేపీయే అధికారాన్ని చేపట్టింది. ఈ ఏడాది మార్చిలో సీఎం మనోహర్ పర్రీకర్ మరణం తర్వాత కూడా జీఎఫ్‌పీ తమ మద్దతు కొనసాగిస్తూ వచ్చింది. మరోవైపు సీఎల్పీ విలీనం పేరుతో 10 మంది ఎమ్మెల్యేలు చేజారడంతో కాంగ్రెస్ పరిస్థితి దయనీయంగా మారింది. ప్రస్తుతం ఆ పార్టీకి ఐదుగురు ఎమ్మెల్యేలే మిగిలారు. అయితే ఎమ్మెల్యేలు వెళ్లినంత మాత్రాన తాము బలహీనపడలేదని గోవా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రతిమా కౌటిన్హో అన్నారు. కాగా గోవాలో జరుగుతున్నది రాజకీయ వ్యభిచారమని కాంగ్రెస్ ఎమ్మెల్యే అలెక్సో రెజినాల్డో లౌరెన్సో మండిపడ్డారు.

ఎంపీలో 'వాతావరణం' మారబోతోంది: బీజేపీ

పార్టీ నేతలకు రాష్ట్ర కాంగ్రెస్ విందు.. ఐకమత్యం చాటేందుకే..?

భోపాల్, జూలై 12: మధ్యప్రదేశ్‌లో అధికార కాంగ్రెస్ గురువారం రాత్రి పార్టీ నేతలకు విందు ఏర్పాటు చేసింది. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి తులసి సిలావత్ ఇంటివద్ద జరిగిన ఈ విందుకు ముఖ్యమంత్రి కమల్‌నాథ్, సీనియర్ నాయకుడు జ్యోతిరాదిత్య సింధియా సహా మం త్రులు, పార్టీ ఎమ్మెల్యేలతో పాటు ఎస్పీ, బీఎస్పీ, స్వతంత్ర ఎమ్మెల్యేలు కూడా హాజరయ్యారు. కర్ణాటక, గోవాల్లో బీజేపీ దూకుడు, తదనుగుణంగా చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలను చూసి, రాష్ట్ర కాంగ్రెస్‌లో అలజడి నెలకొందని రాష్ట్ర రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. పార్టీలో నాయకులంతా ఒకే తాటిపై ఐకమత్యంగా ఉన్నారని చాటేందుకే ఈ విందు ఏర్పాటు చేసినట్లు అంచనా వేస్తున్నాయి. అయితే మధ్యప్రదేశ్‌లో మార్పు తప్పదని బీజేపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. "గోవా, కర్ణాటకల నుంచి రుతుపవనాలు ఇప్పుడు మధ్యప్రదేశ్‌కు చేరుకున్నాయి. త్వరలోనే రాష్ట్రంలో వాతావరణ మార్పు రానుంది. కాంగ్రెస్ వాళ్ల నిద్రలేచిన ప్రతిసారి, తమ ఎమ్మెల్యేలను లెక్కపెట్టుకోవాలి" అని బీజేపీ ఎమ్మెల్యే నరోత్తమ్ మిశ్రా హెచ్చరించారు.

కర్ణాటకకు చెందిన 14 మంది తిరుగుబాటు ఎమ్మెల్యేల్లో నలుగురు శుక్రవారం ముంబైలోని ప్రముఖ సిద్ధి వినాయక ఆలయాన్ని దర్శించి పూజలు చేశారు.

మురళీధర్ రావుకు అమిత్ షా క్లాస్

- బీజేపీ సీనియర్ నేత ఈశ్వరప్పకు కూడా
- కుమారస్వామి సన్నిహితుడితో చర్చలేంటని మండిపాటు

బెంగళూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్ మంత్రి, ముఖ్యమంత్రి కుమార స్వామికి అత్యంత సన్నిహితుడు సా.రా. మహేశ్‌తో గురువారం రాత్రి చర్చలు జరిపిన పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మురళీధర్ రావుపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా తీవ్రస్థాయిలో మండిపడినట్టు విశ్వసనీయంగా తెలిసింది. మురళీధర్ రావుతోపాటు ఈ చర్చల్లో పాల్గొన్న బీజేపీ సీనియర్ నేత ఈశ్వరప్పకు కూడా ఆయన క్లాస్ పీకినట్టు సమాచారం. బెంగళూరులోని కుమార కృప అతిథి గృహంలో గురువారం రాత్రి మహేశ్, ఈశ్వరప్ప, మురళీధర్‌రావులు రహస్య చర్చలు జరిపిన విషయంపై మీడియాలో కథనాలు గుప్పుమన్నాయి. దీంతో అమిత్ షా ఫోన్ చేసి మురళీధర్, ఈశ్వరప్పలకు క్లాస్ పీకినట్టు తెలిసింది. అసలు సా.రా. మహేశ్‌తో భేటీ కావాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీసినట్టు సమాచారం. తక్షణం కర్ణాటక నుంచి వచ్చేయమని కూడా మురళీధర్ రావుకు హుకుం జారీ చేసినట్టు బీజేపీ వర్గాలు తెలిపాయి. దాంతో, నాలుగు రోజులుగా బెంగళూరులోనే మకాం వేసిన మురళీధర్‌రావు తక్షణం హైదరాబాద్‌కు బయల్దేరారు. కాగా, మహేశ్‌తో ఎలాంటి రాజకీయ చర్చ జరగలేదని అమిత్‌షాకు 20 నిమిషాలపాటు ఫోన్‌లోనే మురళీధర్ వివరించారట!

జేడీఎస్‌తో చేతులు కలపం: యడ్యూరప్ప

జేడీఎస్‌తో చేతులు కలిపి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ఉద్దేశం తమకు లేనే లేదని కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడ్యూరప్ప తేల్చి చెప్పారు. గతంలో జేడీఎస్‌తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసినపుడు అనుభవించిన కష్టాలు చాలన్నారు.

స్పీకర్ అయితే.. మేం చేతులు కట్టుకుని కూర్చోవాలా!?

మా అధికారాన్ని సవాల్ చేస్తున్నారా!?.. కర్ణాటక సంక్షోభంపై సుప్రీం వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జూలై 12: "సుప్రీం కోర్టు అధికారాన్ని స్పీకర్ సవాల్ చేస్తున్నారా!? అదేనా ఆయన ఉద్దేశం!? స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేయడానికి సంబంధించి మాకున్న అధికారాన్ని మీరు సవాల్ చేస్తున్నారా!? స్పీకర్‌కు సంబంధించిన విషయాల్లో మేం చేతులు కట్టుకుని కూర్చోవాలని మీరు అంటున్నారా!?" అని కర్ణాటక స్పీకర్ తరఫు న్యాయవాదిని ఉద్దేశించి సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. వారి రాజీనామాల కంటే ముందే అనర్హతపై నిర్ణయం తీసుకుంటే ఆయన చట్టబద్ధంగా పని చేసినట్లని మీరు సూచిస్తున్నారా? అని ప్రశ్నించింది. దాంతో, తమ ఉద్దేశం అదేనని స్పీకర్ తరఫు న్యాయవాది ఏఎం సింఘ్వి స్పష్టం చేశారు. కర్ణాటక సంక్షోభానికి సంబంధించి శుక్రవారం సుప్రీం కోర్టులో వాడి వేడి వాదనలు సాగాయి. ఈ నేపథ్యంలోనే, తిరుగుబాటు ఎమ్మెల్యేల రాజీనామా, అనర్హతపై మంగళవారం వరకూ ఎటువంటి నిర్ణయం తీసుకోవద్దని కర్ణాటక అసెంబ్లీ స్పీకర్‌కు సుప్రీం కోర్టు నిర్దేశించింది. ఈ కేసులో 'లోతైన విషయాలు తెరపైకి వస్తున్నాయని', వాటిపై 16వ తేదీ మంగళవారం విచారిస్తామని, అప్పటి వరకూ యథాతథస్థితిని కొనసాగించాలని సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, న్యాయమూర్తులు జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ అనిరుద్ధ బోస్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. కేసు విచారణ సందర్భంగా లేవనెత్తిన 'పెద్ద అంశాలపై తాము నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, అందుకే, తిరుగుబాటు ఎమ్మెల్యేల రాజీనామాలు, అనర్హతపై ఎటువంటి నిర్ణయం తీసుకోవద్దని స్పీకర్‌కు తేల్చి చెప్పింది. తిరుగుబాటు ఎమ్మెల్యేల పిటిషన్ విచారణ యోగ్యతను స్పీకర్ రమేశ్ కుమార్, ముఖ్యమంత్రి కుమారస్వామి రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం లేవనెత్తారని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, ఎమ్మెల్యేల రాజీనామాలపై నిర్ణయాని కంటే ముందే వారిని అనర్హులను చేయడంపై తొలుత నిర్ణయం తీసుకోవాలన్న స్పీకర్ వినతిని తిరుగుబాటు ఎమ్మెల్యేల తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గీ తప్పుబట్టారని కూడా ధర్మాసనం పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ కేసును మరింత విచారించాల్సి ఉందని తెలిపింది. అంతకుముందు, పార్టీ విప్‌కు ఎమ్మెల్యేలు కట్టుబడి ఉండేలా చేయడంతోపాటు సంక్షోభాన్ని కొనసాగించడానికే ఎమ్మెల్యేల రాజీనామాలపై స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని ముకుల్ రోహత్గీ ఆరోపించారు. ఎమ్మెల్యేలు సుప్రీం కోర్టును ఆశ్రయించడాన్ని స్పీకర్ తప్పుబట్టారని, 'మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి' (గో టు హెల్) అని మీడియా ఎదుటే వ్యాఖ్యానించారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. "రాజీనామాలపై నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్‌కు ఒకటి రెండు రోజులు సమయం ఇవ్వవచ్చు. అప్పటికీ ఆయన నిర్ణయం తీసుకోకపోతే, కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేయవచ్చు. సభలో స్పీకర్ నిర్వహించే శాసన, ఇతర వ్యవహారాలకే న్యాయ సమీక్ష నుంచి మినహాయింపు ఉంటుంది. రాజీనామాలకు సంబంధించి అటువంటి మినహాయింపులు, రక్షణలు ఉండవు" అని రోహత్గీ వివరించారు. రాజీనామాలపై నిర్ణయం తీసుకోవడానికి తనకు మరింత సమయం కావాలని అంటూనే.. తనకు ఆదేశాలు జారీ చేయడానికి సుప్రీం కోర్టుకు ఉన్న అధికారాలను ఆయన సవాల్ చేస్తున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అయితే, అసెంబ్లీ స్పీకర్ అనేది రాజ్యాంగబద్ధమైన పదవి అని, తొలుత అనర్హతపై నిర్ణయం తీసుకునే హక్కు ఆయనకు ఉంటుందని స్పీకర్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ఏఎం సింఘ్వి తెలిపారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే హక్కు రాజ్యాంగం ప్రకారం ఆయనకు ఉందని తేల్చి చెప్పారు. ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం ఎమ్మెల్యేలు అనర్హతకు గురవుతారని, దాని నుంచి తప్పించుకోవడానికే రాజీనామాలు చేశారని తెలిపారు. స్పీకర్ అసెంబ్లీలో సీనియర్ సభ్యుడని, రాజ్యాంగ విధి విధానాలు ఆయనకు తెలుసునని, ఆయనను ఈ విధంగా అధిక్షేపించడం, నిందాపూర్వకంగా మాట్లాడడం తగదని వాదించారు.

శాసనసభలో కుమారస్వామి

బలపరీక్షకు రెడీ!

- సీఎం కుమారస్వామి అనూహ్య ప్రకటన
- తేదీ నిర్ణయించాలని సభలోనే స్పీకర్‌కు వినతి

బెంగళూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో బల పరీక్షకు సిద్ధమని కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్.డి. కుమారస్వామి శుక్రవారం అనూహ్య ప్రకటన చేశారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ సంక్షోభంతో కలత చెందానని, శాశ్వతంగా అధికారంలో ఉండాలని భావించడం లేదని అన్నారు. తాను అన్నింటికీ సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. శాసనసభ వర్షాకాల సమావేశాలు శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభమయ్యాయి. దివంగత నేతలకు శ్రద్ధాంజలి ఘటించిన తర్వాత సీఎం ప్రసంగించారు. శాసనసభలో బలం ఉన్నప్పుడే కీలక నిర్ణయాలు తీసుకోగలమన్నారు. "అసంతృప్త ఎమ్మెల్యేల రాజీనామాలు రాష్ట్ర రాజకీయాల్లో కల్లోలం రేపుతున్నాయి. మీరు తగిన సమయాన్ని కేటాయించి, తేదీ నిర్ణయిస్తే బలం నిరూపించుకునేందుకు సిద్ధపడతాను" అని స్పీకర్ రమేశ్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. శాసనసభ సాక్షిగా సీఎం ఈ వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు ఇటు అధికార.. అటు ప్రతిపక్ష బెంచీల్లో నిశ్శబ్ద వాతావరణం కనిపించింది. కాగా, ముఖ్యమంత్రి ఎప్పుడు కోరితే అప్పుడు సమయం ఇవ్వడానికి తాను సిద్ధమని స్పీకర్ రమేశ్ కుమార్ ప్రకటించారు. విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పిన మర్నాడే బల పరీక్షకు ఏర్పాట్లు చేస్తానన్నారు. విశ్వాస పరీక్షపై నిర్ణయాన్ని కాంగ్రెస్, జేడీఎస్ నేతలు ఉమ్మడిగానే తీసుకున్నామని మాజీ సీఎం సిద్దరామయ్య తెలిపారు.

సిద్దూకు చెక్ పెట్టేందుకే..

రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఏదో ఒక రూపంలో చికాకు సృష్టిస్తున్న మాజీ సీఎం సిద్దరామయ్య తీరుపై ముఖ్యమంత్రి కుమారస్వామి కొద్ది కాలంగా ఆగ్రహంతో ఉన్నారు. తిరుగుబావుటా ఎగరేసిన 13 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో అత్యధికులు సిద్దరామయ్య శిష్యులే! ఈ నేపథ్యంలోనే, సిద్దూ ప్రయోగించిన అస్త్రానికి దీటుగా కుమారస్వామి బల పరీక్ష అస్త్రాన్ని తెరపైకి తెచ్చారని భావిస్తున్నారు. నిజానికి, మొత్తం 16 మంది అసంతృప్త ఎమ్మెల్యేల రాజీనామాలు స్పీకర్ వద్ద ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. మంగళవారం వరకూ వాటిపై నిర్ణయం తీసుకోవద్దని స్పీకర్‌కు సుప్రీం నిర్దేశించింది. అయితే మంగళవారంలోపే బల పరీక్షకు వెళ్లవచ్చని భావిస్తున్నారు. 224 సీట్ల కర్ణాటక అసెంబ్లీలో స్పీకర్ కాకుండా అధికార సంకీర్ణం బలం 116 (కాంగ్రెస్-78, జేడీఎస్-37, బీఎస్పీ-1) స్థానాలు. వీరిలో 16 మంది తిరుగుబాటు చేశారు. ఇక, బీజేపీ బలం 107 సీట్లు. బల పరీక్షలో నెగ్గాలంటే మేజిక్ మార్కు 113 సీట్లు. దీంతో తిరుగుబాటు ఎమ్మెల్యేలు కీలకం కానున్నారు. బల పరీక్షలో అసంతృప్త ఎమ్మెల్యేలు విప్‌ను ఉల్లంఘిస్తే అనర్హత వేటు ఖాయం. విప్ ప్రకారమే వారు ఓటు వేస్తారని జేడీఎస్ నేతలు ఆశాభావంతో ఉన్నారు. ఒకవేళ బలపరీక్షలో ప్రభుత్వం కుప్పకూలితే సిద్దరామయ్యే కారణమనేందుకు అస్త్రం లభిస్తుందని కుమారస్వామి భావిస్తున్నారని అంటున్నారు.

డబ్బుతో ప్రభుత్వాలను కూల్చేస్తున్నారు: రాహుల్

న్యూఢిల్లీ, జూలై 12: కర్ణాటకలో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభానికి బీజేపీనే కారణమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. రాష్ట్రాలలో ప్రభుత్వాలను కూలదోసేందుకు బీజేపీ డబ్బులను వెదజల్లుతోందని ఆరోపించారు. ఇదే విషయంలో గతంలో ఈశాన్య రాష్ట్రాల్లోనూ చూశామన్నారు. కాగా, ప్రజలకోసం సైద్ధాంతిక పోరాటం చేసేందుకు తనకు అవకాశమిచ్చిన ఆరెస్సెస్ బీజేపీలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు రాహుల్ వ్యాఖ్యానించారు.

చల్లని రాజా.. ఓ చందమామా..

జాబిలి యాత్రకు సర్వం సిద్ధం

- 15వ తేదీ తెల్లవారుజామున 2.51కి చంద్రయాన్-2
- సెప్టెంబరు 6 లేదా 7న చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద ల్యాండర్ సాఫ్ట్‌ల్యాండింగ్
- మొత్తం మిషన్ ఖర్చు రూ.978 కోట్ల ఖర్చు

చందమామ దక్షిణ ధ్రువం! ఎప్పుడో 50 ఏళ్ల క్రితం చందమామ మీద నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్‌ను దింపిన అమెరికా సైతం అన్వేషించని చోటు! అంతరిక్ష పరిశోధనల్లో ముందుండే రష్యా కూడా అడుగుపెట్టని ప్రదేశం! డ్రాగన్ దేశం.. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ సైతం పరిశోధనలు చేయని ప్రాంతం. అలాంటి చోట.. మువ్వన్నెల పతాకం సత్తా చాటేందుకు ఇస్రో సర్వం సిద్ధం చేసింది!! చందమామపై ఇప్పటివరకూ వ్యోమనౌకలను దింపిన అమెరికా, రష్యా, చైనాల సరసన.. ఆ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్‌ను నిలపబోతోంది. ఈ యాత్రకు అవుతున్న ఖర్చు రూ.978 కోట్లు. అందులో రాకెట్ ఖర్చు రూ.375 కోట్లు కాగా.. ప్రయోగంలో కీలకమైన ల్యాండర్, ఆర్బిటర్, రోవర్ల నిర్మాణానికి అయిన వ్యయం రూ.603 కోట్లు. ఆ మూడు మాడ్యూళ్ల బరువు.. 3.8 టన్నులు.

పన్నెండేళ్ల క్రితమే..

చంద్రయాన్-2 ప్రయోగం ఇప్పుడు జరుగుతోందిగానీ.. దీని సన్నాహకాలు దాదాపు పుష్కరకాలం క్రితమే మొదలయ్యాయి. ఇస్రోకు.. రష్యా అంతరిక్ష పరిశోధన సంస్థ రాస్‌కాస్మోస్‌కు మధ్య 2007 నవంబరు 12న ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం.. చంద్రుడి చుట్టూ తిరిగే ఆర్బిటర్, చంద్రుడిపై దిగే రోవర్ల బాధ్యత ఇస్రోది. ఈ రెండింటినీ రాకెట్‌లో మోసుకెళ్లే ల్యాండర్ నిర్మాణ బాధ్యత రాస్‌కాస్మోస్‌ది. 2008 సెప్టెంబరు 18న యూపీఏ-1 సర్కారు ఈ మిషన్‌కు ఆమోదం తెలిపింది. 2009 ఆగస్టులో వ్యోమనౌక డిజైన్ పూర్తయింది. అయితే.. ల్యాండర్ నిర్మాణంలో రష్యా విఫలమవడంతో 2016కు ఈ మిషన్‌ను వాయిదా వేస్తూ 2013 జనవరిలో నిర్ణయం తీసుకున్నారు. అనంతరకాలంలో.. రష్యా ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకొంది. దీంతో.. ఇస్రో స్వదేశీ పరిజ్ఞానంతో ల్యాండర్ తయారు చేయాలని నిర్ణయించింది. అలా.. ఈ మిషన్‌లో అత్యంత కీలకమైన మూడు మాడ్యూళ్లనూ (ల్యాండర్, ఆర్బిటర్, రోవర్) ఇస్రో పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించింది.

ఇలా ప్రయోగం

శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి జూలై 15వ తేదీ తెల్లవారుజామున 2.51 గంటలకు.. ఇస్రో బాహుబలిగా పేరొందిన జీఎస్ఎల్వీ మార్క్3 వాహకనౌక.. 3,877 కిలోల బరువున్న కాంపోజిట్ మాడ్యూల్‌ను మోసుకుని నింగిలోకి ఎగిరి నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెడుతుంది. అనంతరం దాని కక్ష్యను శాస్త్రజ్ఞులు దశలవారీగా 16 రోజులపాటు పెంచుకుంటూ పోతారు. ఆ తర్వాత ఐదు రోజులకు అది చంద్రుడి కక్ష్యలోకి చేరుతుంది. అక్కడ 27 రోజులపాటు చంద్రుడి చుట్టూ తిరుగుతుంది. ఈ దశలో ఆర్బిటర్ నుంచి విడివడిన ల్యాండర్.. చంద్రుడి దిశగా పయనించి సెప్టెంబరు 6-7 తేదీల్లో జాబిలి దక్షిణ ధ్రువంపై ల్యాండ్ అవుతుంది. అనంతరం అందులో ఉండే సౌరశక్తితో పనిచేసే రోవర్ చంద్రుడి ఉపరితలంపై పరిశోధనలు చేసి ఆ వివరాలను భూమికి పంపుతుంది.

- సెంట్రల్ డెస్క్

చంద్రయాన్-2 ప్రయోగంలో సిద్దిపేట శాస్త్రవేత్త

- 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడిన వీరబత్తిని సురేందర్



సిద్దిపేట, జూలై 12: చంద్రయాన్-2 ప్రాజెక్టులో.. సిద్దిపేటకు చెందిన శాస్త్రవేత్త వీరబత్తిని సురేందర్ కూడా పాలుపంచుకున్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన సురేందర్.. శాస్త్రవేత్త కావాలని కలలుగని, ఆ కలలను సాకారం చేసుకున్నారు. ఇస్రో చేపడుతున్న పలు ఉపగ్రహ ప్రయోగాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. సురేందర్ తండ్రి సత్తయ్య ఉపాధ్యాయుడు కాగా.. తల్లి రాజమణి బీడీలు చుట్టేది. వారి ముగ్గురు కుమారుల్లో రెండోవాడు సురేందర్. వారికి ఒక కుమార్తె కూడా ఉంది. ఇంట్లో ఆర్థిక కష్టాలు ఎన్ని ఉన్నా.. సురేందర్ పట్టుదలగా చదువుకున్నారు. 1990లో పదోతరగతిలో జిల్లాస్థాయి ర్యాంకర్‌గా నిలిచారు. అనంతరం నిజామాబాద్ పాలిటెక్నిక్ కళాశాలలో చేరారు. కళాశాలలో ప్రథముడిగా నిలిచారు. అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో ఇంజనీరింగ్, బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మైక్రోవేవ్ కమ్యూనికేషన్స్‌లో మాస్టర్స్ పూర్తిచేశారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన అనంతరం కొత్తగూడెంలో ఏపీ జెన్‌కో ఏఈగా, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్‌గా ఉద్యోగాలు వచ్చినా చేరలేదు. మొదట ఈసీఐఎల్‌లో, 2000 సంవత్సరంలో షార్‌లో చేరి.. శాస్త్రవేత్త కలను నెరవేర్చుకున్నారు. ఇప్పుడు చంద్రయాన్-2లో పాలుపంచుకుంటున్న ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రతిష్ఠాత్మకం ఈ ప్రాజెక్టు..

"చంద్రుని మీద నీటిజాడలను చంద్రయాన్-1 ద్వారా ప్రపంచానికి చాటిచెప్పిన ఇస్రో.. నేడు మరింత సమాచారం కోసమే చంద్రయాన్-2 ప్రయోగాన్ని చేపట్టింది. ఈసారి ప్రత్యేకత ఏమిటంటే ప్రగ్యాన్ అనే రోవర్‌ను 14 రోజుల పాటు చంద్రుని మీద 500 మీటర్ల వరకు సంచరించలా చేస్తారు. అది మనకు చంద్రుని గురించిన కీలక సమాచారాన్ని చేరవేస్తుంది. ఈ ప్రయోగం విజయవంతమైతే చంద్రునిపైకి రోవర్‌ను పంపి సమాచారాన్ని సేకరించిన నాలుగో దేశంగా భారత్‌కు గుర్తింపు లభిస్తుంది. ఇప్పటికే అమెరికా, రష్యా, చైనాలు రోవర్లను పంపాయి. ఈ ప్రాజెక్టులో పాలుపంచుకోవడం ఎంతో గర్వంగా భావిస్తున్నా. అంతరిక్ష పరిశోధనల రంగంలో త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేయాలని శాస్త్రవేత్తలం అందరం రాత్రింబవళ్లు కష్టపడుతున్నాం" అని సురేందర్ పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.